
ఈనాడు

హైదరాబాద్ 21-10-2024 సోమవారం సిటీ సంపుటి 51. సంచిక 71 THE LARGEST CIRCULATED TELUGU DAILY రూ. 6-50 పేజీలు 14 www.eenadu.net

Hyderabad, Visakhapatnam, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru


పచ్చదనం.. అక్కడ ప్రమాదకరం



పచ్చదనం పెరిగితే మానవాళికి మంచిదే కదా... ప్రపంచమంతా ఇదే జరగాలని కోరుకుంటున్నాంగదా... పర్యావరణ మార్పులను తట్టుకోవటానికి పచ్చదనం కావాలనుకుంటున్నాంగదా... మరి... పచ్చదనం పెరుగుతోందంటే.. ఈ ఆందోళనేంటి? అనుకుంటున్నారా... రండి... శాస్త్రవేత్తలను ఆందోళనకు గురిచేస్తున్న ఆ పచ్చదనం సంగతేంటో చూద్దాం!

భూగోళంపై హిమగోళంగా పిలిచే అంటార్కిటికాకు ప్రత్యేకస్థానముంది. సాధారణంగా ఇదంతా మంచుతో కప్పబడి ఉంటుంది. హిమానీనదాలు, మంచు, రాళ్లతో నిండి ఉంటుంది. భూమిపై అత్యంత చల్లనైన ప్రాంతమిది. ఇక్కడ మొక్కలు మొలవటం అంత సులభం కాదు. అత్యంత క్లిష్టమైన ఈ వాతావరణ పరిస్థితుల్లో మొలిచే కొన్ని ప్రత్యేకమైన వేళ్లులేని కాండంగల... నాచులాంటి పచ్చని మొక్క కణజాలం మాత్రం ఉంటుంది. అదీ అక్కడక్కడ మాత్రమే!

- అలాంటిది... ఈ పచ్చదనం ఇప్పుడు విపరీతంగా పెరుగుతోందని నేచర్ జియోసైన్స్‌లో ప్రచురించిన అధ్యయనం వెల్లడించింది. బ్రిటిష్ అంటార్కిటిక్ సర్వే శాస్త్రవేత్తలతో పాటు... ఎక్స్‌టర్, హర్ట్‌ఫోర్డ్‌షైర్ విశ్వవిద్యాలయాల పరిశోధకులు కలసి అంటార్కిటికాలో పర్యావరణ మార్పులపై ఈ అధ్యయనం చేశారు.
- సూర్య కిరణాలను పరావర్తనం చెందించటం అంటార్కిటికా ప్రత్యేకత. పచ్చదనం పెరుగుతోందంటే ఆ శక్తి సన్నగిల్లుతోందని అర్థం!



- 1986లో చదరపు కిలోమీటరుకంటే తక్కువగా ఉన్న ఈ పచ్చదనం... 2021 నాటికి... 12 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించింది. అంటే... పదింతలకంటే ఎక్కువ పెరిగింది. ఎంతగా అంటే.. 2016 నుంచి 2021 మధ్య ఇది 30శాతం పెరిగింది. ఐదేళ్లలోనే 4లక్షల మీటర్ల మేర పచ్చదనం విస్తరించింది.

- పచ్చదనం పెరుగుతోందంటే... అంటార్కిటికాలో మంచు తగ్గుదలకు సంకేతం! తద్వారా సాధారణ భూమి పెరుగుతుంది. అంటే... ఇప్పటిదాకా కేవలం సంక్లిష్ట పరిస్థితుల్లో మాత్రమే అక్కడక్కడా పెరిగే మొక్కలకు తోడు... మామూలు చోట్ల పెరిగే, పర్యాటకుల ద్వారా వచ్చే ఇతర జీవజాలం కూడా పెరగటం మొదలవుతుంది. స్థానిక జీవజాలం ప్రమాదంలో పడుతుంది. అంటే పర్యావరణ మార్పుల ప్రభావం మొదలైందన్నమాట! ఇప్పటికే ఆ ప్రభావాన్ని శాస్త్రవేత్తలు గమనిస్తూ వస్తున్నారు.
- గత కొద్దికాలంగా అంటార్కిటికాలో భూమిపై మరెక్కడా లేనంత రేటులో ఉష్ణోగ్రత పెరుగుతోంది. ఎప్పుడూ మైనస్‌లో ఉండే ఉష్ణోగ్రతలు... వేసవిలో వేడిగాలులతో 10 డిగ్రీల సెల్సియస్‌గా నమోదవుతున్నాయి.
- వేడి పెరిగితే హిమానీనదాలు కరుగుతాయి. సముద్రమట్టాలు పెరుగుతాయి.
- అందుకే... ఇప్పటికీ అంటార్కిటికా మంచుతోనే కప్పబడి ఉన్నప్పటికీ... ఈ పచ్చదనంలో అనూహ్య మార్పులు శాస్త్రవేత్తలను ఆందోళనకు గురిచేస్తున్నాయి.

అంటార్కిటికాలో ఇలాగే పచ్చదనం పెరిగితే భూమి తయారవుతుంది. అంటే... బయటి నుంచి కొత్త జీవజాలం విస్తరిస్తుంది. అదే జరిగితే పర్యావరణ సమతౌల్యం దెబ్బతింటుంది. - డాక్టర్ ఓలీ బార్ట్‌లెట్, శాస్త్రవేత్త

- ఈనాడు ప్రత్యేక విభాగం



ఆదాయం ఎందుకు తగ్గింది?

13లో

- 2024-25లో తొలి 6 నెలల లక్ష్యం కన్నా రూ.4,719 కోట్లు తగ్గుదల
- ఇతర రాష్ట్రాల్లో పరిస్థితిపై అధ్యయనం
- రాబడి పెంచాలంటూ ప్రభుత్వ ఆదేశం

సిట్టింగులకే..

- మహారాష్ట్ర తొలి జాబితాలో 71 మంది ప్రస్తుత ఎమ్మెల్యేలకు చోటు కల్పించిన భాజపా
- టికెట్లు రానిది ముగ్గురికే

12లో

ప్రపంచ నగరాలతోనే హైదరాబాద్ పోటీ

- 600 బిలియన్ డాలర్ల నగరంగా దీన్ని నిలబెట్టాలి
- ధైర్యం.. త్యాగాలతోనే గొప్ప నాయకులుగా రాణింపు
- స్కిల్స్ యూనివర్సిటీకి ఐఎస్‌బీయే స్ఫూర్తి
- ఐఎస్‌బీ లీడర్‌షిప్ సమ్మిట్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

రాయదుర్గం - న్యూస్‌టుడే

భారత్‌లోని నగరాలతో కాక న్యూయార్క్, లండన్, పారిస్, టోక్యో, సియోల్ వంటి నగరాలతో హైదరాబాద్ పోటీ పడాలని కోరుకుంటున్నానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రపంచంలోనే హైదరాబాద్ అత్యుత్తమంగా వృద్ధి సాధించాలనేదే తమ ముందున్న పెద్ద లక్ష్యమని.. అది కష్టమే కావచ్చు కానీ అసాధ్యం కాదని చెప్పారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్‌బీ) ఆధ్వర్యంలో ఆదివారం ఐఎస్‌బీ లీడర్‌షిప్ సమ్మిట్(నాయకత్వ సదస్సు) 2024 నిర్వహించారు. లీడర్‌షిప్ ఇన్ న్యూ ఇండియా ఇతివృత్తంతో చేపట్టిన సదస్సును ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఐఎస్‌బీ ప్రాంగణంలో మొక్క నాటారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ‘‘ఐఎస్‌బీ విద్యార్థులు చురుకైన, అసాధారణ తెలివితేటలుగల, నేర్చుకోవాలనే తపన ఉన్న నాయకులు. రాష్ట్రాన్ని ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి పరిచేందుకు హైదరాబాద్‌ను 600 బిలియన్ డాలర్ల నగరంగా నిలబెట్టాలి. ఇందుకు మీ సాయం అవసరం.

...మిగతా 2లో



ఐఎస్‌బీలో నాయకత్వ సదస్సుకు హాజరైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న డీన్ మదన్ పిల్లుట్ల, శ్రీని రాజు, సదస్సు ప్రతినిధి

దక్షిణ కొరియాలో 30 ఎకరాల్లో విస్తరించి ఉన్న క్రీడా యూనివర్సిటీని సందర్శించాను. చిన్న దేశమైనా ఒలింపిక్ క్రీడల్లో 32 పతకాలు సాధించింది. వాటిలో 16 పతకాలు ఆ వర్సిటీకి చెందిన క్రీడాకారులవే. భారత్ ఒక్క బంగారు పతకం కూడా సాధించకపోవడం దురదృష్టకరం. ఒలింపిక్స్‌లో మనం కూడా పతకాలు సాధించడమే నా లక్ష్యం. ఇందుకు గచ్చిబౌలిలో 70 ఎకరాల్లో క్రీడా విశ్వవిద్యాలయం, స్పోర్ట్స్ అకాడమీని అభివృద్ధి పరుస్తున్నాం’

- సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్ అశోక్‌నగర్ క్రాస్ రోడ్డు వద్ద నిరసన తెలుపుతున్న గ్రూప్-1 అభ్యర్థులు

నేటి నుంచి గ్రూప్-1 ప్రధాన పరీక్షలు

- పరీక్ష కేంద్రాల వద్ద 163 సెక్షన్.. భారీ బందోబస్తు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో 563 గ్రూప్-1 పోస్టుల భర్తీకి ప్రధాన పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. వీటిని వాయిదా వేయాలంటూ ఆందోళనలు జరుగుతున్న నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలోని 46 పరీక్ష కేంద్రాల వద్ద ఆయా కమిషనర్ల ప్రత్యక్ష పర్యవేక్షణలో భారీ బందోబస్తు సిద్ధం చేశారు. అన్ని కేంద్రాల వద్ద బీఎన్ఎస్ఎస్ 163 సెక్షన్ విధించారు. దీని ప్రకారం 200 మీటర్ల వరకు ఐదుగురికి మించి ఉండేందుకు వీల్లేదు. ప్రతి కేంద్రం వద్ద ఒక ఎస్సై ఆధ్వర్యంలో మహిళా కానిస్టేబుల్ సహా మొత్తం ఆరుగురు కానిస్టేబుళ్లు ఉండేలా ప్రణాళిక రూపొందించారు. పరీక్ష గది, చీఫ్ సూపరింటెండెంట్, పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పరిస్థితిని పరిశీలించనున్నారు. ఈ నెల 21 నుంచి 27 వరకు జరిగే పరీక్షలకు సంబంధించి రోజూ ప్రశ్నపత్రాలు, జవాబుపత్రాలు తరలించే జీపీఎస్ అమర్చిన వాహనాలు నిర్దేశిత మార్గాల్లోనే ప్రయాణించేలా రూట్‌మ్యాప్ రూపొందించారు.

ఇవీ నిబంధనలు..

ఈ పరీక్షలకు 31,383 మంది హాజరుకానున్నారు. అభ్యర్థులను డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్(డీఎఫ్ఎండీ)లతో తనిఖీ చేశాకే అనుమతించనున్నారు.

...మిగతా 2లో

పట్టింపులకు పోకుండా న్యాయం చేయండి

- ప్రభుత్వానికి గ్రూప్-1 అభ్యర్థుల వినతి

11లో

జీవో 29తో రిజర్వ్‌డ్ అభ్యర్థులకే లాభం

- గ్రూప్-1 మెయిన్స్‌లో 80 శాతం మంది వారే ఉంటారని అంచనా
- ఎవరికీ అన్యాయం జరగకుండా చూస్తాం
- పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్



ఈనాడు, హైదరాబాద్: ‘‘జీవో 29 ద్వారా రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకే లాభం జరుగుతుంది. దానివల్ల నష్టం జరుగుతుందని అపోహకు లోనుకావొద్దు. గ్రూప్-1 మెయిన్స్ అభ్యర్థుల్లో 80 శాతం మంది రిజర్వ్‌డ్ వర్గాలవారే ఉన్నారని మాకు అందిన సమాచారం మేరకు తెలుస్తోంది’’ అని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ వెల్లడించారు. మంత్రులు, ఉన్నతాధికారులతో మూడు గంటలపాటు మాట్లాడి అనుమానాలన్నీ నివృత్తి చేసుకున్నాకే ఈ వివరాలు చెబుతున్నానని.. ఎవరికీ అన్యాయం జరగకుండా చూస్తామని కాంగ్రెస్ తరఫున తాను భరోసా ఇస్తున్నానని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం గాంధీభవన్‌లో ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఖనిజాభివృద్ధి సంస్థ ఛైర్మన్ అనిల్, టీసీ కార్పొరేషన్ ఛైర్మన్ నూతి శ్రీకాంత్, కరీంనగర్ గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఎస్.మల్లేశంలతో కలసి ఆయన మీడియాతో మాట్లాడారు. ‘‘రాజకీయాల కోసం భాజపా, భారాసలు చేపడుతున్న కుట్రపూరిత

...మిగతా 2లో

ప్రజల దృష్టి మళ్లించేందుకు సమస్యల సృష్టి

- హామీల అమలు సచివాలయం గేటు దాటడం లేదు
- రాష్ట్ర ప్రభుత్వంపై కిషన్‌రెడ్డి ధ్వజం
- గ్రూప్-1 అభ్యర్థుల ఆవేదన వింటే తప్పేంటని ప్రశ్న



ఈనాడు, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వానికి హామీలు అమలు చేసే శక్తి, ఆర్థిక వనరులు లేవని.. అందుకే కొత్త సమస్యలు సృష్టించి వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు లక్ష్యంతో ముందుకు వెళ్తోందని, లారీఛార్జీలు, అక్రమ జీవోలు, ఇళ్ల కూల్చివేతలతో కాలంగడిపే ప్రయత్నం చేస్తోందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ఆరోపించారు. వారం రోజులుగా హైదరాబాద్ ఆందోళనలతో అట్టుడుకుతోందన్నారు. ఆదివారం భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ‘‘పేదలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు, ఆరు గ్యారంటీలు.. ఏ ఒక్కటీ సచివాలయం గేటు దాటడం లేదు. భారాస విధానాన్నే కాంగ్రెస్ అవలంబిస్తోందని స్పష్టమవుతోంది.

...మిగతా 2లో

ఆ జీవోను ఎందుకు రద్దు చేయరో ముఖ్యమంత్రి చెప్పాలి

- గన్‌మెన్లు లేకుండా ఆయన అశోక్‌నగర్ రావాలి
- హామీలను విస్మరించి ప్రజలను దగా చేస్తున్న ప్రభుత్వం
- భారాస సీనియర్ నేత హరీశ్‌రావు



తిమ్మాపూర్, న్యూస్‌టుడే: జీవో 29ని రద్దు చేయాలని నిరుద్యోగులు ధర్నా చేస్తే వారిని.. ఉగ్రవాదులు, దొంగల్ని కొట్టినట్లు కొట్టారని భారాస సీనియర్ నేత హరీశ్‌రావు ఆరోపించారు. గన్‌మెన్లు లేకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అశోక్‌నగర్‌కు వచ్చి నిరుద్యోగులతో మాట్లాడాలని పేర్కొన్నారు. జీవో 29ని ఎందుకు రద్దు చేయడం లేదో వారికి చెప్పాలన్నారు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం కొత్తపల్లిలో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన అలయ్-బలయ్ కార్యక్రమానికి హరీశ్‌రావు హాజరై మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించి ప్రజలను దగా చేస్తున్న సీఎం పేరు ఎనుముల రేవంత్‌రెడ్డి కాదు.. ఎగవేతల రేవంత్‌రెడ్డి, ఆయన రైతు వ్యతిరేకి అని వ్యాఖ్యానించారు. ‘‘పథకాల పాలన పోయి ప్రస్తుతం ఫొటోలకు ఫోజులిచ్చే పాలనొచ్చింది. రైతుబంధు ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని చెప్పి

...మిగతా 2లో

ఇదీ సంగతి!



పట్టణాలకూ నక్షా



- గృహాలు, ఆస్తుల గుర్తింపు.. పటాల రూపకల్పన
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పైలట్ సర్వే
- దేశవ్యాప్తంగా 100 పట్టణాల్లో.. రాష్ట్రంలో ఎనిమిది చోట్ల

ఈనాడు, హైదరాబాద్: సాగు భూములకు పక్కాగా ఉండే నక్షా మాదిరిగా.. పట్టణాలకు కూడా రూపొందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పైలట్ సర్వే చేపట్టాయి. దేశవ్యాప్తంగా 100 పట్టణాల్లో నక్షా రూపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం గత నెలాఖరున నిధులు విడుదల చేసింది. రాష్ట్రంలోని ఎనిమిది పట్టణాలను (మున్సిపాలిటీలను) పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. వీటిలో సమగ్ర సర్వే నిర్వహించి.. పూర్తిస్థాయి వివరాలతో పటాలు రూపొందించనున్నారు. సర్వే ఆఫ్ ఇండియా, పురపాలక, భూమి కొలతలు-దస్త్రాల నిర్వహణ, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా పైలట్ ప్రాజెక్టు నిర్వహిస్తున్నాయి.

...మిగతా 2లో



అక్టోబరులోనూ సాగర్ జల సవ్వడులు!

20 గేట్ల ద్వారా నాగార్జునసాగర్ నుంచి దిగువకు విడుదలవుతున్న నీరు

2లో

పట్టణాలకూ నక్షా

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర పథకం నేషనల్ జియోస్పేషియల్ నాలెడ్జ్ బేస్డ్ ల్యాండ్ సర్వే ఆఫ్ అర్బన్ హ్యాబిటేషన్స్ (ఎన్‌ఏకేఎస్‌హెచ్‌ఏ- నక్షా) కింద పట్టణాలకు నక్షాలను రూపొందించే కార్యక్రమం చేపట్టారు. దీనిలో భాగంగా తొలుత రాష్ట్రంలో ఎంపిక చేసిన పట్టణాల్లో ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో సర్వే ఆఫ్ ఇండియా డ్రోన్లతో ఛాయాచిత్రాలు రూపొందిస్తోంది. అనంతరం వాటి పరిశీలన పూర్తి చేసి.. క్షేత్రస్థాయిలో సర్వే చేయనున్నారు.

నక్షా పథకంలో ప్రతి ఇల్లు, ఆస్తిని పక్కాగా సర్వే చేయనున్నారు. అక్షాంశాలు, రేఖాంశాలతో ఆస్తుల హద్దులు గుర్తించి.. వాటి విస్తీర్ణాలను డిజిటల్ పద్ధతిలో నమోదు చేస్తారు. అనంతరం ప్రతి ఇల్లు లేదా ఆస్తికి ప్రాపర్టీ కార్డులను జారీ చేయనున్నారు. దీనివల్ల ఇప్పటివరకు సరైన ఆధారాలు లేని ఆస్తులు, ఇళ్ల విలువ పెరగనుంది. ప్రభుత్వమే కార్డులు అందించడం వల్ల రుణాలు పొందేందుకూ వీలు కలగనుంది. మురికివాడలు, బస్తీలు, కాలనీల్లోని చిన్న చిన్న ఇళ్ల, స్థలాలకూ పటాలు సిద్ధం కానున్నాయి. డిసెంబరు నాటికి పైలట్ సర్వే పూర్తి చేసే అవకాశాలున్నాయని సర్వే ఆఫ్ ఇండియాకు చెందిన ఓ అధికారి 'ఈనాడు'కు తెలిపారు. రాష్ట్రంలో 142 పట్టణాల్లోనూ ముమ్మందు నక్షా సర్వే చేపట్టాలన్న ప్రణాళిక ఉందని పేర్కొన్నారు.

ప్రభుత్వ స్థలాల గుర్తింపు

నక్షా సర్వేలో ప్రభుత్వ స్థలాలు, మురుగునీటి పారుదల వ్యవస్థ నాలాలు, చెత్త డంపింగ్ ప్రదేశాలు, నీటి వనరుల విస్తీర్ణాల కొలతలు పక్కాగా తేలనున్నాయి. వాటి హద్దులనూ గుర్తించనున్నారు. పురపాలక సంఘాల్లోని ప్రభుత్వ స్థలాల గుర్తింపు అనంతరం అవి భూ నిధిగా ఉపయోగపడనున్నాయి. ఆక్రమణలూ తేలనున్నాయి.

రాష్ట్రంలో సర్వే చేపట్టే పట్టణాలు..


మిర్యాలగూడ, జగిత్యాల, మణుగూరు, జడ్చర్ల (బాదేపల్లి మున్సిపాలిటీ), హుస్నాబాద్, కొడంగల్, వర్ధన్నపేట, మహబూబాబాద్

- మొత్తం విస్తీర్ణం: 200 చ.కి.మీ.

భవిష్యత్‌లో చేపట్టే సర్వే వివరాలు..

- పట్టణాలు: 142
- మొత్తం విస్తీర్ణం: 6 వేల చ.కి.మీ.

ప్రస్తుతం జీహెచ్‌ఎంసీ పరిధిలోని చెరువులు, కుంటల ఆక్రమణలను ప్రభుత్వం గుర్తించింది. నక్షా సర్వే ద్వారా చిన్న చిన్న పట్టణాల్లోని ఆక్రమణలు వెలుగులోకి వచ్చే అవకాశాలున్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు.





మీ జీవితపు స్టీరింగును వేరొకరికి ఇవ్వొద్దు

ఇతరుల వ్యవహార శైలిని మీరు మార్చలేరు. దానిపై మీకు నియంత్రణ ఉండదు. కానీ మీ ప్రవర్తన ఎలా ఉండాలన్నది పూర్తిగా మీ చేతుల్లోనే ఉంది. మీ విలువలు, ప్రాధాన్యతలు, లక్ష్యాలకు కట్టుబడి ఉండాల్సింది మీరే. అంటే మీ జీవితం అనే వాహనానికి మీరే డ్రైవరు. ఇతరుల చర్యలకు ప్రతిస్పందనగా మీ వ్యవహార శైలిని తరచూ మార్చుకుంటూ ఉంటే మీ జీవితపు స్టీరింగును వేరొకరికి అప్పగించినట్లే. ఆ తప్పు చేయకుండా ఉండాలంటే మీ సొంత పంథాను వీడకండి. - శ్రుతి మిశ్రా, ప్రొడక్టివిటీ కోచ్

20 గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల

నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టు (అమ్రాబాద్), న్యూస్‌టుడే: నాగార్జునసాగర్ జలాశయానికి అక్టోబరులోనూ వరద నీటి ఉద్ధృతి కొనసాగుతోంది. దీంతో ఎన్నెస్పీ అధికారులు 20 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేశారు. శ్రీశైలం నుంచి 2,47,182 క్యూసెక్కుల వరదనీరు వస్తుండడంతో అధికారులు 14 గేట్లను 5 అడుగులు, 6 గేట్లను 10 అడుగుల మేరకు ఎత్తి 2,02,404 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. గేట్లతో పాటు కుడికాల్వ, ఎడమ కాల్వ, ప్రధాన విద్యుత్కేంద్రం, ఎస్ఎల్బీసీ, వరద కాల్వల ద్వారా మొత్తం 2,47,182 క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా ప్రస్తుత జలాశయ నీటిమట్టం 589.60 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయం నిండుకుండలా మారడంతో అధికారులు 6 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటిని నాగార్జునసాగర్‌కు వదులుతున్నారు. జూరాల ప్రాజెక్టు స్పిల్‌వే, విద్యుదుత్పత్తి ద్వారా 1,28,368 క్యూసెక్కులు, సుంకేశుల జలాశయం నుంచి 67,312, హంద్రీ నుంచి 250 క్యూసెక్కుల వరద శ్రీశైలం జలాశయానికి చేరుతోంది. కుడి, ఎడమ విద్యుత్కేంద్రాలు, స్పిల్ వే ద్వారా వస్తున్న నీటిని దిగువన నాగార్జునసాగర్ జలాశయానికి వదులుతున్నారు. జలాశయంలో 211.4250 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

దత్తాత్రేయకు త్రుటిలో తప్పిన ప్రమాదం

శంషాబాద్, న్యూస్‌టుడే: హరియాణ గవర్నర్ బండారు దత్తాత్రేయకు త్రుటిలో ప్రమాదం తప్పింది. గవర్నర్ కాన్వాయ్ మధ్యలోకి ఓ వాహనం చొచ్చుకు వచ్చింది. దీంతో 3 వాహనాలు ధ్వంసమయ్యాయి. ఆర్జీఐఏ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దత్తాత్రేయ హరియాణకు వెళ్లడానికి ఆదివారం హైదరాబాద్ నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి వాహనశ్రేణితో బయల్దేరారు. ఎయిర్‌పోర్ట్ అప్రోచ్ రోడ్డుపై కిషన్‌గూడ ట్రంపెట్ వంతెన సమీపంలోకి రాగానే.. విమానాశ్రయానికి వెళ్తున్న ఓ కారు అకస్మాత్తుగా గవర్నర్ కాన్వాయ్ మధ్యలోకి వచ్చింది. దీంతో కాన్వాయ్‌లోని ఓ వాహన డ్రైవర్ అత్యవసరంగా బ్రేకులు వేయగా.. కాన్వాయ్‌లోని వాహనాలు అదుపుతప్పి ఒకదానికొకటి ఢీకొన్నాయి. కాన్వాయ్‌లోని భద్రతాసిబ్బందికి చెందిన 3 వాహనాలు ధ్వంసమయ్యాయి. కొందరు భద్రతా సిబ్బందికి స్వల్ప గాయాలయ్యాయి.

బీబీఏ చదివేద్దాం

- మేనేజ్‌మెంట్ కోర్సులకే విద్యార్థుల ప్రాధాన్యం
- బీఎఫ్ఎస్ఐ పరిశ్రమల్లో కొలువులు దక్కడమే కారణం
- బీసీఏకూ పెరుగుతున్న ఆదరణ

ఈనాడు, హైదరాబాద్: డిగ్రీ కోర్సుల్లో బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్(బీబీఏ)తోపాటు బ్యాచిలర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్(బీసీఏ)కు విద్యార్థుల ఆదరణ పెరుగుతోంది. మిగిలిన అన్ని కోర్సుల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతుండగా, ఈ రెండింటిలో చేరే వారి సంఖ్య గత నాలుగేళ్లుగా పైపైకి పోతుండటమే దానికి నిదర్శనం. కొత్త కోర్సులు అందుబాటులోకి రావడం, బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్(బీఎఫ్ఎస్ఐ) రంగాల్లో ఆయా కోర్సులు చదివిన వారికి ఉద్యోగావకాశాలు పెరగడమే దానికి కారణమని, వచ్చే కొద్ది సంవత్సరాల్లో బీబీఏకు ఆదరణ మరింత పెరగవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు.

బీకాంను వెనక్కి నెట్టి

అత్యధిక మంది చేరే కోర్సుల్లో గత కొన్నేళ్లుగా బీకాం అగ్రస్థానంలో నిలుస్తుండగా, క్రమంగా పరిస్థితి మారుతోంది. దోస్త్ గణాంకాలను పరిశీలిస్తే ఆ కోర్సులో ప్రవేశాల సంఖ్య క్రమేణా తగ్గుతుండటం స్పష్టంగా కన్పిస్తోంది. బీఎస్సీ లైఫ్ సైన్స్, ఫిజికల్ సైన్స్‌తోపాటు బీఏలోనూ విద్యార్థుల నమోదు తగ్గుతూ వస్తోంది. ఉదాహరణకు 2020-21లో బీబీఏలో ప్రవేశాలు 12 వేలు ఉండగా, ఇప్పుడు దాదాపు 16 వేలకు చేరాయి. బీసీఏలో 1,564గా ఉన్న ప్రవేశాలు ఇప్పుడు 5,170కి పెరిగాయి. అదే సమయంలో బీకాంలో చేరే వారి సంఖ్య 1.07 లక్షల నుంచి 77 వేలకు పడిపోయింది.

ఎందుకు ఆదరణ?

బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ సంస్థల్లో ఉద్యోగాలు అధికంగా ఉంటున్నాయి. సాఫ్ట్‌వేర్ నిపుణులకూ ఆయా రంగాల్లో కొలువులు పెరుగుతున్నట్లు నిపుణులు చెబుతున్నారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం ఈ సంవత్సరం ఇంజినీరింగ్, డిగ్రీ కళాశాలల్లో బీఎఫ్ఎస్ఐ కోర్సును ప్రవేశపెట్టింది. 'సమస్యలను పరిష్కరించే నైపుణ్యం ఉన్న వారికి కంపెనీలు పెద్దపీట వేస్తున్నాయి. బీబీఏ, బీసీఏ అనేవి నైపుణ్యంతో కూడిన కోర్సులు. అందుకే ఏఐసీటీఈ కూడా ఈ విద్యా సంవత్సరంలో ఆ కోర్సులను తన పరిధిలోకి తెచ్చుకుంది' అని హెచ్‌సీయూ మాజీ ప్రో ఛాన్సలర్, మేనేజ్‌మెంట్ విభాగం సీనియర్ ఆచార్యుడు బెల్లంకొండ రాజశేఖర్ చెప్పారు. "వ్యాపార రంగంపై అవగాహన ఉన్న బీబీఏ, ఎంబీఏ విద్యార్థులకు ఐటీ కంపెనీలు కూడా కొలువులు ఇస్తున్నాయి.



అందుకే ఇటీవలి కాలంలో విద్యార్థులు పీజీ చేసేందుకు ఆసక్తి చూపడం లేదు. ఎంటెక్ సహా సంప్రదాయ పీజీ కోర్సుల్లోనూ చేరడం లేదు. అదే సమయంలో ఎంబీఏలో ఏటా కనీసం 30 వేల మంది చేరుతున్నారు. బీకాం తదితర సంప్రదాయ కోర్సులు చదివిన తర్వాత ఎంబీఏ చేయడం కంటే బీబీఏ చేసి, ఎంబీఏ చదవడం మంచిదన్న భావనతో ఎక్కువ మంది అటు వైపు అడుగులు వేస్తున్నారు' అని లయోలా డిగ్రీ కళాశాల డీన్ డాక్టర్ మర్రి వీరాస్వామి విశ్లేషించారు. అవినాష్ కామర్స్ కళాశాల డీన్ డాక్టర్ కందూరి సుశీల మాట్లాడుతూ, బీబీఏలో పలు స్పెషలైజేషన్లు వస్తున్నాయని, ఈ కారణంగానే కంపెనీలు ఆ కోర్సు విద్యార్థులకు ప్రాధాన్యం ఇస్తున్నాయని చెప్పారు.

నాలుగేళ్లలో ప్రధాన కోర్సుల వారీగా విద్యార్థుల ప్రవేశాలు ఇలా..

కోర్సు పేరు	2020-21	2021-22	2022-23	2024-25
బీబీఏ	12,066	12,367	15,311	15,835
బీసీఏ	1564	3,126	4,722	5,170
బీకాం	1,07,137	88,760	85,516	77,469
బీఎస్సీ(లైఫ్ సైన్స్)	46,385	44,277	43,300	36,733
బీఎస్సీ(ఫిజికల్)	48,424	31,650	26,011	32,181
బీఏ	38,662	31,804	29,846	28,362

2 వెటర్నరీ కళాశాలల్లో ఇక ఎన్‌ఆర్‌ఐ, సెల్ఫ్‌ఫైనాన్స్ కోటా..

దరఖాస్తుల ఆహ్వానం

ఈనాడు, హైదరాబాద్: పీవీ నరసింహారావు తెలంగాణ రాష్ట్ర పశువైద్య విశ్వవిద్యాలయంలో బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ (బీవీఎస్సీ) కోర్సులో ఎన్‌ఆర్‌ఐ, సెల్ఫ్‌ఫైనాన్స్ కోటాను ప్రారంభించాలని పాలకమండలి నిర్ణయించింది. ఈ మేరకు 2024-25లో రెండు కళాశాలల్లో 10 సీట్లకు గాను ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తూ ఆదివారం నోటిఫికేషన్ విడుదల చేసింది. విశ్వవిద్యాలయ పరిధిలోని రాజేంద్రనగర్, కోరుట్ల కళాశాలల్లో ఐదేసి (3 ఎన్‌ఆర్‌ఐ, 2 సెల్ఫ్‌ఫైనాన్స్) చొప్పున మొత్తం 10 సీట్లకు ప్రవేశాలు కల్పిస్తారు. 2014లో వర్సిటీ ప్రారంభించిన తర్వాత ఎన్‌ఆర్‌ఐ, సెల్ఫ్‌ఫైనాన్స్ కోర్సుల కింద సీట్ల భర్తీని చేపట్టడం ఇదే తొలిసారి. తాజాగా విశ్వవిద్యాలయ ఆర్థిక వనరులను పెంచుకునేందుకు వీలుగా ఎన్‌ఆర్‌ఐ, సెల్ఫ్‌ఫైనాన్స్ కోటాను ప్రవేశపెడుతున్నారు. ప్రవాస భారతీయ కుటుంబాల పిల్లలు, ప్రవాస భారతీయులు స్పాన్సర్‌చేసే వారికి ఎన్‌ఆర్‌ఐ కోటా కింద సీట్లు ఇస్తారు. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల విద్యార్థులు సెల్ఫ్‌ఫైనాన్స్ కింద దరఖాస్తు చేసుకోవచ్చు. సీట్లు పొందినవారు రూ.20 లక్షల ప్రవేశరుసుంతో పాటు సంవత్సరానికి రూ.6 లక్షలు చొప్పున ఐదేళ్లకు రూ.30 లక్షలు చెల్లించాలి. నీట్ ర్యాంకుల ఆధారంగా సెల్ఫ్‌ఫైనాన్స్ కోటా సీట్లను భర్తీచేస్తారు. ఎన్‌ఆర్‌ఐ సీట్లు భర్తీకాకపోతే వాటిని సెల్ఫ్‌ఫైనాన్స్‌కు బదలాయిస్తారు. విద్యార్థులు వచ్చేనెల 11 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. 18న కౌన్సెలింగ్ నిర్వహిస్తామని వర్సిటీ వెల్లడించింది. ఈ విధానాన్ని ప్రవేశపెట్టడం వల్ల పేద విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని.. దీన్ని రద్దుచేయాలని తెలంగాణ వెటర్నరీ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కాటం శ్రీధర్ డిమాండ్ చేశారు.

జీవో 29తో రిజర్వ్‌డ్ అభ్యర్థులకే లాభం

(మొదటి పేజీ తరువాయి)

కార్యక్రమాల వలలో పడొద్దని నిరుద్యోగులకు, విద్యార్థులకు మనవి చేస్తున్నా. గ్రూప్-1లో 563 ఉద్యోగాల భర్తీకి గత ఫిబ్రవరిలో ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది. ఈ ఖాళీల కన్నా 50 రెట్లు ఎక్కువమంది అభ్యర్థులను మెయిన్స్ పరీక్షకు టీజీపీఎస్సీ ఎంపిక చేసింది. ఓపెన్ క్యాటగిరీ మెరిట్ లిస్టులో రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులు ఎంపికైతే వారిని రిజర్వ్‌డ్ క్యాటగిరీలోని ఇతర ఖాళీల కోటా కింద లెక్కించరు. ఓసీ క్యాటగిరీలో మెరిట్ ప్రకారం ఎస్సీ, బీసీలు ఎంపికైతే వారిని రిజర్వ్‌డ్ క్యాటగిరీలో లెక్కిస్తారనడం అబద్ధం. ఓసీ క్యాటగిరీలో ఎంపికైనవారు మెరిట్ జాబితాలోనే కొనసాగుతారు. తక్కువ కటాఫ్‌లో ఉన్నవారినే రిజర్వ్‌డ్ కోటాకు జతచేస్తారు. జనరల్‌లో ఎంపికైన రిజర్వ్‌డ్ అభ్యర్థికి ఎలాంటి నష్టం జరగదు. నిరుద్యోగులు ఓటేసినందునే అధికారంలోకి వచ్చాం. వారిని జారవిడుచుకునే ప్రసక్తి లేదు. జీవో 29పై కోర్టులో కేసున్న నేపథ్యంలో అభ్యర్థులెవరూ తొందరపడొద్దు.

రెచ్చగొడుతున్న భారాస, భాజపా

భారాస, భాజపాలు కుమ్మక్కై అభ్యర్థులను రెచ్చగొడుతున్నాయి. ఏటా 2 కోట్ల ఉద్యోగాలిస్తామని 2014లో చెప్పిన భాజపా ఇప్పటికి ఎన్ని కోట్లు ఇచ్చిందో బండి సంజయ్ లెక్కలు చెప్పాలి. ఉద్యోగాలు ఇస్తామని చెప్పి భారాస అధికారంలోకి వచ్చింది. కానీ ఈరోజు ధర్నాలు చేస్తున్న ఆ పార్టీ నేతలు గత పదేళ్లలో ఎన్ని ఉద్యోగాలిచ్చారో లెక్కలు చెప్పాలి. గత పదేళ్లలో ఒక్కసారైనా గ్రూప్-1 పరీక్షలను భారాస ప్రభుత్వం పెట్టిందా? 2012లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం గ్రూప్-1 ఉద్యోగాలు ఇచ్చాక మళ్లీ ఇప్పుడు మా ప్రభుత్వమే ఇస్తోంది. గ్లోబరీనా అనే సంస్థకు ఇంటర్ పరీక్షల ప్రశ్నపత్రాల వాల్యుయేషన్ అప్పగించి.. దాన్ని సరిగా నిర్వహించలేక 20 మంది విద్యార్థులను పొట్టనపెట్టుకున్న భారాస నేతలు ఈరోజు నిరుద్యోగుల గురించి ఎలా మాట్లాడుతున్నారు?'' అని మహేశ్‌కుమార్‌గౌడ్ ప్రశ్నించారు.

ప్రజల దృష్టి మళ్లించేందుకు సమస్యల సృష్టి

(మొదటి పేజీ తరువాయి)

పబ్లిక్ సర్వీస్ కమిషన్ తీరులోనూ ఎలాంటి మార్పు రాలేదు. కాంగ్రెస్ విధానాలతో నిరుద్యోగ యువత ఆందోళనలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డిలు అశోక్‌నగర్ లైబ్రరీ వద్దకు వెళ్లి నిరుద్యోగులతో మాట్లాడారు. చిత్తశుద్ధి ఉంటే ఆ ఇద్దరు నేతలు ఇప్పుడూ అక్కడికి వెళ్లి వారితో మాట్లాడి, వారి ఆవేదన అర్థం చేసుకుంటే తప్పేంటి? అవసరమైతే పోలీసుల సాయంతో వెళ్లండి. ఉద్యోగాలను భర్తీ చేసే చిత్తశుద్ధి ఉంటే నిరుద్యోగులు, అభ్యర్థులతో మాట్లాడి వారు చెప్పే అంశాలను పరిగణనలోకి తీసుకుంటే వచ్చే నష్టమేంటి? జీవో 29పై అనుమానాలున్నాయి. గ్రూప్-1 ప్రిలిమ్స్, మెయిన్స్‌కు వేర్వేరు హాల్‌టికెట్లు ఎందుకు? హైదరాబాద్‌లో మాత్రమే పరీక్షలు ఎందుకు నిర్వహిస్తున్నారు? ఆలయంపై దాడి జరిగితే సీఎం, కాంగ్రెస్ పార్టీ కనీసం ఖండించలేదు. నిరసనకారులపై లాఠీఛార్జి చేయాల్సిన అవసరం ఏంటి? గాయపడినవారికి చికిత్స చేయకుండా ప్రభుత్వ ఆసుపత్రి నుంచి పంపించేశారు. మోటివేషన్ క్లాసుల పేరుతో మతపరమైన కార్యక్రమాలు జరుగుతోంటే పోలీసు వ్యవస్థ, ప్రభుత్వం ఏం చేస్తోంది?'' అని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. విలేకరుల సమావేశంలో భాజపా నేత ప్రకాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో మరింత అధ్వాన స్థితికి ఆర్థిక వ్యవస్థ

రాష్ట్రంలో భారాస హయాంలో పదేళ్లపాటు ఆర్థిక విధ్వంసం జరిగిందని, కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని సరిదిద్దే ప్రయత్నం చేయకుండా మరింత అధ్వాన స్థితికి తీసుకెళ్తోందని కిషన్‌రెడ్డి ఆరోపించారు. ఆయన విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ.. ఈ నెల 23, 24 తేదీల్లో మూసీ పరీవాహక ప్రాంతంలో భాజపా ఎంపీలు, ఎమ్మెల్యేలు పర్యటిస్తారని తెలిపారు. ఈ నెల 25న ఇందిరాపార్కు వద్ద మూసీ బాధితులతో భారీ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

ఆ జీవోను ఎందుకు రద్దు చేయరో ముఖ్యమంత్రి చెప్పాలి

(మొదటి పేజీ తరువాయి)

గద్దెనెక్కిన కాంగ్రెస్ రూ.10 వేలు కూడా ఎందుకు ఇవ్వలేకపోతోంది? ఎన్నికలకు ముందు డిసెంబరు 9న రుణమాఫీ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఆగస్టు 15 వరకు పూర్తి చేస్తామన్నారు. ఇప్పటికీ పూర్తికాలేదు. దేవుళ్ల మీద ఒట్లు వేసి మాట తప్పిన ఏకైక సీఎం రేవంత్‌రెడ్డే. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తప్ప మిగిలినవాటి మాటేమిటి? మూసీ సుందరీకరణకు రూ.లక్ష యాభై వేల కోట్లు ఎందుకు? హామీల అమలుకు లేని నిధులు మూసీకి ఎలా వస్తాయి? మూసీలో నీటిని ముందు శుద్ధి చేయాలి. తర్వాత సుందరీకరణ చేపట్టాలి. పోలీసులు చట్ట ప్రకారం నడుచుకోవాలి. అక్రమ కేసులు పెడితే భవిష్యత్తులో విచారణ ఎదుర్కోవాల్సి వస్తుంది" అని హరీశ్‌రావు అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రూప్-1 ప్రధాన పరీక్షలు

(మొదటి పేజీ తరువాయి)

హాల్‌టికెట్‌పై పేర్కొన్న సూచనలు తప్పనిసరిగా పాటించాలని టీజీపీఎస్సీ స్పష్టం చేసింది. హాల్‌టికెట్లు, ప్రశ్నపత్రాలు తుది నియామకాలు పూర్తయ్యే వరకు భద్రపరుచుకోవాలని సూచించింది. ఇన్విజిలేటర్లు కచ్చితంగా పాటించాలంటూ పలు మార్గదర్శకాలను జారీ చేసింది.

- అభ్యర్థులు బ్లాక్ లేదా బ్లూ రంగు బాల్‌పాయింట్ పెన్, పెన్సిల్, రబ్బరు, హాల్‌టికెట్, ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా గుర్తింపుకార్డు తీసుకురావాలి. బొమ్మలు పెన్సిల్ లేదా పెన్‌తో వేయాలి. జెల్, స్కెచ్‌పెన్‌లు ఉపయోగించకూడదు.
- తొలిరోజు నుంచి చివరి రోజు వరకు ఒకే హాల్‌టికెట్‌ను ఉపయోగించాలి. మార్ఫింగ్ ఫొటోలతో హాల్‌టికెట్లు తీసుకొస్తే అనుమతించరు. హాల్‌టికెట్‌పై పేర్కొన్న స్థలంలో రోజూ అభ్యర్థితోపాటు ఇన్విజిలేటర్ సంతకం చేయాలి.
- జవాబులు రాసేందుకు ఆన్సర్ బుక్‌లెట్ ఇస్తారు. అదనపు పత్రాలు ఇవ్వరు. అభ్యర్థి ఎంపిక చేసుకున్న భాష(జనరల్ ఇంగ్లిష్ మినహా)లోనే సమాధానాలు రాయాలి. వేర్వేరు భాషల్లో రాస్తే ఆ జవాబుపత్రాలను టీజీపీఎస్సీ అనర్హమైనవిగా ప్రకటిస్తుంది.
- స్క్రైబ్(పరీక్ష రాయడానికి సహాయకులు) అవసరమైన దివ్యాంగ అభ్యర్థుల హాల్ టికెట్లపై 'స్క్రైబ్' విషయాన్ని ప్రత్యేకంగా పేర్కొనడంతోపాటు, వీరి కోసం 4 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ అభ్యర్థులకు అదనంగా గంట సమయాన్ని కేటాయిస్తారు. వీరు సదరం ధ్రువపత్రం తీసుకురావాలి.

ప్రపంచ నగరాలతోనే హైదరాబాద్ పోటీ

(మొదటి పేజీ తరువాయి)

ప్రపంచంలో మీరు ఎక్కడికి వెళ్లినా తెలంగాణ, హైదరాబాద్ నగరంలోని సానుకూలతలు, అవకాశాలను పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు, ప్రజలకు వివరించండి.

ఎంతటి సవాళ్లనైనా స్వీకరించాలి..

నగరంలో మేము ఏర్పాటు చేస్తున్న యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి ఐఎస్‌బీయే స్ఫూర్తి. దానితోనే పోటీ పడేలా కృషి చేస్తాం. జీవితం, రాజకీయాల నుంచే నేను నాయకత్వాన్ని అలవర్చుకున్నాను. కాంగ్రెస్ పార్టీకి అద్భుతమైన నాయకత్వ వారసత్వం ఉంది.. మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభ్‌భాయ్‌పటేల్, ఇందిరాగాంధీ, పీవీ నరసింహారావు, మన్మోహన్‌సింగ్ వంటి వారు ఇందుకు ఉదాహరణ. జ్ఞానం, తెలివితేటలు, శ్రమించే తత్వం, ఉత్తమ వ్యవహార శైలితోపాటు కొన్ని సమయాల్లో అదృష్టం ఉండాలి.. నాయకులకు ధైర్యసాహసాలే ముఖ్యం. గొప్ప పనులు చేయడానికి ఎంతటి సవాళ్లనైనా స్వీకరించాలి. మీరు ఉత్తమ నాయకుడిగా ఎదగాలంటే ధైర్యం, త్యాగాలనే విలువలను అలవర్చుకోవాలి. మీరు ఎంత పెద్ద ఉద్యోగాలు చేస్తున్నా.. పరిశ్రమలు నడిపిస్తున్నా.. మా ప్రభుత్వంతో రెండు, మూడేళ్లు పనిచేసి రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరుకుంటున్నాను. కార్పొరేట్ సంస్థల్లా భారీ వేతనాలు చెల్లించకపోయినా అపార అవకాశాలు, సవాళ్లను కల్పిస్తాం'' అని ముఖ్యమంత్రి రేవంత్ పేర్కొన్నారు. ఐఎస్‌బీ డీన్ మదన్ పిల్లుట్ల మాట్లాడుతూ ముఖ్యమంత్రి దార్శనికత, సమ్మిళితంగా ముందుకు సాగే విధానం ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో పారిశ్రామికవేత్త శ్రీని రాజు, విశ్రాంత ఎయిర్ చీఫ్ మార్షల్ వివేక్‌రాం చౌదరి తదితరులు పాల్గొన్నారు.

గ్రహం అనుగ్రహం

21-10-2024 సోమవారం

శ్రీ క్రోధి నామ సంవత్సరం; దక్షిణాయణం; శరదృతువు, ఆశ్వయుజమాసం, బహుళపక్షం

చవితి: ఉ. 8-56 తదుపరి పంచమి

రోహిణి: మ. 12-12 తదుపరి మృగశిర

వర్జ్యం: ఉ. 6-03 వరకు
తిరిగి సా. 5-38 నుంచి 7-11 వరకు

అమృత ఘడియలు: ఉ. 9-08 నుంచి 10-40 వరకు
తిరిగి రా. 2-57 నుంచి 4-30 వరకు

దుర్ముహూర్తం: మ. 12-08 నుంచి 12-54 వరకు
తిరిగి 2-27 నుంచి 3-13 వరకు

రాహుకాలం: ఉ. 7-30 నుంచి 9-00 వరకు

సూర్యోదయం: ఉ. 5.57; సూర్యాస్తమయం: సా.5.33

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
రాజమహేంద్రవరం	38.0	25.5
ఖమ్మం	35.0	24.8
నిజామాబాద్	34.3	24.2
మెదక్	34.0	20.0
తిరుపతి	33.8	25.4
విజయవాడ	33.6	25.6
విశాఖపట్నం	33.6	25.4
నెల్లూరు	33.5	25.5
కర్నూలు	33.5	24.0
అనంతపురం	33.1	24.2
రామగుండం	32.4	23.6
సూర్యాపేట	32.0	25.0
హనుమకొండ	32.0	23.0
కరీంనగర్	32.0	22.0
ఆదిలాబాద్	31.8	23.2
హైదరాబాద్	31.4	23.3
మహబూబ్‌నగర్	30.5	23.5
నల్గొండ	30.0	23.4

దీపావళికి పోలీసు బదిలీలు!

నెలల తరబడి ఇన్‌ఛార్జుల ఆధ్వర్యంలోనే పలు విభాగాలు • ఖాళీగా కొన్ని కీలక పోస్టులు • వీటి భర్తీపై దృష్టిపెట్టనున్న సర్కారు



ఈనాడు, హైదరాబాద్: దీపావళిలోపు పోలీసుశాఖలో బదిలీలు జరగనున్నట్లు తెలుస్తోంది. ఐపీఎస్‌లతో పాటు అదనపు ఎస్పీ, డీఎస్పీ స్థాయి అధికారులను బదిలీ చేసే అవకాశం ఉంది. శాఖలో పలు విభాగాలకు అధిపతులు లేరు. నెలల తరబడి ఇన్‌ఛార్జుల ఆధ్వర్యంలోనే నడుస్తున్నాయి. మరికొన్ని స్థానాలు ఖాళీగా ఉన్నాయి. వీటిని సర్దుబాటు చేయడంతోపాటు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని మారుస్తారని తెలుస్తోంది.

రాష్ట్రంలో గత ప్రభుత్వ హయాం నుంచీ అనేక కీలక విభాగాలను ఇన్‌ఛార్జులతో నెట్టుకొస్తున్నారు. కొత్త ప్రభుత్వం వచ్చినా.. ఈ పరిస్థితిలో పెద్దగా మార్పేమీ రాలేదు. శాఖ పనితీరు మెరుగుపడాలంటే ఇన్‌ఛార్జుల బాధ్యతలను తొలగించడంతోపాటు పనితీరు ప్రాతిపదికన ఖాళీలను భర్తీ చేయాల్సి ఉంటుంది. దీనిలో భాగంగానే బదిలీలు జరుగుతాయని భావిస్తున్నారు. ముఖ్యంగా ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారుల విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని భావిస్తోందని తెలుస్తోంది. ఆయా అధికారులతోపాటు పనితీరు ప్రాతిపదికన పలువురు ఎస్పీ, అదనపు ఎస్పీ, డీఎస్పీ స్థాయి అధికారులను బదిలీ చేయాలని భావిస్తోంది. మొత్తంగా ఈ నెలాఖరులోపు ఈ బదిలీలు జరగనున్నట్లు తెలుస్తోంది.

ఖాళీ పోస్టులు ఇవే..

◆ అత్యంత కీలకమైన హైదరాబాద్ అదనపు కమిషనర్ (నేరాలు) పోస్టు కొన్ని నెలలుగా ఖాళీగా ఉంది. సైబరాబాద్, రాచకొండ జాయింట్ కమిషనర్ల పోస్టులూ ఖాళీగా ఉన్నాయి. రాజధానికి ప్రాతినిధ్యం వహిస్తున్న మూడు కమిషనరేట్లలో ఈ మూడు పోస్టులు కీలకం. నెలలు గడుస్తున్నా భర్తీ కావడంలేదు.

◆ హైదరాబాద్ షీ టీమ్స్, మాదాపూర్ ట్రాఫిక్ డీసీపీ, రాచకొండ సైబర్ నేరాల డీసీపీ పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయి.

◆ నిజామాబాద్ కమిషనర్ కల్మేశ్వర్ సింగన్వార్, డిచ్‌పల్లి బెటాలియన్ కమాండెంట్ రోహిణి ప్రియదర్శిని కేంద్ర సర్వీసులకు వెళ్లారు. ఈ పోస్టులను వెంటనే భర్తీ చేయాల్సి ఉంది.

అదనపు బాధ్యతలు..

◆ సీఐడీ అదనపు డీజీగా ఉన్న శిఖాగోయల్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో, మహిళా భద్రతా విభాగం బాధ్యతలను అదనంగా చూస్తున్నారు. ఈ మూడు కీలక విభాగాలే.

◆ టెక్నికల్ సర్వీసెస్ అదనపు డీజీగా పనిచేస్తున్న వి.వి.శ్రీనివాసరావు పోలీసు నియామక మండలి బాధ్యతలు, శాంతిభద్రతల అదనపు డీజీ మహేశ్‌భగవత్ పర్సనల్, సంక్షేమం విభాగాల బాధ్యతలు; ప్రొవిజన్స్ అండ్ లాజిస్టిక్స్ ఐజీ రమేశ్‌రెడ్డి పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ ఎండీగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

◆ కేంద్రం ఆదేశాలమేరకు రాజా బహద్దూర్ వెంకట్రామిరెడ్డి తెలంగాణ పోలీసు అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్; రహదారి భద్రత, ప్రింటింగ్ అండ్ స్టేషనరీ బాధ్యతలు నిర్వర్తిస్తున్న అంజనీకుమార్‌లు తమ సొంత క్యాడర్ రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లాల్సి వస్తే ఆ పోస్టులనూ భర్తీ చేయాల్సి ఉంటుంది.

కులగణనకు బాసటగా ఉండాలి

• అఖిలపక్ష పార్టీల నేతలు

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో సమగ్ర కులగణన చేపట్టి.. బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలని ఆర్నెల్లుగా చేస్తున్న పోరాటం విజయవంతమైందని అఖిలపక్ష పార్టీల నేతలు పేర్కొన్నారు. బీసీల సమష్టి పోరాటంతోనే రాష్ట్ర ప్రభుత్వం జీవో18 విడుదల చేసిందన్నారు. కులగణనకు అన్ని రాజకీయ పార్టీలు బాసటగా ఉండాలన్నారు. ఆదివారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో సమగ్ర కుల గణనకు మద్దతు కోరుతూ అఖిల పక్ష సమావేశం నిర్వహించారు. జాజుల మాట్లాడుతూ.. కులగణనకు ప్రభుత్వం 70వేల మంది ఉద్యోగులను నియమిస్తోందని, వారికి తోడుగా రాజకీయ పార్టీల నాయకులు భాగస్వామ్యం కావాలన్నారు. శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ బండా ప్రకాశ్ ముదిరాజ్, మండలిలో భారాస పక్ష నేత మధుసూదనాచారి, మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కులగణన చేయాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, వి.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

చర్లపల్లి రైల్వే టెర్మినల్ నెల రోజుల్లో ప్రారంభం!

• త్వరలో యాదాద్రి వరకు ఎంఎంటీఎస్

• కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి



చర్లపల్లి స్టేషన్ అభివృద్ధి పనులపై రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ ద్వారా వివరాలు తెలుసుకుంటున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

ఈనాడు, హైదరాబాద్, ఏఎస్‌రావునగర్, న్యూస్‌టుడే: నెల రోజుల్లో చర్లపల్లి టెర్మినల్ ప్రారంభమవుతుందని కేంద్ర బొగ్గు గనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. చిన్న పనులు మినహా టెర్మినల్‌లో 98శాతం పూర్తయ్యిందన్నారు. చర్లపల్లిలో రూ.430కోట్లతో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మితమవుతున్న టెర్మినల్ పనులను ఆదివారం ఎంపీ ఈటల రాజేందర్, జీఎం అరుణ్‌కుమార్ జైన్‌తో కలిసి పరిశీలించారు. అన్ని రకాల సదుపాయాలతో టెర్మినల్ ఏర్పాటైందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. రోడ్ల కనెక్టివిటీకి రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. గత సీఎం కేసీఆర్‌కు రోడ్లను విస్తరించాలని చెప్పినా పట్టించుకోలేదన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి తెలంగాణకు రైల్వేల విషయంలో అన్యాయం జరిగిందని... నూతన రైల్వే లైన్ల నిర్మాణం భాజపా హయాంలోనే జరుగుతోందని అన్నారు. సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడతో పాటు అదనంగా చర్లపల్లి నాలుగో ప్రధాన రైల్వే స్టేషన్‌గా రూపుదిద్దుకోబోతుందన్నారు. చర్లపల్లి రైల్వే స్టేషన్ అందుబాటులోకి రావడంతో హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్య తగ్గుతుందన్నారు. కొమురవెల్లి దేవస్థానం వరకు రైల్వే ట్రాక్ పనులు జరుగుతున్నాయని, యాదాద్రి వరకు ఎంఎంటీఎస్ పనులు త్వరలోనే ప్రారంభిస్తామని కిషన్‌రెడ్డి తెలిపారు. ప్రధాని మోదీ సారథ్యంలో రాష్ట్రంలో అపూర్వమైన మౌలిక సదుపాయాల కల్పన జరిగిందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్‌వీఎస్‌ఎస్ ప్రభాకర్, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సత్య ప్రకాష్, డివిజనల్ రైల్వే మేనేజర్ భారతీష్ కుమార్ జైన్, సీపీఆర్‌వో శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి

తిరుమలలో శ్రీవారిని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.రాజేశ్వర్‌రావు ఆదివారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో కుటుంబసభ్యులతో కలిసి శ్రీవారి ఆలయం వద్దకు చేరుకున్న న్యాయమూర్తికి తితిదే అధికారులు స్వాగతం పలికి శ్రీవారి మూలమూర్తిని దర్శనం చేయించారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా తితిదే అధికారులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

– న్యూస్‌టుడే, తిరుమల

స్థానిక ఎన్నికలకు ముందే సమస్యలు పరిష్కరించాలి

• పంచాయతీ కార్యదర్శుల సంఘం



సమావేశంలో పంచాయతీ కార్యదర్శుల రాష్ట్ర సంఘం అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, ఇతర సభ్యులు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే తమ సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర పంచాయతీ కార్యదర్శుల సంఘం(టీపీఎస్‌ఏ) డిమాండ్ చేసింది. గ్రామ పంచాయతీలను నాలుగు గ్రేడ్ల కింద పునర్వ్యవస్థీకరించి ఉద్యోగులు, కేడర్ కేటాయింపులను పూర్తి చేయాలని కోరింది. ఆదివారం హైదరాబాద్‌లో సంఘం అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో టీపీఎస్‌ఏ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. జీవో 317తో నష్టపోయిన కార్యదర్శులను సొంత జిల్లాలు, జోన్‌లకు పంపించాలని, పంచాయతీరాజ్ చట్టంలో కార్యదర్శుల సెక్షన్‌లను సవరించాలని, పొరుగు సేవల నియామకం రద్దు చేస్తూ ప్రస్తుతం పనిచేస్తున్న వారిని క్రమబద్ధీకరించాలని, శాశ్వత కార్యదర్శుల క్రమబద్ధీకరణ కాలాన్ని నాలుగేళ్ల నుంచి రెండేళ్లకు తగ్గించాలని ఈ సందర్భంగా తీర్మానించారు. త్వరలో మంత్రి సీతక్కను కలిసి తమ సమస్యలను విన్నవిస్తామని తెలిపారు. సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధ్యక్షురాలు వాణి, కోశాధికారి పండరీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు, టెంపో ఢీ.. 12 మంది మృతి

జైపూర్: రాజస్థాన్‌లో బస్సు, టెంపో ఢీకొని 8 మంది చిన్నారులు సహా ఒకే కుటుంబంలోని 12 మంది దుర్మరణం చెందారు. ఒకరు గాయపడ్డారు. శనివారం అర్ధరాత్రి ధౌల్‌పుర్ జిల్లాలోని సునిపుర్ గ్రామ సమీపంలో ప్రమాదం చోటుచేసుకుంది. పెళ్లి వేడుకల నుంచి తిరిగి వస్తున్న టెంపోను అతివేగంతో వస్తున్న స్లీపర్ బస్సు ఢీకొంది.



స్థిరమైన ప్రయత్నాలే కీలకం

ఫలితాలు ఏ మాత్రం సంతృప్తికరంగా రావడం లేదా? ప్రయత్నాలను స్థిరంగా కొనసాగించండి. సగటు ఫలితాలు మాత్రమే వస్తున్నాయా? క్రమం తప్పకుండా ప్రయత్నించండి. అద్భుతమైన ఫలితాలు వస్తున్నాయా? అయితే మీరు స్థిరమైన ప్రయత్నాలు చేస్తున్నారని అర్థం. ఇక మీదటా వాటిని అలాగే కొనసాగించండి. అంటే దీనర్థం ఫలితాల గురించి పట్టించుకోకుండా మీ ప్రయత్నాలను నిరాటంకంగా కొనసాగించండి.

– స్టీన్ నూర్‌మన్, డిజిటల్ రైటర్

నాన్ రెవెన్యూ క్యాడర్ ఐఏఎస్‌గా చంద్రశేఖర్‌రెడ్డి

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో నాన్ రెవెన్యూ క్యాడర్‌లో ఉన్న ఒక ఐఏఎస్ పోస్టుకు సహకార శాఖకు చెందిన జాయింట్ రిజిస్ట్రార్ కె.చంద్రశేఖర్‌రెడ్డి ఎంపికయ్యారు. ప్రస్తుతం ఈయన హైదరాబాద్ అగ్రికల్చర్ కో ఆపరేటివ్ అసోసియేషన్‌కు ఎండీగా పనిచేస్తున్నారు. కరోనా కాలంలో తెలంగాణ రాష్ట్ర వైద్యసేవలు మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ఎండీగా వైద్యారోగ్యశాఖకు అవసరమైన ఔషధాలు, కీలక సేవలు అందించారు. నాన్ రెవెన్యూ క్యాడర్‌లో ఐఏఎస్ పోస్టుకు రాష్ట్రం నుంచి ఆయనతోపాటు మాధవి కృష్ణమూర్తి, వి.సర్వేశ్వర్‌రెడ్డి, వి.కోటేశ్వర్‌రావు, ఎస్.దిలీప్‌కుమార్ దిల్లీలో ఈ నెల 11న జరిగిన యూపీఎస్సీ ఇంటర్వ్యూకు హాజరయ్యారు. వారిలో చంద్రశేఖర్‌రెడ్డిని ఎంపిక చేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి యూపీఎస్సీ అధికారులు సమాచారం పంపించారు. త్వరలో దీనికి సంబంధించిన అధికారిక గెజిట్ విడుదల కానుంది. అనంతరం ప్రభుత్వం ఆయనకు పోస్టింగ్ ఇస్తుంది.



చంద్రశేఖర్‌రెడ్డి

నేటి నుంచి సియోల్‌లో రాష్ట్ర ప్రతినిధుల బృందం పర్యటన

ఈనాడు, హైదరాబాద్: దక్షిణ కొరియాలోని సియోల్‌లో నదుల పునరుజ్జీవంపై చేపట్టిన పథకాలను రాష్ట్ర ప్రతినిధుల బృందం పరిశీలించనుంది. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో మంత్రి పొన్నం ప్రభాకర్, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత, పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దానకిశోర్, తదితరులతో వెళ్లిన ప్రతినిధుల బృందం ఆదివారం సియోల్‌కు చేరుకుంది. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టును చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించడంతో.. సియోల్‌లో నదుల పునరుజ్జీవానికి ఎలాంటి చర్యలు చేపట్టారో ఈ బృందం పరిశీలిస్తుంది. సోమవారం నుంచి మూడు రోజులపాటు ఈ పరిశీలన ఉంటుంది.

22 నుంచి 'తపస్' ఆందోళన కార్యక్రమాలు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు డీఏలు, పీఆర్సీని వెంటనే ప్రకటించాలని, పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) ఆధ్వర్యంలో ఈ నెల 22 నుంచి ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి ఆదివారం నిర్వహించిన సంఘం రాష్ట్ర సమావేశంలో ఉద్యమ కార్యాచరణ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ నెల 22న పాఠశాలల్లో నల్లబ్యాడ్జీలతో నిరసన, 28న అన్ని మండలాల్లో తహసీల్దార్లకు వినతిపత్రాలు ఇవ్వాలని, నవంబరు 5న ఆయా జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నా జరపాలని నిర్ణయించారు. చివరిగా నవంబరు 23న ఉపాధ్యాయ ధర్మాగ్రహ దీక్ష పేరిట చలో ఇందిరాపార్క్‌కు సంఘం పిలుపునిచ్చింది.

ఈనాడు

ప్రగతి వెలుగుల వెనక...


ప్రస్తుతం ప్రపంచంలో అయిదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న ఇండియా- 2030 కల్లా మూడో స్థానానికి చేరుతుందని ఎస్‌అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ తాజాగా ప్రకటించింది. నేడు 3.6 లక్షల కోట్ల డాలర్ల స్థాయిలో ఉన్న మన ఆర్థికవ్యవస్థ పరిమాణం 2047 నాటికి అంతకు ఎనిమిది రెట్లకు పైగా ఎగబాకుతుందన్న విశ్లేషణలు వినసొంపుగా ఉన్నాయి. ఇదంతా ఒక పార్శ్వమే! నాణేనికి మరోవైపు చూస్తే- ప్రపంచ దేశాల్లో పేద ప్రజల జనాభా ఎక్కువగా ఉన్నది ఇండియాలోనేనని ఐక్యరాజ్య సమితి నివేదిక ఒకటి తాజాగా వెల్లడించింది. విశ్వవ్యాప్తంగా 110 కోట్లమంది పేదలుంటే, అందులో 23.4 కోట్ల మంది భారతీయులేనన్న చేదు వాస్తవం- మన ప్రగతి వెలుగుల మాటున కారుచీకట్లలో మగ్గిపోతున్న జీవితాలకు అద్దంపడుతోంది. ప్రజల ఆదాయాలు, వారి జీవన ప్రమాణాల్లో మెరుగుదలే అభివృద్ధికి సరైన కొలమానం. జీడీపీలో కొత్త ఎత్తులకు చేరుతున్న ఇండియా- తలసరి ఆదాయం పరంగా 140 దేశాలకన్నా దిగువకు పరిమితమైంది. ఆక్స్‌ఫామ్ నివేదిక ప్రకారం- జనాభాలో ఒక శాతం చేతుల్లో 40శాతం దేశ సంపద పోగుపడింది. ప్రజ్వరిల్లుతున్న ఆర్థిక అసమానతల ధాటికి ఎందరి జీవితాలో దుర్భరమవుతున్నాయి!

దేశీయంగా తొమ్మిదేళ్లలో దాదాపు పాతిక కోట్ల మంది దుర్భర దారిద్ర్యం నుంచి బయటపడ్డారని నీతి ఆయోగ్ చర్చాపత్రం ఇటీవల గొప్పగా ప్రకటించింది. అయిదు శాతం కంటే తక్కువ మంది భారతీయులే పేదరికంలో ఉన్నారని ఆ సంస్థ సీఈవో సెలవిచ్చారు. అదే నిజమైతే, 81 కోట్ల మందికి ప్రభుత్వమే ఉచితంగా ఆహార ధాన్యాలను ఎందుకు సమకూర్చాల్సి వస్తోందన్నది ప్రధాన ప్రశ్న. రాబడి లెక్కల మీదే ఆధారపడి లేమితనాన్ని గణించడం సమంజసం కాదు. నాణ్యమైన విద్య, వైద్యం, తాగునీరు, పౌష్టికాహారం తదితరాలను అందిపుచ్చుకోగలుగుతున్న సామాన్యులెందరు ఉన్నారనే కీలకాంశాన్ని పరిశీలించాలి. ప్రభుత్వ వైద్యశాలల దయనీయ స్థితి వల్ల ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సి రావడంతో చాలామంది పేదరికంలోకి జారిపోతున్నారు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం- సమతులాహారానికి నోచుకోక 15-49 ఏళ్ల వయసులోని స్త్రీలలో 57శాతం, పురుషుల్లో 25శాతం రక్తహీనతతో బాధపడుతున్నారు. అయిదేళ్లలోపు చిన్నారులూ ఎదుగుదల లోపాలతో గిడసబారిపోతున్నారు. మానవాభివృద్ధిలో బేలచూపులు చూస్తున్నంత కాలం మన దేశం నిజంగా సంపద్వంతం కాదు!

విస్తృత జనశ్రేయానికి పట్టం కట్టేందుకు ఐరాస పదిహేడు సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను నిర్దేశించింది. అందులో కీలకమైన వాటిని సాధించడంలో ఇండియా పరిస్థితి ఎక్కడి గొంగడి అక్కడే అన్నట్లు ఉందని పరిశీలనలు చాటుతున్నాయి. పెరుగుతున్న ఖర్చులకు తగినట్లుగా ఆదాయాలు లేక పొదుపు తగ్గిపోయి అనేక కుటుంబాల అప్పుల్లో కూరుకుపోతున్నాయి. పెట్టుబడి ఖర్చులు కట్టుతప్పి, గిట్టుబాటు ధరలు లభించక అన్నదాతలెందరో కాడి వదిలేస్తున్నారు. రుణభారంతో బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. జనాభాలో సగానికి పైగా ఉన్న యువతలో అత్యధికులు- చదువుకు తగిన నైపుణ్యాలు కొరవడి ఉపాధి వేటలో ముఖం వేలాడేస్తున్నారు. చిన్నాచితకా కొలువులతో బతుకుబండి భారంగా వెళ్లదీస్తున్నారు. ఈ సమస్యలన్నింటినీ పరిష్కరించుకోగలిగితేనే ఇండియా నిజంగా అభివృద్ధి చెందిన దేశం కాగలదు. విద్యా వైద్యాలపై వ్యయాలను పెంచుతూ సమ్మిళిత సుస్థిరాభివృద్ధి విధానాలను ప్రభుత్వాలు ఆచరించాలి. నైపుణ్య శిక్షణ, స్వయం ఉపాధికి చేయూతలతో యువశక్తులను సద్వినియోగం చేసుకోగలగాలి. 'దేశం సంపన్నమైనదే కానీ, ప్రజలే పేదలు' అన్న అపప్రథ అప్పుడే తొలగిపోతుంది!

విద్యుత్ వారధిపై స్నేహరథం

ఆర్థికాభివృద్ధిలో విద్యుచ్ఛక్తి పాత్ర కీలకమైంది. ఇండియా విద్యుత్ అవసరాలను తీర్చడంలో భూటాన్ బాగా అక్కరకొస్తోంది. అదే సమయంలో భూటాన్‌కు ఆర్థిక సాయం చేయడం ద్వారా ఆ దేశం చైనా గుప్పిట్లోకి పోకుండా భారత్ జాగ్రత్త వహిస్తోంది.



బంగ్లాదేశ్ సంక్షోభంలోకి జారిపోయిన సమయంలో మరో పొరుగు దేశం భూటాన్ నుంచి శుభవార్తలు వస్తున్నాయి. భారత్ సహకారంతో అక్కడ నిర్మితమవుతున్న 1,020 మెగావాట్ల పునట్సాంగ్ఛు-2 జల విద్యుత్ ప్రాజెక్టు టర్బైన్లలో రెండు ఇటీవల పనిచేయడం మొదలుపెట్టాయి. వచ్చే డిసెంబరు నుంచి మిగిలిన నాలుగు టర్బైన్లు కూడా విద్యుదుత్పాదన ప్రారంభించనున్నాయని అధికార వర్గాలు చెబుతున్నాయి. భారత్-భూటాన్ సహకారానికి ఈ ప్రాజెక్టు విశిష్ట ప్రతీక అని భూటాన్ ఇంధన శాఖ మంత్రి గ్యెమ్ షెరింగ్ ఉద్ఘాటించారు. పునట్సాంగ్ఛు-2 ప్రాజెక్టు విద్యుదుత్పాదన సామర్థ్యాన్ని మొదట్లో 990 మెగావాట్లుగా నిర్ణయించినా, తరవాత 1,020 మెగావాట్లకు పెంచారు. ప్రాజెక్టు వ్యయాన్ని రూ.3,777 కోట్లుగా అంచనా వేశారు. ఇందులో 30శాతాన్ని భారత ప్రభుత్వం గ్రాంటుగా, మిగిలిన 70శాతాన్ని 10శాతం వార్షిక వడ్డీపై రుణంగా ఇస్తోంది. ప్రాజెక్టు డిజైన్, ఇంజినీరింగ్ సేవలను భారత ప్రభుత్వ సంస్థలే అందించాయి.

తీవ్ర జాప్యం

పునట్సాంగ్ఛు-2 ప్రాజెక్టు నిర్మాణాన్ని 2010 డిసెంబరులో మొదలు పెట్టి, ఏడేళ్లలో పూర్తిచేయాలన్నది లక్ష్యం. పర్వతాలు, అడవుల మధ్య పనులు కష్టతరం కావడం, పదేపదే మెరుపు వరదలు విరుచుకుపడటం, కొవిడ్ వచ్చిపడటం వంటివాటితో ప్రాజెక్టు నిర్మాణ వ్యవధిని పొడిగించాల్సి వచ్చింది. డ్యామ్ పునాది దగ్గర పగుళ్లు ఏర్పడటం మూలంగానూ నిర్మాణం ఆలస్యమైంది. ఇక 2013లోనే నిలిచిపోయిన పునట్సాంగ్ఛు-1 ప్రాజెక్టు పనులనూ తిరిగి ప్రారంభించాలని భారత్, భూటాన్‌లు తాజాగా నిర్ణయించాయి. 2008లో చేపట్టిన ఈ 1200 మెగావాట్ల ప్రాజెక్టు నిర్మాణాన్ని 2015కల్లా పూర్తిచేయాల్సి ఉంది. కానీ, 2013లో డ్యామ్ స్థలానికి కుడివైపు మట్టిపెళ్లలు విరిగిపడటంతో పని ఆగిపోయింది. ఇరుదేశాల నిపుణుల కమిటీ 30 సార్లు సమావేశమై ప్రాజెక్టును మళ్లీ ముందుకు ఉరికించాలని సిఫార్సు చేసింది. దానికి రెండు దేశాలూ ఇటీవల ఆమోదముద్ర వేశాయి. రూ.3,500 కోట్ల వ్యయ అంచనాతో చేపట్టిన పునట్సాంగ్ఛు-1 ప్రాజెక్టు కాలహరణం వల్ల ఇప్పుడు రూ.10వేల కోట్లు వెచ్చిస్తే కానీ పూర్తవని పరిస్థితి ఏర్పడింది. ఈ ప్రాజెక్టు పునట్సాంగ్ఛు నది మీద నిర్మితమవుతోంది. సముద్ర మట్టానికి 1200 మీటర్ల ఎత్తున ఫోచ్ఛు, మోచ్ఛు నదుల సంగమం నుంచి పునట్సాంగ్ఛు ఉద్భవిస్తోంది. అది దక్షిణ దిక్కుగా ప్రవహించి పశ్చిమ్ బెంగాల్‌లో ప్రవేశించి బ్రహ్మపుత్ర నదిలో కలుస్తుంది. భారత్-భూటాన్‌ల మధ్య జలవిద్యుత్ ప్రాజెక్టులపై సహకార ఒప్పందం కుదిరింది. దాని కింద భూటాన్‌లో పదివేల మెగావాట్ల జల విద్యుత్ ప్రాజెక్టులను నిర్మించి, మిగులు విద్యుత్తును భారత్ దిగుమతి చేసుకోవాలని నిర్ణయించారు. ఈ ఒప్పందం కింద భారత్ సహకారంతో భూటాన్‌లో ఇప్పటికి నాలుగు జలవిద్యుత్ ప్రాజెక్టులు నిర్మితమయ్యాయి. వాటిలో మొదటిది చుఖా జలవిద్యుత్కేంద్రం. భూటాన్ ఆదాయంలో 35శాతానికి పైగా ఒక్క చుఖా ద్వారానే వస్తోంది. ఆ తరవాత మరో మూడు జల విద్యుత్కేంద్రాలను నిర్మించారు. ఈ నాలుగు ప్లాంట్ల ఉత్పాదన సామర్థ్యం 2,136 మెగావాట్లు. ప్రస్తుతం పునట్సాంగ్ఛు-1, పునట్సాంగ్ఛు-2లతో పాటు 600 మెగావాట్ల ఖోలోంగ్ఛు ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయి.

సాయం ఇలా...

సామాజిక, ఆర్థికాభివృద్ధికి 1961 నుంచి ప్రత్యేక ప్రణాళికలను అమలు చేస్తోంది భూటాన్. ఇప్పటి వరకు 12 ప్రణాళికలు పూర్తయ్యాయి. వాటికి అత్యధిక నిధులు సమకూర్చింది మన దేశమే. ఆయా ప్రణాళికల కాలంలో భూటాన్‌కు భారత్ అందించిన ఆర్థిక సాయం రూ.కోట్లలో...

1961–66	10.72
1966–71	20.22
1971–76	42.66
1976–81	85.30
1981–87	134
1987–92	400
1992–97	750
1997–02	1050
2002–08	2610.14
2008–13	3400
2013–18	4500
2018–23	5000

చైనాకు దీటుగా..

భారత ప్రధాని నరేంద్ర మోదీ ఈ ఏడాది జూన్‌లో భూటాన్‌ను సందర్శించినప్పుడు ఖోలోంగ్ఛు ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. దానితో పాటు 1520 మెగావాట్ల సామర్థ్యంతో మరో మూడు జల విద్యుత్కేంద్రాలను సంయుక్త ప్రాజెక్టులుగా చేపడుతున్నారు. భూటాన్ విదేశీ రుణాల్లో 80శాతం జల విద్యుత్కేంద్రాల నిర్మాణం కోసం చేసినవే. ఆ అప్పుల్లో అత్యధికం భారత్ ఇచ్చినవే. భూటాన్ సామాజిక, ఆర్థికాభివృద్ధికి జలవిద్యుత్ ప్రాజెక్టులు గొప్ప ఊతమిస్తున్నాయి. ఆ దేశ జీడీపీలో 14శాతం జలవిద్యుత్ ద్వారా లభిస్తోంది. విద్యుత్ విక్రయాల్లో సింహభాగం భారత్‌కే జరుగుతున్నాయి. 2022లో భారత్ భూటాన్ నుంచి రూ.2,448 కోట్ల విలువైన విద్యుత్తును కొనుగోలు చేసింది. భారత ప్రభుత్వం 2024-25 తాత్కాలిక బడ్జెట్లో విదేశాంగ శాఖకు రూ.22,154 కోట్లను కేటాయించింది. అందులో 'పొరుగు దేశాలకే ప్రాధాన్యం' విధానం కింద అత్యధిక ఆర్థిక సహాయాన్ని (రూ.2,068 కోట్లను) భూటాన్‌కే అందించాలని నిర్ణయించారు. పాకిస్థాన్, నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంకల్లో చైనా భారీగా పెట్టుబడులు పెట్టిన సంగతి తెలిసిందే. భారత్ సైతం డ్రాగన్‌కు దీటుగా పొరుగు దేశాలకు ఆర్థిక సహాయం అందిస్తోంది. తద్వారా అవి పూర్తిగా చైనా ఆధిపత్యంలోకి జారిపోకుండా చూస్తోంది. పైగా భూటాన్ భూభాగాలను చైనా నిశ్శబ్దంగా కబ్జా చేస్తున్న నేపథ్యంలో ఆ దేశానికి భారత్ అండదండలు కీలకమవుతున్నాయి.

– కైజర్ అడపా

ఓ శరణార్థి కథ

వరదల వల్ల సర్వం కోల్పోయి మూటాముల్లె నెత్తిన పెట్టుకుని జీవచ్ఛవాలుగా చైనా దేశ రాజధానికి చేరుతున్నారెందరో! బృందాలు బృందాలుగా భారంగా నడచి వస్తున్నారు... వారిలో చిట్టచివరిగా ఒక వృద్ధుడు భుజం మీద కావడితో వచ్చాడు. దానికున్న ఒక బుట్టలో సామాను, రెండో దాంట్లో మడతలు పెట్టి ఉన్న ఒక అతుకుల బొంత ఉన్నాయి. దారినపోతున్న ఓ మనిషి, ఆ ముసలివాణ్ని చూసి జాలిపడ్డాడు. ఓ వెండి కాసునూ మరో రాగి కాసును అతని ఒడిలోకి విసిరి... "అదుగో ఆ నూడుల్సు కొనుక్కుని తిను" అన్నాడు. తాను బిచ్చగాడిని కానని, రైతునని, వరదలవల్ల అంతా తలకిందులైందని ఆ వృద్ధుడు చెబుతున్న మాటలను వినకుండానే వెళ్లిపోయాడా వ్యక్తి.


ఇదంతా చూస్తున్న నూడుల్సు అమ్మే వ్యక్తి ఓ పెద్ద కప్పు పట్టుకుని ఆ వృద్ధుడి దగ్గరకు వస్తాడు. నిండా నూడుల్సుతో ఉన్న ఆ కప్పును ఇవ్వబోతాడు. 'ఒక చిన్న గిన్నెడు చాలు' అంటూ అంతే తీసుకుంటాడా వృద్ధుడు. షాపతనిలో ఆశ్చర్యాన్ని, ఉత్సుకతను కలిగిస్తూ ఆ గిన్నె తీసుకుని కావడిలోని ఒక బుట్ట దగ్గరకు వెళ్తాడు. అందులోని రగ్గు మడతలను తీసి, వాటి మధ్యలో శుష్కించిపోయిన దేహంతో కళ్లు తెరవలేనంత నీరసంతో ఉన్న ఒక పిల్లాడికి నూడుల్సు తినిపిస్తూ- 'వీడు నా మనవడు. కొడుకు, కోడలు ఇద్దరూ



వరదల్లో చనిపోయారు' అని చెబుతాడు. ఆ గిన్నెకు అంటుకున్న నూడుల్సు తను తిని, దుకాణదారుకు డబ్బులు ఇచ్చేస్తాడు. "నా కోసం నూడుల్సు ఎందుకు కొనలేదో నువ్వు అర్థం చేసుకోలేవు. నీకు పొలముంటే తెలిసేది. ఉన్న డబ్బుతో నా మనవడికి విత్తనాలు కొనివ్వడమే నేనిచ్చే పెద్ద కానుక. తిండిలేక నేను చనిపోయినా, మిగిలినవారు విత్తనాలు చల్లి, పంటలను పండించాలి" అంటూ వివరిస్తాడు. తరవాత కావడిని భుజం మీద వేసుకుని వణుకుతున్న పాదాలతో, ముసురుతున్న చీకటిలో దారి కోసం కళ్లు చికిలిస్తూ నడిచి వెళ్లిపోతాడు ఆ వృద్ధుడు.

ప్రఖ్యాత అమెరికా రచయిత్రి, నోబెల్ బహుమతి గ్రహీత పెరల్.ఎస్.బక్ రాసిన 'ద రిఫ్యూజీస్' అన్న కథలోని హృదయ విదారకమైన సన్నివేశమిది. వరద బాధితుల దైన్యాన్ని, మనస్థితిని, వారిని భరించలేని ఆ నగర వాసుల మనోభావాలను ఈ కథ అద్భుతమైన అక్షరచిత్రాలుగా చూపుతుంది. ఆత్మగౌరవాన్ని వదులుకోని రైతుల వ్యక్తిత్వాన్నీ కళ్లకుకడుతుంది. ఆ వృద్ధుడి పాత్ర మానవ అనుబంధాలకు నిలువెత్తు సాక్ష్యం. అతని మాటలు- భావితరాల క్షేమాన్నీ సుస్థిరతనూ కోరుకునే ఓ అనుభవజ్ఞుడి పరిణతికి, దార్శనికతకు, మానవత్వానికి గొప్ప తార్కాణాలు!

– శీతాంశు



సినిమాలు వరసగా ఫెయిల్ కావడంతో ఈ రంగాన్ని ఇక వదిలేద్దాం అనుకున్నాను. కానీ, ఒక ప్రయత్నంగా నన్ను నేను మార్చుకుని ప్రేక్షకుల ముందుకు వచ్చాను. విజయవంతం అయ్యాను. ప్రయత్నిస్తే ఏదైనా సాధ్యమే.


– షమ్మీ కపూర్

మార్గదాత

నైతికత, మంచి నడత... వాటి ఆచరణ- బౌద్ధధర్మానికి పట్టుగొమ్మలు. 'నేను మార్గాన్ని మాత్రమే చూపుతాను. లక్ష్యం మీరే చేరుకోవాలి' అని బుద్ధుడు చాలా స్పష్టంగా చెప్పాడు. తాను బోధించిన 'చతురార్య సత్యాలు', 'అష్టాంగమార్గాలు' వంటి ఉపదేశాలన్నీ జీవనమార్గాలుగా ఉండాలని బుద్ధుడి ఉద్దేశం.

బౌద్ధ ధర్మాచరణలో ముఖ్యమైన మరో నాలుగు సూత్రాలు మైత్రి, కరుణ, ముదిత, ఉపేక్ష. వీటిని బ్రహ్మ విహారాలు అంటారు. లోకంలోని సకల జీవుల పట్ల స్నేహపూర్వకంగా ఉండటం మైత్రి. మాటలతోగానీ మనుగడలోగానీ ఎదుటివారి మనసు గాయపడకుండా ప్రవర్తించడం కరుణ. ఇతరుల ఉన్నత గుణాలను ప్రశంసించడం, వాటిని ఎటువంటి అహం లేకుండా ఆచరించడం ముదిత. ఎవరైనా మనపట్ల దురుసుగా ప్రవర్తిస్తే, శత్రుత్వం పెంచుకోకుండా వారిని క్షమించడం ఉపేక్ష. ఈ నాలుగు సూత్రాలను ఆచరించడం వల్ల జీవితం ప్రశాంతంగా సాగిపోతుందని బుద్ధుడు ప్రబోధించాడు.

తథాగతుడు ధర్మ ప్రచారానికి భిక్షు సంఘాల్ని ఏర్పాటుచేశాడు. ఈ భిక్షువులతో పాటు సాధారణ గృహస్థులు కూడా బౌద్ధధర్మాన్ని ఆచరిస్తారు. వీరిని ఉపాసకులు అంటారు. భిక్షువులైనా, ఉపాసకులైనా ఎవరి ధర్మాన్ని వారు ఆచరించాలి. ఉదాహరణకు భిక్షువులు ఎటువంటి ఆస్తులు కలిగి ఉండకూడదు. ఒక పూటే భోజనం చేయాలి. అలాగే ఉపాసకులు నైతికతను తమ జీవనవిధానంలో భాగం చేసుకోవాలి. కేవలం బుద్ధుణ్ని అనుసరించడం వల్ల వారికి ఎటువంటి ప్రయోజనం ఉండదు. స్వీయ సాధన ద్వారానే ఉత్తమ జీవన మార్గాన్ని పొందగలరు.



అంతర్యామి

మగధ చక్రవర్తి బింబిసారుడు, కోసల దేశం రాజు ప్రసేనజిత్తుడు బౌద్ధ ధర్మాన్ని ఆచరించి ధర్మదీక్ష తీసుకున్నారు. రాజ క్షురకుడైన ఉపాలి, రాజ గణిక ఆమ్రపాలి వంటివారు బుద్ధుడి సన్నిధిలోనే ధర్మదీక్ష చేపట్టారు. బుద్ధుడి బోధనలకు ప్రభావితులై అంగులీమాలుడు వంటి బందిపోటు దొంగలు కూడా ధార్మికజీవనాన్ని అవలంబించి నిర్వాణ స్థితిని పొందారు. శీలవంతమైన జీవనానికి బుద్ధుడు 'పంచశీల' ఉపదేశించాడు. అవి... సత్యమే పలకాలి. జీవహింస చేయకూడదు. మద్యపానం, వ్యభిచారం, దొంగతనం చేయకూడదనివి. పంచశీలైనా మరోటైనా చెప్పడం వరకే బుద్ధుడి బాధ్యత. ఫలితాన్ని ఎవరికి వారే సాధన, ఆచరణ ద్వారా సముపార్జించుకోవాలి.

ఒకసారి సారనాథ్‌లో బుద్ధుడు ఉపదేశం ఇస్తున్నాడు. ఓ శిష్యుడు 'భగవాన్ మీరు బోధించే ధర్మం వినడానికి ఎంతో ఆసక్తిగా ఉంటుంది. కానీ మార్గమే పూర్తిగా బోధపడటం లేదు' అన్నాడు. 'మీరిప్పుడు సారనాథ్‌లో ఉన్నారు. ఇక్కడినుంచి వారణాసికి వెళ్లాలంటే- ఆ మార్గమంతా పయనిస్తే గానీ చేరుకోలేరు కదా! అలాగే నేను చెప్పింది వినడమే కాకుండా ఆచరించాలి. నేను మార్గదాతను మాత్రమే' అని బుద్ధుడు శిష్యుడికి వివరణ ఇచ్చాడు.


బౌద్ధధర్మమనే కాదు, ఏ ధర్మమైనా ఆచరణపైనే ఆధారపడి ఉంటుంది. దాని జోలిపోకుండా కేవలం బోధనలను వల్లెవేయడం వల్ల ఫలితం శూన్యం.

– డాక్టర్ బండి సత్యనారాయణ



అన్నీ ఆన్‌లైన్‌లోనే...

ప్రస్తుతం అందరి చేతుల్లో స్మార్ట్ ఫోన్లు ఉంటున్నాయి. తక్కువ ధరకే డేటా అందుబాటులోకి వచ్చింది. జీవన విధానంలోనూ మార్పులు చోటుచేసుకున్నాయి. ఈ క్రమంలో అన్ని రకాల వస్తువులను ఆన్‌లైన్‌లోనే కొనేస్తున్నారు. దేశీయంగా 2022లో మొత్తం ఈ-కామర్స్ చిల్లర విపణిలో ఆయా వస్తువుల వాటా ఎంతంటే...(శాతాల్లో)



- స్మార్ట్‌ఫోన్లు
- ఎలక్ట్రానిక్స్, ఇతర ఉపకరణాలు
- ఫ్యాషన్, దుస్తులు
- ఆహారం, వేగంగా అమ్ముడయ్యే వినియోగ వస్తువులు (ఎఫ్‌ఎంసీజీ)
- ఫర్నిచర్, గృహాలంకరణ సామగ్రి
- ఇతరాలు

(ఆధారం: ఐబీఈఎఫ్ నివేదిక)

ఖర్చు బారెడు... రాబడి బెత్తెడు!

మన దేశంలో పాడి రంగంపై ఆధారపడి సుమారు ఎనిమిది కోట్ల మంది ఉపాధి పొందుతున్నారు. ప్రపంచ పాల ఉత్పత్తిలో భారత్ ప్రథమ స్థానంలో ఉంది. అమెరికా, పాకిస్థాన్, చైనా, బ్రెజిల్ దేశాలు మన తరువాతి స్థానాల్లో నిలుస్తున్నాయి. ఆయా దేశాల్లో పాడిని ఒక పరిశ్రమగా చేపడుతూ నిర్వాహకులు లాభాల బాటలో పయనిస్తున్నారు. అక్కడి ప్రభుత్వాలు సైతం పాడి రైతులను అనేక రకాలుగా ఆదుకుంటుండటంతో వాళ్లు ఆ రంగంలో నిలదొక్కుకుంటున్నారు. మనదేశంలో చిన్న, సన్నకారు రైతులే ఎక్కువగా పాలను ఉత్పత్తి చేస్తున్నారు. వారిలో అధిక శాతం పల్లెల్లో ఉండటంతో పాలను నేరుగా అమ్ముకునే సదుపాయం లేక స్థానిక సేకరణ కేంద్రాల్లో విక్రయిస్తున్నారు. ప్రభుత్వ పాల సేకరణ కేంద్రాలున్న చోట రైతులకు కొంత మెరుగైన ధర లభిస్తున్నా, అవి లేని ప్రాంతాల్లో వ్యాపారులు నిలువు దోపిడీ చేస్తున్నారు. దీంతో పాడి రైతుల బతుకులు నష్టాల ఊబిలోంచి బయటపడటం లేదు.



ప్రభుత్వాల ప్రోత్సాహం లేకపోవడంతో పాడి రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. పాడి పశువుల కొనుగోలు భారంగా మారింది. పశుగ్రాసం, దాణా, కూలీల ఖర్చులు విపరీతంగా పెరిగాయి. పాలకు గిట్టుబాటు ధర దక్కడం లేదు. దిక్కులేని పరిస్థితుల్లో పాడి పశువులను అయినకాడికి అమ్మేసుకోవాల్సిన దుస్థితి నెలకొంటోంది.

చేతల్లో కానరాని చేయూత

ఐక్యరాజ్యసమితికి చెందిన ఆహార, వ్యవసాయ సంస్థ(ఎఫ్ఏఓ) 2022 గణాంకాల ప్రకారం... ప్రపంచ వ్యాప్తంగా 15 కోట్ల కుటుంబాలు పాడి రంగంపై ఆధారపడి జీవిస్తున్నాయి. సుమారు 93 కోట్ల టన్నుల పాలు ఉత్పత్తి అవుతున్నాయి. ఫలితంగా మానవాళికి పోషకాహార భద్రత లభిస్తోంది. ఎందరో చిన్నారుల ఆరోగ్యం మెరుగుదలకు పాలు, పాలఉత్పత్తులు తోడ్పడుతున్నాయి. పాడి రైతుల శ్రేయస్సుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు మన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘనంగా చెబుతున్నాయి. కానీ, ఆచరణలో మాత్రం అవేమీ కానరావడం లేదు. కేంద్ర బడ్జెట్‌లో పశుసంవర్ధక శాఖ, డెయిరీ రంగాలకు దక్కిన అంతంతమాత్రం కేటాయింపులతో పాడి రంగం ప్రగతి సాధన ప్రశ్నార్థకమే. యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా అనేక పథకాలు రూపొందిస్తున్నామని ప్రభుత్వాలు చెబుతున్నా, ఆ ఫలాలు డెయిరీ రంగంలో పనిచేస్తున్నవారికి అందడం లేదు. రెక్కలు ముక్కలు చేసుకున్నా కనీస ధర గిట్టుబాటు కావడం లేదంటూ పాడి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో లక్షల మంది పాడిని కుటీర పరిశ్రమగా చేపట్టి జీవనోపాధి పొందుతున్నారు. వీరిలో ఎక్కువ శాతం మహిళలే. అసంఘటిత రంగం కావడంతో బ్యాంకులు సైతం ఓ పట్టాన వీరికి రుణాలు మంజూరు చేయట్లేదు. పొలం ఉన్నవారికి కొంతమేరకు అప్పులిస్తున్నా, ఏ ఆధారం లేని పశుపోషకులకు మాత్రం రుణాలు లభించడం కష్టంగా ఉంది. దీంతో ప్రైవేటు వ్యక్తులు, ఆర్థిక సంస్థల దగ్గర అప్పులు చేసి పాడి పశువులను కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఓ వైపు దాణా, పశుగ్రాసం, మినరల్ మిక్చర్ మొదలైన వాటి ధరలు ఇబ్బడిముబ్బడిగా పెరిగాయి. తీరా ఇంత కష్టపడి పాలను ఉత్పత్తి చేసినా ఆశించిన గిట్టుబాటు ధర లభించడం లేదు. రైతులకు భరోసా ఇచ్చేలా రాయితీలు పెంచాల్సిన ప్రభుత్వాలు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. ఫలితంగా చేసిన అప్పులు చెల్లించలేక పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.


సమస్యలకు నిలయాలు

దేశంలో 2022 గణాంకాల ప్రకారం 12వేల పశువైద్యశాలలు, పాలీక్లినిక్‌లు ఉన్నాయి. కానీ, అనారోగ్యానికి గురైన పాడి పశువులను ఆసుపత్రులకు తీసుకెళ్తే సూదిమందులు ఇవ్వడానికి, అవసరమైన శస్త్రచికిత్సలు చేయడానికి తగినంత మంది పశువైద్యులు అందుబాటులో ఉండట్లేదు. ఉన్నవారికి ప్రభుత్వం అనేక అదనపు బాధ్యతలు అప్పగిస్తుండటంతో వారు పూర్తిస్థాయిలో చికిత్సపై దృష్టి సారించలేకపోతున్నారు. మారుమూల ప్రాంతాల్లోని ఆసుపత్రులకు పశువైద్యులు వచ్చినా ఎక్కువకాలం ఉండటం లేదు. కింది స్థాయి సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. దీంతో పలుచోట్ల పశువైద్య కేంద్రాలకు తాళాలు వేసి ఉంటున్నాయి. అనేకచోట్ల సరిపడా మందులు లేకపోవడంతో చీటీ రాసి బయట దుకాణాల నుంచి తెచ్చుకోవాలని సూచిస్తున్నారు. ఇది రైతులకు అదనపు భారమవుతోంది. ప్రభుత్వం పాడి రంగానికి బడ్జెట్లో అధిక నిధులు కేటాయించడంతో పాటు రాయితీలు పెంచాలి. పశువుల ఆస్పత్రుల్లో ఖాళీలు ఉన్నచోట సిబ్బందిని నియమించాలి. పశువులకు ఎప్పటికప్పుడు తగిన చికిత్సలు అందేలా చూడాలి. పాడి రంగాన్ని అన్నివిధాలా ఆదుకొనేలా ప్రోత్సాహక చర్యలు తీసుకుంటేనే పశుపోషకులు నిలదొక్కుకోగలుగుతారు. ఈ రంగంలో ఉపాధి అవకాశాలు పొందేందుకు మరింతమంది ఉత్సాహం చూపుతారు.

– రాజు గాగిల్లాపురం

సోము ఆలోచన..!

ఒక ఊరిలో దేవా, సోము అని ఇద్దరు మిత్రులు ఉండేవారు. వాళ్లు ఒకే తరగతి చదువుతున్నారు. ఇళ్లు కూడా పక్కపక్కనే ఉండటంతో.. బడికి కలిసే వెళ్లేవారు. ఇంటికి వచ్చాక ఇద్దరూ కలిసి ఒకే చోట చదువుకునేవారు. అయితే.. దేవా పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకునేవాడు. కానీ సోముకు అరకొర మార్కులు వచ్చేవి. ఎన్నిరోజులు గడుస్తున్నా.. ఇది ఇలా కొనసాగుతూనే ఉంది. దాంతో.. సోము ఒకరోజు దేవా దగ్గరకు వెళ్లి.. 'మిత్రమా! మనం ఇద్దరం కలిసే చదువుతున్నాం. కలిసే ఉంటున్నాం. అయినా నాకు తక్కువ మార్కులు వస్తున్నాయంటే దానికి కారణం నేను ఉపయోగించే పుస్తకాలు, పెన్నులే అయి ఉంటాయి. ఇంటికి వెళ్లి.. మా అమ్మను నీలాంటివి కొనిపెట్టమని అడుగుతాను' అన్నాడు సోము.



చెప్పినట్లుగానే.. ఓ మంచి పెన్ను కొనిపించుకున్నాడు. అయినా సోము.. పరీక్షల్లో ఎక్కువ మార్కులు సాధించలేదు. ఆ తర్వాత.. అచ్చం తనలాంటి రాత పుస్తకాలు కొంటూనే ఉన్నాడు. కానీ ప్రయోజనం లేకుండా పోయింది. ఇదంతా గమనించిన వాళ్ల టీచర్ సోమును పిలిచి.. 'చూడు సోమూ! మనం ఒక పని చేస్తున్నప్పుడు పూర్తి ఏకాగ్రత దాని మీదే పెట్టాలి. అప్పుడే అందులో అనుకున్న లక్ష్యాన్ని చేరుకోగలం. అంతేకానీ.. మన ప్రతిభ ఉపయోగించే వస్తువుల నాణ్యతలో ఉండదు' అని వివరించారు. విషయం అర్థం చేసుకున్న సోము.. అప్పటి నుంచి.. శ్రద్ధగా చదవడం మొదలుపెట్టాడు.

బొమ్మల్లో ఏముందో?

కింద ఇచ్చిన బొమ్మల ఆధారంగా వాటి ఆంగ్ల పేర్లు ఖాళీ గడుల్లో నింపగలరా?



జవాబులు: 1.DOLL 2.LOTUS 3.TOMATO 4.OWL

email:hai@eenadu.in





ఆదివారం.. ఆడిపాడి.. ప్రజా సంబరాలు కార్యక్రమంలో భాగంగా జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని కేబీఆర్ ఉద్యానం వద్ద ఆదివారం ప్రకృతి, సంస్కృతితో కూడిన పునరుజ్జీవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నాపెద్దా ఆటపాటలతో సందడి చేశారు. షాపింగ్ స్టాళ్లు ఏర్పాటు చేశారు. – న్యూస్‌టుడే, జూబ్లీహిల్స్

ఒళ్లు హూనం.. గన్యానా.. డెంగీనా..?

చికున్ గన్యా బారినపడిన వారిలో కొత్త లక్షణాలు కనిపిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. వీరిలోనూ ప్లేట్‌లెట్లు తగ్గిపోతుండటంతో తొలుత వైద్యులు డెంగీగా అనుమానంతో ఎన్ఎస్1, ఐజీజీ ఎలీసా పరీక్షలు చేస్తున్నారు. డెంగీ లేదని తేలాక చికున్‌గన్యాకు చికిత్స అందిస్తున్నారు. చిన్నపిల్లలపై దీని ప్రభావం ఎక్కువగా కనబడుతోంది.

● నిలోఫర్ ఆసుపత్రిలో ఓపీకి నిత్యం 5-6 వరకు ఈ తరహా కేసులు వస్తున్నాయి. పిల్లల్లోనూ కీళ్ల నొప్పులు తీవ్రంగా ఉంటున్నాయి. ● చికున్‌గన్యా సోకిన వారిలో కొత్తగా ముక్కు భాగంలో నల్లని ప్యాచ్‌లు వస్తున్నాయని వైద్యులు తెలిపారు. దీన్ని నిర్ధారించడానికి ప్రభుత్వ ఆసుపత్రుల్లో పీసీఆర్ టెస్టులు అందుబాటులో లేవు. లక్షణాలను పరిగణనలోకి తీసుకొని చికిత్స అందిస్తున్నారు.



- కొత్త లక్షణాలతో బెంబేలు
- నిలోఫర్ ఓపీకి బాధితులు
- అప్రమత్తత అవసరమంటున్న నిపుణులు

● నగరంలో డెంగీ కంటే చికున్ గన్యా కేసులు అధికంగా నమోదవుతున్నాయని వైద్యులు పేర్కొన్నారు. జ్వరం తగ్గినా.. చాలా మందిలో 3-4 వారాలపాటు తీవ్ర కీళ్ల నొప్పులు ఉంటున్నాయి. ఇందుకు టైగర్‌దోమే కారణం. ● డెంగీ, చికున్‌గన్యా వైరల్‌కు సంబంధించినవే. నొప్పులు తగ్గడానికి కొందరు పెయిన్‌కిల్లర్లు వాడుతున్నారు. వైద్యుల సూచనలు లేకుండా వాడొద్దని సూచిస్తున్నారు. ● తీవ్రమైన జ్వరం వల్ల శరీరం త్వరగా డీహైడ్రేషన్ బారిన పడుతుంది. ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవడం వల్ల నిస్సత్తువ ఆవహించదు.



చికున్‌గన్యా లక్షణాలు...

● హఠాత్తుగా 102 డిగ్రీలకుపైగా జ్వరం ● తీవ్ర కీళ్ల, కండరాల నొప్పులు ● నొప్పులతో కదలలేని పరిస్థితి ● చేతుల మణికట్టు, కాళ్లు, మడమలు, భుజాల్లో నొప్పి ● చర్మంపై దద్దుర్లు, ముఖంపై నల్లటి ప్యాచ్‌లు ● జ్వరం తగ్గినా.. నెల రోజులపాటు కీళ్ల నొప్పులు ● కొందరిలో ప్లేట్‌లెట్లు తగ్గిపోవడం.

డెంగీ ఇలా..

- ఆకస్మిక అధిక జ్వరం(102 డిగ్రీలకుపైగా)
- తీవ్ర తల, కళ్ల వెనుక నొప్పి
- తీవ్రమైన కండరాల నొప్పి
- అలసట, వికారం, వాంతులు, అతిసారం
- జ్వరం ప్రారంభమైన రెండు రోజుల తర్వాత చర్మంపై దద్దుర్లు ● తేలికపాటి రక్తస్రావం
- ప్లాస్మా లీకేజీలు ● కాళ్లు, కళ్ల కింద వాపులు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

● ఇంట్లో దోమలు లేకుండా చూసుకోవాలి. దోమ తెరలు వాడాలి. ● కుండీల్లో నీరు నిల్వ లేకుండా చూడాలి. చెత్తాచెదారం తొలగించాలి.
● పిల్లలను స్కూళ్లకు పంపేటప్పుడు చేతులు, కాళ్లు కప్పి ఉంచేలా సాక్సులు, ఇతర వస్త్రాలు ధరింపజేయాలి.
● ఇంటి చుట్టూ నీరు నిల్వ లేకుండా చూడాలి.

ఈనాడు, హైదరాబాద్

వైద్యులను సంప్రదించాలి



ప్రస్తుతం నగరంలో చికున్‌గన్యా ఎక్కువగా కనిపిస్తోంది. పిల్లలు కూడా ఈ జ్వరం బారిన పడుతున్నారు. 102 డిగ్రీలపైన జ్వరముంటే.. వైద్యులను సంప్రదించాలి. కొన్నిసార్లు చికున్‌గన్యాలో ప్లేట్‌లెట్ల తగ్గుదల ఉంటుంది. అంత ముప్పు కాదు. కానీ డెంగీలో ప్లేట్‌లెట్లు తగ్గడం, ప్లాస్మా లీకేజీలతో రోగి పరిస్థితి విషమంగా మారే ప్రమాదం ఉంటుంది. పిల్లల విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలి. **-డాక్టర్ ఉషారాణి, చిన్న పిల్లల వైద్యనిపుణులు, నిలోఫర్ ఆసుపత్రి**

'అనుమతి ఉన్న ఇళ్లను హైడ్రా కూల్చదు'

ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వ అనుమతితో నిర్మాణమైన కట్టడాలపై చర్యలు తీసుకోవట్లేదని హైడ్రా స్పష్టం చేసింది. అనుమతులు పొందిన ఏ ఒక్క నిర్మాణాన్ని కూడా హైడ్రా కూల్చదంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటనపై కమిషనర్ రంగనాథ్ స్పందించారు. సీఎం ఆదేశాలను, ప్రభుత్వ విధానాలను హైడ్రా పాటిస్తుందని, చట్ట ప్రకారం నిర్మించిన భవనాలను తొలగించే ప్రసక్తే లేదని ఆయన మరోమారు గుర్తుచేశారు. సామాజిక మాధ్యమాలు, వేర్వేరు సంస్థలు, వ్యక్తులు, రాజకీయ పార్టీలు సృష్టిస్తోన్న అపోహలను నమ్మొద్దని కోరారు. చట్ట పరిధిలోని భవనాలను కూల్చబోమని ఆయన వెల్లడించారు.

రాబందుల సంరక్షణకు అష్టకష్టాలు

☛ 15 ఏళ్లయినా నెహ్రూ జూపార్కులో పెరగని సంతతి

ఈనాడు, హైదరాబాద్

అంతరించిపోతున్న రాబందుల జాతిని సంరక్షించేందుకు నెహ్రూ జూపార్కు చేస్తున్న ప్రయత్నం ఫలించడం లేదు. కేంద్ర జూ అథారిటీ(సీజడ్ఏ) నిపుణులు, జూపార్కు అధికార యంత్రాంగం 15 ఏళ్లుగా చేస్తున్న శ్రమ వృథా అయింది. సీజడ్ఏ కూడా సంతానోత్పత్తి కేంద్రానికి ఏడాది కిందట ఆర్థిక సాయాన్ని నిలిపేసింది. ఈ నేపథ్యంలో క్యూరేటర్ సునీల్ ఎస్ హరేమత్ కీలక నిర్ణయం తీసుకున్నారు. శాస్త్రీయ కారణాలను విశ్లేషిస్తూ సంతానోత్పత్తి కేంద్రానికి 10 జతల కొత్త రాబందులను ఇవ్వాలంటూ సీజడ్ఏకు లేఖ రాశారు. రాబందుల సంరక్షణ కేంద్రానికి ఆర్థికసాయాన్ని పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు.



మానవ తప్పిదాలతో..

● ఆదిలాబాద్, మహారాష్ట్ర సరిహద్దుల్లో మినహా.. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో రాబందులు కొన్నేళ్లుగా కనిపించడం లేదు. దేశ వ్యాప్తంగానూ ఇదే పరిస్థితి ఉంది. కేంద్ర జూ అథారిటీ వాటి సంఖ్యను ఎలాగైనా పెంచాలన్న ఉద్దేశంతో హర్యానాలోని పింజోర్ జూపార్కులో, నగరంలోని నెహ్రూ జూపార్కులో సంతానోత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేసింది. దాంతోపాటు అంతరించిపోయే దశలోని మూషిక జింకల సంతానోత్పత్తి కేంద్రం కూడా నగరంలో ఏర్పాటైంది. అయితే.. నెహ్రూ జూపార్కులో మూషిక జింకల సంతతి పెరిగినా రాబందుల సంఖ్యలో వృద్ధి లేదు.

● గత ఆరు సీజన్లలో మాత్రమే రాబందులు ఒకటి, రెండు గుడ్లు పెట్టాయి. పొదిగి పిల్లను చేయడంలో మాత్రం రాబందులు సఫలం కాలేదు. మగ, ఆడ పక్షుల మధ్య వయసులో వ్యత్యాసం ఉండడం, ఇక్కడి వాతావరణానికి అలవాటుపడక పోవడం, ఇతర కారణాలతో సంతతి పెరగడం లేదు.

ఓపెన్ హార్ట్ సర్జరీ లేకుండా శస్త్రచికిత్స

నిమ్స్, న్యూస్‌టుడే: ఓపెన్ హార్ట్ సర్జరీ లేకుండా గుండె చికిత్సలను విజయవంతంగా పూర్తి చేస్తున్నట్లు పంజాగుట్ట నిమ్స్ ఆస్పత్రి డైరెక్టర్ నగరి బీరప్ప చెప్పారు. ఓపెన్ హార్ట్ విధానంలో ఎక్కువ ప్రమాదం ఉంటుందని, ట్రాన్స్‌కాథెటర్ ఎయుర్టిక్ వాల్వ్ ఇంప్లాంటేషన్ (టీఏవీఐ) ప్రక్రియతో వేగంగా శస్త్రచికిత్స పూర్తి చేయడంతో పాటు రోగులు త్వరగా కోలుకుంటారని చెప్పారు. ఆస్పత్రి ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన కార్యశాలలో ఆయన మాట్లాడారు. కార్డియాలజీ విభాగాధిపతి శ్రీనివాస్ మాట్లాడుతూ.. 50 ఏళ్ల పైబడిన వారిలో గుండె కవాటాలు మూసుకుపోతాయని, తప్పనిసరి పరిస్థితుల్లో ఓపెన్ హార్ట్ సర్జరీ చేయాల్సి వచ్చేదని, ఇక ఆ సమస్య ఉండకుండా రక్తనాళాల ద్వారా గుండెకు కృత్రిమ కవాటాన్ని అమర్చొచ్చని చెప్పారు. ఈ తరహా చికిత్సకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో రూ.20లక్షల వరకు అవుతుందని, నిమ్స్‌లో రూ.10లక్షల్లోనే పూర్తవుతుందన్నారు. ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయనిధి ఉపయోగించే వెసులుబాటు ఉంటుందని చెప్పారు. సీనియర్ ప్రొఫెసర్ సాయిసతీశ్, వైద్యులు పురుషోత్తం, శ్రీకాంత్ పాల్గొన్నారు.



కార్యశాలలో డైరెక్టర్ బీరప్ప, కార్డియాలజీ విభాగాధిపతి శ్రీనివాస్, సీనియర్ ప్రొఫెసర్ సాయిసతీశ్, వైద్యులు

గోవర్ధన గిరిలా.. వెండి మబ్బుల ఝరి



హుస్సేన్‌సాగర్ తీరంలో ఆదివారం సాయంత్రం ఆకాశం కనువిందు చేసింది. దట్టంగా అలుముకున్న నీలి మేఘాలను బుద్ధుడు మోస్తున్నట్లుగా కనిపించడంతో సందర్శకులు ఆసక్తిగా తిలకించారు.

పార్కింగ్ కష్టాలు తీరేలా..

ఈనాడు, హైదరాబాద్

ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో నగరంలోనే మొదటిసారిగా నిర్మిస్తున్న బహుళ అంతస్తుల పార్కింగ్ సముదాయం(ఎంఎల్‌పీ) జనవరి 1 నుంచి జరిగే నుమాయిష్ నాటికి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. పనుల పూర్తికి మరో రెండు నెలలు పడుతుందని నిర్మాణదారులు చెబుతున్నారు. నాంపల్లి కూడలిలో మెట్రోకి చెందిన అర ఎకరం స్థలంలో బహుళ సముదాయ నిర్మాణ పనులు తుది మెరుగులు దిద్దుకుంటున్నాయి. మెస్సర్ ఇన్‌ఫ్రా ప్రైవేటు లిమిటెడ్ పీపీపీ విధానంలో రూ.80 కోట్ల పెట్టుబడితో నిర్మిస్తోంది. మెట్రో భూమి కేటాయించగా.. ప్రైవేటు సంస్థ నిధులు వెచ్చించి నిర్మాణం చేపడుతోంది. 50 ఏళ్ల లీజ్ ఒప్పందమిది. కొవిడ్ తీవ్రత, రుణ లభ్యత సమస్యలు, గ్లోబల్ సప్లయ్ చైన్ అవాంతరాల వంటి కారణంగా ప్రాజెక్ట్ నిర్మాణంలో తీవ్ర జాప్యమైంది. దాదాపు ఐదేళ్లు కావొస్తుంది. అందుబాటులోకి వస్తే నాంపల్లి చుట్టుపక్కల పార్కింగ్ తిప్పలు తీరుతాయని వాహనదారులు ఎదురుచూస్తున్నారు.

నాంపల్లిలో పది అంతస్తుల భవనం పూర్తిగా వాహనాలకే



ప్రాజెక్ట్ విశేషాలు

- భవనం ఎత్తు: 15 అంతస్తులు
- పార్కింగ్ కేటాయించిన అంతస్తులు: 10
- మొత్తం భవనం విస్తీర్ణం: 1.44 లక్షల చ.అ.
- పార్కింగ్‌కు కేటాయింపు: 68 శాతం
- వాణిజ్య కార్యకలాపాలకు: 32 శాతం
- ఎన్ని కార్లు నిలపవచ్చు: 250
- ద్విచక్ర వాహనాలు: 200

మూడు నిమిషాల్లోనే చేసేలా..

● కింది అంతస్తులో వాహనాలు నిలిపేందుకు నాలుగు టెర్మినళ్లు ఏర్పాటు చేశారు. వాహనాన్ని నిలిపేందుకు టర్న్ టేబుల్‌పై వాహనం సరి. ఎక్కడ ఖాళీ ఉంటే అక్కడికి వెళ్లి పార్కింగ్ చేస్తుంది. ● ఆ తర్వాత ట్రాన్స్‌పోర్టర్ షటిల్ ఆ వాహనాన్ని లిఫ్ట్ ద్వారా నిర్ణీత అంతస్తుకు తీసుకెళ్లి ఖాళీగా ఉన్న స్థలంలో పార్క్ చేస్తుంది. జర్మన్ సాంకేతికత ఇది. ● పార్క్ చేసిన వాహనాన్ని తిరిగి పొందడానికి చెల్లించిన పార్కింగ్ టికెట్‌ను కార్డ్ రీడర్‌కు చూపగానే ట్రాన్స్‌పోర్టర్ షటిల్ ఆటోమెటిక్‌గా కారును వాహనదారుడికి అందజేస్తుంది. పార్కింగ్‌కోసం నిమిషం కంటే తక్కువ, తిరిగి పొందడానికి రెండు నిమిషాలు మాత్రమే పడుతుంది.

రెండు సినిమా తెరలు కూడా...

సముదాయంలో పై అంతస్తుల్లో రెండు సినిమా తెరలను సిద్ధం చేశారు. ఆహారశాలలు ఉంటాయి. ఇతర వాణిజ్య కార్యకలాపాలను లీజ్ పద్ధతిలో ఇస్తారు. వీటితో వచ్చే ఆదాయంతో సముదాయం నిర్వహణ, పెట్టుబడి ఖర్చును రాబట్టుకుంటారు.

గూగుల్‌లో వేట.. నేరగాళ్ల ఆట

ఈనాడు- హైదరాబాద్

ఎలక్ట్రానిక్ వస్తువు చెడిపోయిందని కంపెనీ కస్టమర్ కేర్ కోసం గూగుల్‌లో వెతకగానే ఓ నంబరు ప్రత్యక్షమవుతుంది.. ఫోన్ చేశాక అవతలి వ్యక్తులు చెప్పినట్లు చేశామా ఖాతా ఖాళీ.. బ్యాంకు లావాదేవీపై ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేద్దామని ప్రయత్నిస్తే నకిలీ వెబ్‌సైట్ దర్శనమిస్తుంది. తనిఖీ చేసుకోకుండా వివరాలు నమోదుచేస్తే ఖాతా గుల్లయినట్టే.. సైబర్ నేరస్థులు కేవలం పౌరులనే కాదు గూగుల్‌ని ఏమార్చి రూ.వందల కోట్లు కొల్లగొట్టేస్తున్నారు.



నకిలీ వెబ్‌సైట్లతో బోల్తాకొట్టిస్తున్న సైబర్ ముఠాలు

ఇదీ నేరగాళ్ల మంత్రం..

గూగుల్, ఇతర సెర్చ్‌ంజన్ ఏదైనా వెబ్‌సైట్, సమాచారం కోసం వెతికినప్పుడు ఎక్కువ మంది వీక్షించే వెబ్‌సైట్లు, సంబంధించిన ప్రకటనలు తెరపై ప్రత్యక్షమవుతాయి. సైబర్ ముఠాలు దీన్ని వాళ్లకు అనుకులంగా మార్చుకుంటున్నాయి. అసలైన వెబ్‌సైట్లకు బదులు తాము సృష్టించిన నకిలీ వెబ్‌సైట్ ప్రముఖంగా కనిపించేలా చేస్తున్నారు. సంస్థ పేరులో ఏదో ఒక అక్షరం తేడాతో ఈ వెబ్‌సైట్ ఉంటుంది. గూగుల్ అల్గారిథమ్ ప్రకారం.. అసలు వెబ్‌సైట్ కోసం వెతికినప్పుడు ఎక్కువ వీక్షణలుండే నకిలీ వెబ్‌సైట్ ముందు ప్రత్యక్షమవుతుంది. ఎక్కువ మంది అసలు, నకిలీ వెబ్‌సైట్లకు తేడా గుర్తించకుండా అందులోని నకిలీ కస్టమర్ కేర్ నంబర్లకు ఫోన్ చేస్తుంటారు. కొందరు వెబ్‌సైట్లకు వెళ్లకుండా నేరుగా ఆయా కంపెనీల కస్టమర్ కేర్ నంబరు కోసం వెతుకుతారు. ఇలా వెతికినప్పుడు తెరపై 90 శాతం నకిలీ కాల్‌సెంటర్ల నంబర్లు వస్తుంటాయి. ఈ కాల్స్‌ను స్వీకరించే నేరగాళ్లు నమ్మకంగా మాట్లాడుతూ వివరాలు సేకరించి డబ్బు కొట్టేస్తున్నారు.

10 శాతం మోసాలివే..

ప్రస్తుతం 185 రకాల సైబర్ మోసాలు జరుగుతున్నాయి. ఇందులో క్రెడిట్, డెబిట్ కార్డు, కస్టమర్ కేర్, తక్కువ ధరకే విలువైన వస్తువులు తదితర మోసాలు దాదాపు 10 శాతం వరకూ ఉంటున్నాయి. వెబ్‌సైట్లో అంతా సవ్యంగానే కనిపించినా వివరాలు నమోదు చేయించి వేర్వేరు ఫీజుల పేరుతో డబ్బు వసూలు చేస్తారు. తక్కువ ధరకే వస్తువులంటూ ప్రకటనలో బోల్తా కొట్టించడం మరో మోసం. మనం ఫర్నీచర్ కోసం వెతికినప్పుడు తెరపై రూ.2 వేలకే మంచి ఖరీదైన ఫర్నీచర్, రూ.10 వేలకే ఫ్రిజ్ వంటి ప్రకటనలు వస్తాయి. పొరపాటున వీటి మీద క్లిక్ చేస్తే నేరుగా నకిలీ వెబ్‌సైట్లోకి తీసుకెళ్తుంది. వస్తువు డెలివరీ చేయడానికి డబ్బు కట్టాలంటూ మోసగిస్తారు. నకిలీ కస్టమర్ కేర్‌కు ఫోన్ చేసినప్పుడు ముందస్తు డిపాజిట్ కట్టాలనో.. లేక లింకు పంపిస్తే దాన్ని క్లిక్ చేయాలని చెబుతారు. ఈ లింకు క్లిక్ చేస్తే ఎనీడెస్క్ వంటి యాప్‌లు డౌన్‌లోడ్ అయి ఫోన్ మొత్తం నేరగాళ్ల చేతుల్లోకి వెళ్తుంది.

మద్యం సీసా చూపిన సాక్ష్యం

- ఏడాదిన్నర క్రితం శివారులో మహిళ హత్య
- నాటి వేలిముద్రలతో తాజాగా నిందితుడి గుర్తింపు

ఈనాడు, హైదరాబాద్: పగిలిన మద్యం సీసా ఓ హంతకుడిని పట్టించింది. దాదాపు 20నెలలుగా పెండింగ్‌లో ఉన్న మహిళ హత్య కేసును ఛేదించింది.

ఇదీ నేపథ్యం.. : ఏపీలోని నెల్లూరు జిల్లా ఓజిలి మండలానికి చెందిన చెంచు శైలజారెడ్డి(42) భర్త కృష్ణారెడ్డి, ఇద్దరు పిల్లలతో కలిసి 2011లో కందుకూరుకు వచ్చి.. దాసర్లపల్లిలోని అరుణ ఫాం హౌస్‌లో పనికి కుదిరారు. 2023 మార్చి 3న కృష్ణారెడ్డి, పిల్లలు బయటకు వెళ్లగా శైలజారెడ్డి ఒక్కరే ఉన్నారు. అప్పటికే ఆమెపై కన్నేసిన దాసర్లపల్లికే చెందిన ఉప్పుల శివకుమార్.. ఫాంహౌస్‌కు వెళ్లి ఆమెను బలవంతం చేయబోగా ఎదురు తిరిగింది. దీంతో కత్తితో ఆ మహిళను నరికి చంపాడు. తర్వాత పక్కనే మద్యం సీసా కనిపించగా తాగేందుకు ప్రయత్నించాడు. సీసా చేజారి కింద పడి పగిలిపోయింది. దానిపై నిందితుడి వేలిముద్రలు పడ్డాయి. అనంతరం పరారయ్యాడు. వేలిముద్రలు మినహా ఘటనాస్థలిలో ఎలాంటి ఆధారాలు లభ్యమవ్వలేదు. ఎప్పటికైనా నిందితుడు చిక్కుతాడనే ఉద్దేశంతో పోలీసులు మద్యం సీసా మీద వేలిముద్రలు భద్రపరిచారు. తాజాగా కొత్తగూడ మామిడితోటలో వృద్ధ దంపతుల హత్య కేసులో శివకుమార్ నిందితుడని పోలీసులు సాంకేతిక ఆధారాలతో గుర్తించి అరెస్టు చేశారు. ఇక్కడ సేకరించిన వేలిముద్రల్ని.. శైలజారెడ్డి హత్య కేసులో నమోదైన వాటిని రెండింటినీ రాచకొండ ఫింగర్ ప్రింట్ యూనిట్‌తో పోల్చగా సరిపోలాయి. దీంతో పోలీసులు రెండు కేసుల్లోనూ నిందితుడిగా చేర్చారు.



రెండో దశ పూర్తి.. యాదాద్రిపై దృష్టి

ఈనాడు, హైదరాబాద్

ఎంఎంటీఎస్ రెండో దశ పనులు పూర్తవ్వడం, చర్లపల్లి టెర్మినల్ సిద్ధమైపోవడంతో కేంద్ర ప్రభుత్వం యాదాద్రి రైల్వే లైన్ విస్తరణ పనులపై దృష్టిసారిస్తోంది. తాజాగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చర్లపల్లి టెర్మినల్‌ను సందర్శించిన నేపథ్యంలో యాదాద్రి రైల్వేలైన్ పనులను ప్రారంభించనున్నట్టు చెప్పారు. దీంతో ఏడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుపై ఆశలు చిగురించాయి.

రూ.20కే చేరుకోవచ్చు..

నగరం నుంచి 65 కిలోమీటర్ల మేర దూరంలో యాదాద్రికి రోడ్డుమార్గంలో వెళ్లే భక్తులకు 2గంటల సమయం పడుతోంది. అదే ఎంఎంటీఎస్ అందుబాటులోకి వస్తే సికింద్రాబాద్ నుంచి కేవలం 45 నిమిషాల నుంచి గంట వ్యవధిలో గమ్యం చేరుకోవచ్చు. నగరవాసులకు రూ.20కే, గంట వ్యవధిలోనే యాదాద్రి ప్రయాణం కల సాకారమవుతుంది. ఘట్‌కేసర్ వరకు ఉన్న ఎంఎంటీఎస్ లైన్‌ను రాయగిరి రైల్వే స్టేషన్ దాకా విస్తరించాలని అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. అక్కడి నుంచి యాదాద్రికి కొత్తగా మూడో లైన్ వేయాలని నిర్ణయించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో నిర్మించేందుకు 2016-17లో రూ.330కోట్లలో.. రూ.220 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం భరించేలా ప్రతిపాదనలు తయారుచేసి పంపించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి వాటా నిధులు అందకపోవడంతో ప్రక్రియ ఆగిపోయింది. దీంతో మొత్తం కేంద్రం వాటాతోనే విస్తరించేందుకు 2023లో నిర్ణయం తీసుకుంది. అప్పటికే అంచనా వ్యయం రూ.330కోట్ల నుంచి రూ.412కోట్లకు పెరిగింది. అప్పటి నుంచి పెండింగ్‌లో ఉండగా.. కేంద్ర మంత్రి తాజా ప్రకటనతో మళ్లీ తెరపైకి వచ్చింది.



మిక్కి.. బండెక్కి..



ఇటీవల శుభకార్యాల్లో మిక్కి మౌస్, ఇతర బొమ్మల వేషధారణలతో సందడి చేయిస్తున్నారు. నారాయణగూడ లిబర్టీ చౌరస్తాలో ఓ మిక్కి మౌస్ వేషధారి ఇలా బైక్‌పై వెళ్తూ కనిపించాడు.

ఉసురు తీసిన రుణయాప్ నిర్వాహకుల వేధింపులు

యువకుడి ఆత్మహత్య.. మరొకరు అదృశ్యం

శామీర్‌పేట, ఘట్‌కేసర్, న్యూస్‌టుడే: రుణయాప్ నిర్వాహకుల వేధింపులు తాళలేక యువకుడు ఆత్మహత్య చేసుకోగా మరో వ్యక్తి అదృశ్యమయ్యాడు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో ఆదివారం ఈ ఘటనలు జరిగాయి. పోలీసుల కథనం ప్రకారం.. శామీర్‌పేట మండలం మజీద్‌పూర్‌కు చెందిన ఇటబోయిన వినయ్‌రాజ్(23) బీటెక్ పూర్తి చేశాడు. ఉద్యోగం చేసి అప్పులు చెల్లిస్తాననే భరోసాతో రుణయాప్‌తో పాటు మరికొందరి వద్ద అప్పులు చేశాడు. 22న సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో చేరాల్సి ఉన్న క్రమంలోనే రుణయాప్ నిర్వాహకుల వేధింపులను తట్టుకోలేకపోయాడు. ఆదివారం ఎవరికీ సమాచారం ఇవ్వకుండా ఇంటి నుంచి ద్విచక్రవాహనంపై బయటకు వెళ్లాడు. వినయ్‌రాజ్ తండ్రి నరేందర్ పనుల కోసం పొలం వద్దకు వెళ్లడంతో అక్కడ కుమారుడి ద్విచక్రవాహనం కనిపించింది. చుట్టుపక్కల వెతకడంతో హనుమల్లకుంట పక్కన ఉన్న ఓ చెట్టుకు కేబుల్ తీగతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు గుర్తించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు శామీర్‌పేట పోలీసులు తెలిపారు.



వినయ్‌రాజ్

● ఘట్‌కేసర్ మండలం చౌదరిగూడ ఎన్ఎన్ఆర్‌జీ కళాశాల సమీపంలో కొమారి లక్ష్మీనారాయణ(32) నివాసం ఉంటున్నారు. డ్రైవర్‌గా పని చేస్తున్న ఆయన ఇంటి అవసరాల కోసం రుణయాప్ ద్వారా అప్పు తీసుకున్నారు. నిర్వాహకుల వేధింపులు తట్టుకోలేక శనివారం అర్ధరాత్రి ఇంట్లో చరవాణి పెట్టి ద్విచక్రవాహనంపై బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని పోచారం ఐటీకారిడార్ పోలీసులు తెలిపారు.

ఖైరతాబాద్

• ఖైరతాబాద్ • జూబ్లీహిల్స్

అభయాంజనేయ ఆలయంలో పూజలు

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: హిమాయత్ నగర్ డివిజన్, నారాయణగూడ రాజ్‌మోహల్లాలో కొత్తగా నిర్మించిన అభయాంజనేయ స్వామి ఆలయంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, స్థానిక కార్పొరేటర్ గడ్డం మహాలక్ష్మీ గౌడ్, ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డి పాల్గొన్నారు. భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి సైతం పూజలు చేశారు.


పూజల్లో ఎమ్మెల్యే దానం నాగేందర్, కార్పొరేటర్ మహాలక్ష్మీగౌడ్

వైభవంగా సంకటహర చతుర్థి

వెంగళ్‌రావునగర్, న్యూస్‌టుడే : వెంగళరావునగర్ డివిజన్ పరిధి అభయాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం సంకట హర చతుర్థి పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా గణపతికి పంచామృత అభిషేకం, మహా గణపతి హోమం, గణపతి నామ స్తోత్రం హవనము తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ నిర్వాహకుడు టి. వెంకటరమణ, ప్రధాన అర్చకులు పవన్‌కుమార్‌స్వామి పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ప్రత్యేక అలంకరణలో గణనాథుడు



రూ.కోట్లతో అత్యవసర అభివృద్ధి పనులు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్..

షేక్‌పేట, న్యూస్‌టుడే: త్వరలో రూ.కోట్లతో నియోజకవర్గంలో అత్యవసర అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ తెలిపారు. షేక్‌పేట వినోబానగర్ కాలనీ సంక్షేమ సంఘం కొత్త కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం స్థానిక భగత్‌సింగ్ సామాజిక భవనంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మూడో సారి తనపై విశ్వాసంతో ఎమ్మెల్యేగా గెలిపించడం పట్ల ఆయన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. షేక్‌పేట అభివృద్ధికి చర్యలు తీసుకుంటానని, ఎలాంటి సమస్యనైనా ప్రజలు తన దృష్టికి తీసుకురావాలన్నారు. స్థానిక చారిత్రక పోచమ్మ దేవాలయం అభివృద్ధికి సహకారం అందిస్తానని చెప్పారు. నలభై ఏళ్లుగా వినోబా నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా సిద్ధసదానంద్ ఎన్నికవడం అభినందనీయమని, ఆయనపై ప్రజలకు ఉన్న నమ్మకానికి ఇది నిదర్శనమన్నారు. డివిజన్ భారాస, భాజపా, కాంగ్రెస్ అధ్యక్షులు ప్రదీప్‌కుమార్, జి.శివకుమార్, డి. సత్యనారాయణ, షేక్‌పేట సంక్షేమ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చాట్లసదానంద్, సార వెంకటేశ్, ఎం. అశోక్‌కుమార్, పి. బాబు రావు తదితరులు పాల్గొన్నారు.

చింతలబస్తీ నుంచి.. జాతీయ స్థాయికి

హైదరాబాద్ హాకీ జట్టులో రాణిస్తున్న సాయి

న్యూస్‌టుడే, జూబ్లీహిల్స్: ఎనిమిదేళ్ల వయసులో చింతలబస్తీలోని ఇంటి పక్కన మైదానంలో హాకీ కర్ర పట్టి వేసిన గోల్స్, అతడిని జాతీయ స్థాయికి తీసుకెళ్లాయి. రైట్ ఇన్, సెంటర్ ఫార్వర్డ్ ఆటతో గోల్స్ కొట్టే ఆ యువకుడు డిగ్రీ చదువుతూనే పోలీసు కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. అటు వృత్తిలోనూ, ఇటు క్రీడలోనూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నాడు.

విద్యాభ్యాసం..

ఖైరతాబాద్‌లోని చింతలబస్తీలో నివసించే సాయి ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు స్థానికంగా ఉన్న ఫాదర్ రాక్‌మెమోరియల్ పాఠశాలలో, ఇంటర్ వెస్లీ కళాశాలలో, క్రీడా కోటాలో ఏవీ డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశాడు. డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్నప్పుడు 2009లో పోలీసు ఉద్యోగానికి ఎంపికయ్యాడు. అప్పటి నుంచి నగరంలోని వివిధ ఠాణాల్లో విధులు నిర్వహిస్తున్నాడు.

రాంలీల మైదానంలో..

సాయి తన బావ, తెలంగాణ హాకీ అసోసియేషన్ కార్యదర్శి సీఆర్ భీంసింగ్ ఆటను చింతలబస్తీలోని రాంలీల మైదానంలో చిన్ననాటి నుంచి గమనించేవాడు. అతడి ఆసక్తిని గమనించిన భీంసింగ్ కొన్ని మెలకువలు నేర్పించాడు. అదే సమయంలో కోచ్ ఈశ్వర్ వద్ద మరింత శిక్షణ పొందాడు. స్థానికంగా ఉన్న నవ భారత్ హాకీ క్లబ్‌లో అడుగుపెట్టి, హైదరాబాద్ జట్టుకు ఎంపికయ్యాడు. అక్కడి నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయిని దాటి జాతీయ స్థాయిలో అడుగుపెట్టాడు. పోలీసు శాఖలో జరిగే పోటీల్లోనూ సత్తాను చాటాడు.


పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ చేతుల మీదుగా అవార్డు తీసుకుంటూ..

ఎన్నో అవార్డులు...

- హైదరాబాద్ జట్టు తరఫున 2006లో గచ్చిబౌలిలో జరిగిన చీఫ్ మినిస్టర్స్ కప్ పోటీలో విజేతగా నిలిచి అప్పటి ముఖ్యమంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. అదే ఏడాది స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, ఏపీ ఒలింపిక్ అసోసియేషన్ నిర్వహించిన పోటీల్లో జట్టును విజేతగా నిలిపారు.
- 2008లో ఆంధ్రప్రదేశ్‌లోని 4వ అండర్-18 జూనియర్ హాకీ ఛాంపియన్‌షిప్ పోటీల్లో సాయి ఉన్న జట్టుకు మూడో స్థానంలో నిలిచింది.
- 2010 నుంచి 2023 వరకు ఆల్‌ఇండియా పోలీస్ హాకీ పోటీల్లో ప్రతి సంవత్సరం పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబర్చాడు. 2010లో జరిగిన రేంజ్ మీట్‌లో ఛాంపియన్‌గా నిలిచిన సాయితోపాటు బృందానికి నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ అభినందించారు.

కీళ్ల నొప్పులుంటే నడవకూడదనేది అపోహే


వాకథాన్‌ను ప్రారంభిస్తున్న డా.పవన్ గోరుకంటి

ఖైరతాబాద్: ప్రపంచ ఆస్టియోపోరోసిస్ డే సందర్భంగా కీళ్ల మార్పిడి శస్త్రచికిత్సలు చేసుకున్న రోగులతో నెక్లెస్ రోడ్డులో ఆదివారం వాకథాన్ నిర్వహించారు. యశోద హాస్పిటల్స్ డైరెక్టర్ డా. పవన్ గోరుకంటి వాకథాన్‌ను ప్రారంభించారు. కీళ్లనొప్పులు ఉంటే నడవకూడదనే అపోహ తొలగించేందుకే ఈ అవగాహన నడక నిర్వహించామన్నారు. ఆసుపత్రి సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్.సునీల్ దాచేపల్లి పాల్గొన్నారు.



బంజారాహిల్స్‌లోని పోలీసు కమాండ్ కంట్రోల్ భవనం వద్ద ట్రాఫిక్ జామ్ నిత్య కృత్యమైపోతోంది. సమీపంలోని దుకాణాలకు వచ్చేవారు తమ వాహనాలను రోడ్లపైనే నిలపడంతో ఈ పరిస్థితి ఎదురవుతోంది.

విద్యార్థుల్లో శాస్త్రీయ భావాలు పెంచేందుకు సైన్స్ సంబరాలు


గోడపత్రిక ఆవిష్కరించిన కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

గన్‌ఫౌండ్రి, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో శాస్త్రీయ భావాలు పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి కోరారు. జన విజ్ఞాన వేదిక తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'చెకుముకి' సైన్స్ సంబరాల గోడపత్రాలను ఆయన ఆవిష్కరించారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజా మాట్లాడుతూ.. 36 ఏళ్లుగా విద్యార్థుల్లో శాస్త్రీయ భావాలు పెంపొందించేందుకు చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. చెకుముకి పరీక్షను నాలుగు దశల్లో నిర్వహిస్తామని, పాఠశాల, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో జరుగుతుందన్నారు. 8, 9, 10వ తరగతి విద్యార్థులు పాల్గొనాలని కోరారు. విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. హైదరాబాద్ నగరంలో 20 వేల మంది విద్యార్థులు ఏటా చెకుముకి సైన్స్ పరీక్షకు హాజరవుతున్నారన్నారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావుల వరప్రసాద్, సోషల్ మీడియా సబ్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ లింగస్వామి, నగర నేతలు రవీంద్రబాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బంజారాహిల్స్, ఖైరతాబాద్, న్యూస్‌టుడే:

? బంజారాహిల్స్ రోడ్డు నం.2 నవోదయ కాలనీలోని జువారి సిమెంట్ సమీపంలో నిర్మల రెసిడెన్సీ ప్రాంతంలో కొన్నాళ్లుగా వీధి దీపం వెలగడం లేదు.
– రజని, స్థానికురాలు, నవోదయ కాలనీ

✓ ఆ ప్రాంతంలో గతంలో సమస్య తలెత్తితే పరిష్కరించాం. మళ్లీ సమస్య వచ్చినట్లు మా దృష్టికి రాలేదు. సిబ్బందిని పంపి వీధి దీపం వెలిగేలా చర్యలు తీసుకుంటాం.
– సుష్మ, మున్సిపల్ ఏఈ (వీధిదీపాల విభాగం), సర్కిల్– 18.

? ప్రేమ్‌నగర్‌లో ఓ భవనానికి అనుమతికి మించి అంతస్తుల నిర్మిస్తున్నారు. అంతేకాకుండా వీధి స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం చేపడుతున్నారు. ఏప్రిల్‌లో ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా స్పందన లేదు. ఉప కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా చర్యలు లేవు.
– స్థానికురాలు, ప్రేమ్‌నగర్

✓ నిర్మాణదారుకి తాఖీదు జారీ చేశాం. తదుపరి చర్యలకు స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్‌టీఎఫ్)కు సిఫార్సు చేశాం.
– శ్రీనివాస్, ఏసీపీ, జీహెచ్ఎంసీ జూబ్లీ హిల్స్ సర్కిల్

నేటి నుంచి ప్రైవేట్ ఎలక్ట్రీషియన్లకు అవగాహన

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: విద్యుత్తు ప్రమాదాలు నిరోధించేందుకు ప్రైవేటు సెక్టార్‌లో పని చేస్తున్న ఎలక్ట్రీషియన్ల కోసం పోలీక్యాబ్ కంపెనీ అధ్వర్యంలో మూడు రోజులపాటు ఉచిత టెక్నికల్ అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ఎలక్ట్రికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నక్క యాదగిరి ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 21, 22వ తేదీల్లో మదీనాగూడలోని రావిలా బ్రాండ్ హాల్‌లో, 23న నాగోల్‌లోని వైట్ పెర్ల్ బంకెట్ హాల్‌లో ఉదయం 10:30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ సదస్సులు ఉంటాయని తెలిపారు.

వడ్డెర్ల సమస్యల పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న కార్పొరేటర్ సి.ఎన్ రెడ్డి

బోరబండ, న్యూస్‌టుడే: వడ్డెర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని రహ్మత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వడ్డెర ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఎస్పీఆర్ హిల్స్ క్రీడాప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సి.ఎన్.రెడ్డి మాట్లాడుతూ.. ఎస్పీఆర్ హిల్స్ క్వారీ స్థలంలో రాళ్లు కొట్టిన వడ్డెరలకు ప్రభుత్వం తరఫున పక్కా ఇళ్లు దక్కేలా చూస్తానని హామీ ఇచ్చారు. సంబంధిత అధికారులతో చర్చించి ఇక్కడి స్థలం వడ్డెరలకు దక్కే విధంగా చూస్తానన్నారు. తెలంగాణ వడ్డెర ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వేముల యాదయ్య మాట్లాడుతూ.. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో ఎస్పీఆర్ హిల్స్ క్వారీకి చెందిన 9ఎకరాల 16గుంటల స్థలాన్ని వడ్డెరలకు కేటాయించారని గుర్తుచేశారు. క్వారీ ప్రాంతంలో మిగిలిన స్థలాన్ని వడ్డెరలకు కేటాయించాలని ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు. వడ్డెర ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొలుసుల ఎల్లయ్య, నగర అధ్యక్షుడు ముద్దంగుల శేఖర్ పాల్గొన్నారు.

నడకదారి పక్కన పూల సోయగం



కేబీఆర్ ఉద్యానం ముందు జీహెచ్ఎంసీ నడకదారి పక్కన జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఆదివారం పునరుజ్జీవ వేడుకలు నిర్వహించారు. ఈ క్రమంలో నడకదారిలోని ఓపెన్ జిమ్ ప్రాంతంలో దాదాపు 1200 పూల మొక్కలను ఇక్కడ ప్రత్యేకంగా ఏర్పాటుచేశారు. పెటోనస్, ఇంప్రెషన్స్, మేరిగోల్డ్, ఐరిసన్ రకాలకు చెందిన మొక్కలన్నీ రంగుల పూలతో ఆకట్టుకున్నాయి. – న్యూస్‌టుడే, జూబ్లీహిల్స్.

నిర్వహణ కరవై.. చెత్తకు నిలయమై

బసవ తారకం క్యాన్సర్ ఆసుపత్రి రోడ్డులో ఏర్పాటు చేసిన ఈ ఫౌంటేన్ నిర్వహణ కరవైంది. మంచి నీరు ఉండాల్సిన ప్రాంతంలో చెత్తా చెదారం, మురుగుతో నిండిపోయింది. పరిసరాలు కళావిహీనంగా మారాయి.



అంధుల మధ్య ఇంటర్నేషనల్ చెఫ్ డే



సోమాజిగూడలోని రూట్స్ కాలేజ్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్, కలినరీ విద్యార్థులు ఇంటర్నేషనల్ చెఫ్ డేను అంధుల మధ్య జరుపుకొన్నారు. ఆదివారం బేగంపేటలోని ఆశా బ్లైండ్ హోమ్స్‌కు వెళ్లిన విద్యార్థులు 'లంచ్ విత్ లవ్' పేరుతో అక్కడి అంధులకు మధ్యాహ్న భోజనం వడ్డించారు.
– న్యూస్‌టుడే, సోమాజిగూడ

తెలుగు రాష్ట్రాల్లో ఎస్పీని బలోపేతం చేస్తాం


పాశం వెంకటేష్‌ను సన్మానిస్తున్న కల్యాణ్‌యాదవ్, నర్సింగ్‌రావు

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: తెలుగు రాష్ట్రాల్లో సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ)ని బలోపేతం చేస్తామని ఆ పార్టీ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు పాశం వెంకటేశ్ అన్నారు. ఆదివారం జూబ్లీహిల్స్‌కు విచ్చేసిన ఆయనను ఆ పార్టీ నేతలు దండుబోయిన కల్యాణ్ యాదవ్, తెలంగాణ మాదిగ దండోరా అధ్యక్షుడు మదిరె నర్సింగ్ రావు సత్కరించారు. వెంకటేశ్ మాట్లాడుతూ.. త్వరలోనే పార్టీ జాతీయ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్‌ను కలిసి ఆయన సూచనల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ స్థాయిల్లో కమిటీలు వేయనున్నట్లు తెలిపారు.

కళ సమాజ హితానికి ఉపయోగపడాలి


ప్రదర్శన ప్రారంభించిన రజత్ కుమార్, చిత్రంలో హరి, వకుళాభరణం కృష్ణమోహన్

బంజారాహిల్స్, న్యూస్‌టుడే: లలిత కళలు అజరామరమని, కళ సమాజ హితానికి ఉపయోగపడాలని, కృత్రిమ మేధ (ఏఐ) దూసుకొస్తున్న తరుణంలో చిత్రకళ పట్ల మరింత ఆదరణ పెరగాల్సిన అవసరం ఉందని వక్తలు అభిప్రాయపడ్డారు. నగరానికి చెందిన వీఎస్ఎల్ విజువల్స్ ఇంటర్నేషనల్ ఆర్ట్ గ్యాలరీ ఆధ్వర్యంలో చిత్రకారుడు హరి గీసిన చిత్రాల ప్రదర్శన 'పెర్సెవరన్స్' పేరిట బంజారాహిల్స్‌లోని తాజ్ డెక్కన్‌లో ఆదివారం కొలువుదీరింది. ఈ ప్రదర్శన ద్వారా వచ్చిన మొత్తంలో కొంత భాగాన్ని క్యాన్సర్ వ్యాధిగ్రస్థులకు అందజేయనున్నారు. స్థిరాస్తి సంస్థ మైరాన్ హోమ్స్ ఈ ప్రదర్శన నిర్వహణకు సహకారం అందిస్తోంది. విశ్రాంత ఐఏఎస్ అధికారి రజత్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ఓ చిత్రాన్ని ఆవిష్కరించారు. పద్మశ్రీ డా.మంజుల అనగాని. వకుళాభరణం కృష్ణమోహన్, సినీ సంగీత దర్శకుడు కోటి, మైరాన్ హోమ్స్ వ్యవస్థాపకుడు యువరాజు, విభిన్న రంగాలకు చెందిన డా.ఆశిష్ చౌహాన్, సుధా జైన్, అభినవ్ సర్దార్, రౌనక్ యార్ ఖాన్, చైతన్య రెడ్డి, మాల్యాద్రి, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

'ముదిరాజ్ కుల మహనీయులు' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: ముదిరాజ్ సమాజంలోని మహనీయులను గుర్తుచేసుకునేలా వారి వివరాలతో రూపొందించిన 'ముదిరాజ్ కుల మహనీయులు' పుస్తకావిష్కరణ ఆదివారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు. ముదిరాజ్ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డా.శివ ముదిరాజ్ రాసిన పుస్తకాన్ని ఆ సామాజిక వర్గానికి చెందిన పలువురు ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఫిషరీస్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ పిట్టల రవీందర్ మాట్లాడుతూ.. ఏదైనా సమస్య పరిష్కారం కావాలంటే ఆ సమస్య పార్టీల అవసరంగా మార్చాలన్నారు. పుస్తక రచయిత మాట్లాడుతూ.. ముదిరాజ్ సమాజం ఒకచోట కలుసుకోవాలంటే ఏదైనా సందర్భం ఉండాలని, అందుకోసం ముదిరాజ్ మహనీయుల జనన, మరణ తేదీలతో ఈ పుస్తకాన్ని రూపొందించినట్లు తెలిపారు. సమావేశంలో ముదిరాజ్‌కులాన్ని బీసీ-డీ నుంచి ఏ లోకి మార్చేందుకు అడ్డంకులు-పరిష్కార మార్గాలు, స్థానిక సంస్థల్లో ముదిరాజ్ సమాజానికి రావాల్సిన వాటా, తెలంగాణ ప్రభుత్వంలో వాటా, ముదిరాజ్‌లకు నామినేటెడ్ పదవులు, ప్రత్యేక నిధులు, సంక్షేమ పథకాలపై చర్చించారు. సమావేశంలో బీఎస్పీ రాష్ట్ర కోఆర్డినేటర్ చంద్రశేఖర్ ముదిరాజ్, జన సమితి ప్రధాన కార్యదర్శి నిజ్జన రమేష్, ముదిరాజ్ ప్రతినిధులు ఉప్పరి నారాయణ, శ్రీకాంత్, వెంకటేష్, ఆశాప్రియ, రమాదేవి, ఉదయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

అమీర్‌పేట, న్యూస్‌టుడే: (ఇవి ఆదివారం నాటివి.. కిలోకు రూపాయల్లో) టమాట 39, నల్ల వంకాయ 35, పొడుగు వంకాయ 28, బెండ 55, పచ్చిమిర్చి 40, బజ్జి మిర్చి 75, క్యాప్సికం 75, పచ్చకాకర 38, పందిరిబీర 55, క్యాబేజి 26, క్యారెట్ 41, దొండ 28, గుండుబీన్స్ 125, గింజ చిక్కుడు 70, గోకరకాయ 35, కీర 23, దోస 35, బీట్‌రూట్ 33, ఉల్లి 45, ఆలు 37, చామ 45, మొరంగడ్డ 28, కంద 65, గోబీ 23, సొర 17, పొట్లకాయ 18.

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం - అక్టోబరు 21
కీ॥శే॥ K.S.వ్యాస్ IPS కీ॥శే॥ ఉమేష్‌చంద్ర IPS కీ॥శే॥ పరదేశీనాయుడు IPS
ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం, సమాజ శ్రేయస్సు కోసం, రాజ్యాంగ సంరక్షణలో భాగంగా అహర్నిశలు పోరాడుతూ, త్యాగాల బాటలో నడిచి, కర్తవ్య నిర్వహణే ధ్యేయంగా భావించి విధి నిర్వహణలో తమ ప్రాణాలను ఫణంగా పెట్టి అసువులు బాసిన పోలీసు అధికారులకు మరియు సిబ్బందికి ఇవే మా అశ్రునయన జోహార్లు.
పంజాగుట్ట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సిబ్బంది
GRT JEWELLERS Since 1964
HYDERABAD:
SOMAJIGUDA: 040 - 2333 1515
KUKATPALLY : 040 - 4025 1515
CHANDA NAGAR : 040 - 4020 1515
DR. A S RAO NAGAR : 040 - 2714 1515
Telangana | Andhra Pradesh | Karnataka | Tamil Nadu | Puducherry | Singapore

చరవాణి వినియోగంలో జాగ్రత్తలు అవసరం

బంజారాహిల్స్, న్యూస్‌టుడే: చరవాణి వినియోగంలో జాగ్రత్త అవసరమని సైబర్ నిపుణుడు మురళి తలశిల సూచించారు. కీలకమైన సమాచారం చరవాణిలోనే భద్రపరచుకుంటున్న నేపథ్యంలో ప్రజలు సైబర్ మోసాలకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యార్థులతో ఏర్పాటైన టెక్నో ఫౌండేషన్ మొదటి వార్షికోత్సవ వేడుకలు 'ఇల్యూమినేట్ 20 24' పేరిట బంజారాహిల్స్‌లోని గతి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చరవాణిలో ఏపీకే యాప్ డౌన్‌లోడ్ చేయవద్దని సూచించారు. ఆన్‌లైను గేమ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. షేక్‌పేట మండల డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ యాదగిరి మాట్లాడుతూ.. డిగ్రీ స్థాయి విద్యార్థులు సమాజ సేవకు నడుం బిగించటం ముదావహమన్నారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సతీష్ సహ వ్యవస్థాపకుడు లోహిత్ పాల్గొన్నారు.

ఖైరతాబాద్

• ఖైరతాబాద్ • జూబ్లీహిల్స్

ఐఎండీ, సీఎస్ఐఆర్‌లకు ఉత్తమ స్టాల్ అవార్డు

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: దిల్‌సుఖ్‌నగర్‌లోని జి.పుల్లారెడ్డి మెమోరియల్ పాఠశాలలో నిర్వహించిన భారత్ ప్రైడ్ ఎగ్జిబిషన్ ఎక్స్‌పోలో 2024 ఉత్తమ స్టాల్ అవార్డును ఐఎండీ, సీఎస్ఐఆర్‌లు గెలుచుకున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్ హురాల్యూర్ జయశ్రీ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మూడు రోజుల పాటు జరిగిన జాతీయ సైన్స్ అండ్ టెక్నాలజీ ఎక్స్‌పోలో సీఎస్ఐఆర్, ఐఎండీ, ఇస్రో, ఎన్ఆర్ఎస్‌సీ-సీఎస్ఐఆర్, ఎన్‌జీఆర్ఐ, ఎన్ఏఎల్, నేషనల్ కౌన్సిల్ ఫర్ సైన్స్ మ్యూజియం, వంటి ప్రముఖ సైన్స్ విభాగాలకు చెందిన 100 స్టాల్స్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ ఎక్స్‌పోను 50వేలకు పైగా విద్యార్థులు, ప్రజలు సందర్శించినట్లు తెలిపారు. ఈనెల 18న ప్రారంభమైన ఎక్స్‌పో ఆదివారంతో ముగిసిందన్నారు. ఉత్తమ స్టాల్ అవార్డును హైదరాబాద్ ఐఎమ్‌డీ డైరెక్టర్ నాగరత్న కొప్పర్తికి పాఠశాల ప్రిన్సిపాల్ హురాల్యూర్ అందించారు. జాగృతి యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు నరేష్, శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

"గచ్చిబౌలి పబ్‌లో డ్రగ్స్ తీసుకొని దొరికిన ప్రబుద్ధులు. మాదాపూర్ పబ్‌లో నవ్వుతూ పలకరించి జేబులు గుల్లచేసే అందమైన అమ్మాయిలు. బంజారాహిల్స్ బార్‌లో విదేశీ యువతుల నగ్న.. అర్ధనగ్న నృత్యాలు. నగరంలోని పలు పబ్‌లు, బార్‌లు వినోదం ముసుగులో విచ్చలవిడిగా వ్యవహరిస్తున్నాయి. కుర్రకారును ఆకట్టుకునేందుకు దేశ, విదేశాల నుంచి అందమైన మగువలను రప్పిస్తున్నాయి.. తమను తాము మరచిపోయే సింథటిక్ డ్రగ్స్‌ను రుచిచూపుతున్నాయి. పలుమార్లు టీజీన్యాబ్, పోలీసులు, ఆబ్కారీ యంత్రాంగం తరచూ దాడులు చేసి కేసులు నమోదుచేస్తున్నా.. నిర్వాహకులు తీరుమార్చుకోవట్లేదు. కాసులు ఎదజల్లి మళ్లీ అనుమతులు తెచ్చుకుంటున్నారు."

ఈనాడు, హైదరాబాద్, - న్యూస్‌టుడే, జూబ్లీహిల్స్

మత్తెక్కించే డ్రగ్స్...

• పబ్‌లలో అసాంఘిక కార్యకలాపాలు
• కేసులు నమోదు చేసినా మారని నిర్వాహకులు

మైమరిపించే మగువలు



వలపు వల.. జేబుగుల్ల: మాదాపూర్, బంజారాహిల్స్.. గచ్చిబౌలి ఇలా ఖరీదైన ప్రాంతంలో పబ్‌కు ఒంటరిగా వెళ్లారా.. కాస్త 'రిలాక్స్' అవ్వాలనే సమయంలో పక్కనే కూర్చున్న అందమైన యువతి పలకరింపు వినిపిస్తుంది. చిరునవ్వుతో ఆరా తీస్తుంది. తన మిత్రుడు వస్తానని చెప్పి ఎక్కడో చిక్కాడంటూ నమ్మిస్తుంది. మాటలతో మాయచేసి సరదా సంభాషణ నుంచి వలపు వాకిట్లోకి తీసుకెళ్తుంది. ఛీర్స్.. డ్యాన్స్.. ఆపై రొమాన్స్ అంటూ ఊరించి.. తేరుకునేలోపు మాయమవుతుంది. పబ్ నిర్వాహకులు వేలల్లో బిల్లు చేతిలో పెట్టి అతని ముక్కు పిండి మరీ వసూలు చేస్తారు.. గత కొద్ది రోజులుగా నగరంలో కొనసాగుతున్న దందాపై పోలీసులు ఎప్పటిప్పుడు చర్యలు చేపడుతున్నా కొందరు యజమానులు తమ తీరు మార్చుకోవడం లేదు.. గోవా, ముంబయి తరహాలో నగరంలోని పలు పబ్‌లు ఇతర రాష్ట్రాల యువతులు, మహిళలకు ఉచిత ప్రవేశం కల్పించి.. కమీషన్ ఆశచూపి ఒంటరిపక్షులను యథేచ్ఛగా దోచుకుంటున్నారు.

◆ తాజాగా టాస్ పబ్ వ్యవహారంలోనూ ఇదే చోటుచేసుకొంది. దాదాపు 42 మందిలో 22మంది యువతులు, 20 మంది వివాహితులు శనివారం రాత్రి నిర్వహించిన పోలీసుల దాడుల్లో దొరికారు. వీరిలో చాలామంది గృహిణులున్నారు.

◆ ఆర్థిక అవసరాలకు పబ్‌కు వెళ్లి కాసింత సమయం అక్కడున్న వారిని తమ నృత్యాలతో రంజింపచేస్తున్నారు. వారితో కలిసి మద్యం సేవించి బిల్లును రెట్టింపు చేసి కమీషన్ తీసుకుంటున్నామంటూ పోలీసుల ఎదుట వాపోయారు.

◆ లెస్పాట్ పబ్‌లో ఇదే తరహాలో నిర్వాహకులే అమ్మాయిలను తీసుకొచ్చి కస్టమర్లతో అధికంగా మద్యం తాగి బిల్లు పెరిగేలా దందా చేశారు.

◆ బంజారాహిల్స్‌లోనూ ఒక పబ్‌లో అమ్మాయిలను తీసుకొచ్చి దందా చేస్తున్నట్లు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు.

సామాజిక మాధ్యమాలకు దూరంగా..

గోవా, ముంబయి, దిల్లీ, పుణె, బెంగళూరు వంటి నగరాల్లో కొన్ని పబ్బులు, బార్లలో యువతులు ప్రత్యేకంగా నృత్యాలు చేయడానికి వస్తుంటారు. రూ. 2-3వేలు ఇచ్చే ఒప్పందంతో రప్పిస్తున్నారు. కొన్ని పబ్‌లు ముజ్రాపార్టీకి ముంబయినుంచి హిజ్రాలను రప్పిస్తున్నారు. విదేశీ యువతుల నృత్యాన్ని ఆస్వాదించేందుకు ప్రత్యేక రుసుం వసూలు చేస్తున్నారు.

నవ్వుకు చిక్కి కేసుల్లో ఇరుక్కోవద్దు:

పబ్‌కు వెళ్లే సమయంలో అక్కడి పరిస్థితులను ముందుగా తెలుసుకొని వెళ్లాలని పోలీసులు సూచిస్తున్నారు. పరిచయం లేని యువతులు, మహిళలు వచ్చి మాట, మందు కలిపితే ముందుగానే పోలీసులకు సమాచారం ఇవ్వాలంటున్నారు. గతంలో రాడిసన్ బ్లూ ప్లాజా హోటల్‌లో మాదకద్రవ్యాల పేరుతో పోలీసులు దాడి చేసి దాదాపు 200 మందిని బంజారాహిల్స్ ఠాణాకు తరలించారు. బంజారాహిల్స్‌లోని ఆఫ్టర్ 9 పబ్‌లోనూ ఇదే తరహాలో 175 మందిని, టాస్ పబ్‌లో 142 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చీకటి కార్యకలాపాలకు పాల్పడే పబ్‌లు, బార్‌లను సీజ్ చేయమని నగర సీపీ సీవీ ఆనంద్ స్పష్టమైన ఆదేశాలిచ్చినట్టు తెలుస్తోంది.

కేబీఆర్ ఉద్యానంలో వాకర్స్ సమస్యలు పరిష్కరించండి



సమావేశంలో మాట్లాడుతున్న విజయ్ కుమార్

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: కేబీఆర్ ఉద్యానవనం నడకదారులను పార్కింగ్ సమస్య తీవ్రంగా వేధిస్తుందని, ఈ సమస్యపై అధికారులు దృష్టి సారించాలని కేబీఆర్ నేచర్ పార్కు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయకుమార్ కోరారు. జూబ్లీహిల్స్‌లోని జింఖానా క్లబ్‌లో ఆదివారం నేచర్ పార్కు వాకర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నడకదారులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను కమిటీ దృష్టికి తీసుకొచ్చారు. ఉద్యానవనం వద్ద వాణిజ్య కార్యకలాపాలు జరుగుతున్నాయని వాటిని అరికట్టాలని సూచించారు. నడకదారులకు నడిచే దారిలో ఏదైనా ప్రమాదం జరిగితే వెంటనే వారిని ప్రధాన గేటు వద్దకు తీసుకొచ్చే విధంగా ఓ బ్యాటరీ వాహనాన్ని అందుబాటులో ఉంచాలని, ఫస్ట్ ఎయిడ్ కిట్లు ఏర్పాటు చేయాలని కోరారు. వారు మాట్లాడుతూ.. నడకదారులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులతో చర్చించి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఉద్యానవనంలో వయోవృద్ధులకు కూర్చునేందుకు అవసరమైన ప్రాంతాల్లో బల్లలు ఏర్పాటు చేయిస్తామన్నారు. అసోసియేషన్ కార్యదర్శి లక్ష్మారెడ్డి, కోశాధికారి సురేష్ అగర్వాల్, సంయుక్త కార్యదర్శి వైఈపీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పునరుజ్జీవ వేడుకలు

జూబ్లీహిల్స్: జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో కేబీఆర్ ఉద్యానవనం వద్ద పునరుజ్జీవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు ఇక్కడ ఏర్పాటు చేసిన క్లైంబింగ్‌తో పాటు ఇతర క్రీడల్లో పోటీపడ్డారు. జూట్ సంచులు, మిద్దె తోటల పెంపకం, చేనేత స్టాల్స్ ఆకట్టుకున్నాయి. ఖైరతాబాద్ సర్కిల్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, ఉప కమిషనర్ ప్రశాంతి కార్యక్రమాన్ని పరిశీలించారు. వెంకటేశ్వరకాలనీ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి పాల్గొన్నారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	120-00
రిటైల్	142-00
డ్రెస్డ్	206-00
స్కిన్‌లెస్	234-00

'పబ్‌ని డ్యాన్స్‌బార్‌గా మార్చారు'

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: బంజారాహిల్స్‌లోని టాస్ పబ్‌లో రూ.2.50లక్షల విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని, పబ్‌ను డ్యాన్స్‌బార్‌గా మార్చిన నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని టాస్క్‌ఫోర్స్ డీసీపీ సుధీంద్ర ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అశ్లీల నృత్యాలతో అధిక బిల్లులు వసూలు చేసేందుకు ప్రత్యేకంగా మహిళలను, యువతులను నియమించుకున్న పబ్‌పై శుక్రవారం అర్ధరాత్రి తరువాత బంజారాహిల్స్ పోలీసులు, పశ్చిమ మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసిన విషయం విదితమే. ఈ దాడుల్లో 149 మందిని అదుపులోకి తీసుకున్నారు. పబ్ యాజమాన్యం ఏర్పాటు చేసిన 42 మంది మహిళలు, ఏడుగురు నిర్వాహకులు, 98 మంది కస్టమర్లతోపాటు ఇద్దరు యజమానులు వీరిలో ఉన్నారు. నిబంధనలకు విరుద్ధంగా డీజే శబ్దాలతో పాటు, డిస్కో లైటింగ్‌లు, మహిళలతో నృత్యాలు చేయించి, అధికంగా మద్యం సేవించేలా మహిళలతో ప్రోత్సహించడాన్ని గుర్తించామన్నారు. పబ్ నిర్వాహణకు అవసరమైన లైసెన్స్ లేదని, ప్రవేశ రుసుంతో పాటు రూ.500 మద్యానికి ప్రత్యేకంగా వసూలు చేస్తున్నారని వెల్లడించారు. పబ్‌లో డీజే సిస్టం, నగదు, స్వైపింగ్ యంత్రాలు, చరవాణులు సైతం స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ పేర్కొన్నారు. టాస్క్‌ఫోర్స్, బంజారాహిల్స్ పోలీసులను ఆయన అభినందించారు.

వందేళ్ల పండగకు సిద్ధం



ఆంధ్రప్రదేశ్ కృష్ణాజిల్లా తాడంకి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు హైదరాబాదులోని బంజారాహిల్స్ తబలా హోటల్‌లో ఆదివారం సమావేశమయ్యారు. 2025 జనవరి 12న పాఠశాల శతాబ్ది ఉత్సవాల నిర్వహణపై చర్చించారు. అప్పట్లో సెవెంత్ ఫార్మ్, ఎస్ఎస్ఎల్‌సి చదివిన వారు తమ జ్ఞాపకాలను పంచుకున్నారు. ప్రముఖ క్యాన్సర్ వైద్యుడు నోరి దత్తాత్రేయుడు ఇదే పాఠశాలలో చదువుకున్నట్లు అనంతలక్ష్మి గుర్తు చేశారు. తిరుమలప్రసాద్ నిర్వహించిన ఈ సమావేశంలో పూర్వ విద్యార్థి ఏనుగు మస్తాన్రావు, ఎమ్మెస్ ప్రకాశరావు, ఎర్రబోతు ప్రభాకర్‌రావు, ఎస్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఊరంతా తిప్పి.. చరవాణితో ఉడాయించి

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: రాపిడో బైక్ బుక్ చేసిన యువకుడు చోదకుడిని బురిడీ కొట్టించి ఊరంతా తిప్పి చివరికి అతడి చరవాణితో ఉడాయించిన ఘటన ఇది. జూబ్లీహిల్స్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండాపూర్‌కు చెందిన చంద్రమహేష్‌బాబు రాపిడో చోదకుడు. ఈనెల 18న రాత్రి 11 గంటల ప్రాంతంలో నితిన్ అనే వ్యక్తి గచ్చిబౌలిలోని డెలాయిట్ కార్యాలయం నుంచి కొండాపూర్‌లోని ఏఎంబీ మాల్ వరకు రాపిడో బైక్ బుక్ చేసుకోవడంతో అతడిని తీసుకువెళ్లాడు. గమ్యం చేరుకున్నాక తాను డబ్బులు తీసుకురావడం మర్చిపోయానని, కూకట్‌పల్లికి తీసుకెళ్తే అక్కడ తన స్నేహితుడి నుంచి డబ్బులు తీసుకొని కొంత ఎక్కువ ఇస్తానని చెప్పడంతో అక్కడికి తీసుకెళ్లాడు. నితిన్ ఓ ఇంట్లోకి వెళ్లి తన స్నేహితుడు లేడని, శ్రీకృష్ణనగర్ ప్రాంతంలో విడిచిపెడితే అన్ని డబ్బులు కలిపి ఇస్తానని నమ్మించాడు. ఈ మేరకు జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 10లోని అల్కాజార్ మాల్ వద్దకు చేరుకున్నాక నితిన్ తన చరవాణి స్విచ్ఛాఫ్ అయ్యిందని చోదకుడి చరవాణి తీసుకొన్నాడు. ఫోన్ మాట్లాడుతున్నట్లు నటిస్తూ దూరంగా వెళ్లి తిరిగి రాలేదు. చోదకుడు చుట్టుపక్కల వెదికినా కనిపించలేదు. తర్వాత చరవాణి స్విచ్‌ఆఫ్ అయ్యింది. దీంతో చంద్రమహేష్ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనన్య ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ ఎండీపై కేసు

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: అనన్య ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీపై బంజారాహిల్స్ ఠాణాలో కేసు నమోదైంది. బంజారాహిల్స్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్ నంబరు 10లోని హెచ్ఎస్ఆర్ హోమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు అనన్య ఇన్‌ఫ్రా సంస్థ అబ్దుల్లాపూర్‌మెట్‌లోని దాదాపు 34 ఎకరాల స్థలాన్ని విక్రయించింది. ఇందుకు 2018లో హెచ్ఎస్ఆర్ సంస్థ రూ. 8,37,95,000 చెల్లించింది. అప్పటి నుంచి రిజిస్ట్రేషన్ చేయలేదు. ఈ వ్యవహారంలో అనన్య ఎండీ రాజ్‌కుమార్ రాయ్ ఉద్దేశపూర్వకంగా మరికొందరితో కలిసి మోసానికి పాల్పడ్డారని హెచ్ఎస్ఆర్ హోమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ డైరెక్టర్ దురెడ్డి ధీరజ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కార్మికుల సంక్షేమానికి చర్యలు చేపట్టాలి


మాట్లాడుతున్న అలీక్‌చక్రవర్తి

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: కార్మిక సంఘాలన్నీ ఏకమై కేంద్రంలోని భాజపా సర్కారు అవలంబిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని టీయూసీఐ జాతీయ ఉపాధ్యక్షుడు అలీక్ చక్రవర్తి అన్నారు. ఆదివారం సుందరయ్య కళానిలయంలో ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్(ఐఎఫ్‌టీయూ) టీయూసీఐలో విలీన సభ జరిగింది. ఈ సందర్భంగా అలీక్ చక్రవర్తి మాట్లాడుతూ.. కార్మికుల సామాజిక భద్రతకు నెలకు రూ.26వేల వేతనం చెల్లించాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. టీయూసీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం మాట్లాడుతూ.. కార్మికుల హక్కుల సాధనకు పోరాటాలే శరణ్యమన్నారు. టీయూసీఐ జాతీయ ఉపాధ్యక్షుడు ఉమాకాంత్, మహారాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌నట్కర్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్ఎల్ పద్మ, నేతలు హన్మేష్, రాజన్న, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి: కేంద్ర మంత్రి


ప్రారంభిస్తున్న కిషన్‌రెడ్డి, లావణ్య, శ్రీనివాస్‌ముదిరాజ్ గౌతంరావు తదితరులు

గోల్నాక, న్యూస్‌టుడే: మౌలిక వసతుల కల్పనకు తన వంతు కృషి చేస్తానని కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి తెలిపారు. కాలనీలు, బస్తీల్లో రహదారులు, తాగునీరు, డ్రైనేజీ, వీధిదీపాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆదివారం జైస్వాల్ గార్డెన్ కాలనీ ముఖ ద్వారాన్ని గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్య, కాలనీ అధ్యక్షుడు చింతల శ్రీనివాస్ ముదిరాజ్, భాజపా జిల్లా అధ్యక్షుడు గౌతంరావు తదితరులతో కలిసి ప్రారంభించారు. అజయ్, రవీందర్‌గౌడ్, రమేష్‌గౌడ్, మధుసూదన్‌చారి పాల్గొన్నారు.

పద్మశాలీలు అన్ని రంగాల్లో రాణించాలి: ఎంపీ


ప్రసంగిస్తున్న ఈటల రాజేందర్

ఎల్బీనగర్, న్యూస్‌టుడే: పద్మశాలీలు ఐక్యంగా ఉండి, అన్నిరంగాల్లో రాణించాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ సూచించారు. ఆటోనగర్ హరిణ వనస్థలి అనన్య ఏకో పార్కులో ఆదివారం ఎల్బీనగర్ సర్కిల్ పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో దసరా మేళా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ రాజేందర్ మాట్లాడుతూ.. సమాజంలో పద్మశాలీల పాత్ర కీలకమైందన్నారు. టీపీసీసీ ప్రచార కమిటీ ఛైర్మన్ మధు యాష్కీ గౌడ్ మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాలు ఐక్యమైనప్పుడే రాజ్యాధికారం సాధ్యమన్నారు. ఎమ్మెల్సీ ఎల్.రమణ, మాజీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్, వరంగల్ పూర్వ మేయర్ గుండు సుధారాణి, అఖిల భారత పద్మశాలీ సంఘం అధ్యక్షుడు కందగట్ల స్వామి, తెలంగాణ అధ్యక్షుడు కె.మురళి, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గజ్జ సత్యం, ఎల్బీనగర్ పద్మశాలీ సంఘం అధ్యక్షుడు పున్న గణేశ్ నేత, మేళా కమిటీ ఛైర్మన్ రవిశంకర్ నేత పాల్గొన్నారు.

దేవాలయాలపై దాడులు... విచారణకు కమిటీ వేయాలి


నినాదాలు చేస్తున్న పుట్టి యాదగిరి ముదిరాజ్, యమన్‌సింగ్, బాబూరావు, రాంచందర్ తదితరులు

అంబర్‌పేట, న్యూస్‌టుడే: నగరంలోని దేవాలయాలపై జరుగుతున్న దాడులపై విచారణ కమిటీ ఏర్పాటు చేయాలని సనాతన హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి డిమాండ్ చేసింది. వరుస దాడులను ఖండిస్తూ ఆదివారం అంబర్‌పేటలో ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమంలో సమితి రాష్ట్ర ఛైర్మన్ పుట్టి యాదగిరి ముదిరాజ్, అధ్యక్షుడు ఠాకూర్ యమన్‌సింగ్ తదితరులు మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆలయాలపై దాడులు జరుగుతున్నాయని విమర్శించారు. కోశాధికారి కాశీబుగ్గ బాబూరావు, నగర కన్వీనర్ తూర్పు రాంచందర్, రాష్ట్ర కార్యదర్శులు సదానంద్, జీకే రాయుడు, చంద్రశేఖర్, కృష్ణగౌడ్ పాల్గొన్నారు.

బండి సంజయ్ వ్యాఖ్యలు హాస్యాస్పదం: మాజీ ఎంపీ

గన్‌ఫౌండ్రీ: భారాస, కాంగ్రెస్ ఒక్కటేనని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదమని మాజీ ఎంపీ రవీంద్రనాయక్ ఒక ప్రకటనలో విమర్శించారు. ఎన్నో ఆశలతో ప్రజలు ఎనిమిది మంది ఎంపీలను గెలిపిస్తే భారాస హయాంలో జరిగిన అవినీతిపై చర్యలు తీసుకోవాలని నరేంద్రమోదీ ప్రభుత్వంపై ఎందుకు ఒత్తిడి తీసుకురావడం లేదని ప్రశ్నించారు. భారాసతో భాజపా కుమ్మక్కై ఆ పార్టీ చేసిన అవినీతిపై మౌనం వహిస్తూ కాంగ్రెస్ పార్టీపై విమర్శలు చేయడం సిగ్గు చేటన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటాలే సీపీఎం ఎజెండా

వెంగళ్‌రావునగర్, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలపై పోరాటాలే సీపీఎం ఎజెండాని ఆపార్టీ నగర కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు అన్నారు. వెంగళరావునగర్ డివిజన్ బ్రహ్మం టాలెంట్ పాఠశాలలో హైదరాబాద్ నగర మహాసభల ముందస్తు ప్రణాళిక సంఘం సమావేశం ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సీపీఎం పార్టీ హైదరాబాద్ నగర 23వ మహాసభలు నవంబరు 30, డిసెంబరు 1వ తేదీల్లో నిర్వహించనున్నామని తెలిపారు. పార్టీ కార్యవర్గ సభ్యులు ఎం.వెంకటేష్, దశరథ్ ఆహ్వానం సంఘం కమిటీని ప్రకటించారు. సి.హెచ్.చంద్రశేఖర్‌రావు, పోసాని సుబ్బారావు, రాజేష్, శ్యామల రాజన్‌బాబు, టి.సాయిశేషగిరిరావు పాల్గొన్నారు.

త్వరలోనే కాగిత రహిత న్యాయసేవలు

ఈనాడు, హైదరాబాద్

నాంపల్లి కోర్టులో మొదలైన దస్త్రాల డిజిటలైజేషన్



నాంపల్లి క్రిమినల్ కోర్టుల సముదాయం

గ్రేటర్‌లో కాగిత రహిత న్యాయ సేవలు అందుబాటులోకి రానున్నాయి. డిజిటల్ పద్ధతిలోనే వేగంగానే కేసులు విచారించే దిశగా వడివడిగా అడుగులు పడుతున్నాయి. తొలిదశలో కేసు దస్త్రాల డిజిటలైజేషన్ ప్రక్రియను చేపట్టగా నల్గొండ, వరంగల్ జిల్లాలతో పాటు నగరంలోని నాంపల్లి క్రిమినల్ కోర్టులు ఎంపికయ్యాయి. అందుకు సంబంధించిన టెండర్లు, ఇతర ప్రక్రియ పూర్తవ్వడంతో ఆరు నుంచి ఎనిమిది నెలల్లో డిజిటలైజేషన్ పూర్తి చేసేలా ప్రణాళికలు రచిస్తున్నారు. డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తయిన వెంటనే కాగిత రహిత సేవల అందించే ప్రక్రియకు శ్రీకారం చుట్టనున్నారు. డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తయిన వెంటనే నగరంలోని మిగిలిన కోర్టులతో పాటు రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల న్యాయస్థానాల్లో దశలవారీగా ప్రక్రియ మొదలు పెట్టనున్నారు.

సేవలు ఇలా... కాగితరహిత న్యాయ సేవల్లో భాగంగా.. కోర్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (సీఐఎస్) ద్వారా డిజిటల్ పద్ధతిలో సేవలు అందించనున్నారు. కేసు నమోదు నుంచి తీర్పు (డిస్పోజ్) అయ్యే వరకు పూర్తి వివరాలను అందించే కేంద్రీకృత వ్యవస్థ ఇది. న్యాయమూర్తుల కోసం 'ఏ' డైరీ, కేసు విచారణకు సంబంధించిన 'బీ' డైరీ పూర్తి వివరాలన్నీ ఇక్కడ నమోదు చేస్తారు. కక్షిదారులు కేసు నమోదు సమయంలో ఇచ్చిన స్కాన్ కాపీలు, రోజువారీ విచారణ అంశాలు, తీర్పులు అన్నీ ఇక్కడి సర్వర్‌లోనే ఉంటాయి. ఫలానా కేసుకు సంబంధించిన ఫైల్ తీసుకురమ్మని ఆదేశిస్తే ఇక నుంచి పాత దస్త్రాలన్నీ తిరగేయాల్సి పని ఉండదు. 'కీ' వర్డ్, అడ్వకేట్ వైజ్ బుక్‌మార్కింగ్, సీక్వెన్స్ వివరాల ఆధారంగా కేసుల వివరాలు వస్తాయి.

లక్షలాది దస్త్రాలు... జంట నగరాలతో పాటు రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో మొత్తం 20 కోర్టు సముదాయాలున్నాయి. రాజధాని పరిధిలోని అన్ని న్యాయస్థానాల్లో లక్షలాది ఫైళ్లను డిజిటలైజ్ చేసి కాగితరహిత సేవలు అందించేందుకు మరికొంత సమయం వేచి చూడాల్సిందే అని న్యాయ నిపుణులు చెబుతున్నారు.

కుటుంబ న్యాయస్థానంలో అవగాహన

పాత నగరంలో కుటుంబ న్యాయస్థానాల సముదాయాన్ని ప్రారంభించిన సమయంలోనే కాగిత రహిత సేవలు ప్రారంభించేందుకు అధికారులు ప్రయత్నాలు సాగించారు. వివాదాల పరిష్కారానికి వచ్చేవారికి పూర్తి స్థాయిలో అవగాహన వచ్చే వరకు తొలుత హైబ్రీడ్ పద్ధతిలో సేవలు అందించి అనంతరం పూర్తిస్థాయిలో సేవలు విస్తరించేందుకు ప్రయత్నిస్తున్నారు.

సగరుల అభివృద్ధే ధ్యేయం


అభివాదం చేస్తున్న నేతలు హరికిషన్‌సగర, ప్రకాశ్‌రావు తదితరులు

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: సగరులు ఐక్యంగా ఉంటూ అందరి సహకారంతో అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని అఖిల భారత సగర మహాసభ జాతీయ అధ్యక్షుడు హరికిషన్ సగర పిలుపునిచ్చారు. ఆదివారం సుందరయ్య కళానిలయంలో సగర క్షత్రియ వెల్ఫేర్ ఛారిటబుల్ ట్రస్ట్, సగర మహాసభ సంయుక్త ఆధ్వర్యంలో దసరా సమ్మేళనం పేరిట సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హరికిషన్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సగరుల జనాభా ప్రకారం అన్ని రంగాల్లో సమాన వాటా కల్పించాలని కోరారు. చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ గణపతి ప్రకాశ్‌రావు సగర, ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, కోశాధికారి వేణుగోపాల్, గౌరవ అధ్యక్షుడు శ్రీరాములు సగర, రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్‌సగర, ప్రధాన కార్యదర్శి సత్యం, మహిళా అధ్యక్షురాలు ప్రవంతి, సురేశ్ పాల్గొన్నారు.



ఉత్తేజంగా యమహా ట్రాక్ డే

శామీర్‌పేట: బొమ్మరాశిపేట లియోనియా రిసార్ట్స్ చికెన్ సర్క్యూట్‌లో ఇండియా యమహా మోటార్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ట్రాక్ డే ఈవెంట్‌కు వివిధ రాష్ట్రాల నుంచి 120 మంది బైక్ రైడర్లు వచ్చారు.

వసతి గృహంలో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

మూసాపేట, న్యూస్‌టుడే: కళాశాల వసతి గృహంలో కుమార్తెను దించి ఇంటికి బయలుదేరిన ఆ కుటుంబికులు ఇల్లు చేరకముందే పిడుగులాంటి వార్త అందింది. దీంతో దారి మధ్యలోంచే తిరిగి వచ్చి కుమార్తె మృతదేహాన్ని చూసి హతాశులయ్యారు. బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం నాగిరెడ్డిపల్లికి చెందిన దంపతులకు ముగ్గురు కుమార్తెలు. రెండో కుమార్తె (16) బాచుపల్లి చౌరస్తాలోని నారాయణ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. వసతి గృహంలో ఉండటంపై అనాసక్తితో ఉంటున్నట్లు తెలుస్తోంది. కొద్ది రోజులుగా ఇంట్లో ఉంటున్న ఆమెను ఆదివారం సాయంత్రం కారులో తీసుకొచ్చి కుటుంబ సభ్యులు వసతి గృహం వద్ద దించి వెళ్లారు. ఆ సమయంలో ఇంటికి బయలుదేరిన వారిని ఆమె ఆనందంగా సాగనంపింది. దీంతో వారు వచ్చిన కారులోనే తిరిగి ప్రయాణమయ్యారు. అయితే సగం దూరం వెళ్లగానే హాస్టల్ నిర్వాహకులు ఆ విద్యార్థిని ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఫోన్ చేసి చెప్పారు. దీంతో కంగారుగా తిరిగి వసతిగృహం వద్దకు వచ్చి కూతురు శవాన్ని చూసి కుప్పకూలిపోయారు. వారి రోదనలు మిన్నంటాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



సాహసం.. కొండచిలువకు ప్రాణం

ఆదివారం సాయంత్రం.. హిమాయత్‌సాగర్ గేట్ల మధ్య ఓ కొండ చిలువ చిక్కుకుని విలవిలలాడుతూ అక్కడి సిబ్బందికి కనిపించింది. వెంటనే స్నేక్ సొసైటీ సభ్యులకు సమాచారాన్ని అందించారు. వారు వచ్చి సాహసోపేతంగా తాడు సహాయంతో గేట్ల వద్దకు చేరుకుని దానిని రక్షించారు.

'దళితుల హామీల అమలులో ప్రభుత్వం విఫలం'


లాల్‌సింగ్ ఆర్యను సన్మానిస్తున్న రమేష్‌యాదవ్ తదితరులు

కాచిగూడ, న్యూస్‌టుడే: దళితుల హక్కుల సాధనకు ఉద్యమించాలని భాజపా ఎస్సీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లాల్‌సింగ్ ఆర్య అన్నారు. ఆదివారం నగరానికి వచ్చిన ఆయన్ను కాచిగూడ రైల్వేస్టేషన్లో భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్‌యాదవ్ సన్మానించారు. ఎన్నికల్లో ఎస్సీలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్రం ప్రభుత్వం విఫలమైందని లాల్‌సింగ్ ఆర్య విమర్శించారు. ఎన్నికల హామీల అమలు కోరుతూ రాష్ట్రవ్యాప్త ఆందోళనలను చేపట్టాలని పిలుపునిచ్చారు. ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్, జాతీయ కార్యదర్శి కుమార్, కార్యవర్గ సభ్యుడు అశోక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి క్రాంతికుమార్, అజయ్‌కుమార్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

హర్ష కార్తీకకు టైటిల్



ఈనాడు, హైదరాబాద్: ఐటీఎఫ్ జూనియర్ ప్రపంచ టూర్ టెన్నిస్ టోర్నీలో హైదరాబాద్ అమ్మాయి ఓరుగంటి హర్ష కార్తీక సత్తాచాటింది. ఈనెల 14 నుంచి 20 వరకు ఇథియోపియాలో జరిగిన టోర్నీలో హర్ష కార్తీక టైటిల్ సాధించింది. బాలికల సింగిల్స్ ఫైనల్లో హర్ష కార్తీక 6-4, 7-6 (7-4)తో బ్రూనా (బ్రెజిల్)పై గెలుపొందింది. 13 ఏళ్ల హర్ష కార్తీక టోర్నీ ఆసాంతం ఒక్క సెట్ కూడా కోల్పోకుండా విజేతగా నిలిచింది.

అగ్రస్థానంలో ధ్రువ: వారాస్ ర్యాపిడ్ ఓపెన్ రేటింగ్ చెస్ టోర్నమెంట్లో ధ్రువ్ తోట విజేతగా నిలిచాడు. 9 రౌండ్లలో అతడు 8.5 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచాడు. విజేతలకు ఎంపీ విశ్వేశ్వరరెడ్డి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్ (ఐపీఎస్), అశోక్ (రిటైర్డ్ ఎస్బీఐ ఏజీఎం) పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు అందించిన ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి

మాదిగలు ఐక్యంగా హక్కులు సాధించుకోవాలి


మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు కేపీ నర్సింగరావు

కాచిగూడ, న్యూస్‌టుడే: మాదిగలు ఐక్యంగా ఉండి హక్కులను సాధించుకోవాలని అరుంధతీయ బంధు సేవా మండలి రాష్ట్ర అధ్యక్షుడు కేపీ నర్సింగరావు అన్నారు. మండలిని దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు విస్తరించనున్నట్లు ప్రకటించారు. ఆదివారం కాచిగూడలోని మున్నూరు కాపు సంఘం మ్యాడం అంజయ్య హాలులో అరుంధతీయ బంధు సేవా మండలి 42వ వార్షిక దసరా మిలాప్-2024 వేడుకల్లో ఆయన మాట్లాడారు. త్వరలోనే ఏపీ రాష్ట్ర నూతన కమిటీని ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు మేకల నారాయణ, సెక్రటరీ జనరల్ సత్యేంద్ర కృష్ణ, గ్రేటర్ అధ్యక్షుడు బి.నర్సింగ్‌రావు, ప్రధాన కార్యదర్శి పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆచార్య నిత్యానందరావు బాధ్యతల స్వీకరణ



నారాయణగూడ, న్యూస్‌టుడే: నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 12వ ఉపాధ్యక్షుడి(వీసీ)గా వెలుదండ నిత్యానందరావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్ స్వాగతం పలికారు. మహిళా వర్సిటీ ఇన్‌ఛార్జి ఉపాధ్యక్షులు ఆచార్య సూర్య, తెలుగువర్సిటీ పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య టి.గౌరీశంకర్, ఆచార్య చెన్నకేశవరెడ్డి, పరిషత్తు ప్రధాన కార్యదర్శి డా.జుర్రు చెన్నయ్య అభినందించారు.

మహిళా ఠాణా సీఐ శ్రీనివాస్‌రావుకు పతకాలు



గోషామహల్, న్యూస్‌టుడే: తెలంగాణ స్టేట్ పోలీస్ డ్యూటీ మీట్ పోటీల్లో సౌత్/వెస్ట్ జోన్ మహిళా పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్ వెన్నమల్ల శ్రీనివాస్‌రావు ప్రతిభ కనబరిచారు. సైంటిఫిక్ ఇన్వెస్టిగేషన్ విభాగంలో మూడు బంగారు పతకాలు, ఒక వెండి పతకం సాధించారు. అతని ప్రతిభకు 'స్టార్ ఆఫ్ ఇయర్' అవార్డు సైతం పొందారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వాటిని అందజేసి అభినందించారు.

వీసీల నియామకాల్లో బీసీలకు అన్యాయం


మాట్లాడుతున్న జిల్లపల్లి అంజి

కాచిగూడ, న్యూస్‌టుడే: రాష్ట్రంలో విశ్వవిద్యాలయాల వీసీల నియామకాల్లో బీసీలకు అన్యాయం జరిగిందని బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జిల్లపల్లి అంజి విమర్శించారు. ఆదివారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 54 శాతం ఉన్న 120 బీసీ కులాలకు అన్ని రంగాల్లో అన్యాయం జరుగుతోందన్నారు. తొమ్మిది యూనివర్సిటీలకు వీసీలను నియమిస్తే అందులో కేవలం ముగ్గురు బీసీలకు మాత్రమే అవకాశం ఇచ్చారని పేర్కొన్నారు. రిజర్వేషన్లకు తూట్లు పొడుస్తున్న జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

వసుంధర

vasundhara@eenadu.in



మార్చేయక తప్పదు మరి...!

సౌకర్యమూ, శరీరాకృతి దెబ్బతినకుండా ఉండటమూ... ఇలా కారణం ఏదైనా బ్రాల వాడకం తప్పనిసరిగా మారింది. కొనేటప్పుడు నాణ్యమైనవి, సరైన సైజు చూసి తీసుకోవడం ఎలానూ తప్పదు. మరి వాడటం మొదలుపెట్టాక అది రూపుని కోల్పోయినా, మీరు లావైనా... ఏం చేస్తారు? బోలెడు డబ్బులు పెట్టి కొన్నాం కదా... . అలానే ధరిస్తున్నాం అంటారా? అవును నిజమే... దాదాపు డెబ్బైశాతం మంది మహిళలు ఒకసారి బ్రా కొన్నాక సుమారు 2-5సంవత్సరాల పాటు వినియోగిస్తున్నారని చెబుతోంది అమెరికాకు చెందిన హార్పర్‌వైల్డ్ అనే సంస్థ చేసిన అధ్యయనం. దీనివల్ల బ్రా స్ట్రాప్స్ సాగడం, కప్స్ ముందుకు రావడం వంటి అసౌకర్యాలెన్నో కలుగుతున్నా... వాటినే వినియోగిస్తున్నారట. అయితే, ఇలా చేయడం మంచిది కాదని హెచ్చరిస్తున్నారు నిపుణులు. దీనివల్ల బాడీ పోశ్చర్ మార్చడమే కాదు, తల, వెన్ను, భుజాల నొప్పులు ఇబ్బందిపెడతాయట. అలాకాకుండా ఉండాలంటే ఏడాదిన్నరలోపే వాటిని మార్చేయమని సూచిస్తున్నారు.

వాల్‌నట్స్‌తో రక్షణ గోడ!



గింజధాన్యాలతో చాలా లాభాలుంటాయని తెలుసుకదా! వాటిలో వాల్‌నట్స్ మహిళల ఆరోగ్యానికి మరింత మేలు చేస్తాయి. ఎలాగంటే... వీటిలో వృక్ష ఆధార ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు. అధిక మోతాదులో ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యానికి ఎంతో మేలు. బరువు నియంత్రణకూ సాయపడతాయి.

- క్యాన్సర్ నిరోధంలో వీటిది కీలక పాత్ర. ముఖ్యంగా రొమ్ము క్యాన్సర్ ముప్పును నిలువరిస్తాయి.
- వాల్‌నట్స్‌లోని ఆరోగ్యకరమైన కొవ్వులు, సూక్ష్మ పోషకాలు.. శరీరంలోని అతి పెద్ద అవయవమైన చర్మ ఆరోగ్యానికి సాయపడతాయి.
- ఆఫీసులో, ఇంటి దగ్గరా రెండు షిఫ్టుల్లో పనిచేసే మహిళలకు నిద్ర తక్కువ. దీనికి నిద్రలేమి సమస్య తోడైతే ప్రమాదం. నిద్ర సరిగ్గా పట్టనివాళ్లు వాల్‌నట్స్‌ను రాత్రి భోజనం తర్వాత స్నాక్స్‌గా తీసుకుంటే సులభంగా నిద్రలోకి జారుకుని, హాయిగా నిద్రపోతారు.
- జీర్ణ వ్యవస్థ సరిగ్గా పనిచేయకపోతే, ఆ ప్రభావం ఆరోగ్యంపైన పడుతుంది. ముఖ్యంగా మహిళల్లో ఇది సంతాన సాఫల్యతపైన ప్రభావం చూపుతుంది. వాల్‌నట్స్ జీర్ణవ్యవస్థకు తద్వారా ఆరోగ్యానికీ మేలు చేస్తాయి.

ఆడపిల్లకు చదువెందుకని ప్రశ్నించే రోజులవి. ఆమెను కూడా పదో తరగతి తర్వాత ఇంట్లో వాళ్లు చదువు మానేయమన్నారు. కానీ, పంతంతో భోజనం మానేసి మరీ అమ్మానాన్నలను చదువుకుంటానని ఒప్పించింది. అయినా, మంచి సంబంధమని ఇంటర్ చదువుతుండగానే ఆమెకు పెళ్లి చేశారు పెద్దవాళ్లు. అలాంటి పరిస్థితుల్లో తిరిగి చదువు కొనసాగించడమే కాదు, చదువుకున్న కళాశాలకే ప్రిన్సిపల్ అయ్యారామె. తాజాగా ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని డా.బీఆర్ అంబేడ్కర్ న్యాయకళాశాలలో ప్రిన్సిపల్‌గా బాధ్యతలు చేపట్టిన డా.కె. సీతామాణిక్యం స్ఫూర్తి కథనం ఆమె మాటల్లోనే...



సినిమా సెట్... నా రూటు మార్చింది!

ప్రతి పురుషుడి విజయం వెనుక ఒక స్త్రీ ఉంటుందంటారు. కానీ నా విజయం వెనుక మావారున్నారు. రావులపాలెం పక్కన ఊబలంక అనే చిన్న పల్లెటూరు మాది. అమ్మ బుల్లి వెంకాయమ్మ, నాన్న పేర్రెడ్డి. వారికి ఎనిమిది మంది సంతానం. నేను ఏడోదాన్ని. నా చిన్నప్పుడే రాజమండ్రిలో స్థిరపడ్డాం. అమ్మానాన్నలు నన్ను అల్లారుముద్దుగా పెంచారు. అయితే, అప్పట్లో అమ్మాయిల చదువుకు అంతగా ప్రాధాన్యం ఇచ్చేవారు కాదు. మంచి సంబంధమని 17 ఏళ్ల వయసులో విశాఖకు చెందిన తమ్మిరెడ్డితో నాకు వివాహం జరిపించారు. ఇంటర్ చదువుతుండగానే పెళ్లంటే... 'ఇక నేను ఇంటికి పరిమితమవ్వాల్సిందే' అనుకున్నా. కానీ పెళ్లిచూపుల్లో 'చదువుకుంటావా?' అని ఆయన అడగడంతో నా సంతోషానికి అవధుల్లేవు. అలా మావారి సహకారంతో ప్రైవేటుగా డిగ్రీ చదివా. ఇంటి పనులన్నీ పూర్తయ్యాక రాత్రి 10 గంటలకు పుస్తకం తీసేదాన్ని. మళ్లీ ఉదయాన్నే లేచి ఇంటి పనులు ప్రారంభించేదాన్ని. అలా ఎంఏ హిస్టరీ, బ్యాచిలర్ ఆఫ్ లా, ఎంఏ ఇంగ్లిష్ చేశా. తర్వాత ఆంధ్ర విశ్వవిద్యాలయంలో మాస్టర్ ఆఫ్ లా (ఎల్ఎల్ఎం) పూర్తిచేశా. 2006లో సైబర్ నేరాలపై ఒడిశాలోని బ్రహ్మాపుర విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పట్టానూ పొందా. 2014లో ఎల్ఎల్‌డీ (పోస్ట్ డాక్టోరల్ ఇన్ లా) పూర్తిచేశా. ఏపీ నుంచి ఆ డిగ్రీ పొందిన తొలివ్యక్తిని నేనే. నాటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి నుంచి ఎల్ఎల్‌డీ పట్టా అందుకోవడం నేనెప్పటికీ మర్చిపోలేను.

ఆ స్టూడియోలో చూసి...

నిజానికి మొదట్లో నాకు న్యాయవిద్యపై అంతగా అవగాహన లేదు. డిగ్రీ చదువుతున్న సమయంలో పద్మాలయా స్టూడియో సందర్శనకు వెళ్లాం. అక్కడ ఓ కోర్టు సన్నివేశానికి సంబంధించిన సెట్ వేశారు. మావారు నన్ను జడ్జి కుర్చీలో కూర్చోబెట్టి ఫొటో తీశారు. అది ఒక రకంగా నన్ను ఉత్సాహపరిచింది. అలా జడ్జి కావాలని న్యాయవిద్యలోకి ప్రవేశించా. అయితే, ఎల్ఎల్ఎం చదువుతున్న సమయంలో అప్పటి ప్రొఫెసర్ల బోధన తీరు నన్ను ఆకట్టుకుంది. దాంతో ప్రొఫెసర్‌గా మారితే ఎక్కువ మంది న్యాయమూర్తులను తీర్చిదిద్దగలనని భావించి బోధన వైపు అడుగులేశా. 2006లో ఏయూ న్యాయ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరిన నేను, తర్వాత అసోసియేట్ ప్రొఫెసర్‌గా, ప్రొఫెసర్‌గా, తాజాగా ప్రిన్సిపల్‌గానూ బాధ్యతలు చేపట్టా. బిజినెస్ ప్రాసెస్ అవుట్‌సోర్సింగ్ మాదిరిగా మా కాలేజీలో లీగల్ ప్రాసెస్ అవుట్‌సోర్సింగ్ (ఎల్‌పీవో) నిర్వహిస్తున్నాం. దాని ద్వారా విదేశాలకు న్యాయపరమైన సేవలు అందించొచ్చు. నేను ప్లేస్‌మెంట్ ఆఫీసర్‌గా ఉన్న సమయంలో న్యూయార్క్ ప్రధాన కేంద్రంగా పనిచేస్తున్న ఓ న్యాయసేవల కంపెనీలో 40 మంది విద్యార్థులకు ఉద్యోగాలొచ్చాయి. విద్యార్థులకు సాంకేతికతతో ముడిపడిన అంశాలనే పరిశోధనకు ఎంపిక చేసుకోవాలని సూచిస్తున్నా. సైబర్ నేరాలు పెరుగుతోన్న నేపథ్యంలో 'సెంటర్ ఫర్ సైబర్ లా' ఏర్పాటుచేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నా. దీనిద్వారా సైబర్ నేరాలపై అవగాహన పెంచడంతోపాటు డిప్లొమా కోర్సులు, కాన్ఫరెన్స్‌ల నిర్వహణ, వాటి ద్వారా చట్టాల్లో అవసరమైన సవరణలకు సలహాలు ఇవ్వొచ్చు. 2022లో ఆదర్శ విద్యా సరస్వతి రాష్ట్రీయ పురస్కారం (జాతీయ అవార్డు), 2023లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నా. ఇప్పటి వరకూ నా పరిశోధన పత్రాలు జాతీయ, అంతర్జాతీయ జర్నళ్లలో 120కు పైగా ప్రచురితమయ్యాయి. నాలుగు పరిశోధనా పత్రాలకు పేటెంట్లు దక్కడం ఆనందంగా ఉంది. ఎందరో గొప్ప జడ్జిలనూ, న్యాయవాదులనూ అందించిన ఈ కళాశాలను, జాతీయ న్యాయ విశ్వవిద్యాలయాల సరసన చేర్చాలన్నదే నా లక్ష్యం. ఇల్లు, పని ప్రదేశాల్లో ఎక్కడైనా సరే కొత్త బాధ్యతలు తీసుకోవడానికి మహిళలు సిద్ధంగా ఉండాలి. పని చేసుకుంటూ వెళ్తుంటే ఎన్నో పాఠాలు నేర్చుకోవచ్చు. నేపథ్యమేదైనా పట్టుదలతో అనుకున్నది సాధించుకోవచ్చు.

– కేతిరెడ్డి రాజ్యలక్ష్మి, విశాఖపట్నం

అందానికి యాలకులు!

మిఠాయిలకు సువాసనలిచ్చే యాలకులు నోటి ఇన్‌ఫెక్షన్లను దూరం చేస్తాయి. ఆహారం జీర్ణమయ్యేలా చేయడంతోపాటు ఎన్నో అనారోగ్య సమస్యలకూ చెక్ పెడతాయనీ తెలుసు. అందాన్నీ పెంచుతాయనీ తెలుసా?



స్పూను చొప్పున యాలకుల పొడి, పంచదార, తేనె తీసుకుని బాగా కలపాలి. దీన్ని ముఖానికి మృదువుగా రుద్ది, పదినిమిషాలయ్యాక గోరువెచ్చని నీటితో కడిగేస్తే సరి. ఈ స్క్రబ్ మృతకణాలను తొలగించడంతోపాటు చర్మానికి కావాల్సిన తేమనీ అందిస్తుంది. మాస్క్‌లా ప్రయత్నించాలంటే స్పూను యాలకుల పొడికి చిటికెడు పసుపు, కొన్ని చుక్కల నిమ్మరసం కలిపితే సరి. దీన్ని పావుగంటసేపు ముఖానికి రాసి, కడిగేయాలి. కప్పు రోజ్‌వాటర్‌కి స్పూను యాలకుల పొడి కలిపి, అరగంటసేపు నానబెట్టాలి. తరవాత వడకట్టి, స్ప్రే బాటిల్‌లో పోసుకోవాలి. దీన్ని ఫ్రిజ్‌లో ఉంచుకుంటే టోనర్‌లా పనిచేస్తుంది.

యాలకుల్లో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఫ్రీరాడికల్స్‌తో పోరాడి వృద్ధాప్యఛాయలు త్వరగా దరిచేరకుండా చూడటమే కాదు... అనేక చర్మసమస్యల నుంచీ కాపాడతాయి. రక్తప్రసరణ మెరుగయ్యేలా చూస్తూనే చర్మకణాలకు న్యూట్రియంట్లు, ఆక్సిజన్ సరఫరా మెరుగయ్యేలా చేస్తాయి. తద్వారా యవ్వనవంతమైన చర్మం సొంతమయ్యేలా చూస్తాయి. ఎన్ని సుగుణాలో కదా... అలాగని చకచకా పూయడం మొదలుపెట్టేయొద్దు. మిగతా ఉత్పత్తుల్లాగే దీన్నీ ముందు స్కిన్ టెస్ట్ చేసుకోండి. ఎర్రబడటం, దద్దుర్లు వంటివి లేకపోతే... చక్కగా కొనసాగించేయండి.

ప్రేయసి కోసం... నన్ను మోసగించాడు!

రెండేళ్లక్రితం ఓ అబ్బాయితో ప్రేమలో పడ్డా. పెళ్లి చేసుకోవాలనుకున్నాం. కానీ ఇప్పుడు అతను అంగీకరించడం లేదు. నాకు తెలిసిందేంటంటే అతనికి ఇంతకుముందే ప్రేయసి ఉందనీ, ఆమె అసూయ పడేలా చేయడానికే నాతో ప్రేమ నటించాడనీ. ఈ విషయం విని షాక్ అయ్యా. ఒక్కసారిగా తీవ్ర కుంగుబాటు, ఆందోళనలు ఎదుర్కొన్నా. బరువు కూడా బాగా తగ్గాను. మా అమ్మానాన్నలు పెళ్లి చేసుకోమని చెబుతున్నారు. నాకు ఇష్టం లేదు. ఈ పరిస్థితిని ఎలా ఎదుర్కోవాలి. - ఓ సోదరి.

డియర్ వసుంధర



డా. మండాది గౌరీదేవి
మానసిక నిపుణురాలు

యుక్త వయసులో అబ్బాయిలు, అమ్మాయిలు ఒకరికొకరు ఆకర్షణలకు లోనవడం సహజం. అయితే, దీనిలో భాగంగా ఎదుటివారిని మోసం చేయడం తప్పు. తన ప్రేయసి అసూయ చెందాలని మిమ్మల్ని ప్రేమించినట్లు నటించడం సరికాదు. దీన్నిబట్టి అతని మానసిక స్థితి ఏంటో అర్థమవుతోంది. స్థిరమైన ఆలోచనలూ లేవు. నమ్మదగిన వ్యక్తిగానూ కనిపించడం లేదు. ఇలాంటి వాళ్ల గురించి మీరు కుంగిపోయి భవిష్యత్తును పాడుచేసుకోవద్దు. ఒక రకంగా మీరు అదృష్టవంతులని భావించండి.

ఈ సంఘటనను బట్టి అతని వ్యక్తిత్వమేంటో మీకు తెలిసింది. అలాంటి వ్యక్తి మీ జీవితంలోకి రానందుకు సంతోషించండి. వస్తే మీరు ముందుముందు మరిన్ని బాధలు పడాల్సి వస్తుంది. అప్పుడు జీవితం ఇంకా అస్తవ్యస్తం అయ్యే ప్రమాదం ఉంది. ఈ అనుభవంతో జీవితంలోకి మరొకరిని ఆహ్వానించే ముందే జాగ్రత్తపడండి. ఏ మనిషినీ పూర్తిగా తెలుసుకోకుండా తొందరపడి ప్రేమ, పెళ్లికి అంగీకరించకండి. ఇక అమ్మానాన్నలు పెళ్లి చేసుకోమంటున్నారన్నారు. ముందు మీరు డిప్రెషన్‌లోంచి బయట పడాల్సి ఉంది. ఉద్యోగం చేసుకుంటూ మిమ్మల్ని మీరు బిజీగా ఉంచుకోండి. స్నేహితులతో మనసు విప్పి మాట్లాడండి. సాంత్వన కలుగుతుంది. పరిస్థితి చక్కబడింది అనుకుంటే పెళ్లి గురించి ఆలోచించొచ్చు. ఇంకో విషయం ఏంటంటే... తిరిగి అతనే మళ్లీ వచ్చి మనసు మార్చుకున్నా అని చెప్పినా కూడా మీరు నిలకడగా ఉండడం అవసరం. ఎందుకంటే, ఒకసారి మోసం చేసిన వాళ్లకు రెండోసారి మోసం చేయడం పెద్ద కష్టం కాదు కదా! ఆలోచించి నిర్ణయం తీసుకోండి.

మీకు నాక్టరియా ఉందా?


ఓటీటీలో కొత్త వెబ్ సిరీస్ వచ్చింది... ఈ రోజు చూసేయాలి అనుకుంటున్నారా... అయితే ఒక్కసారి న్యూరాలజీ అండ్ యూరోడైనమిక్స్ అనే జర్నల్ ప్రచురించిన ఈ పరిశోధన చదవండి. రోజుకి ఐదు గంటలకి మించి టీవీ లేదా ఫోన్‌కి అతుక్కుపోతే... మీకు నాక్టరియా వచ్చినట్టే. రాత్రిపూట తరచూ మూత్రానికి వెళ్లడాన్ని వైద్య పరిభాషలో ఇలా పిలుస్తారు. ఒక్క అమెరికాలోనే ఐదు కోట్లమందిలో ఈ లక్షణం ఉన్నట్లు అధ్యయనాల్లో తేలిందట. దీనివల్ల వీళ్లు నిద్రలేమితో బాధపడుతూ బీపీ, మధుమేహం, హృద్రోగాల బారినపడుతున్నారట. అయితే ఎక్కువసేపు టీవీ చూడ్డానికీ ఇలా నాక్టరియా బారిన పడ్డానికీ కారణం ఏమిటనేది కచ్చితంగా కనుగొనలేదు కానీ మేలుకుని ఉన్న సమయంలో తరచూ ఏవో స్నాక్స్ తింటూ నీళ్లు తాగడం వల్ల... అవన్నీ తరవాత విసర్జన ద్వారా వెళుతున్నాయని భావిస్తున్నారు. కాబట్టి జాగ్రత్త!



ఏంటి? సింహం, కోతి, నెమలి... అన్నీ గోడ ఎక్కాయి.. అనుకుంటున్నారా? మరి పక్షులు, జంతువులు మన జీవితంలో అంతలా మమేకమయ్యాయి. ప్రేమగా వీటిని పెంచుకోవడమే కాదు, ఇంటి అలంకరణలోనూ భాగం చేస్తున్నారు ఇప్పుడు. సృజనాత్మకతను అద్దుకుని ఇలా ముద్దొచ్చే జంతువులు, పక్షులు డిజైన్లలో వచ్చేస్తున్నాయి. అలాంటి వాటిలోవే ఈ 'వాల్ లైట్‌లు' కూడా. బెడ్‌రూమ్, హాల్, బాత్‌రూమ్... ఏ గోడకు అయినా వీటిని తగిలించేయొచ్చు. ఈ రంగురంగుల డిమ్ బల్బులు గది అందాన్నే మార్చేస్తాయి. ప్రశాంతమైన వాతావరణాన్ని ఇస్తాయి. నిద్రించే ముందు ట్యూబ్‌లైట్‌కు బదులుగా ఈ డిమ్ లైట్‌లు ఆన్ చేస్తే చాలు. పక్షులన్నీ ఆకాశంలో ఎగురుతున్నట్లుగా, జంతువులు మనతో ముచ్చటిస్తున్నట్లుగా అనిపిస్తుంది. మీరూ ప్రయత్నించండి.



కోతి, నెమలి... గోడెక్కేశాయి!




పెళ్లితో ఉద్యోగానికి దూరం!

'అన్నీ నచ్చాయి... కాకపోతే అమ్మాయి ఉద్యోగం మానేయాలి' పెళ్లిచూపుల్లో చాలామందికి ఎదురయ్యే క్లిష్టమైన అనుభవం ఇది. ఆమె ఒక నిర్ణయానికి రాకముందే... 'మంచి సంబంధం... ఉద్యోగానిదేముంది' ఓ ఉచిత సలహా వచ్చేస్తుంది. దానికి 'తందానా' పలికేవారే అంతా! అయిదే దీని పర్యవసానం ఏకంగా దేశ ఆర్థికవ్యవస్థమీద పడుతోందని చెబుతోంది ప్రపంచ బ్యాంకు. ఆ వివరాలేంటంటే...

కర్ణుడి చావుకి కారణాలు అనేకం అన్నట్టుగా.. మనదేశంలో మహిళలు ఉద్యోగాలు మానేయడానికి కూడా అనేక అంశాలు దోహదపడుతున్నాయని ప్రపంచ బ్యాంకు తాజా సర్వే చెబుతోంది. ఫలితంగా శ్రామికవర్గంలో వారి సంఖ్య తక్కువగా ఉంటోందని ఆందోళన వ్యక్తంచేసింది. దక్షిణాసియాలో 'మహిళలు, ఉపాధి, వృద్ధి' అంశంపైన ప్రపంచబ్యాంకు తాజాగా ఒక సర్వే చేపట్టింది. దీని ప్రకారం భారతీయ మహిళా ఉద్యోగుల్లో 12 శాతం పెళ్లి తర్వాత శ్రామిక వర్గం నుంచి దూరమవుతున్నారు. దీన్నే 'మ్యారేజీ పెనాల్టీ'గా చెబుతున్నారు. ఈ కారణంగా ఉద్యోగాలకు దూరమవుతున్నవాళ్లు మళ్లీ ఉపాధి బాట పట్టడానికి అయిదేళ్లు పడుతోందట. దీని వెనక ప్రధాన కారణం సామాజిక కట్టుబాట్లేనని తేల్చింది. పెళ్లి తర్వాత భర్త బాగోగులు చూసుకోవడానికనో, ఆడపిల్ల ఉద్యోగం చేసే సంప్రదాయం నచ్చదనో అత్తంటివారు చెప్పడంతో మహిళలు ఉద్యోగాలకు దూరమవుతున్నట్టు ఈ సర్వే చెబుతోంది. పెళ్లి తర్వాత ఉద్యోగంలో కొనసాగడంలో అమ్మాయిల చదువుదీ కీలకపాత్రని చెబుతోందీ సర్వే. భార్యాభర్తలిద్దరూ ఉన్నత విద్యావంతులైతే అమ్మాయి ఉద్యోగం మానేయడం తక్కువగా ఉంటోంది. డిగ్రీ ఆపైన అర్హత ఉన్నవారు, భర్తతో సమానమైన విద్యార్హత ఉన్నవాళ్లలో అధికశాతం పెళ్లి తర్వాతా ఉద్యోగాల్లో కొనసాగుతుండటం గమనార్హం.


ప్రపంచ కార్మిక సంస్థ విడుదల చేసిన ఇండియా ఎంప్లాయ్‌మెంట్ రిపోర్ట్-2024... అబ్బాయిలకంటే అమ్మాయిలు ఇంటి పనుల్లో ఆరు రెట్లు ఎక్కువ కష్టపడతారని తేల్చింది. కానీ శ్రామిక వర్గంలో మహిళా ఉద్యోగుల శాతం 32. పురుషుల శాతం(77)కంటే ఇది చాలా తక్కువ. ఈ కారణంగా మనం జనాభా సానుకూలత(డెమోగ్రాఫిక్ డివిడెండ్) ప్రయోజనాల్ని పూర్తిగా పొందలేకపోతున్నాం. పెళ్లి మాత్రమే కాదు, పిల్లల్ని పెంచడం కోసం మహిళలు ఉద్యోగాలకు దూరమవుతుంటారు. దీన్నే 'చిల్డ్రన్ పెనాల్టీ'గా చెబుతున్నారు. 'మూడు దశాబ్దాలుగా దక్షిణాసియా, ముఖ్యంగా భారత్ ఎంతో ఆర్థిక వృద్ధి సాధించింది... అయినప్పటికీ మహిళల్లో మూడింట ఒక వంతు మాత్రమే ఉద్యోగాల్లో చేరుతున్నారు. శ్రామికవర్గంలో పురుషులతో సమానంగా మహిళలూ ఉంటే ఈ ప్రాంత జీడీపీ దాదాపు 50 శాతం మేర పెరుగుతుంది' అని చెబుతారు ప్రపంచ బ్యాంకు దక్షిణాసియా విభాగం ముఖ్య ఆర్థికవేత్త ఫ్రాన్సికా ఆన్‌సర్జ్. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్‌ది కీలకపాత్రనీ, మహిళా ఉద్యోగులు పెరిగితే అది మరింత ఉన్నత స్థాయికి చేరుతుందని చెబుతారామె. సామాజిక, వ్యవస్థాగత కారణాల్ని గుర్తించి మహిళలపై వివక్షను రూపుమాపడంద్వారా వాళ్లు ఉద్యోగాల్లోకి వచ్చేలా చేయాలంటారు... 'నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లైడ్ ఎకనమిక్ రిసర్చ్' డైరెక్టర్ జనరల్ పూనమ్ గుప్త. అదే సమయంలో మహిళలకు పని ప్రదేశంలో భద్రత కల్పించాలనీ, ప్రోత్సహకాలూ ఉండాలనీ చెబుతారు పూనమ్.





విటమిన్ డి తగ్గితే...

పిల్లలకి ఆటల్లో దెబ్బలు తగలడం సహజమే. అయితే, కొన్నిసార్లు ప్రమాదవశాత్తు చేయో, కాలో కూడా విరుగుతూ ఉంటాయి. వీటిల్లో చాలావాటికి సర్జరీల అవసరమూ ఉండకపోవచ్చు. అయితే, ఆ చిన్నారికి డి విటమిన్ లోపం ఉంటే మాత్రం అది అతుక్కోవడానికి సమయం పట్టొచ్చుట. అమెరికన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ నేషనల్ చేసిన ఓ అధ్యయనం దీన్ని వెల్లడిస్తోంది. ఇందులో భాగంగా 186మంది గాయాలు పాలైన పిల్లల్ని పరీక్షించారట. ఆపై రేడియోగ్రాఫిక్ ఫలితాలతో పోల్చి చూడటం ద్వారా ఈ విషయాన్ని గుర్తించారు. దీంతో మరోసారి పిల్లల ఎదుగుదలలో, ఎముకల దృఢంగా మారడంలో డి విటమిన్‌ది కీలకపాత్ర అనే విషయం వెల్లడైంది. అందుకే, డి విటమిన్ ఎక్కువగా ఉండే పాలు, పాల ఉత్పత్తులు, చేపలు, తృణధాన్యాలను వారికిచ్చే ఆహారంలో తప్పక చేర్చాలి. ఇక, రోజూ కాసేపైనా కచ్చితంగా చిన్నారులు ఆరుబయట ఆడుకునేలా చూడండి. ముఖ్యంగా ఎండలో చర్మం చురుక్కు మనేవరకూ ఉండనివ్వాలి. అంటే సుమారు ఇరవై నిమిషాల నుంచి గంట వరకూ సమయం పట్టొచ్చు. అప్పుడే విటమిన్ డి శరీరానికి తగినంతగా అందుతుంది. ఎముకలు బలం పుంజుకునేలా చేస్తుంది.


యంగ్ 48 నాటౌట్
రచిన్ 39 నాటౌట్

ఛాంపియన్

అద్భుతాలేం లేవ్..

తొలి టెస్టులో భారత్ ఓటమి

- చిన్నస్వామిలో తప్పని పరాభవం
- 36 ఏళ్ల తర్వాత కివీస్ గెలుపు

2004 నవంబరు 5న ముంబయి టెస్టులో ఆస్ట్రేలియాకు భారత జట్టు 107 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. స్పిన్నర్ల స్వర్గధామంగా మారిన వాంఖడెలో అంత చిన్న లక్ష్యాన్ని ఛేదించలేక ఆసీస్ 93 పరుగులకే కుప్పకూలింది. అద్భుత విజయం టీమ్‌ఇండియా సొంతమైంది.

20 ఏళ్లు గడిచాయి. వేదిక బెంగళూరుకు మారింది. ప్రత్యర్థేమో న్యూజిలాండ్. లక్ష్యం కూడా 107 పరుగులే. భారత జట్టులో బుమ్రా, సిరాజ్ లాంటి మేటి పేసర్లు.. అశ్విన్, జడేజా, కుల్‌దీప్ లాంటి నాణ్యమైన స్పిన్నర్లు ఉండడంతో మళ్లీ అలాంటి అద్భుతం ఆవిష్కృతం అవుతుందేమో అని అభిమానుల్లో ఆశ!

కానీ ఆదివారం అద్భుతాలేమీ జరిగిపోలేదు. బుమ్రా ఆరంభంలో రెండు వికెట్లతో ఆశలు రేకెత్తించినా.. మిగతా బౌలర్లు అంచనాలకు తగ్గట్లు రాణించలేదు. పిచ్ కూడా పెద్దగా సహకరించలేదు. చివరి ఆశ అయిన వరుణుడూ ప్రతాపం చూపలేదు. దీంతో న్యూజిలాండ్ చేతిలో భారత్‌కు పరాభవం తప్పలేదు. 36 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత భారత గడ్డపై టెస్టు మ్యాచ్ గెలిచిన కివీస్.. సిరీస్‌లో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.


బుమ్రా, రోహిత్

3 భారత్‌లో ఆడిన 37 టెస్టుల్లో న్యూజిలాండ్‌కు ఇది మూడో విజయం మాత్రమే. గతంలో 1969 (నాగ్‌పుర్), 1988 (ముంబయి)లో గెలిచింది.

24 ఓ పర్యటక జట్టు భారత్‌లో వంద కన్నా ఎక్కువ లక్ష్యాన్ని విజయవంతంగా ఛేదించడం 24 ఏళ్ల తర్వాత ఇదే.

2005 భారత జట్టు చిన్నస్వామి స్టేడియంలో చివరగా టెస్టు మ్యాచ్ ఓడిపోయిన (పాకిస్థాన్‌పై) సంవత్సరం. ఆ తర్వాత ఎనిమిది టెస్టుల్లో (ప్రస్తుత మ్యాచ్‌కు ముందు వరకు) అయిదు గెలిచి, మూడింటిని డ్రాగా ముగించింది. ఇంతకుముందు ఈ స్టేడియంలో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ న్యూజిలాండ్ పరాజయంపాలైంది.

బెంగళూరు

న్యూజిలాండ్‌తో తొలి టెస్టు రెండో రోజు బ్యాటర్ల ఘోర వైఫల్యానికి భారత్ మూల్యం చెల్లించుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో పేలవ ప్రదర్శన తర్వాత ఇన్నింగ్స్‌లో ఎంత మెరుగ్గా ఆడినప్పటికీ రోహిత్‌సేనకు ఓటమి తప్పలేదు. చివరి రోజు, ఆదివారం 107 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని 2 వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదించిన కివీస్.. 1988 తర్వాత భారత్‌లో ఓ టెస్టు మ్యాచ్ గెలిచింది. ఉదయం జస్‌ప్రీత్ బుమ్రా (2/29) రెండు వికెట్లతో ఆశలు రేకెత్తించినా.. విల్ యంగ్ (48 నాటౌట్; 76 బంతుల్లో 7×4, 1×6), రచిన్ రవీంద్ర (39 నాటౌట్; 46 బంతుల్లో 6×4) నిలకడగా ఆడి కివీస్‌ను గెలిపించారు. తొలి రోజు వర్షార్పణమయ్యాక రెండో రోజు తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 46 పరుగులకే కుప్పకూలగా.. బదులుగా కివీస్ 402 పరుగులు చేసింది. రెండో ఇన్నింగ్స్‌లో పోరాడిన రోహిత్‌సేన 462 పరుగులు సాధించింది. మూడు టెస్టుల సిరీస్‌లో తర్వాతి మ్యాచ్ పుణెలో గురువారం మొదలవుతుంది.

రెండో బంతికే వికెట్: బౌలర్లు విజృంభించి కివీస్‌ను త్వరగా ఆలౌట్ చేసి జట్టును గెలిపిస్తారా.. లేక వరుణుడు కాపాడతాడా అన్న ఆశల మధ్య చివరి రోజు ఆటను చూసిన అభిమానులకు రెండు రకాలుగా నిరాశ తప్పలేదు. చిన్నస్వామి స్టేడియం పిచ్ ఎప్పట్లా స్పిన్నర్లకు సహకరించి ఉంటే అశ్విన్, జడేజా, కుల్‌దీప్ త్రయం అద్భుతాలు చేసేదేమో కానీ.. ఈ వికెట్‌పై పేసర్లే కొంత ప్రభావం చూపించారు. బ్యాటింగ్ అంత కష్టంగా కూడా కనిపించలేదు. బంగ్లాతో సిరీస్‌లో మాదిరే భారత్ మూడో పేసర్‌ను ఎంచుకుంటే బావుండేదేమో అన్నట్లుగా కనిపించాయి పరిస్థితులు. బుమ్రా ఒక్కడే ఆదివారం ప్రభావవంతంగా బౌలింగ్ చేశాడు. అతను తన రెండో బంతికే లేథమ్ (0)ను వికెట్ల ముందు దొరకబుచ్చుకోవడంతో ఒక్కసారిగా జట్టులో, అభిమానుల్లో ఆశలు రేకెత్తాయి. మరో ఓపెనర్ కాన్వే (17)ను కూడా అతను ఇబ్బంది పెట్టాడు. తడబడుతూ సాగిన కాన్వే కూడా బుమ్రా బౌలింగ్‌లోనే ఎల్బీగా ఔటవడంతో కివీస్ 29/2తో నిలిచింది. అయితే విల్ యంగ్ ఆరంభం నుంచి భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్నాడు. మరో ఎండ్‌లో తొలి ఇన్నింగ్స్ సెంచరీ హీరో రచిన్ రవీంద్ర నిలకడగా ఆడాడు. స్పిన్నర్లు పెద్దగా ప్రభావం చూపకపోవడంతో వీరు సులువుగా బౌండరీలు కొడుతూ పరుగులు రాబట్టారు. లక్ష్యం కరుగుతూ వెళ్లడంతో భారత అభిమానులు నెమ్మదిగా స్టేడియం నుంచి వెళ్లిపోయారు. లంచ్ విరామం లోపే మ్యాచ్ ముగిసిపోయింది.

ఒక మ్యాచ్ లేదా ఒక సిరీస్ ఆధారంగా మా తీరును మార్చుకోం. ఇక ముందు ఆటలో దూకుడు కొనసాగుతుంది. మా జట్టు ఎలాంటిదన్నది ఒక్క మూడు గంటల ఆట నిర్ణయించదు. ఆ మూడు గంటల ఆటను దృష్టిలో ఉంచుకుని ఆటగాళ్లను అంచనా వేయడం, వారి గురించి భిన్నంగా మాట్లాడడం న్యాయం కాదు. ఆటలో మేం చిన్న తప్పులు చేశాం. ఫలితాన్ని అనుభవిస్తున్నాం. కానీ దానర్థం అప్పుడే అంతా అయిపోయిందని కాదు. సర్ఫరాజ్ లాంటి ఆటగాళ్లు అవకాశం కోసం ఎదురు చూస్తుండడం జట్టుకు మంచిది. ఆటలో అతడు ఎంతో పరిణతిని ప్రదర్శించాడు – రోహిత్ శర్మ

భారత జట్టులో సుందర్


సుందర్

న్యూజిలాండ్‌తో మిగతా రెండు టెస్టుల కోసం ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్‌ను భారత జట్టులోకి తీసుకున్నారు. రెండో టెస్టు నేపథ్యంలో సుందర్ పుణెలో జట్టుతో చేరతాడని బీసీసీఐ తెలిపింది. సుందర్ ఇప్పటివరకు నాలుగు టెస్టులు, 22 వన్డేలు, 52 టీ20 మ్యాచ్‌లు ఆడాడు.

భారత్ తొలి ఇన్నింగ్స్: 46; న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్: 402; భారత్ రెండో ఇన్నింగ్స్: 462; న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్: లేథమ్ ఎల్బీ (బి) బుమ్రా 0; కాన్వే ఎల్బీ (బి) బుమ్రా 17; యంగ్ నాటౌట్ 48; రచిన్ నాటౌట్ 39; ఎక్స్‌ట్రాలు 6 మొత్తం: (27.4 ఓవర్లలో 2 వికెట్లకు) **110**; వికెట్ల పతనం: 1-0, 2-35; బౌలింగ్: బుమ్రా 8-1-29-2; సిరాజ్ 7-3-16-0; జడేజా 7.4-1-28-0; కుల్‌దీప్ 3-0-26-0; అశ్విన్ 2-0-6-0

రాహుల్ ఎందుకలా..?


రాహుల్

బెంగళూరు: న్యూజిలాండ్‌తో తొలి టెస్టు ముగిశాక ఆటగాళ్లంతా పెవిలియన్ చేరుతుంటే.. వాళ్లతో పాటు నడుస్తున్న భారత మిడిలార్డర్ బ్యాటర్ కేఎల్ రాహుల్ వెనక్కి వచ్చి పిచ్‌ను మొక్కి వెళ్లాడు. సొంత మైదానం చిన్నస్వామి స్టేడియంలో అతడిలా చేయడం చర్చనీయాంశమైంది. టెస్టుల నుంచి వీడ్కోలు పలకబోతున్నాడా అన్న ఊహాగానాలకు ఈ చర్య తావిచ్చింది. ఈ మ్యాచ్‌లో రాహుల్ పేలవ ప్రదర్శన చేశాడు. తొలి ఇన్నింగ్స్‌లో డకౌటైన అతను.. రెండో ఇన్నింగ్స్‌లో 12 పరుగులే చేశాడు. అతను యథాలాపంగానే పిచ్‌కు మొక్కి ఉండొచ్చు గానీ.. సర్ఫరాజ్, శుభ్‌మన్ గిల్ ఫామ్‌లో ఉన్న నేపథ్యంలో రాహుల్ భవితవ్యంపై చర్చ జోరందుకుంది.

జ్యోతికి నిరాశ

ఆర్చరీ ప్రపంచకప్ ఫైనల్


జ్యోతి సురేఖ

ట్లస్‌కాలా (మెక్సికో): ప్రతిష్ఠాత్మక ఆర్చరీ ప్రపంచకప్ ఫైనల్ పోటీల్లో భారత స్టార్ కాంపౌండ్ ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖకు నిరాశ ఎదురైంది. మహిళల వ్యక్తిగత విభాగంలో ఆమె తొలి రౌండ్లోనే నిష్క్రమించింది. ఆదివారం క్వార్టర్స్‌లో రెండో సీడ్ జ్యోతి 145-147 తేడాతో అయిదో సీడ్ మరీట (ఈస్టోనియా) చేతిలో ఓడింది. మరోవైపు పురుషుల కాంపౌండ్ విభాగంలో ప్రథమేశ్ త్రుటిలో పతకం కోల్పోయాడు. కాంస్య పతక పోరులో ఏడో సీడ్ ప్రథమేశ్ 146-150తో మైక్ షులోసర్ (నెదర్లాండ్స్) చేతిలో పరాజయం పాలయ్యాడు.

జైపుర్, గుజరాత్ విజయం


జైపుర్, బెంగాల్ మ్యాచ్‌లో..

హైదరాబాద్, ఈనాడు: ప్రో కబడ్డీ లీగ్‌లో ఆదివారం జైపుర్ పింక్ పాంథర్స్, గుజరాత్ జెయింట్స్ విజయాలు నమోదు చేశాయి. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో మొదట జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ 36-32 తేడాతో బెంగళూరు బుల్స్‌పై విజయం సాధించింది. రైడర్ పర్తీక్ దహియా 8 పాయింట్లతో గుజరాత్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఆ జట్టులో గుమన్ (6), సోంబిర్ (6) కూడా రాణించారు. బెంగళూరును గెలిపించడానికి ప్రదీప్ నర్వాల్ (9 పాయింట్లు) గట్టి ప్రయత్నం చేశాడు. ఆదివారం మరో మ్యాచ్‌లో జైపుర్ 39-34తో బెంగాల్ వారియర్స్‌పై విజయం సాధించింది. అర్జున్ 15 పాయింట్లతో బెంగళూరును గెలిపించాడు. బెంగాల్ జట్టులో నితిన్ (13) టాప్‌స్కోరర్.

‘లక్ష్య’ అథ్లెట్లకు 35 పతకాలు

సౌత్‌జోన్ ఛాంపియన్‌షిప్


రోషన్


తేజేశ్వర రెడ్డి



దత్తు

ఈనాడు, హైదరాబాద్: సౌత్‌జోన్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో ఈనాడు సీఎస్ఆర్ కార్యక్రమం ‘లక్ష్య’ అథ్లెట్లు అదరగొట్టారు. గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ‘లక్ష్య’ క్రీడాకారులు 35 పతకాలతో సత్తాచాటారు. అందులో 10 స్వర్ణాలు, 10 రజతాలు, 15 కాంస్య పతకాలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ నుంచి 8 స్వర్ణాలు, 6 రజతాలు, 15 కాంస్యాలు. . తెలంగాణ తరపున 2 స్వర్ణాలు, 4 రజతాలు అథ్లెట్లు సొంతం చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ అథ్లెట్ షేక్ రోషన్ రెండు స్వర్ణాలతో మెరిశాడు. అండర్-20 బాలుర 100 మీటర్లు, 110 మీటర్ల హర్డిల్స్‌లో అగ్రస్థానం సాధించాడు. ‘లక్ష్య’ క్రీడాకారుల మిగతా ఫలితాలివీ..

- **అండర్–16:** మహ్మద్ ఆసియా (స్వర్ణం- షాట్‌పుట్), తరుణ్ తేజ (స్వర్ణం- 80 మీ హర్డిల్స్), ప్రణీత్‌కుమార్ (స్వర్ణం- షాట్‌పుట్), ధనుష్ (రజతం- ట్రయథ్లాన్), తేజేశ్వర రెడ్డి (రజతం- హైజంప్), నక్షత్ర (రజతం- ట్రయథ్లాన్), మస్తాన్ (రజతం- 600 మీ, రజతం- మెడ్లే రిలే), సాయికుమార్ (కాంస్యం- 60 మీ), ప్రవల్లిక రెడ్డి (కాంస్యం- మెడ్లే రిలే), శంకర్ నాయక్ (కాంస్యం- మెడ్లే రిలే), యశ్వంత్ రాజు (కాంస్యం- లాంగ్‌జంప్), సాయి (కాంస్యం- మెడ్లే రిలే), శ్రీలత రెడ్డి (కాంస్యం- మెడ్లే రిలే), గోకుల్ (కాంస్యం- జావెలిన్), తిరుకుమార్ (కాంస్యం- 600 మీ),
- **అండర్–18:** హమీద్ (రజతం- మెడ్లే రిలే), రంజిత్‌కుమార్ (రజతం- మెడ్లే రిలే), శేషు (స్వర్ణం- 200 మీ, రజతం- మెడ్లే రిలే, కాంస్యం- 100 మీ), బి.హరీశ్ (రజతం- 5000 మీ రేస్ వాక్), మల్లికార్జున్ (స్వర్ణం- 5000 మీ రేస్ వాక్), శ్రీతేజ (స్వర్ణం- హెప్టాథ్లాన్), గణేశ్ (రజతం- 100 మీ), దత్తు (స్వర్ణం- హెప్టాథ్లాన్),
- **అండర్–20:** ఎం.హరీశ్ (స్వర్ణం- 3000 మీ, కాంస్యం- 5000 మీ రేస్ వాక్), భారతి (కాంస్యం- 4×400 మీ రిలే), మహాలక్ష్మి (కాంస్యం- 4×400 మీ రిలే), షేక్ బషీర్ (కాంస్యం- 4×400 మీ రిలే), వెంకట్ (కాంస్యం- 3000 మీ), మణికంఠ (కాంస్యం- 800 మీ)



వారెవా.. కివీస్!

న్యూజిలాండ్ అమ్మాయిలు చరిత్ర సృష్టించారు. పురుషుల జట్టుకు సాధ్యం కాని ఘనతను దక్కించుకున్నారు. దేశానికి మొట్టమొదటి టీ20 ప్రపంచకప్‌ను అందించారు. ఒకే రోజు ఇటు లేథమ్ సేన టీమ్‌ఇండియాపై చారిత్రక టెస్టు విజయంతో.. అటు డివైన్ బృందం టీ20 ప్రపంచకప్‌తో న్యూజిలాండ్ అభిమానులకు డబుల్ ధమాకా అందించాయి!

తుదిపోరులో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో రాణించి.. ఒత్తిడిని అధిగమించి.. దక్షిణాఫ్రికాను చిత్తుచేసిన కివీస్ అమ్మాయిలు.. టీ20 విశ్వవిజేతగా నిలిచారు!

దక్షిణాఫ్రికాకు మళ్లీ కన్నీళ్లే. పురుషుల, మహిళల క్రికెట్లో ఇప్పటివరకూ ప్రపంచకప్‌ను లెవని ఆ దేశాన్ని దురదృష్టం వెంటాడుతూనే ఉంది. ఈ ఏడాదే టీ20 ప్రపంచకప్ ఫైనల్లో భారత్ చేతిలో ఆ దేశ పురుషుల జట్టు ఓడగా.. ఇప్పుడు అమ్మాయిలు వరుసగా రెండో పొట్టి కప్‌లోనూ తుదిపోరులో చిత్తయ్యారు.

చివరి బంతి కాగానే కివీస్ మహిళలు సంతోషంతో కన్నీళ్లు పెట్టుకోగా.. దక్షిణాఫ్రికా అమ్మాయిలు బాధతో దుఃఖంలో మునిగిపోయారు.

కివీస్ కొప్పులో కప్పు

టీ20 విశ్వ విజేతలుగా న్యూజిలాండ్ అమ్మాయిలు

- తొలిసారి టైటిల్ సొంతం
- ఫైనల్లో దక్షిణాఫ్రికా చిత్తు
- అదరగొట్టిన అమేలియా, బ్రూక్

దుబాయ్

న్యూజిలాండ్ సాధించింది. సఫారీ సవాలును కాచుకుని తొలిసారి పొట్టి కప్ పట్టేసింది. ఆదివారం మహిళల టీ20 ప్రపంచకప్ ఫైనల్లో కివీస్ 32 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాపై గెలిచింది. మొదట న్యూజిలాండ్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 158 పరుగులు చేసింది. అమేలియా కెర్ (43; 38 బంతుల్లో 4×4), బ్రూక్ హాలీడే (38; 28 బంతుల్లో 3×4), సుజీ బేట్స్ (32; 31 బంతుల్లో 3×4) రాణించారు. సఫారీ బౌలర్లలో ఎంలబా (2/31) ఆకట్టుకుంది. అమేలియా (3/24)ధాటికి ఛేదనలో దక్షిణాఫ్రికా 9 వికెట్లకు 126 పరుగులే చేయగలిగింది. ఆ జట్టులో లారా వోల్వార్ట్ (33; 27 బంతుల్లో 5×4) టాప్‌స్కోరర్. రోజ్‌మేరీ (3/25) సత్తాచాటింది. అమేలియా కెర్ ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్, ప్లేయర్ ఆఫ్ ద టోర్నీగా ఎంపికైంది.

ఒత్తిడికి చిత్తు: ఈ ప్రపంచకప్‌లో బ్యాటింగ్‌లో ఉత్తమ ప్రదర్శనతో సాగిన దక్షిణాఫ్రికా ఫైనల్లోనూ ఛేదనను గొప్పగా మొదలెట్టింది. సఫారీ కెప్టెన్ వోల్వార్ట్ బౌండరీలతో చెలరేగింది. 6 ఓవర్లకు 47/0తో నిలిచిన ఆ జట్టు విజయం దిశగా బలమైన పునాది వేసుకున్నట్లే కనిపించింది. కానీ ఆ జట్టు ఆశలు కూలిపోవడానికి, కివీస్ సంబరాల్లో తేలిపోవడానికి ఎక్కువ సమయం పట్టలేదు. తజ్మిన్ (17)ను జోనాస్ (1/28) ఔట్ చేసి 51 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యానికి తెరదించింది. అక్కడి నుంచి ఒత్తిడికి చిత్తయి బ్యాటర్లు వికెట్లు సమర్పించుకున్నారు. అమేలియా ఒకే ఓవర్లో వోల్వార్ట్, బాష్ (9)ను ఔట్ చేసి సఫారీని గట్టిదెబ్బ కొట్టింది. స్లో డెలివరీలతో సఫారీ బ్యాటర్లను కివీస్ బౌలర్లు బుట్టలో వేసుకున్నారు. వరుస బంతుల్లో మరిజేన్ (8)ను కార్సన్, డిక్లెర్క్ (6)ను రోజ్‌మేరీ ఔట్ చేయడంతో దక్షిణాఫ్రికా పనైపోయింది. 14 ఓవర్లలో 86/5తో నిలిచిన ఆ జట్టు.. విజయానికి 36 బంతుల్లో 73 పరుగులు చేయాల్సి రావడంతో ఓటమి ఖాయమైంది. ఆ తర్వాత అంతా లాంఛనమే.

చివర్లో చితక్కొట్టారు: 85/3.. 13 ఓవర్లకు న్యూజిలాండ్ స్కోరిది. ఆ జట్టు 130 చేసినా గొప్పే అనిపించింది! కానీ ఆఖరి 7 ఓవర్లలో 73 పరుగులు రాబట్టిన కివీస్ 160కి చేరువగా వెళ్లింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆ జట్టు ఇన్నింగ్స్‌ను మెరుగ్గా మొదలెట్టి.. ఘనంగా ముగించింది. ప్లిమర్ (9) త్వరగానే ఔటైనా 43/1తో పవర్‌ప్లేను న్యూజిలాండ్ ఉత్తమంగానే ముగించింది. కానీ ఆ తర్వాత కివీస్ ఇన్నింగ్స్ నత్తనడకను తలపించింది. ట్రియాన్ (1/22), ఎంలబా, లుజ్ స్పిన్‌తో కట్టడి చేశారు. పేసర్లు మరిజేన్, డిక్లెర్క్ (1/17) స్లో డెలివరీలతో బ్యాటర్లను పరీక్షించారు. క్రీజులో కుదురుకున్న బేట్స్ ఔటైపోవడం, కెప్టెన్ డివైన్ (6) నిలబడకపోవడంతో 11 ఓవర్లకు 74/3తో కివీస్ కష్టాల్లో పడింది. మరో ఎండ్‌లో నిలబడ్డ అమేలియా తొలి 22 బంతుల్లో 19 పరుగులే చేసింది. ఓ దశలో 48 బంతుల పాటు ఒక్క బౌండరీ కూడా రాలేదు. అప్పుడే బ్రూక్ గేరు మార్చింది. లుజ్ బౌలింగ్‌లో వరుస ఫోర్లతో ఇన్నింగ్స్‌కు వేగాన్ని అందించింది. అమేలియా కూడా జోరు పెంచడంతో స్కోరుబోర్డు దూసుకెళ్లింది. వరుస ఓవర్లలో బ్రూక్, అమేలియా ఔటైనా.. ఆఖరి ఓవర్లో గ్రీన్ (12 నాటౌట్) సిక్సర్‌తో ఇన్నింగ్స్‌కు మెరుపు ముగింపు దక్కింది. చివరి రెండు ఓవర్లలో కివీస్ 27 పరుగులు పిండుకుంది.


అమేలియా కెర్ 43

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: సుజీ బేట్స్ (బి) ఎంలబా 32; ప్లిమర్ (సి) లుజ్ (బి) ఖకా 9; అమేలియా కెర్ (సి) ట్రిట్స్ (బి) ఎంలబా 43; డివైన్ ఎల్బీ (బి) డిక్లెర్క్ 6; బ్రూక్ హాలీడే (సి) బాష్ (బి) ట్రియాన్ 38; మ్యాడీ గ్రీన్ నాటౌట్ 12; ఇసబెల్లా నాటౌట్ 3; ఎక్స్‌ట్రాలు 15; మొత్తం: (20 ఓవర్లలో 5 వికెట్లకు) **158**; వికెట్ల పతనం: 1-16, 2-53, 3-70, 4-127, 5-141; బౌలింగ్: మరిజేన్ కాప్ 4-0-25-0; అయబోంగా ఖకా 4-0-44-1; ట్రయాన్ 4-0-22-1; ఎంలాబా 4-0-31-2; డిక్లెర్క్ 2-0-17-1; సున్ లుజ్ 2-0-17-0

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: వోల్వార్ట్ (సి) బేట్స్ (బి) అమేలియా 33; తజ్మిన్ (సి) గ్రీన్ (బి) జోనాస్ 17; బాష్ (సి) గేజ్ (బి) అమేలియా 9; మరిజేన్ (సి) ప్లిమర్ (బి) కార్సన్ 8; డిక్లెర్క్ (సి) అమేలియా (బి) రోజ్‌మేరీ 6; ట్రయాన్ (సి) గ్రీన్ (బి) రోజ్‌మేరీ 14; లుజ్ (సి) బేట్స్ (బి) బ్రూక్ 8; డెర్క్‌సన్ (సి) బేట్స్ (బి) అమేలియా 10; సినాలో (బి) రోజ్‌మేరీ 6; ఎంలబా నాటౌట్ 4; ఖకా నాటౌట్ 4; ఎక్స్‌ట్రాలు 7; మొత్తం: (20 ఓవర్లలో 9 వికెట్లకు) **126**; వికెట్ల పతనం: 1-51, 2-59, 3-64, 4-77, 5-77, 6-97, 7-111, 8-117, 9-120; బౌలింగ్: రోజ్‌మేరీ 4-0-25-3; కార్సన్ 4-0-22-1; జోనాస్ 4-0-28-1; లియా తహుహు 3-0-21-0; అమేలియా కెర్ 4-0-24-3; బ్రూక్ హాలీడే 1-0-4-1

1 పురుషులు, మహిళల క్రికెట్ రెండింట్లోనూ న్యూజిలాండ్ నెగ్గిన తొలి టీ20 ప్రపంచకప్ ఇదే. మహిళల జట్టు 2009, 2010లో రన్నరప్‌గా నిలిచింది. పురుషుల జట్టు 2021 ఫైనల్లో ఓడింది. వన్డే ప్రపంచకప్‌లో అమ్మాయిల జట్టు 2000లో విజేతగా నిలవగా.. పురుషుల జట్టు ఏదీ గెలవలేదు.

2 మహిళల టీ20 ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికా వరుసగా ఓడిన ఫైనల్స్. 2023లో ఆ జట్టు తుదిపోరులో ఆస్ట్రేలియాకు తలవంచింది.

ఉత్తరాఖండ్‌కు ఆధిక్యం

డెహ్రాడూన్: హైదరాబాద్‌తో జరుగుతున్న రంజీ ట్రోఫీ గ్రూపు-బి మ్యాచ్‌లో ఉత్తరాఖండ్‌కు ఆధిక్యం లభించింది. ఓవర్‌నైట్ స్కోరు 244/5తో ఆదివారం ఉదయం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన హైదరాబాద్ 97 ఓవర్లలో 292 పరుగులకు ఆలౌటైంది. రాహుల్ రాదేశ్ (94)కు సెంచరీ చేజారింది. 33 పరుగుల ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఉత్తరాఖండ్ మూడో రోజు ఆట ముగిసే సమయానికి 61 ఓవర్లలో 5 వికెట్లకు 189 పరుగులు సాధించింది. కెప్టెన్ రవికుమార్ సమర్థ్ (57), కునాల్ చండీలా (57 బ్యాటింగ్) అర్ధ సెంచరీలతో రాణించారు. హైదరాబాద్ బౌలర్లలో రోహిత్ రాయుడు (2/20), సి.వి.మిలింద్ (1/29), కార్తికేయ (1/24), అనికేత్‌రెడ్డి (1/56) సఫలమయ్యారు. సోమవారం మ్యాచ్‌కు చివరి రోజు కాగా.. మొత్తంగా ఉత్తరాఖండ్ ఆధిక్యం 222 పరుగులకు చేరుకుంది. అహ్మదాబాద్‌లో గుజరాత్‌తో జరుగుతున్న మరో గ్రూపు-బి మ్యాచ్‌లో ఆంధ్ర ఫాలోఆన్‌లో చిక్కుకుంది. ఓవర్‌నైట్ స్కోరు 137/5తో మూడో రోజు ఉదయం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆంధ్ర 213 పరుగులకు ఆలౌటైంది. శ్రీకర్ భరత్ (98) త్రుటిలో శతకం చేజార్చుకున్నాడు. గుజరాత్‌కు 154 పరుగుల ఆధిక్యం సమర్పించుకుని ఫాలోఆన్ ఆడిన ఆంధ్ర.. ఆదివారం ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 66 ఓవర్లలో 4 వికెట్లకు 203 పరుగులు సాధించింది. అభిషేక్‌రెడ్డి (81), మహీప్ (55) రాణించారు.

ఎదురులేని భారత్

జొహోర్ బహ్రు (మలేసియా): సుల్తాన్ ఆఫ్ జొహోర్ కప్ హాకీ టోర్నమెంట్లో భారత్ అదిరే ప్రదర్శన చేస్తోంది. ఆదివారం 6-4తో బ్రిటన్‌ను ఓడించి వరుసగా రెండో విజయాన్ని సొంతం చేసుకుంది. అయితే ఈ మ్యాచ్‌లో ఆరంభం బ్రిటన్‌దే. 2వ నిమిషంలో రోరీ పెన్‌రోజ్ చేసిన గోల్‌తో ఆ జట్టు ఆధిక్యంలోకి వెళ్లింది. కానీ భారత్ బలంగా పుంజుకుంది. మహ్మద్ దాద్ (7వ ని) సఫలం కావడంతో స్కోరు సమం చేసింది. ఆ తర్వాత భారత్ దూకుడు పెంచింది. దిల్‌రాజ్ (17వ, 50వ), శార్దానంద్ (20వ, 50వ), మన్‌మీత్ సింగ్ (26వ) గోల్స్‌తో విజయపథంలో నడిచింది. ఆఖర్లో బ్రిటన్ ఆటగాడు రాయ్‌డెన్ (46వ, 59వ) రెండుసార్లు భారత గోల్‌కీపర్‌ను బోల్తా కొట్టించాడు. తొలి మ్యాచ్‌లో భారత్ 4-2తో జపాన్‌ను ఓడించింది.

నాదల్.. జకో చేతిలోనూ


జకోవిచ్, నాదల్

రియాద్: డేవిస్‌కప్‌తో టెన్నిస్‌కు వీడ్కోలు చెబుతానని ప్రకటించిన స్పెయిన్ దిగ్గజం రఫెల్ నాదల్.. దాని కంటే ముందు ఆడిన రెండు మ్యాచ్‌ల్లో ఓడిపోయాడు. సిక్స్ కింగ్స్ స్లామ్ ఎగ్జిబిషన్ టోర్నీలో మూడో స్థానం కోసం జరిగిన పోరులో నాదల్ 2-6, 6-7 (5-7)తో సెర్బియా దిగ్గజం నొవాక్ జకోవిచ్ చేతిలో ఓడాడు. అంతకుముందు సెమీస్‌లో నాదల్ సహచర స్పెయిన్ ఆటగాడు కార్లోస్ అల్కరాస్ చేతిలో ఓడాడు. పారిస్ ఒలింపిక్స్ తర్వాత రఫా బరిలో దిగిన తొలి టోర్నీ ఇదే. మరోవైపు సిక్స్ కింగ్స్ స్లామ్ ఎగ్జిబిషన్ టోర్నీలో యానిక్ సినర్ (ఇటలీ) టైటిల్ గెలిచాడు. ఫైనల్లో అతడు 6-7 (5-7), 6-3, 6-3తో అల్కరాస్‌పై విజయం సాధించాడు.

తొలి వన్డేలో విండీస్‌పై శ్రీలంక విజయం

పల్లెకెలె: వెస్టిండీస్‌తో మూడు వన్డేల సిరీస్‌లో శ్రీలంక శుభారంభం చేసింది. ఆదివారం జరిగిన తొలి మ్యాచ్‌లో డక్‌వర్త్ లూయిస్ విధానంలో 5 వికెట్ల తేడాతో గెలిచింది. మొదట వెస్టిండీస్ 38.3 ఓవర్లలో 185/4తో ఉన్నప్పుడు వర్షం మొదలైంది. చాలా సమయం వృథా కావడంతో ఆ జట్టు ఇన్నింగ్స్ అక్కడే ముగిసింది. లంక లక్ష్యాన్ని 37 ఓవర్లలో 232 పరుగులకు సవరించారు. అసలంక (77), మదుష్క (69) మెరవడంతో లంక 31.5 ఓవర్లలో లక్ష్యాన్ని 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. అంతకుముందు విండీస్ ఇన్నింగ్స్‌లో షెఫానీ రూథర్‌ఫర్డ్ (74 నాటౌట్), కార్టీ (37) రాణించారు.

శిక్షణ పొందితేనే 'సహకారం'

- సంఘాల్లో అవినీతి అడ్డుకట్టకు సర్కారు కసరత్తు
- పాలకవర్గాలు, కార్యదర్శులు, ఉద్యోగులకు త్వరలో శిబిరాలు



ఈనాడు, హైదరాబాద్: "తమ వ్యవస్థలను ఎలా నిర్వహించాలో తెలియని ఉద్యోగుల కారణంగానే సహకార సంఘాలు, డీసీసీబీలు సరిగా నడవడం లేదు. కార్యదర్శులకు సరిగా లెక్కలు రాయడమే తెలియడంలేదు. వారు ఎలా విధులు నిర్వర్తిస్తున్నారు? రాష్ట్ర ప్రభుత్వం రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేపట్టినప్పుడు అనేక సంఘాల్లో అక్రమాలు వెల్లడయ్యాయి" అంటూ సహకార సమాఖ్యపై ఇటీవల సమీక్ష నిర్వహించినప్పుడు రాష్ట్ర సహకార శాఖ మంత్రి తుమ్మల అసంతృప్తి వ్యక్తంచేశారు. ఈ అవినీతికి అడ్డుకట్ట వేయాలని, అన్ని స్థాయుల్లోని ఉద్యోగులకు, అధికారులకు నిరంతరం శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. పాలకవర్గాలతోపాటు కార్యదర్శులకు, ఉద్యోగులకు, సభ్యులను తీర్చిదిద్దే బాధ్యతను సహకార సమాఖ్యకు అప్పగించింది.

హైదరాబాద్, వరంగల్‌లలో కేంద్రాలు

రాష్ట్రంలో 926 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు పనిచేస్తున్నాయి. ప్రభుత్వ గుర్తింపు పొందిన మరో 24 వేల వినియోగదారుల సంఘాలు, గృహ నిర్మాణ సంఘాలు, అర్బన్ బ్యాంక్, పరస్పర సహకార సంఘాలు ఉన్నాయి. సహకార వ్యవస్థ నిర్వహణ, కార్యకలాపాలపై వీటికి శిక్షణ ఇవ్వడానికి రాష్ట్ర సహకార సమాఖ్య హైదరాబాద్, వరంగల్‌లలో కేంద్రాలు ఏర్పాటు చేసింది. అయితే, వీటిద్వారా సహకార శాఖ ఉద్యోగులకు, సంఘాల పాలకవర్గాలకు మాత్రమే తరగతులు జరుగుతున్నాయి. శిక్షణ కోసం ఆయా సంఘాల నుంచి 1% నిధిని వసూలు చేస్తున్నారు. ఇకపై అన్ని సహకార సంఘాలకు శిక్షణ ఇవ్వనున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ నిజాం కళాశాల మైదానం వద్ద ఉన్న భవనం శిక్షణకు అనుకూలంగా లేకపోవడంతో దాన్ని మరోచోట ఏర్పాటు చేయనున్నారు. వరంగల్‌లోని శిక్షణ కేంద్రం నిర్మాణానికి గతంలోనే స్థలం కేటాయించారు.

కఠిన నిబంధనల అమలు

ప్రస్తుతమున్న ప్రతి సంఘం శిక్షణ పొందినట్లుగా ధ్రువీకరణ పత్రం తీసుకుంటేనే దాన్ని రెన్యువల్ చేస్తారు. కొత్త పాలకవర్గాలు విధిగా శిక్షణ పొందాలనే నిబంధన తెస్తారు. మొదట హైదరాబాద్, వరంగల్‌లలో నిపుణులతో మాస్టర్ ట్రైనింగ్ ఇప్పిస్తారు. వారితో గ్రామాలు, పట్టణాలు, జిల్లాల్లో శిక్షణ శిబిరాలు నిర్వహిస్తారు. సహకార సమాఖ్య వసూలు చేస్తున్న ఎడ్యుకేషన్ ఫండ్‌పైనా ఆడిట్ చేయిస్తారు.

సైబర్ నేరగాళ్లపై 'సైకాప్స్' అస్త్రం!

- మూడేళ్లలో 70 వేల కేసుల పరిశోధనకు దన్ను
- 26 రాష్ట్రాల పోలీసులకు సాంకేతిక సహకారం



ఈనాడు, హైదరాబాద్: రోజురోజుకీ పెరుగుతున్న సైబర్ నేరాల నియంత్రణకు తెలంగాణ పోలీసులు రూపొందించిన అస్త్రం 'సైకాప్స్' దూసుకుపోతోంది. ఇప్పుడు దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల పోలీసులకు దిక్సూచిలా మారింది. 26 రాష్ట్రాల్లో జరిగిన నేరాలు.. 450 మంది సైబర్ నేరగాళ్ల అరెస్టు.. 70,900 కేసుల దర్యాప్తునకు సాంకేతిక సహకారం.. ఇదీ ఈ 'సైబర్ క్రైమ్ ఎనాలిసిస్ అండ్ ప్రొఫైలింగ్ సిస్టమ్ (సైకాప్స్)' సత్తా. సైబర్ నేరాల పరిశోధనలో దర్యాప్తు బృందాలకు సాంకేతిక సహకారం అందిస్తోంది. తెలంగాణలో నమోదైన కేసుల్లో నిందితులు ఇతర రాష్ట్రాల్లోనూ నేరాలకు పాల్పడితే గుర్తించి అక్కడి పోలీసులకు సమాచారమందించే బృహత్ ప్రణాళికను సైకాప్స్ భుజాన వేసుకొంది. ఇలా మూడేళ్లలో వేలాది కేసులను ఛేదించేందుకు దోహదపడింది. ఈ దిశగా సైకాప్స్ బృందం నిరంతరం శ్రమిస్తోంది. తాజాగా తెలంగాణ పోలీసుల సాంకేతిక పరిజ్ఞానానికి కేంద్ర హోంశాఖ పురస్కారం అందిన నేపథ్యంలో 'సైకాప్స్'కు ప్రాధాన్యం ఏర్పడింది. సాధారణంగా సైబర్ నేరాలకు సంబంధించిన ఫిర్యాదులు '1930' నంబర్ లేదా నేషనల్ సైబర్‌క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ ద్వారా జాతీయస్థాయిలో నమోదవుతుంటాయి. ఈ క్రమంలో తెలంగాణ పోలీస్ సాంకేతిక బృందం ఆ పోర్టల్‌లోని ఫిర్యాదులతో పాటు ఇండియన్ సైబర్‌క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (ఐ4సీ), జాతీయ నేర గణాంకసంస్థ (ఎన్‌సీఆర్‌బీ), క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ అండ్ నెట్‌వర్కింగ్ సిస్టమ్ (సీసీటీఎన్ఎస్)లోని సమాచారాన్ని విశ్లేషిస్తుంటుంది. నేరగాళ్ల సమాచారాన్ని సైకాప్స్ సాఫ్ట్‌వేర్‌లో నిక్షిప్తం చేస్తోంది. ఈ సాఫ్ట్‌వేర్‌కు కేంద్ర హోంశాఖ కితాబివ్వడంతో ప్రస్తుతం 26 రాష్ట్రాల పోలీసులకు దీన్ని అందుబాటులో ఉంచారు. ఇంతవరకు దేశవ్యాప్తంగా నమోదైన సైబర్‌నేరాల్లో 70 వేలకు పైగా కేసుల సమాచారాన్ని ఇందులో నిక్షిప్తం చేయగలిగారు. వివిధ రాష్ట్రాల్లో నమోదవుతున్న సైబర్ కేసుల సమాచారాన్ని ఆ రాష్ట్రాల పోలీసులు తెలుసుకొని దర్యాప్తులో ముందుకెళ్తున్నారు.

ఏ సిమ్‌కార్డు.. ఏ హ్యాండ్‌సెట్?

ఏదైనా సైబర్‌నేరానికి పాల్పడినప్పుడు నేరగాళ్లు ఏ సిమ్‌ను వినియోగించారు.. ఏ మొబైల్ హ్యాండ్‌సెట్ వాడారు.. కొల్లగొట్టిన సొమ్మును ఏ బ్యాంకుఖాతాకు మళ్లించారు.. ఏ వ్యాలెట్‌ను వినియోగించారు.. ఏ ఏటీఎంకార్డు ద్వారా డ్రా చేశారన్న వివరాల్ని సైకాప్స్ బృందం సేకరిస్తుంది. అలా ఎన్ని నేరాలు జరిగాయో గుర్తిస్తారు. ఈ సమాచారాన్ని ఆయా రాష్ట్రాలకు అందిస్తారు.

తీరనున్న కొత్త పేర్ల ప'రేషన్'?

- త్వరలో నమోదు ప్రక్రియ
- డిజిటల్ కార్డులు కొలిక్కి రాగానే కీలక నిర్ణయం



ఈనాడు, హైదరాబాద్: ఒక కుటుంబానికి రేషన్ కార్డుంది.. రేషన్ మాత్రం భార్యాభర్తలకే వస్తోంది..వారి ఇద్దరు పిల్లలకు రావట్లేదు. మరో కుటుంబంలో మెట్టినింట రేషన్ కార్డులో కోడలి పేరు చేరలేదు. అలాగని పుట్టినింట కార్డులోనూ లేదు. పెళ్లయి అత్తారింటికి వెళ్లాక ఆమె పేరును పుట్టింటి కార్డులోంచి తొలగించారు... సంవత్సరాలుగా ఉన్న ఈ సమస్యకు త్వరలో పరిష్కారం లభించనున్నట్లు పౌరసరఫరాలశాఖ వర్గాల సమాచారం. రేషన్ కార్డుల్లో అర్హులైన కొత్త కుటుంబ సభ్యుల పేర్లను చేర్చేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందని తెలిసింది. "ఫ్యామిలీ డిజిటల్ కార్డుల అంశం కొలిక్కి రాగానే ఈ విషయంపై కీలక నిర్ణయం ఉంటుంది. ఇప్పటికే ఉన్న రేషన్ కార్డుల్లో అర్హులైన కుటుంబ సభ్యుల పేర్లను చేర్చే ప్రక్రియ మొదలవుతుంది. ఆ తర్వాత నూతన రేషన్ కార్డులకు దరఖాస్తుల స్వీకరణ ఉంటుంది' అని ఉన్నతాధికారి ఒకరు చెప్పారు.

రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో 11.08 లక్షల దరఖాస్తులు...

రేషన్ కార్డుల్లో అర్హుల పేర్లను చేర్చాలని రాష్ట్రంలో లక్షల కుటుంబాలు మీసేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకున్నాయి. ప్రభుత్వ అనుమతి లేకపోవడంతో పౌరసరఫరాల శాఖ ఇన్నాళ్లూ వాటిని పరిశీలించలేదు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 11.08 లక్షల దరఖాస్తులు అందాయి. వాటిని ఆమోదిస్తే ప్రభుత్వంపై ఎంత భారం పడుతుందన్న విషయంపై అధికారులు నివేదిక ఇచ్చారు. నెలకు సుమారు 9,890 టన్నుల బియ్యం అదనంగా కావాల్సి ఉంటుందని.. రూ.37.40 కోట్ల భారం పడుతుందని పౌరసరఫరాల శాఖ అధికారులు అంచనా వేసినట్లు తెలిసింది. తొలుత ఫ్యామిలీ డిజిటల్ కార్డులు వచ్చాక.. ప్రస్తుత రేషన్ కార్డులు, అందులోని లబ్ధిదారుల సమాచారం అంతా అందులో చేరిపోయేలా సాఫ్ట్‌వేర్‌ను రూపొందించనున్నట్లు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డుతో రేషన్ దుకాణానికి వెళ్లి అక్కడ క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే చాలు..ఆ కుటుంబానికి ఏ సరకులకు, ఎంత పరిమాణానికి అర్హత ఉంది అన్న వివరాలు తెలిసిపోతాయి. ఆ మేరకు రేషన్ ఇస్తారు. తర్వాత అర్హత కలిగిన కుటుంబ సభ్యులను చేర్చే దరఖాస్తుల్ని పరిశీలించి ఆమోదిస్తే.. వారి సమాచారం కూడా ఫ్యామిలీ డిజిటల్ కార్డుల్లో చేరిపోతుందని పౌరసరఫరాల శాఖ వర్గాలు తెలిపాయి.

జీవో 29 ఏం చెబుతోందంటే..

- 1:50 మెరిట్ జాబితాలో అన్నివర్గాలకూ చోటు
- అర్హులు తక్కువగా ఉన్న రిజర్వుడు కేటగిరీల్లో తదుపరి మెరిట్ నుంచి ఎంపిక
- టీజీపీఎస్సీ, ప్రభుత్వ వర్గాల వెల్లడి
- ఓపెన్ మెరిట్‌లో రిజర్వుడు అభ్యర్థుల సంఖ్య తగ్గి నష్టపోతున్నామని పలువురి నిరసన

ఈనాడు, హైదరాబాద్: గ్రూప్-1 ప్రధాన పరీక్షలకు (మెయిన్స్) అభ్యర్థుల ఎంపికలో రిజర్వుడు కేటగిరీ వర్గాలకు అన్యాయం జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటూ సాధారణ మెరిట్ జాబితా రూపొందించినట్లు టీజీపీఎస్సీ వర్గాలు వెల్లడించాయి. ఈ అంశంలో సుప్రీంకోర్టు నిబంధనలకు లోబడి భవిష్యత్తులో న్యాయ వివాదాలు తలెత్తకుండా జీవో 29 రూపొందించి అమలు చేస్తున్నట్లు పేర్కొన్నాయి. ఒక నోటిఫికేషన్‌లో రెండు స్థాయుల్లో రిజర్వేషన్లు అమలు చేయకూడదన్న నిబంధన పరిగణనలోకి తీసుకుని న్యాయం చేయనున్నట్లు స్పష్టంచేశాయి. తెలంగాణ సబార్డినేట్ సర్వీసు నిబంధనల ప్రకారం అన్నివర్గాలకు సమన్యాయం చేసేలా గ్రూప్-1లో చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపాయి. మొత్తం 563 పోస్టులకు 1:50 నిష్పత్తిలో 28,150 మంది మాత్రమే మెయిన్స్‌కు హాజరుకావాలి. ఇందులో అన్నివర్గాలకు చోటు లభించింది. కానీ రిజర్వుడు వర్గాలకు న్యాయం చేసేందుకు జీవో 29 ద్వారా తీసుకొచ్చిన నిబంధనతో.. మెరిట్ జాబితాలో చోటు దక్కని ఆయా వర్గాలకు చెందిన దాదాపు 3,233 మందికి అదనంగా ప్రధాన పరీక్షలు రాసే అర్హత లభించినట్లు వెల్లడించాయి. అయితే ఈ విధానంతో తాము నష్టపోతున్నామని కొందరు అభ్యర్థులు చెబుతున్నారు.

న్యాయవివాదమిదీ..

2007లో ఉమ్మడి రాష్ట్రంలో ఏపీపీఎస్సీ 196 పోస్టులతో గ్రూప్-1 ప్రకటన వెలువరించింది. ఈ మేరకు ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించింది. 1997లో జారీచేసిన జీవో 570 ప్రకారం.. రిజర్వుడు కేటగిరీలతో సంబంధం లేకుండా (అంటే ఈ మెరిట్‌లో ఓసీలతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర రిజర్వుడు కేటగిరీల వారు ఉంటారు) ఉద్యోగ ఖాళీల సంఖ్య మేరకు 1:50 నిష్పత్తిలో మెరిట్ జాబితాను వెలువరించింది. 2007 నోటిఫికేషన్‌లో మెయిన్స్ పరీక్ష ఎంపికకు అనుసరించిన ఈ విధానాన్ని బాలోజీ బడావత్, మరో 30 మంది హైకోర్టులో సవాల్ చేశారు. రిజర్వుడు కేటగిరీలతో సంబంధం లేకుండా జనరల్ మెరిట్ ద్వారా మెయిన్స్‌కు ఎంపిక చేయడం చెల్లదని.. సంబంధిత రిజర్వుడు కేటగిరీల వారీగా 1:50 నిష్పత్తి పాటిస్తూ ఎంపిక చేయాలని 2008లో హైకోర్టు డివిజన్ బెంచ్ సూచించింది. ఈ నిర్ణయాన్ని ఏపీపీఎస్సీ సుప్రీంకోర్టులో సవాల్ చేయగా... హైకోర్టు తీర్పును కొట్టివేస్తూ రిజర్వుడు కేటగిరీలతో సంబంధం లేకుండా మెయిన్స్‌కు జనరల్ మెరిట్ లిస్టు ద్వారా అభ్యర్థులను ఎంపిక చేయాలని సూచించింది.

ఏమిటీ జీవో 29

తెలంగాణలో గత ప్రభుత్వం జారీ చేసిన జీవో 55 ప్రకారం... ప్రతి మల్టీజోన్‌లోని పోస్టుల సంఖ్యకు అనుగుణంగా 1:50 నిష్పత్తిలో ప్రధాన పరీక్షకు అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఈ ఎంపికలో తెలంగాణ సబార్డినేట్ సర్వీసు రూల్స్ 22, 22 ఏ నిబంధనల ప్రకారం రిజర్వుడు కేటగిరీ, జెండర్, ఈడబ్ల్యూఎస్, దివ్యాంగులు, స్పోర్ట్స్ రిజర్వేషన్లు పాటించింది. జీవో 55 తీసుకువచ్చినపుడు దీన్ని సవాల్ చేస్తూ కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించిన విషయాన్ని టీజీపీఎస్సీ వర్గాలు గుర్తుచేశాయి. గతంలో సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో న్యాయవివాదాలను అధిగమించేందుకు జీవో 55ను ప్రభుత్వం సవరించి.. జీవో 29 తీసుకొచ్చింది. దీని ప్రకారం.. "రిజర్వుడు కేటగిరీలతో సంబంధం లేకుండా ప్రతి మల్టీజోన్‌లోని పోస్టుల సంఖ్యకు అనుగుణంగా 1:50 నిష్పత్తిలో ప్రధాన పరీక్షకు అభ్యర్థులను ఎంపిక చేయాలి. అయితే మెరిట్ జాబితాలో చోటు సంపాదించిన వారిలో ఏదైనా రిజర్వుడు కేటగిరీలోని పోస్టుల సంఖ్యకు అనుగుణంగా 1:50 నిష్పత్తిలో ఆ వర్గం అభ్యర్థులు లేకుంటే.. ఆ కేటగిరీలోని తదుపరి మెరిట్ అభ్యర్థులను పరిగణనలోకి తీసుకోవాలి. తద్వారా రిజర్వుడు కేటగిరీ పోస్టుల సంఖ్యకు 1:50 నిష్పత్తిలో ఆ కేటగిరీ అభ్యర్థులు ఉండేలా జాగ్రత్తతీసుకున్నాం" అని టీజీపీఎస్సీ వర్గాలు వెల్లడించాయి.

జీవో 55తో సమస్యలివీ..

"జీవో 55 ప్రకారం ఎంపిక చేపడితే... ఓపెన్ మెరిట్‌లో చోటు సంపాదించిన అభ్యర్థులు ఓపెన్ పోస్టులతో పాటు సంబంధిత రిజర్వుడు కేటగిరీ పోస్టులకు పోటీపడవచ్చు. కానీ రిజర్వుడు పోస్టులకు రిజర్వుడు కేటగిరీలో 1:50 నిష్పత్తిలో ఎంపికైన అభ్యర్థులు, ప్రధాన పరీక్షల్లో మెరిట్ సాధించినా సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఓపెన్ పోస్టులకు అర్హులు కాబోరు. వారు రిజర్వుడు కేటగిరీ పోస్టులకే పోటీపడాల్సి ఉంటుంది. జీవో 29 ప్రకారం ప్రధాన పరీక్షకు ఎంపికైనవారిలోని రిజర్వుడు కేటగిరీ అభ్యర్థులందరూ ఓపెన్ కేటగిరీలో పోస్టులకు పోటీపడవచ్చు. ఈ జీవో ప్రకారం రిజర్వుడు అభ్యర్థులకు న్యాయం జరుగుతుంది" అని టీజీపీఎస్సీ వర్గాలు తెలిపాయి.

31,383 మంది అభ్యర్థులకు అవకాశం...

"ప్రస్తుత గ్రూప్-1లో 563 పోస్టులు ఉన్నాయి. అయితే జీవో 29 ప్రకారం.. రిజర్వుడు పోస్టుల సంఖ్యకు అనుగుణంగా ఆయా కేటగిరీల వారు 1:50 నిష్పత్తిలో ఉండేలా చేయడంతో మొత్తం 31,383 మంది అభ్యర్థులు మెయిన్స్ పరీక్షలు రాయనున్నారు. ఇదే తరహా విధానాన్ని అమలు చేసేలా 2018లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జీవో 5 జారీచేసింది. దీని ప్రకారం.. పోస్టుల సంఖ్యకు అనుగుణంగా జనరల్ మెరిట్ ప్రకారం అభ్యర్థులను ఎంపిక చేసి, ఏదైనా రిజర్వుడు కేటగిరీలో అభ్యర్థుల సంఖ్య తక్కువగా ఉంటే.. తదుపరి మెరిట్ నుంచి ఆ విభాగం అభ్యర్థులకు అర్హత కల్పిస్తోంది. రెండు రాష్ట్రాలు ప్రిలిమినరీలో ఒకేవిధానాన్ని అమలు చేస్తున్నాయి" అని పేర్కొన్నాయి.

కొందరు ఏమంటున్నారంటే...

గ్రూప్-1 ఓపెన్ మెరిట్ 1:50లో ఎక్కువ మంది ఓసీ అభ్యర్థులున్నారని, రిజర్వుడు కేటగిరీ అభ్యర్థుల సంఖ్య తక్కువగా ఉందని ఆరోపిస్తున్నారు. జీవో 29 కారణంగా రిజర్వుడు అభ్యర్థులకు అన్యాయం జరుగుతోందని, మెయిన్స్ రాసేందుకు అవకాశం కోల్పోతున్నట్లు వెల్లడిస్తున్నారు. ఈ జీవోని రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

రైతులపై భారాస మొసలికన్నీరు

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ఈనాడు, హైదరాబాద్, ఖమ్మం కమాన్‌బజార్, న్యూస్‌టుడే: రైతులపై భారాస నేతలు మొసలికన్నీరు కారుస్తున్నారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విమర్శించారు. పదేళ్లలో ప్రభుత్వ వ్యవస్థలను భ్రష్టు పట్టించారని ధ్వజమెత్తారు. ఖమ్మంలో మంత్రి ఆదివారం అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి, కబ్జాలకు పాల్పడి దోచుకున్న భారాస నాయకులు.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తప్పు చేస్తున్నారంటూ దుష్ప్రచారం చేయడం అవివేకమని దుయ్యబట్టారు. గత ప్రభుత్వం రైతులకు ఇవ్వని రైతుబంధు సొమ్మును తాము చెల్లించామన్నారు. రైతుల సంక్షేమాన్ని విస్మరించిన వారు ఇప్పుడు రోడ్డుమీదకు వచ్చి ధర్నాలు చేస్తున్నారని, వారికి గుణపాఠం చెప్పాలని ప్రజలను కోరారు. "మురుగు కాల్వలు శుభ్రం చేస్తామంటే రూ.కోట్లు తింటున్నారని సీఎంపై తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రేవంత్‌రెడ్డి ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ రైతు రుణమాఫీ చేశారు. ఇచ్చిన మాట ప్రకారం రైతుల ఖాతాల్లో రుణమాఫీ నిధులు జమ చేశాం. మరో రూ.25 వేల కోట్లు చెల్లించడానికైనా కాంగ్రెస్ ప్రభుత్వం వెనకాడబోదు. గత ప్రభుత్వం పంటల బీమాను ఎత్తివేసింది. రైతులు కట్టాల్సిన ప్రీమియం కూడా ప్రభుత్వమే చెల్లించేలా అన్ని పంటలకు బీమా సౌకర్యం తెస్తున్నాం. గత ప్రభుత్వం రద్దు చేసిన అన్ని పథకాలను పునరుద్ధరించేందుకు సిద్ధమయ్యాం" అని అన్నారు. దీపావళి నుంచి పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తుమ్మల తెలిపారు.

పట్టింపులకు పోకుండా న్యాయం చేయండి

- ప్రభుత్వానికి గ్రూప్-1 అభ్యర్థుల వినతి

గాంధీనగర్, ముషీరాబాద్, న్యూస్‌టుడే: ప్రభుత్వం పట్టింపులకు పోకుండా తమకు న్యాయం చేయాలని పలువురు గ్రూప్-1 అభ్యర్థులు కోరారు. ఆదివారం అభ్యర్థులు అశోక్‌నగర్ క్రాస్ రోడ్డు వద్ద ప్రెస్‌మీట్ ఏర్పాటు చేశారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ముందే అక్కడ మోహరించారు. ప్రెస్‌మీట్ జరుగుతుండగానే పలువురిని అదుపులోకి తీసుకొని.. వివిధ ఠాణాలకు తరలించారు. అంతకుముందు అభ్యర్థులు మాట్లాడుతూ.. ప్రజాసేవ చేయాలనే భావంతోనే గ్రూప్-1 పరీక్షలకు సిద్ధమయ్యామని పేర్కొన్నారు. ప్రభుత్వం జీవో 29 తీసుకురావడం, హాల్‌టికెట్ల మార్పుతో బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు నష్టపోయే ప్రమాదముందన్నారు. మానసిక ఆందోళనలో ఉన్నామని, ఈ పరిస్థితిలో పరీక్షలు ఎలా రాయాలని ప్రశ్నించారు. తాము ఏ పార్టీకీ మద్దతు తెలపడం లేదని స్పష్టం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపక్షంతో చర్చించడం కంటే తమతో చర్చించి సమస్యను పరిష్కరించాలని కోరారు. హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నంత మాత్రాన పరీక్షలు రాసేందుకు సిద్ధంగా ఉన్నట్లు కాదన్నారు. లాఠీఛార్జ్ చేయొద్దని సీఎం చెప్పినా, తాము శాంతియుతంగా ప్రెస్‌మీట్ పెట్టినా పోలీసులు అడ్డుకోవడం సరికాదని చెప్పారు. మెయిన్స్ పరీక్షలను వాయిదా వేసి, జీవో 29ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రిలిమ్స్ ఫలితాల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను అమలు చేయాలన్నారు. పరీక్షల్లో ప్రామాణిక పుస్తకాలపై స్పష్టతనివ్వాలని కోరారు. కాగా, గ్రూప్-1 అభ్యర్థులపై ప్రభుత్వ తీరుకు నిరసనగా డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐల ఆధ్వర్యంలో ఆర్టీసీ క్రాస్‌రోడ్డులో జీవో నంబరు 29 ప్రతులను దహనం చేశారు.

జీవో 29ని రద్దు చేసి గ్రూప్-1 మెయిన్స్‌ని రీషెడ్యూల్ చేయాలి

- ముఖ్యమంత్రికి బండి సంజయ్ బహిరంగ లేఖ



ఈనాడు, హైదరాబాద్: ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లకు జీవో నంబరు 29 గొడ్డలిపెట్టుగా మారిందని.. దీన్ని వెంటనే రద్దు చేసి, గ్రూప్-1 పరీక్షలను రీషెడ్యూల్ చేయాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు. దీనిపై రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగుల్లో ఆందోళన నెలకొందని.. అభ్యర్థులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆదివారం రాసిన బహిరంగ లేఖలో ఆయన పేర్కొన్నారు. యూపీఎస్సీ సహా అన్ని రాష్ట్రాల్లోనూ పబ్లిక్ సర్వీస్ కమిషన్లు దశాబ్దాలుగా అనుసరిస్తున్న విధానానికి ఈ జీవో పూర్తి భిన్నంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం భవిష్యత్తులో మొత్తం రిజర్వేషన్లనే ఎత్తివేయబోతోందనే ఆందోళన నిరుద్యోగుల్లో నెలకొందన్నారు. దీన్ని అర్థం చేసుకుని పట్టింపులకు పోకుండా, రాజకీయాలను పక్కనపెట్టి ప్రభుత్వం మానవతాదృక్పథంతో ఆలోచించాలన్నారు. 29 జీవోతో దాదాపు 30 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు మెయిన్స్ పరీక్షకు అనర్హులయ్యారని ఆరోపించారు. ఓపెన్ కేటగిరీ కింద అర్హత సాధించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులను కూడా రిజర్వేషన్ కేటగిరీలో కలపడంతో 5,003 మంది రిజర్వుడ్ కేటగిరీ అభ్యర్థులు మెయిన్స్ రాసే అవకాశం కోల్పోయారని పేర్కొన్నారు. ఓపెన్ కేటగిరీ అభ్యర్థులను 1:65 నిష్పత్తిలో అర్హులుగా ప్రకటించడమే దీనికి ప్రధాన కారణమన్నారు. రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా.. అంబేడ్కర్ కల్పించిన రిజర్వేషన్లను తుంగలో తొక్కేలా కాంగ్రెస్ ప్రభుత్వం జీవోను జారీ చేయడం ఘోర తప్పిదమని, దీన్ని సరిదిద్దుకోకపోగా న్యాయం కోరిన నిరుద్యోగులపై పోలీసులు లాఠీఛార్జ్ చేసి భయాందోళనలకు గురిచేయడం దుర్మార్గపు చర్య అని విమర్శించారు. మహిళలని కూడా చూడకుండా పోలీసులతో కొట్టించడం ప్రభుత్వానికి మాయని మచ్చగా మిగిలిపోతుందని పేర్కొన్నారు.

రైతుభరోసా హామీ అమలు ఏమైంది: కేటీఆర్



మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో క్యామ మల్లేశ్, ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, సబితారెడ్డి, మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి తదితరులు

ఆదిభట్ల, న్యూస్‌టుడే: రెండు పంటలకు కాదు, మూడు పంటలకు రైతుబంధు ఇవ్వాలని గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చెప్పిన రేవంత్‌రెడ్డి.. సీఎం పదవి చేపట్టిన తర్వాత ఆ మాటను మర్చిపోయారని మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం బొంగుళూరులో భారాస శ్రేణులతో కలిసి అలయ్ బలయ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అధికారంలోకి వస్తే రైతులకు ఎకరానికి రూ.15 వేల చొప్పున ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. ఖరీఫ్ సీజన్ నుంచి కాకుండా వచ్చే యాసంగి నుంచి రైతుభరోసా అమలు చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పడం సిగ్గుచేటన్నారు. భారాస ఆధ్వర్యంలో రైతుల కోసం పోరాటం చేస్తుంటే.. రైతుసంఘాలు ఎందుకు మూగబోయాయని, కమ్యూనిస్టులు ఎక్కడ ఉన్నారని కేటీఆర్ ప్రశ్నించారు. కార్యక్రమంలో మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి, భారాస నాయకులు క్యామ మల్లేశ్, ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, సత్తు వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీపై పచ్చి అబద్ధాలు

తెలంగాణలో 40 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేసినట్లు జాతీయ కాంగ్రెస్ పార్టీ 'ఎక్స్'లో పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తోందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. ఈ అంశంపై ఆదివారం 'ఎక్స్' వేదికగా కేటీఆర్ స్పందించారు. "రుణమాఫీ చేసినట్లు ఇచ్చిన ప్రకటనలో వాడినట్లే రుణమాఫీ జరిగిన రైతుల లెక్క విషయంలో కూడా ముఖ్యమంత్రి ఏఐ టెక్నాలజీ వాడారు. కాంగ్రెస్ పేర్కొన్న 40 లక్షల మంది రైతులు అనే సంఖ్య పచ్చి అబద్ధం. నిజానికి తెలంగాణలో ఇప్పటి వరకు 40 శాతం రుణాలు కూడా మాఫీ కాలేదు'' అని కేటీఆర్ ఎద్దేవా చేశారు.

మలేసియా తెలంగాణ అసోసియేషన్ దశాబ్ది ఉత్సవాలకు కేటీఆర్‌కు ఆహ్వానం

ఈనాడు, హైదరాబాద్: మలేసియా తెలంగాణ అసోసియేషన్ దశాబ్ది ఉత్సవాలకు హాజరు కావాల్సిందిగా భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ను అసోసియేషన్ ప్రతినిధులు ఆహ్వానించారు. వచ్చే నెల 9న కౌలాలంపూర్‌లో జరిగే ఈ వేడుకలకు అక్కడి తెలంగాణవాసులు పెద్దఎత్తున హాజరవుతారని తెలిపారు. హైదరాబాద్ నందినగర్‌లోని కేటీఆర్ నివాసంలో ఆదివారం మలేసియా తెలంగాణ అసోసియేషన్ అధ్యక్షుడు తిరుపతి, మాజీ ఎమ్మెల్యే గ్యాదరి కిశోర్ ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం కేటీఆర్‌కు ఆహ్వానపత్రాన్ని అందించింది.



సోషల్ మీడియాను మీరెలా వినియోగిస్తున్నారు?

ఉన్నత స్థాయికి ఎదగాలనే కోరిక ఉన్నవారు సామాజిక మాధ్యమాలను **1.**వృత్తిపరమైన నెట్‌వర్క్‌ను పెంచుకోవడానికి **2.**ఇతరుల నుంచి నేర్చుకోవడానికి **3.**మార్గదర్శనం చేసేవారి కోసం అన్వేషించడానికి **4.**భావసారూప్యం ఉన్న వారితో సత్సంబంధాలు కొనసాగించడానికి వినియోగించుకుంటారు. సోషల్ మీడియాలో తమకు ఏ మాత్రం పరిచయం లేనివారితో రాజకీయాల గురించి ఘర్షణపడేవారికి, ఇతరుల జీవనశైలితో తమను పోల్చుకొనేవారికి సమయం వృథా కావడం తప్ప ఎలాంటి ప్రయోజనమూ ఉండదు.

– రోహిత్ కాలియుర్, బ్రాండ్ స్ట్రాటజిస్ట్

హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- మాజీ ఎంపీ బి.వినోద్‌కుమార్



జగిత్యాల, న్యూస్‌టుడే: ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని మాజీ ఎంపీ, రాష్ట్ర ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్ విమర్శించారు. జగిత్యాలలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆడబిడ్డలకు రూ.2,500 పంపిణీ, పింఛన్ల పెంపును ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. మూసీ నది ప్రక్షాళన పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి రూ.1.20 లక్షల కోట్లు వృథా చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చిందన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ దావ వసంత తదితరులు పాల్గొన్నారు.

'నారాయణపేట-కొడంగల్' టెండర్లకు ఈఎన్సీ షరతు!

లేఖ సమర్పించాలని కొర్రీ

ఈనాడు, హైదరాబాద్: నారాయణపేట-కొడంగల్ సాగునీటి ఎత్తిపోతల పథకం టెండర్లకు కమిషనర్ ఆఫ్ టెండర్స్ (సీవోటీ) ఛైర్మన్, ఈఎన్సీ అనిల్‌కుమార్ సూత్రప్రాయంగా ఆమోదం తెలుపుతూనే షరతు విధించినట్లు తెలిసింది. శనివారం జరిగిన సీవోటీ సమావేశంలో ఎత్తిపోతల మొదటి దశలోని రెండు ప్యాకేజీలకు సంబంధించిన టెండర్లను మహబూబ్‌నగర్ సీఈ ప్రవేశపెట్టారు. రెండు ప్యాకేజీలకు తొలుత 4 గుత్తేదారు సంస్థలు బిడ్లు దాఖలు చేయగా.. సాంకేతిక బిడ్స్ పరిశీలనలో రెండు సంస్థలను అనర్హులుగా ప్రకటించారు. మరో రెండు సంస్థలను ఎల్-1, ఎల్-2గా గుర్తించారు. అయితే, టెండర్లకు సంబంధించి సాంకేతిక పరమైన పలు అంశాలపై స్పష్టత ఇవ్వాలని, ఎటువంటి అభ్యంతరాలు, ఫిర్యాదులు లేవని లేఖ ఇవ్వాలంటూ సీవోటీ సమావేశానికి హాజరైన మహబూబ్‌నగర్ సీఈకి ఈఎన్సీ సూచించినట్లు తెలిసింది. లేఖ అందగానే సీవోటీ ఆమోదం తెలిపినట్లు స్పష్టత ఇస్తామని చెప్పినట్లు సమాచారం.

ప్రభుత్వాన్ని కూల్చేందుకు భారాస, భాజపా కుట్రలు

- కూనంనేని సాంబశివరావు ఆరోపణ

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వాన్ని కూల్చడానికి భారాస, భాజపాలు కలిసి కుట్రలు చేస్తున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. ప్రజా సమస్యలను పక్కదారి పట్టించి, అశాంతి సృష్టించి కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకునేలా ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. ఆదివారం హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'మూసీ పునరుజ్జీవంపై రాజకీయ, ప్రజాసంఘాలు, మేధావులు, పర్యావరణవేత్తలతో చర్చించి అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయాలు తీసుకోవాలి. గ్రూప్-1 పరీక్షలపై నిరుద్యోగుల అనుమానాలను ప్రభుత్వం ముందుగా నివృత్తి చేయాలి' అని సూచించారు. సమావేశంలో పార్టీ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్‌పాషా, జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్యపద్మ, రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు, బాలమల్లేశ్ ఉన్నారు.

గ్రూప్-1 పరీక్షలపై సీఎం రేవంత్ వైఖరి దుర్మార్గం: ఆర్.కృష్ణయ్య



బషీర్‌బాగ్, న్యూస్‌టుడే: 'గ్రూప్-1 పరీక్షల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. రిజర్వేషన్ల అమల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయి. దీనికి సంబంధించిన జీవో ఎత్తివేసి ఆయా కులాల వారికి న్యాయం చేయాలని పక్షం రోజులుగా ఉద్యమిస్తోంటే రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోంది. నిరుద్యోగులపై దారుణంగా లాఠీఛార్జి చేసింది. పరీక్షలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అవలంబిస్తున్న వైఖరి దుర్మార్గం' అని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య మండిపడ్డారు. ఆదివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో తెలంగాణ నిరుద్యోగ ఐకాస ఛైర్మన్ నీల వెంకటేశ్ అధ్యక్షతన విద్యార్థి, యువజన, నిరుద్యోగ సంఘాల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కృష్ణయ్య మాట్లాడుతూ.. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగబద్ధమైన రిజర్వేషన్లను సక్రమంగా అమలు చేయాలని, జీవో 55ను అమలు చేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు జరిగిన అన్యాయంపై సీఎంను కలిసి విజ్ఞప్తి చేసినప్పటికీ ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం తగదన్నారు. నీల వెంకటేశ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల ఆగ్రహానికి గురైతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. సమావేశంలో తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ, బీసీ సంఘాల నేతలు పాల్గొన్నారు.

మైండ్‌తో మెదడుకు ప్రయోజనం మెండు!

ఆరోగ్యకరమైన ఆహారంతో మెదడును పదిలంగా ఉంచుకోవచ్చని శాస్త్రవేత్తలు తేల్చారు. ముఖ్యంగా విషయగ్రహణ సామర్థ్యాన్ని రక్షించుకోవచ్చని గుర్తించారు. గుండెను ఆరోగ్యంగా ఉంచే 'మైండ్ ఆహారం'తో బుర్రను కాపాడుకోవచ్చని కనుగొన్నారు.

పెరుగుతున్న సమస్య

ప్రపంచవ్యాప్తంగా డిమెన్షియా బాధితులు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. ఈ సమస్య ఉన్నవారిలో ఆలోచన, జ్ఞాపకశక్తి, తార్కిక నైపుణ్యాలు దెబ్బతింటాయి. డిమెన్షియా రావడానికి చాలా ఏళ్ల ముందే ఆ రుగ్మతకు సంబంధించిన లక్షణాలు కనిపిస్తాయి. జ్ఞాపకశక్తి, ఆలోచనశక్తి, విషయగ్రహణ సామర్థ్యంలో స్వల్ప క్షీణత చోటుచేసుకుంటుంది. సకాలంలో స్పందించి చర్యలు చేపడితే ఈ వ్యాధిని చాలాకాలం పాటు దూరం పెట్టేయవచ్చు.

ఆహారం పరమౌషధం!

ఆరోగ్యకరమైన ఆహారపోకడలతో విషయగ్రహణ సామర్థ్యం మెరుగుపడుతుందని ఇప్పటికే కొన్ని అధ్యయనాలు తేల్చాయి. వీటిలో.. పండ్లు, కూరగాయలు, సంతృప్త కొవ్వులు తక్కువగా ఉండే లీన్ ప్రొటీన్లతో కూడిన మెడిటరేనియన్ ఆహారం, అధిక రక్తపోటును నివారించడానికి ఉద్దేశించిన 'డ్యాష్' ఆహార ప్రణాళిక ఉన్నాయి. ఈ రెండింటిలోని కీలకాంశాలను సమ్మిళితం చేసి.. మెడిటరేనియన్-డ్యాష్ ఇంటర్వెన్షన్ ఫర్ న్యూరోడిజెనరేటివ్ డిలే (మైండ్) డైట్‌ను తెచ్చారు. మెదడు ఆరోగ్యాన్ని పరిరక్షించడం దీని ఉద్దేశం.



ఏమిటీ మైండ్?

మైండ్ ఆహారంలో ఆకుకూరలు, ఇతర కూరగాయలు, బెర్రీలు ఉంటాయి. ఇంకా.. ముతక ధాన్యాలు, బీన్స్, నట్స్, కనీసం వారానికోసారి చేపలు ఉంటాయి. రెడ్ మీట్, మిఠాయిలు, చీజ్, ఫాస్ట్ ఫుడ్, వేపుళ్లను బాగా తగ్గించాలి.

పరిశోధనలో ఏం తేలింది?

మెదడు సామర్థ్యాన్ని పరిరక్షించడంలో 'మైండ్' పాత్రను శోధించడానికి అమెరికాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ (ఎన్ఐహెచ్) ఆధ్వర్యంలో 30వేల మందిపై జరిగిన 'రిగార్డ్స్' అధ్యయనంలో వచ్చిన డేటాను శాస్త్రవేత్తలు విశ్లేషించారు. మైండ్ డైట్‌ను నిష్ఠగా పాటించడం వల్ల విషయగ్రహణ సామర్థ్యం దెబ్బతినే ఆస్కారం తగ్గుతుందని ఇందులో వెల్లడైంది.

- మైండ్ ఆహార ప్రణాళికను అరకొరగా అనుసరించేవారితో పోలిస్తే గట్టిగా పాటించేవారిలో విషయగ్రహణ సామర్థ్యం దెబ్బతినే ముప్పు 4 శాతం తక్కువ.
- ఈ ఆహార ప్రణాళికకు గట్టిగా కట్టుబడే మహిళల్లో విషయగ్రహణ క్షీణత ముప్పు 8 శాతం మేర తక్కువగా ఉంటుంది.

- ఈనాడు ప్రత్యేక విభాగం

24 విమానాలకు బాంబు బెదిరింపులు

దిల్లీ: దేశంలో పౌర విమానాలకు బాంబు బెదిరింపులు ఆగడం లేదు. శనివారం ఒక్క రోజే 30కి పైగా విమానాలకు బాంబు బెదిరింపులు రాగా.. ఆదివారం సైతం 24 విమానాలకు వచ్చాయి. ఇండిగో, విస్తారా, ఎయిరిండియా, ఆకాశ ఎయిర్‌తోపాటు పలు అంతర్జాతీయ సర్వీసు విమానాలు కూడా ఈ జాబితాలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. వీటిలో ఇండిగో, విస్తారా, ఎయిరిండియాకు చెందిన విమానాలు ఆరు చొప్పున ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ బెదిరింపుల గురించి సంబంధిత అధికారులకు తెలియజేశామని, వారి ఆదేశాల మేరకు భద్రతా విధానాలను పాటిస్తున్నామని విమానయాన సంస్థల ప్రతినిధులు వెల్లడించారు. ఈ వారంలో 90కి పైగా విమానాలకు బాంబు బెదిరింపులు రాగా, అవన్నీ నకిలీవేనని అధికారులు తేల్చారు. మరోవైపు, బాంబు బెదిరింపులకు పాల్పడే వారిని విమాన ప్రయాణ నిషేధ (నో-ఫ్లై) జాబితాలో చేర్చాలని పౌర విమానయానశాఖ చూస్తోంది.



ప్రస్తుత క్షణంలో జీవించండి

శరీరాన్ని, మనసును ప్రస్తుత క్షణంలో లగ్నం చేయగలిగే నేర్పును సాధించినవారు వృత్తిగత, వ్యక్తిగత జీవితాలను చక్కగా సమన్వయం చేసుకోగలరు. పని చేసే సమయంలో దానిపైనే ధ్యాస ఉండాలి తప్ప విశ్రాంతి గురించి, ఇంట్లో సమస్యల గురించి ఆలోచించకూడదు. అలాగే కుటుంబ సభ్యులు, స్నేహితులతో గడుపుతున్నప్పుడు పని గురించి ఆలోచిస్తే ఆ సందర్భాన్ని పూర్తిగా ఆస్వాదించలేరు.

– లాయిడ్ లీ, ఏఐ కన్సల్టెంట్



వారణాసిలో కంటి ఆసుపత్రిని ప్రారంభించిన ప్రధాని మోదీ. చిత్రంలో ఉత్తర్‌ప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్, కంచి శంకరాచార్య శంకర విజయేంద్ర సరస్వతి, గవర్నర్ ఆనందీబెన్ పటేల్

కాశీ.. ఇక ఆరోగ్య సంరక్షణ కేంద్రం

రాకేశ్ ఝున్‌ఝున్‌వాలా-శంకర కంటి ఆసుపత్రి ప్రారంభోత్సవంలో ప్రధాని

వారణాసి (యూపీ): తూర్పు ఉత్తర్‌ప్రదేశ్‌ను గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయని.. దీర్ఘకాలంగా ఆధ్యాత్మిక కేంద్రంగా ఉన్న కాశీ నగరం ఇకపై ఆరోగ్య సంరక్షణకు పెద్ద కేంద్రంగా ఆవిర్భవించనుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. వారణాసిలో కంచి మఠం ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాకేశ్ ఝున్‌ఝున్‌వాలా - శంకర కంటి ఆసుపత్రిని ఆదివారం ప్రధాని ప్రారంభించారు. ముందుగా వేదికపై ఉన్న కంచి శంకరాచార్య శంకర విజయేంద్ర సరస్వతికి మోదీ నమస్కరించారు. ఆ తర్వాత ఆయన మాట్లాడుతూ.. తన మిత్రుడు, భారతదేశ ప్రసిద్ధ పెట్టుబడిదారుల్లో ఒకరైన రాకేశ్ ఝున్‌ఝున్‌వాలా పేరును కంటి ఆసుపత్రికి పెట్టడంపై హర్షం వ్యక్తం చేశారు. గత పదేళ్లలో కాశీతోపాటు పూర్వాంచల్ ప్రాంతమంతా అపూర్వ స్థాయిలో వైద్య సదుపాయాలను తాము విస్తరించామని తెలిపారు. కార్యక్రమంలో శంకర విజయేంద్ర సరస్వతి మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వానికి భగవంతుని ఆశీస్సులు ఉన్నాయంటూ, 'ఎన్‌డీఏ' అంటే నరేంద్ర దామోదర్‌దాస్ కా అనుశాసన్ (నియంత్రణ) అన్నారు. దేశంలో కంచి మఠం ఆధ్వర్యంలో ప్రారంభించిన 17వ ఆసుపత్రి ఇది. ఈ కార్యక్రమం అనంతరం వారణాసిలోని సిగ్రా స్పోర్ట్స్ కాంప్లెక్సు నుంచి రూ.6,700 కోట్ల అభివృద్ధి పనులకు మోదీ శ్రీకారం చుట్టారు.


బాగ్‌డోగ్రా విమానాశ్రయ విస్తరణకు శంకుస్థాపన

పశ్చిమబెంగాల్‌లోని సిలిగుడీ సమీప బాగ్‌డోగ్రా విమానాశ్రయ విస్తరణ పనులకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. రూ.1,550 కోట్ల నిధులతో చేపట్టనున్న ఈ పనులకు వారణాసి సభ నుంచే వర్చువల్‌గా ప్రధాని పచ్చజెండా ఊపారు.

సిట్టింగు రంగా..

- మహారాష్ట్రలో 99 మందితో భాజపా తొలి జాబితా
- 71 మంది ప్రస్తుత ఎమ్మెల్యేలకు చోటు

ముంబయి: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి తొలి జాబితాను భాజపా ఆదివారం విడుదల చేసింది. ముందుగా 99 మంది అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. వీరిలో 71 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలే కావడం విశేషం. ముగ్గురు మినహా సిట్టింగులందరికీ చోటు దక్కింది.



ముంబయి నగరంలో ప్రస్తుతం 16 మంది భాజపా ఎమ్మెల్యేలు ఉంటే వారిలో 14 మందికి తొలి జాబితాలోనే టికెట్లు లభించాయి. ఉపముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ నాగ్‌పుర్ నైరుతి స్థానం నుంచి మరోసారి బరిలో దిగనున్నారు. ఆయనతోపాటు స్పీకర్, పలువురు మంత్రులకు తొలి జాబితాలో చోటు దక్కింది. పలువురు నేతల కుటుంబ సభ్యులకు కూడా టికెట్లు ప్రకటించారు. వీరిలో మాజీ సీఎం అశోక్ చవాన్ కుమార్తె శ్రీజయ చవాన్, లోక్‌సభ సభ్యుడు నారాయణ్ రాణె తనయుడు నితేశ్ రాణె తదితరులు ఉన్నారు. రాష్ట్రంలో 288 అసెంబ్లీ స్థానాలున్నాయి. 151 స్థానాల్లో కమలదళం పోటీ చేయనుంది. మిగతా సీట్లలో సీఎం ఏక్‌నాథ్ శిందే సారథ్యంలోని శివసేన, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ అభ్యర్థులు బరిలో దిగనున్నారు.

దిల్లీలో సీఆర్‌పీఎఫ్ పాఠశాల వద్ద పేలుడు

- హై అలర్ట్ ప్రకటించిన పోలీసులు

దిల్లీ: దేశ రాజధాని దిల్లీలోని రోహిణి ప్రాంతంలో ఉన్న సీఆర్‌పీఎఫ్ పాఠశాల సమీపంలో భారీ పేలుడు సంభవించింది. ఆదివారం ఉదయం 7:50 గంటలకు జరిగిన ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని అధికారులు తెలిపారు. పేలుడు ధాటికి ఆ ప్రాంతంలో దట్టమైన పొగ వ్యాపించిందని, పాఠశాల గోడ కూలిపోవడంతోపాటు సమీపంలో ఉన్న దుకాణాలు, కార్లు దెబ్బతిన్నాయని వెల్లడించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ఆ తర్వాత ఫోరెన్సిక్ బృందాలు, క్రైమ్, బాంబు నిర్వీర్యక సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. పాఠశాల సమీపంలోని మట్టి, అక్కడ గుర్తించిన తెల్లని పౌడర్ నమూనాలనూ ల్యాబ్‌కు పంపించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఎవరైనా దాడికి పాల్పడ్డారా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని, ఘటనా స్థలంలోని సీసీటీవీ ఫుటేజీని పరిశీలిస్తున్నామని దిల్లీ పోలీసులు తెలిపారు. పేలుడు నేపథ్యంలో నగరంలో హై అలర్ట్ ప్రకటించారు.



పేలుడు చోటుచేసుకున్న ప్రాంతంలో ఆధారాలు సేకరిస్తున్న ఎన్ఎస్‌జీ సిబ్బంది

రంగంలోకి ఎన్ఐఏ, ఎన్ఎస్‌జీ.. రోబోల మోహరింపు

పేలుడు నేపథ్యంలో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ), జాతీయ భద్రతా దళం (ఎన్ఎస్‌జీ) ఘటనా స్థలానికి చేరుకుని తనిఖీలు చేపట్టాయి. ఘటనా స్థలాన్ని పూర్తిగా పరిశీలించడానికి ఎన్ఎస్‌జీ రోబోలను మోహరించింది.

ఉత్తర గాజా రక్తసిక్తం

- ఇజ్రాయెల్ దాడిలో 87 మంది మృతి!
- యుద్ధం తక్షణం ఆపాలని ఐరాస పిలుపు

డెయిర్ అల్-బలా: గాజాలో రక్తం ఏరులై పారుతోంది! అక్కడి బెట్ లాహియాలో ఇజ్రాయెల్ శనివారం జరిపిన భూతల దాడిలో 87 మంది మృతి చెందారని, 40 మంది గాయపడ్డారని పాలస్తీనా ఆరోగ్య శాఖ పేర్కొంది. భవనాలకు భవనాలు నేలమట్టమయ్యాయని పేర్కొంది. గత 2 వారాలుగా ఉత్తర గాజాను ఇజ్రాయెల్ సైన్యం (ఐడీఎఫ్) పూర్తిస్థాయిలో దిగ్బంధించింది. హమాస్ మిలిటెంట్ల ఏరివేతే లక్ష్యంగా భారీ ఆపరేషన్ నిర్వహిస్తోంది. దీంతో ఈ ప్రాంతానికి ఆహారం, తాగునీరు కూడా సరఫరా కావడం లేదు. ఉత్తర గాజాలోని బెట్ లాహియాలో హమాస్ స్థావరాన్ని మాత్రమే తాము లక్ష్యం చేసుకున్నామని ఐడీఎఫ్ తెలిపింది. మృతుల సంఖ్య విషయంలో పాలస్తీనా ఆరోగ్యశాఖ చెబుతున్న గణాంకాలను తప్పుబట్టింది. అంతమంది మరణించలేదని పేర్కొంది. తాజా దాడి నేపథ్యంలో ఐక్యరాజ్యసమితి శాంతి ప్రక్రియ సమన్వయకర్త వెన్స్‌ల్యాండ్ తీవ్రంగా స్పందించారు. తక్షణమే యుద్ధాన్ని ఆపాలని ఇరు వర్గాలకు విజ్ఞప్తి చేశారు. "సాధారణ పౌరులపై నిరంతరం జరుగుతున్న దాడులను ఖండిస్తున్నాను. యుద్ధం ఆగాల్సిందే. బందీలను హమాస్ విడిచిపెట్టాల్సిందే. పాలస్తీనియన్ల వలసలు ఆగాల్సిందే. వారికి మానవతా సాయం అందాలి" అని తెలిపారు. ఇజ్రాయెల్ దాడిలో తమ దేశానికి చెందిన ముగ్గురు సైనికులు మృతి చెందారని లెబనాన్ ప్రకటించింది. బీరుట్‌తో పాటు దక్షిణ లెబనాన్‌పైనా ఐడీఎఫ్ భారీ స్థాయిలో విరుచుకుపడుతోంది.

కశ్మీర్‌లో ఉగ్రదాడి

- ఓ వైద్యుడు, ఆరుగురు కార్మికుల మృతి
- నిందితులను వదలబోం: అమిత్‌షా

శ్రీనగర్, దిల్లీ: జమ్మూకశ్మీర్‌లోని గాందర్‌బల్ జిల్లాలో ఉగ్రవాదులు జరిపిన దాడిలో ఓ వైద్యుడు, ఆరుగురు కార్మికులు మృతిచెందగా, మరో అయిదుగురు గాయపడినట్లు అధికారులు తెలిపారు. జిల్లాలోని గుండ్ వద్ద శ్రీనగర్ - లేహ్ జాతీయ రహదారిలో సొరంగ నిర్మాణపనులు చేస్తున్న ప్రయివేటు కంపెనీ కార్మికుల కోసం తాత్కాలిక ఆవాసాలు ఏర్పాటు చేసింది. ఆదివారం సాయంత్రం కార్మికులు, సిబ్బంది పనులు ముగించుకొని తమ ఇళ్లకు తిరిగి వచ్చారు. ఆ సమయంలో ఇద్దరు ఉగ్రవాదులు వారిపై కాల్పులకు తెగబడ్డారు. పోలీసు బలగాలు, సైనిక దళాలు ముష్కరుల గాలింపునకు చర్యలు చేపట్టాయి. కశ్మీర్ పోలీస్ ఐజీ వి.కె. బిర్ది ఘటనా స్థలాన్ని పరిశీలించారు. స్థానికేతరులైన కార్మికులపై జరిగిన ఈ దాడి పిరికిచర్య అంటూ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఖండించారు. దాడిని హేయమైన చర్యగా ఖండించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా దీనికి బాధ్యులైన ఉగ్రవాదులను విడిచిపెట్టబోమని 'ఎక్స్' ద్వారా పేర్కొన్నారు.

భారత సంతతి ఓటర్లూ కీలకమే!

- అమెరికా ఎన్నికల్లో ప్రభావం అధికమే..

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో భారతీయ అమెరికన్ల ఓట్లు కీలకంగా మారాయి. సంఖ్యాపరంగా చూస్తే ఓటర్లు తక్కువగానే ఉన్నప్పటికీ, నానాటికీ భారతీయ అమెరికన్ల ప్రభావం పెరుగుతుండటంవల్ల వారిని విస్మరించే పరిస్థితి లేదు. అందుకే రెండు ప్రధాన పార్టీలు వీరి ఓట్లను దక్కించుకునేందుకు ప్రత్యేక ప్రణాళికలు వేస్తున్నాయి. అమెరికా రాజకీయాల్లో భారతీయ మూలాలున్నవారు కీలక పాత్ర పోషిస్తున్నారు.





కేవలం ఓటర్లుగానే కాకుండా రాజకీయ నేతలుగా, అభ్యర్థులుగా, ఓటర్లను సమీకరించే శక్తులుగా, నిధులు సేకరించే వారిగా ఇలా అనేక అంశాల్లో భారతీయులు ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. అమెరికా మొత్తం ఓటర్లలో భారతీయ అమెరికన్ల ఓట్లు దాదాపు 21 లక్షలుంటాయి. అధ్యక్ష ఎన్నికను మలుపు తిప్పగల సామర్థ్యమున్న స్వింగ్ రాష్ట్రాల్లో భారతీయుల జనాభా ఎక్కువగా ఉంది. స్వింగ్ స్టేట్స్‌గా పిలిచే పెన్సిల్వేనియా, ఆరిజోనా, నెవడా, జార్జియా, మిషిగన్, నార్త్ కరోలినా, విస్కాన్సిన్ రాష్ట్రాల్లో ఉన్న దక్షిణాసియా ఓటర్లలో ఇండియన్లు అత్యధికంగా ఉన్నారు. అధ్యక్ష ఎన్నికల ఫలితాన్ని తేల్చడంలో అత్యంత కీలకమైన పెన్సిల్వేనియా రాష్ట్రంలోని బక్స్ కౌంటీలో భారతీయులు అధిక సంఖ్యలో ఉన్నారు. మిషిగన్, జార్జియా రాష్ట్రాల్లోనూ భారతీయ సంతతి అధికంగా ఉంది.

భారీ స్థాయిలో విరాళాలు

అమెరికాలో ప్రధాన పార్టీలకు భారతీయ అమెరికన్ల నుంచి పెద్ద మొత్తంలో విరాళాలు అందుతున్నాయి. అక్కడ భారతీయ అమెరికన్ల సగటు వార్షిక ఆదాయం 1.45 లక్షల డాలర్లుగా ఉంది. ఇది అమెరికన్లతో పోలిస్తే 21 శాతం ఎక్కువ. హారిస్‌కు కాలిఫోర్నియాలో ఇటీవల ఒక్క వారంలోనే ఏకంగా 5.5 కోట్ల డాలర్ల విరాళాలు వచ్చాయి. వాటిలో ఎక్కువ మొత్తం భారతీయ అమెరికన్ల నుంచే వచ్చాయి. డెమోక్రటిక్ పార్టీకి భారీగా విరాళాలిచ్చిన జాబితాలో 60 మందికి పైగా ఇండియన్ అమెరికన్లు ఉన్నారు. అక్కడ రాజకీయాల్లో చురుగ్గా పాల్గొంటున్న భారతీయుల సంఖ్య పెరుగుతోంది. సెనేట్, ప్రతినిధుల సభతో పాటు రాష్ట్రాల సెనేట్లు, అసెంబ్లీలు, సిటీ కౌన్సిళ్లు, స్కూలు బోర్డులకు ప్రాతినిధ్యం వహిస్తున్న, జిల్లాల అటార్నీలుగా నియమితులవుతున్న భారతీయ మూలాలున్నవారి సంఖ్య పెరుగుతోంది.

సర్వేలు ఏం చెబుతున్నాయి?

స్వింగ్ రాష్ట్రాల్లో హారిస్, ట్రంప్ విజయావకాశాలను భారతీయ ఓటర్లు ప్రభావితం చేసే అవకాశం ఉందని సర్వేలు అంటున్నాయి. అమెరికాలో దక్షిణాసియాకు చెందిన 48 లక్షల మందికిపైగా యువ ఓటర్లను ప్రభావిత చేయడంలో భారతీయులు కీలకంగా మారినట్లు వెల్లడించాయి. గత రెండు అధ్యక్ష ఎన్నికల్లోనూ భారతీయ అమెరికన్లు భారీ సంఖ్యలో ఓటేసినట్లు ఎగ్జిట్ పోల్స్ తెలిపాయి. 2020 ఎన్నికల్లో 71 శాతం ఇండో అమెరిన్లు ఓటేసినట్లు చెప్పాయి. ఈసారి 91 శాతం మంది ఓటు వేసే అవకాశాలు ఉన్నాయని ఆసియన్ అమెరికన్ ఓటర్ సర్వే అంచనా వేసింది.

భారతీయ అమెరికన్ల మద్దతు ఎవరికి?

భారతీయ అమెరికన్లలో దాదాపు 55 శాతం మంది డెమోక్రటిక్ పార్టీ మద్దతిస్తున్నట్లు తాజా సర్వేలు వెల్లడించాయి. 25 శాతం మంది రిపబ్లికన్ పార్టీకి మద్దతిచ్చారు. 15 శాతం మంది స్వతంత్రులకు మద్దతివ్వగా, మిగిలిన వారు తమ అభిప్రాయాన్ని చెప్పేందుకు విముఖత చూపినట్లు సర్వేలు తెలిపాయి.

మహారాష్ట్ర, ఝార్ఖండ్‌లలో

మిత్రపక్షాలకు కాంగ్రెస్ పెద్దపీట!

ముంబయి, రాంచీ: హరియాణా, జమ్మూకశ్మీర్ ఎన్నికల్లో దెబ్బతిన్న కాంగ్రెస్ ఇప్పుడు మిత్రపక్షాలతో సీట్ల సర్దుబాటుపై ఆచితూచి వ్యవహరిస్తోంది. మహారాష్ట్ర, ఝార్ఖండ్ ఎన్నికల్లో భాజపాను నిలువరించేందుకు తక్కువ సీట్లలో పోటీకి సిద్ధమవుతోంది. మహారాష్ట్రలో 288లో హస్తం పార్టీ 125 సీట్లు ఆశించింది. చివరకు 105-110 సీట్లలో పోటీకి సిద్ధమైనట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. మిత్రపక్షాలైన శివసేన (యూబీటీ), ఎన్‌సీపీ (ఎస్‌పీ), సమాజ్‌వాదీ పార్టీలతో సీట్ల సర్దుబాటుపై చర్చలు జరుపుతున్నామని పేర్కొన్నాయి. మిత్రపక్షాలకు సానుకూల సంకేతం పంపేందుకు తమ సీట్లను తగ్గించుకున్నామని వెల్లడించాయి. 2019లో ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో జేఎంఎం కూటమితో కలిసి కాంగ్రెస్ బరిలోకి దిగింది. అప్పట్లో కాంగ్రెస్ 31 సీట్లలో అభ్యర్థులను పోటీకి దింపింది. ఈసారి 33 సీట్లను కోరి, 29కే ఒకే చెప్పినట్లు తెలుస్తోంది. జేఎంఎం గతసారి 43 స్థానాల్లో బరిలోకి దిగగా, ఈసారి రెండు స్థానాలను అదనంగా ఆశిస్తోంది.



ఒంటరిగా పోటీకైనా రెడీ: ఆర్జేడీ

ఝార్ఖండ్‌లో ఆర్జేడీ గతసారి 7 స్థానాల్లో పోటీ చేసింది. 18-20 సీట్లలో బలంగా ఉన్న తాము ప్రస్తుత ఎన్నికల్లో 12-13 కంటే తక్కువ సీట్లకైతే అంగీకరించేది లేదని, ఒకవేళ ఒంటరిగా పోటీ చేసినా ఇండియా కూటమి అవకాశాలకు మాత్రం ద్రోహం తలపెట్టబోమని స్పష్టంచేసింది. తాము పోటీచేసే స్థానాలను సోమవారం ప్రకటిస్తామని, అవి మినహా మిగిలిన 60-62 చోట్ల కూటమి అభ్యర్థులకు మద్దతు ఇస్తామని ఆర్జేడీ అధికార ప్రతినిధి మనోజ్ కుమార్ ఝా తెలిపారు. భాజపాను ఓడించడమే తమ ఉమ్మడి ధ్యేయమన్నారు.

'మహా' ఎన్నికల బరిలో దిగుతాం: మనోజ్ జరాంగే



ముంబయి: మరాఠా వర్గానికి రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఉద్యమం చేపట్టిన మనోజ్ జరాంగే- మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి అభ్యర్థులను బరిలోకి దించనున్నట్లు తెలిపారు. మరాఠా సామాజికవర్గం బలంగా, విజయావకాశాలు ఎక్కువగా ఉన్నచోట పోటీ చేస్తామని వెల్లడించారు. తమ ఉద్యమాన్ని ఉపముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ అణగదొక్కారని ఆరోపించారు. "ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన స్థానాల్లో మరాఠా ఉద్యమానికి అండగా నిలిచే అభ్యర్థులకు మద్దతు ఇస్తాం. విజయావకాశాలు అంతగా లేని నియోజకవర్గాల్లో.. కులమతాలు, పార్టీలతో సంబంధం లేకుండా మరాఠా రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నవారి గెలుపునకు పోరాడతాం. ఈ డిమాండుకు అంగీకరించిన అభ్యర్థులు తప్పనిసరిగా ప్రమాణపత్రంపై సంతకం చేయాలి" అని సరాటీలో నిర్వహించిన ఓ సభలో మనోజ్ జరాంగే తెలిపారు. మరాఠా రిజర్వేషన్లకు అనుకూలంగా ఉన్న అభ్యర్థులు తొలుత నామినేషన్లు దాఖలు చేయాలని, అక్టోబరు 29న వారి అభ్యర్థిత్వంపై తుది నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

2 గంటల్లో 21 కి.మీ. పరుగెత్తిన ఒమర్ అబ్దుల్లా

జమ్మూకశ్మీర్ మారథాన్‌లో పాల్గొన్న సీఎం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో జరిగిన తొలి అంతర్జాతీయ మారథాన్‌లో 21 కిలోమీటర్ల దూరాన్ని 2 గంటల్లో పూర్తి చేసి ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా(54) క్రీడా స్ఫూర్తిని చాటుకున్నారు. కశ్మీర్‌లో మొదటిసారిగా నిర్వహించిన ఈ మారథాన్‌లో ఐరోపా, ఆఫ్రికా దేశాల క్రీడాకారులతో పాటు 2 వేల మంది పాల్గొన్నారు. ఆదివారం ఈ కార్యక్రమాన్ని బాలీవుడ్ నటుడు సునీల్ శెట్టి ప్రారంభించారు. కశ్మీర్ మారథాన్ ప్రపంచంలోని అత్యుత్తమ కార్యక్రమాల్లో ఒకటిగా మారుతుందని ఆశిస్తున్నట్లు ఈ సందర్భంగా సీఎం ఒమర్ పేర్కొన్నారు. 'నా జీవితంలో 13 కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరం ఎప్పుడూ పరిగెత్తలేదు. అది కూడా ఒక్కసారి మాత్రమే. ఈ రోజు చాలా మంది మారథాన్‌లో పాల్గొన్నారు. ఎంతో ఉత్సాహంగా వారితో పాటు ముందుకు సాగాను" అని కార్యక్రమం అనంతరం ఒమర్ వ్యాఖ్యానించారు. కాగా మారథన్‌లో షేర్ సింగ్, తంసీ సింగ్ విజేతలుగా నిలిచారు. 18-35 వయసు విభాగంలో 42 కిలోమీటర్లను 2.23గంటల సమయంలో పూర్తిచేసిన షేర్ సింగ్ పురుషుల్లో మొదటి స్థానంలో నిలవగా.. 3.03 గంటల్లో లక్ష్యాన్ని పూర్తి చేసిన తామసీ సింగ్ మహిళల్లో ప్రథమ స్థానంలో నిలిచారు. విజేతలకు లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా బహుమతులను అందించారు.



వయనాడ్‌లో ప్రియాంకపై పోటీకి

భాజపా యువ నాయకురాలు నవ్య



వయనాడ్: కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీపై వయనాడ్‌లో కేరళ భాజపా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి నవ్యా హరిదాస్‌ను భాజపా బరిలోకి దింపింది. దీంతో ఇద్దరు మహిళా నేతల మధ్య ఆసక్తికర పోరు నెలకొంది. కాలికట్ విశ్వవిద్యాలయం నుంచి బీటెక్ పూర్తిచేసిన నవ్య.. ప్రస్తుతం కోజికోడ్ నగరపాలక సంస్థలో భాజపా వార్డు కౌన్సిలర్‌గా ఉన్నారు. వరుసగా రెండుసార్లు ఆమె ఈ పదవికి ఎన్నికయ్యారు. 2021లో కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో దక్షిణ కోజికోడ్ నియోజకవర్గం నుంచి ఎన్డీయే అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. తాజాగా వయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నికల బరిలో అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. వయనాడ్ లోక్‌సభ స్థానం అంటే గాంధీ కుటుంబానికి కేవలం ఓ ఐచ్ఛికమేనని, దానిని ఎప్పుడూ రెండో సీటుగానే చూస్తుందని నవ్య ఆరోపిస్తున్నారు. స్థానిక ప్రజలు ఈ విషయాన్ని గ్రహించారని, తమ వెన్నంటి నిలిచి సమస్యల్ని పరిష్కరించే నేతను వారు కోరుకుంటున్నారని ఆమె కోజికోడ్‌లో విలేకరులకు తెలిపారు. వయనాడ్ గురించి పార్లమెంటులో ప్రస్తావించడంలో గాంధీ కుటుంబం విఫలమైందని, అలాంటి కుటుంబం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రియాంకా గాంధీ బరిలోకి దిగారని చెప్పారు. 'ఐదేళ్ల పాటు రాహుల్‌గాంధీ తమకు ప్రాతినిధ్యం వహిస్తారని వయనాడ్ ప్రజలు ఆయన్ని ఎన్నుకున్నారు. కానీ రాయ్‌బరేలీలో కూడా గెలిచేసరికి ఆయన ఈ స్థానాన్ని వదిలేశారు' అని విమర్శించారు. ఉప ఎన్నికల్లో తనకు టికెట్ లభించడం ఆశ్చర్యం కలిగించిందన్నారు.

మహారాష్ట్రపై ఆరెస్సెస్ కసరత్తు

- భాజపా వైపు ప్రజాభిప్రాయాన్ని మలచడంపై దృష్టి

దిల్లీ: ప్రతిష్ఠాత్మకంగా మారిన మహారాష్ట్ర ఎన్నికల్లో భాజపా విజయావకాశాలను మెరుగుపరచడంపై రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్) దృష్టి సారించింది. ఇటీవల హరియాణాలో భాజపా విజయానికి తోడ్పడిన రీతిలోనే మహారాష్ట్రలోనూ ప్రజాభిప్రాయాన్ని మలచడంలో సంఘ్ బృందాలు పెద్దఎత్తున నిమగ్నమయ్యాయి. తమకు కేటాయించిన ప్రాంతాలకు అవి చేరుకుని, నిర్దిష్ట సందేశాన్ని చేరవేయడానికి 5-10 మంది ప్రజలతో చిన్నచిన్న బృందాలుగా సమావేశమవుతున్నాయి. ఇప్పటివరకు 1.25 లక్షల బృందాలతో ఇలాంటి భేటీలు పూర్తయ్యాయి. నేరుగా భాజపా అభ్యర్థుల పక్షాన ఓట్లు కోరడం కాకుండా దేశ ప్రయోజనాలు, హిందుత్వం, సుపరిపాలన, అభివృద్ధి, ప్రజా సంక్షేమం, సమాజ సంబంధిత అంశాల గురించి ప్రజలకు విడమరచి చెప్పి.. పరోక్షంగా మద్దతు కోరుతున్నాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ బృందాలు ఏర్పడటానికి ముందే సంఘ్ నేతలు, అనుబంధ సంఘాలవారు వేర్వేరు స్థాయిల్లో సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేసుకుని వ్యూహాన్ని రూపొందించారు. అగ్నిపథ్ నియామక పథకంపై ఉన్న ఆందోళనల్ని తొలగించడంలో, రైతులను పార్టీకి అనుకూలంగా మార్చడంలో హరియాణాలో చేసిన ప్రయత్నం సఫలమైందని మరో నాయకుడు పీటీఐ వార్తాసంస్థకు తెలిపారు.

ఇండోనేసియా అధ్యక్షుడిగా ప్రబోవో సుబియాంటో ప్రమాణం

జకార్తా: ప్రపంచంలో అత్యధిక ముస్లిం జనాభా కలిగిన ఇండోనేసియా ఎనిమిదవ అధ్యక్షుడిగా ప్రబోవో సుబియాంటో (73) ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, విదేశీ ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మద్దతుదారులు రహదారులపైకి పెద్దఎత్తున చేరి సంబరాలు చేసుకున్నారు. ఉపాధ్యక్షుడిగా సురాకార్తా మాజీ మేయర్ గిబ్రాన్ రాకాబుమింగ్ రాకా ప్రమాణం చేశారు. ఆయన తాజా మాజీ అధ్యక్షుడు జోకో విడొడో కుమారుడు.



అమెరికాలో కూలిన డాక్ గ్యాంగ్‌వే

ఏడుగురి మృతి

సాపెలో ఐలాండ్: అమెరికాలోని జార్జియా రాష్ట్రంలో ఉన్న సాపెలో ద్వీపంలో శనివారం పడవల డాక్ గ్యాంగ్‌వే (పడవలు ఎక్కడానికి ఏర్పాటు చేసే తాత్కాలిక నడక దారి) కూలి ఏడుగురు మృతి చెందారు. గాయపడిన పలువురిని ఆసుపత్రికి తరలించారు. గ్యాంగ్ వే కూలడంతో పలువురు నీటిలో పడిపోయారు. ద్వీపంలో ఉత్సవాల కోసం భారీగా జనం రావడంతో ఈ ప్రమాదం జరిగింది.

బిహార్ ఆలయంలో విగ్రహాల ధ్వంసం

భాగల్‌పుర్: బిహార్‌లోని భాగల్‌పుర్ జిల్లాలోని ఓ ఆలయంలో ఉన్న విగ్రహాలను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. దీంతో ఆగ్రహించిన ప్రజలు ఆదివారం రోడ్లెక్కి నిరసనలు చేపట్టారు. టైర్లను తగలబెట్టారు. దీంతో భద్రతా బలగాలు కవాతు నిర్వహించాయి. ఈ ఘటనలో అనుమానితుడిని అరెస్టు చేశామని, దీనిపై విచారణ చేపట్టామని పోలీసులు పేర్కొన్నారు.



ఆలోచనా ధోరణి మారితేనే సత్ఫలితాలు

ఆలోచనా ధోరణి మార్చుకున్నప్పుడు మాత్రమే జీవితం మారుతుంది. రోజంతా పని చేసి, ఒత్తిడి నుంచి ఉపశమనం పొందడానికి సాయంత్రం పబ్‌కు వెళ్లడమే మార్గమని ఆలోచించే యువత ఇక నుంచి నడక, వ్యాయామం లేదా ఆటలాడటానికి వెళ్లాలి. దాని ఫలితం ఎలా ఉంటుందో మీకే అనుభవంలోకి వస్తుంది. మద్యపానం లాంటి పలాయనవాద అలవాట్లు ఆరోగ్యకరమైన పరిష్కారాలు ఇవ్వలేవని గుర్తుంచుకోండి.

– ఐగొర్ బ్యూనెవిసి, పర్సనల్ గ్రోత్ మెంటార్

ఏపీలో కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ఆలపాటి, పేరాబత్తుల

ఈనాడు, అమరావతి: ఏపీలో రెండు ఎమ్మెల్సీ స్థానాలకు కూటమి తమ అభ్యర్థులను ప్రకటించింది. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను, ఉమ్మడి పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పేరాబత్తుల రాజశేఖర్‌ను పార్టీ అధినేత, సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ఖరారు చేసినట్లు తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు.

ఆదాయం ఎందుకు తగ్గింది?

- రాబడి పెంచాలంటూ ప్రభుత్వ ఆదేశం



ఈనాడు, హైదరాబాద్: అదనంగా పన్నులు పెంచకుండా రాష్ట్రంలో ఆదాయం పెంచాలని అన్ని శాఖలను ప్రభుత్వం తాజాగా ఆదేశించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) తొలి అర్ధభాగం (ఏప్రిల్ నుంచి సెప్టెంబరు)లో నిర్దేశించిన లక్ష్యం రూ.42,034 కోట్లు కాగా.. అందులో రూ.4,719 కోట్ల మేర తగ్గడాన్ని ప్రభుత్వం సీరియస్‌గా పరిగణిస్తోంది. ఈ క్రమంలో ఆదాయం ఎందుకు తగ్గుతోంది.. ఇతర రాష్ట్రాల మాదిరిగా ఎందుకు పెంచలేకపోతున్నామనేది అధ్యయనం చేసి చెప్పాలని సంబంధిత ప్రభుత్వశాఖలకు సూచించింది. ఈ మేరకు ఒడిశా, ఏపీ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల విధానాలతో పాటు.. కేంద్రం జీఎస్టీ వసూలులో అమలుచేస్తున్న నూతన విధానాలేమైనా ఉన్నాయా అనేది అధ్యయనం చేయడానికి రాష్ట్ర వాణిజ్య పన్నులశాఖ అధికారుల బృందాలను పంపింది. ఆయా రాష్ట్రాలకు వెళ్లిన బృందాలు క్షేత్రస్థాయిలో అక్కడ పన్నుల వసూళ్ల తీరు ఎలా ఉందనేది పరిశీలించాయి. ఈ నివేదికలను నేడో, రేపో తెలంగాణ ప్రభుత్వానికి సమర్పించనున్నాయి. వీటిపై సోమ, మంగళవారాల్లో సర్కారు సమీక్ష జరపనుందని తెలుస్తోంది. అధ్యయనానికి వెళ్లిన అధికారుల బృందాలను ఈ సమావేశానికి హాజరుకావాలని వాణిజ్య పన్నులశాఖ కమిషనర్ రిజ్వీ ఆదేశించారు.


మద్యంపై మినహా అన్నీ తగ్గుదల..

నెలవారీగా పన్నుల ద్వారా ఆదాయంపై సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల లోతుగా సమీక్షించారు. ఈ ఏడాది తొలి అర్ధభాగంలో మద్యంపై అమ్మకపు పన్ను నిర్దేశిత లక్ష్యం రూ.8,079 కోట్లకు గాను మరో రూ.31 కోట్లు పెరిగి రూ.8,110 కోట్లు వచ్చింది. ఇది తప్ప జీఎస్టీ, పెట్రోలియంపై అమ్మకపు పన్ను, వృత్తి పన్ను వంటి ఆదాయాల్లో లక్ష్యాల కంటే తగ్గుదల నమోదైంది.

- ✦ జీఎస్టీపై లక్ష్యం రూ.24,906 కోట్లు కాగా.. ఏకంగా రూ.4,086 కోట్లు తగ్గి రూ.20,820 కోట్లు మాత్రమే వచ్చినట్లు తేలింది. 16 శాతానికిపైగా తగ్గడం ఏమిటని వాణిజ్యపన్నుల అధికారుల పనితీరుపై ప్రభుత్వం అసంతృప్తి వ్యక్తం చేసింది. పన్నుల వసూళ్లు ఎందుకు పెరగడం లేదని ప్రశ్నించింది.
- ✦ పెట్రోలియంపై అమ్మకపు పన్ను లక్ష్యం రూ.8,606 కోట్లకు గాను రూ.654 కోట్లు, వృత్తిపన్ను రూ.437 కోట్లకు గాను రూ.17 కోట్లు తక్కువగా వచ్చింది.

శత శాతం సాధించేనా!

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వచ్చే మార్చి నాటికి పన్నుల ద్వారా మొత్తం రూ.85,126 కోట్లు రాబట్టాలనేది లక్ష్యం. ఇందులో తొలి 6 నెలల నిర్దేశిత లక్ష్యంలో తగ్గుదల నమోదు కావడంతో వచ్చే మార్చినాటికి వందశాతం లక్ష్యం సాధించేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో పన్నుల వసూళ్లలో పారదర్శకత పెంచాలని, క్షేత్రస్థాయిలో తనిఖీలు, ఆడిట్‌లు విస్తృతంగా నిర్వహిస్తే ఆదాయం గణనీయంగా పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఇతర రాష్ట్రాల్లో అధ్యయనం చేయగా.. అక్కడ ఆడిట్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాలు వాణిజ్యపన్నులశాఖలో విడిగా పనిచేస్తున్నాయని, రోజూవారీ విధులు నిర్వహించే సిబ్బందికి ఆ పనులు లేకపోవడం వల్ల పన్నుల వసూళ్లపై ఎక్కువగా దృష్టి పెడుతున్నట్లు తేలింది. తెలంగాణ వాణిజ్యపన్నులశాఖలో పనిచేసే సిబ్బందికి వృత్త్యంతర శిక్షణ లేకపోవడం వల్ల ఆధునిక పరిజ్ఞాన వినియోగం, వసూళ్ల పెంపులో నూతన విధానాలు తెలియడం లేదని గుర్తించారు. రాష్ట్రంలో ఒక సర్కిల్‌లో ఆదాయం పెరగకపోతే అక్కడి సిబ్బందిని ప్రశ్నించడమే తప్ప క్షేత్రస్థాయిలో వారి పనితీరులో ఉన్న లోపాలపై తనిఖీలు లేకపోవడంతో వారేం చేస్తున్నారనేది ప్రభుత్వానికి తెలియడం లేదని సీనియర్ అధికారులు చెబుతున్నారు. జీఎస్టీ చెల్లింపులపై సమగ్రంగా ఆడిట్‌లు, తనిఖీలు నిర్వహిస్తే ఆదాయం పెరుగుతుందని వారు వివరించారు. ఇప్పటికే కొన్ని వ్యాపారసంస్థలు జీఎస్టీ చెల్లించకుండా ఎగవేస్తున్నట్లు గుర్తించి నోటీసులు జారీ చేసినట్లు అధికారులు చెప్పారు.



స్వయం సహాయక సంఘాలకు చెక్కు అందిస్తున్న చల్లా శ్రీనివాసులు శెట్టి. చిత్రంలో చిన్నారెడ్డి, మేఘారెడ్డి, రాజేశ్‌రెడ్డి తదితరులు

రాష్ట్రానికి రూ.51 కోట్ల 'పీఎం విశ్వకర్మ' రుణాలు

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే: పీఎం విశ్వకర్మ యోజన కింద దేశవ్యాప్తంగా రూ.354 కోట్ల రుణాలు మంజూరు కాగా, ఇందులో రూ.51 కోట్లు తెలంగాణలో లబ్ధిదారులకు అందించామని ఎస్బీఐ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి తెలిపారు. ఆర్థిక సేవలతోపాటు సామాజిక సేవలో తమ బ్యాంకు ముందుంటుందని పేర్కొన్నారు. ఆదివారం వనపర్తిలో ఎస్బీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వినియోగదారులతో నిర్వహించిన సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడారు. సీఎస్ఆర్ నిధులతో గత ఏడాది దేశవ్యాప్తంగా భారతీయ స్టేట్ బ్యాంకు ఆధ్వర్యంలో వెయ్యి ప్రభుత్వ పాఠశాలలు, వెయ్యి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను అభివృద్ధి చేశామని తెలిపారు. అనంతరం వనపర్తి జిల్లాలో పీఎం విశ్వకర్మ యోజన కింద ఎంపికైన 185 మంది లబ్ధిదారులకు రూ.1.47 కోట్ల చెక్కు అందించారు. జోగులాంబ రీజియన్ పరిధిలో స్వయం సహాయక సంఘాలకు మంజూరైన రూ.31 కోట్ల చెక్కును అందజేశారు. వనపర్తి జిల్లాలో ముద్ర రుణాలకు దరఖాస్తు చేసుకున్న 50 మంది లబ్ధిదారులకు రూ.50 లక్షల చెక్కు అందించారు. నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎస్బీఐ ఎండీ సంజయ్ ప్రకాశ్, వనపర్తి, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యేలు మేఘారెడ్డి, రాజేశ్‌రెడ్డి, పలువురు నేతలు, అధికారులు పాల్గొన్నారు.



రైతునేస్తం పురస్కారాలు అందుకున్న రైతులతో వెంకయ్యనాయుడు, యడ్లపల్లి వెంకటేశ్వరరావు, కామినేని శ్రీనివాస్

శాస్త్ర, సాంకేతికతతోనే లాభసాటి వ్యవసాయం

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

ఈనాడు – అమరావతి: రైతులు అధునాతన శాస్త్ర, సాంకేతికతలను అందిపుచ్చుకునేలా శాస్త్రవేత్తలు చొరవ తీసుకోవాలని, అప్పుడే వ్యవసాయ రంగంలో అద్భుతాలు సృష్టించవచ్చని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్టులో ఆదివారం 'రైతు నేస్తం' మాసపత్రిక 20వ వార్షికోత్సవం సందర్భంగా పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రైతులకు అవగాహన కల్పించడంలో 'ఈనాడు', 'ఈటీవీ' వ్యవస్థాపకులు రామోజీరావు చేసిన సేవలు మరువలేనివని ఈ సందర్భంగా ఆయన కొనియాడారు. కార్యక్రమంలో ఏపీ రైతు సాధికార సంస్థకు జీవన సాఫల్య పురస్కారాన్ని అందించారు. ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ టి.విజయకుమార్‌కు పురస్కారాన్ని అందించి, సన్మానించారు. హైదరాబాద్ ఆల్వాల్‌కు చెందిన చింతల వెంకటరెడ్డిని 'కృషి రత్న' బిరుదుకు ఎంపిక చేశారు. లాభసాటి ప్రకృతి వ్యవసాయం చేస్తున్న 20 మంది రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్త ఐ.వి.సుబ్బారావు పేరిట అవార్డులు ఇచ్చి సత్కరించారు. రైతు నేస్తం ఎడిటర్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జామకాయలు కాదు.. బీర కాయలు..



ఈ సందర్భంగా నిర్వహించిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శనలో .. నాగర్‌కర్నూల్ జిల్లా చారుగొండ మండలం జూపల్లికి చెందిన రంగప్రసాద్ పండించిన బంతి బీరలు ఆకట్టుకున్నాయి. బీరకాయల్లా పొడుగ్గా కాకుండా గుండ్రంగా ఉన్నాయి. వీటిని వెంకయ్యనాయుడు ఆసక్తిగా పరిశీలించారు.

కజకిస్థాన్‌లో హైదరాబాద్ వాసికి ప్రమాదం

- చికిత్సలో భాగంగా కాలు తొలగింపు
- అండగా నిలిచిన అక్కడి భారతీయులు
- అభినందించిన రాయబారి నాగేంద్రప్రసాద్

ఈనాడు, హైదరాబాద్: స్నేహితులతో కలిసి కజకిస్థాన్‌లో పర్యాటక ప్రదేశాలను చూసేందుకు వెళ్లిన హైదరాబాద్ వాసి రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. క్లిష్ట పరిస్థితుల్లో అక్కడి భారత రాయబార కార్యాలయం చొరవతో భారత కమ్యూనిటీ, 'ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ కల్చర్' అండగా నిలిచాయి. ఆయా సంస్థలను భారత రాయబారి టి.వి.నాగేంద్రప్రసాద్ అభినందించారు. హైదరాబాద్ కూకట్‌పల్లికి చెందిన 37 ఏళ్ల విద్యాధర్ రాఘవన్ స్నేహితులతో కలిసి కజకిస్థాన్‌లోని అల్మాటీకి ఈ నెల 10న చేరుకున్నారు. అదేరోజు క్యాబ్‌లో ప్రయాణిస్తుండగా ఆయనకు ప్రమాదం జరిగి కాలు తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ సమాచారాన్ని అక్కడి భారత రాయబార కార్యాలయం.. హైదరాబాద్‌లోని కుటుంబ సభ్యులకు చెప్పడంతో ఆయన సోదరుడు హుటాహుటిన అక్కడికి వెళ్లారు. కుటుంబ సభ్యులు, ఆసుపత్రి వర్గాలతో ఎంబసీ సమన్వయం చేసింది. అక్కడ ఉన్న భారత కమ్యూనిటీ, ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ కల్చర్.. రాఘవన్‌కు సహాయం చేయడానికి 4,200 అమెరికా డాలర్లను సమీకరించి అందజేశాయి. చికిత్స అనంతరం వైద్యుల ధ్రువీకరణతో ఈ నెల 20న ఉదయం స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలిసి రాఘవన్ హైదరాబాద్ చేరుకున్నారు.



తిరుగుప్రయాణంలో.. అల్మాటీ విమానాశ్రయంలో చక్రాల కుర్చీలో విద్యాధర్ రాఘవన్

తప్పనిసరిగా వైద్య బీమా కలిగి ఉండాలి.. నాగేంద్రప్రసాద్: భారత్ నుంచి కజకిస్థాన్ వెళ్లే పర్యాటకుల సంఖ్య పెరిగింది. దిల్లీ నుంచి 3 గంటల విమాన ప్రయాణం కావడంతో ఎక్కువ మంది వెళుతున్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు భారత్ నుంచి కజకిస్థాన్‌కు వచ్చిన పర్యాటకుల సంఖ్య లక్ష దాటిందని నాగేంద్రప్రసాద్ తెలిపారు. అనుకోని ఘటనలు ఏవైనా జరిగితే వైద్యపరంగా ఇబ్బంది పడకుండా తప్పనిసరిగా వైద్య బీమా కలిగి ఉండాలని పర్యాటకులకు సూచించారు.

ఐటీలో పెట్టుబడులు ₹20 వేల కోట్లు







2 లక్షల మందికి ఉపాధి లక్ష్యం

- ఈ రంగం సుస్థిర అభివృద్ధికి ప్రణాళిక
- పెట్టుబడి పరిమాణం ఆధారంగా.. మూడు క్యాటగిరీలు
- మెగా కంపెనీలకు టైలర్ మేడ్‌గా ప్రోత్సాహకాలు
- పొరుగు రాష్ట్రాల పాలసీలకు దీటుగా నూతన విధానం
- 2024-29 మధ్య అమలులో ఉండేలా నిబంధనలు
- ముసాయిదా ఐటీ విధానం సిద్ధం

ఈనాడు – అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లో వచ్చే ఐదేళ్లలో ఐటీ రంగంలో రూ.20 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా 2 లక్షల మందికి ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో ఏపీ ప్రభుత్వం ముసాయిదా ఐటీ విధానాన్ని (పాలసీ) సిద్ధం చేసింది. ఈ విధానాన్ని అమలు చేయడం ద్వారా ఏపీలో ఈ రంగానికి అవసరమైన సుస్థిర వాతావరణాన్ని అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. 2024-29 మధ్య ఐదేళ్ల పాటు అమలులో ఉండే ఈ విధానాన్ని తుది పరిశీలన తర్వాత ప్రభుత్వం ప్రకటించనుంది. ఇప్పటికే ఐటీ రంగం వేళ్లూనుకున్న రాష్ట్రాలతో పోటీ పడి పెట్టుబడులు సాధించేందుకు వీలుగా ప్రోత్సాహకాలను అందించాలని నిర్ణయించింది. ఐటీ రంగానికి సంబంధించి పెట్టుబడుల ఆకర్షణలో గుర్తింపు పొందిన కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాల్లో అమలు చేస్తున్న ఐటీ విధానాలపై ప్రభుత్వం అధ్యయనం చేసింది. వాటిలోని లోపాలను మినహాయించి.. పెట్టుబడులను ఆకర్షించేందుకు ఉన్న సానుకూల అంశాలతో నూతన విధానాన్ని అధికారులు తీర్చిదిద్దారు. ఉపాధి కల్పన ఆధారంగా ఐటీ పార్కుల్లో భూములు. .పెట్టుబడుల ఆధారంగా ప్రోత్సాహకాలను అందించేలా ముసాయిదా పాలసీని అధికారులు సిద్ధం చేశారు.

లక్ష్య సాధనకు దోహదపడే అంశాలు

- స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్
- వాక్ టు వర్క్.. ఇతర సామాజిక మౌలిక సదుపాయాలు
- నైపుణ్యం కల్పించే వ్యవస్థ
- ఐటీ సేవల విస్తరణ కోసం ఐటీ స్పేస్, హబ్‌ల కోసం ప్రైవేటు స్థలాలను ప్రభుత్వం/ పట్టణ స్థానిక సంస్థలు గుర్తించాలి.
- పెట్టుబడుల ఆకర్షణ కోసం ఆకర్షణీయమైన ప్రోత్సాహకాలు.

ఏపీలో ఐటీ కంపెనీల డేటా..ఉపాధి

రాష్ట్రంలో వివిధ దశల్లో ఉన్న సుమారు 250 ఐటీ కంపెనీల డేటాబేస్‌ను ఐటీ శాఖ నిర్వహిస్తోంది. వాటి ద్వారా రూ.7,800 కోట్ల పెట్టుబడులతో పాటు..సుమారు 70 వేల మందికి ఉపాధి లభిస్తుందని గుర్తించింది. రాష్ట్రంలో సుమారు 70వేల మంది ఐటీ రంగంలో పనిచేస్తుండగా వీరిలో విశాఖలో అత్యధికంగా 67.6 శాతం, కృష్ణా జిల్లాలో 8.9, కాకినాడ- 7.1, విజయవాడ- 4.3 , తిరుపతిలో 3.7 శాతం మంది ఉపాధి పొందుతున్నారు. ఐటీ రంగంలో పెట్టుబడులను రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరించింది. ఆ ప్రకారం..

- రూ.500 కోట్లు..అంతకంటే ఎక్కువ: ఒక ప్రాజెక్టు.. రూ.540 కోట్ల పెట్టుబడి
- రూ.100కోట్ల నుంచి రూ.500 కోట్ల మధ్య: 27 ప్రాజెక్టులు..రూ.4,392 కోట్లు
- రూ.50కోట్ల నుంచి 100 కోట్ల మధ్య: 8 ప్రాజెక్టులు.. రూ.471 కోట్లు
- రూ.50 కోట్ల లోపు: 204 ప్రాజెక్టులు.. రూ.2,481 కోట్లు

మూడు క్యాటగిరీలుగా.. ప్రోత్సాహకాలు

ఐటీ రంగంలో పెట్టుబడులు పెట్టే సంస్థలకు పెట్టుబడుల స్థాయిని బట్టి మూడు క్యాటగిరీలుగా వర్గీకరించింది. ఈ ప్రాతిపదికగా ప్రోత్సాహకాలను అందించాలని భావిస్తోంది. ప్రస్తుతం ఎంఎస్ఎంఈ రంగంలోనే ఎక్కువ కంపెనీలు ఉన్నాయి. భవిష్యత్తులో లార్జ్, మెగా కంపెనీలను భారీ ఎత్తున ఆకర్షించేందుకు వీలుగా అనువైన వాతావరణాన్ని రాష్ట్రంలో అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. మెగా కంపెనీలకు టైలర్ మేడ్ విధానంలో ప్రోత్సాహకాలు చెల్లించాలని భావిస్తోంది.

- ఎంఎస్ఎంఈ : రూ.50 కోట్ల లోపు
- లార్జ్ : రూ.50 నుంచి రూ.100 కోట్ల లోపు
- మెగా : రూ.100 కోట్లు ఆ పైన

గత దశాబ్దంలో ఐటీ రంగ పరిస్థితి

- రాష్ట్రంలో 2014-19 మధ్య కాలంలో 102 ఐటీ ప్రాజెక్టులకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. వాటి ద్వారా రూ.2,007 కోట్ల పెట్టుబడులు.. 36,423 మంది ఉపాధి పొందుతున్నారు.
- 2019-24 మధ్య 52 ఐటీ ప్రాజెక్టులకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అందులో 39 ప్రాజెక్టులు అమల్లోకి వచ్చాయి. వాటి ద్వారా రూ.876 కోట్ల పెట్టుబడులు.. 16,234 మందికి ఉపాధి లభించింది. మరో 13 ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయి. వాటి ద్వారా రూ.231 కోట్ల పెట్టుబడులు.. 4,365 మందికి ఉపాధి లభించే అవకాశం ఉందని అంచనా.
- ఒకే సంస్థ పదేళ్ల వ్యవధిలో రెండు సార్లు ఒప్పందాలను కుదుర్చుకుంది. 2014-19 మధ్య అప్పటి ప్రభుత్వంతో విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటు ద్వారా రూ.30 వేల కోట్ల పెట్టుబడులు.. 28,600 మందికి ఉపాధి కల్పించేలా ప్రతిపాదించింది. ఆ తర్వాత అది అమలులోకి రాలేదు.

జగన్ ప్రభుత్వం.. పూర్తిగా నిర్లక్ష్యం

గత ప్రభుత్వం ఐదేళ్లలో ఐటీ రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. మూడేళ్ల పాటు (2021-24 మధ్య) అమలులో ఉండేలా ఐటీ పాలసీని ప్రకటించింది. కానీ, పాలసీ అమలు, మార్గదర్శకాలను ప్రభుత్వం ప్రకటించ లేదు. దీంతో పాలసీ ఆధారంగా ప్రోత్సాహకాల కోసం దరఖాస్తు చేయడానికి కంపెనీలకు అవకాశం లేకుండా పోయింది. జగన్ ప్రభుత్వం గత ఐదేళ్లలో ప్రోత్సాహకం కింద ఏ ఒక్క ఐటీ కంపెనీకీ రూపాయి కూడా చెల్లించలేదు.

- *2014-19 మధ్య (ఐదేళ్లలో) అప్పటి ఐటీ పాలసీ విధానాల ప్రకారం వివిధ కంపెనీలకు రూ.90.99 కోట్ల ప్రోత్సాహకాలను అప్పటి తెదేపా ప్రభుత్వం చెల్లించింది. ఐదేళ్ల వ్యవధిలో ఉపాధి కల్పన ఆధారంగా ప్రోత్సాహకాల కోసం 82 దరఖాస్తులు.. లీజు, రెంటల్ మినహాయింపు కోసం 224 దరఖాస్తులు (మొత్తం 434) అందాయి. అందులో 378 దరఖాస్తులకు ప్రోత్సాహకాలను అప్పటి ప్రభుత్వం చెల్లించింది.*

మహారాష్ట్రలో భాజపా కూటమిపై గెలుపునకు వ్యూహం

- మంత్రులు ఉత్తమ్, సీతక్క



మహారాష్ట్రలో కాంగ్రెస్ నేతల సమావేశంలో తెలంగాణ మంత్రులు ఉత్తమ్, సీతక్క

ఈనాడు, హైదరాబాద్: వచ్చే నెలలో మహారాష్ట్రలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో అధికార భాజపా కూటమిపై కాంగ్రెస్ పార్టీ గెలిచేందుకు అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించినట్లు తెలంగాణ మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీతక్క తెలిపారు. ఎన్నికల్లో విజయం సాధించడానికి చేయాల్సిన కసరత్తుపై ముంబయిలో ఏఐసీసీ పరిశీలకులు, ముఖ్యనేతలతో భేటీ అయినట్లు ఉత్తమ్, సీతక్క ఆదివారం మీడియాకు తెలిపారు. మహారాష్ట్రలో ఏఐసీసీ ఎన్నికల పరిశీలకులుగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీతక్క, యం.బి.పాటిల్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

కృష్ణా తీరానికి చేరిన డ్రోన్లు

- రేపు 5,500 డ్రోన్లతో ప్రదర్శన



డ్రోన్‌షోకు సిద్ధం చేస్తున్న డ్రోన్లు

విజయవాడ (భవానీపురం), న్యూస్‌టుడే: విజయవాడ నగరవాసులను కనువిందు చేసేలా కృష్ణా నదీ తీరంలో వినీలాకాశంలో డ్రోన్‌షో నిర్వహణకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఏకంగా 5,500 డ్రోన్‌లతో పున్నమి ఘాట్ వద్ద ఆకాశంలో డ్రోన్‌షో మంగళవారం సాయంత్రం జరగనుంది. డ్రోన్‌లను పున్నమిఘాట్ వద్దకు తెచ్చి ఆదివారంనుంచి ఛార్జింగ్ చేస్తున్నారు. పనితీరును పరీక్షిస్తున్నారు. డ్రోన్‌లతో దుర్గమ్మతోపాటు వివిధ రకాల రూపాలు, బొమ్మలు, ఆకారాలు, పేర్లు, ఇలా.. అనేకం ఆకాశంలో కనువిందు చేయనున్నాయి. ఈ ప్రదర్శనను తిలకించేందుకు సీఎం చంద్రబాబుతోపాటు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, శాసనసభ్యులు, ఉన్నతాధికారులు హాజరుకానున్నారు. వీఐపీలతోపాటు సాధారణ ప్రజలు తిలకించేలా గ్యాలరీలను సిద్ధం చేస్తున్నారు. ఎయిర్‌షోను విజయవాడ నగరంలో ప్రజలు తిలకించడానికి వీలుగా బెంజి సర్కిల్, రామవరప్పాడు రింగ్, వారధి, బస్టాండు, ప్రకాశం బ్యారేజి వద్ద భారీ డిజిటల్ తెరలను ఏర్పాటు చేస్తారు.

31న శ్రీవారి ఆలయంలో దీపావళి ఆస్థానం

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి ఆలయంలో ఈ నెల 31న దీపావళి ఆస్థానం నిర్వహించనున్నారు. ఉదయం 7నుంచి 9 గంటల వరకు ఆస్థానం ఉంటుంది. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్ప స్వామి మాడ వీధుల్లో విహరించి భక్తులను కటాక్షించనున్నారు. దీపావళి ఆస్థానం కారణంగా 31న తిరుప్పావడ, కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం సేవలను తితిదే రద్దు చేసింది. తోమాల, అర్చన సేవలను ఏకాంతంగా నిర్వహిస్తారు.

బోరుగడ్డ అనిల్‌కుమార్‌పై కేసు

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: వైకాపా నాయకుడు, రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌కుమార్‌పై ఏలూరు మూడో పట్టణ పోలీసుస్టేషన్‌లో ఆదివారం రాత్రి కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కు 2023లో అనిల్‌కుమార్ ఫోన్ చేసి వ్యక్తిగతంగా దూషించారు. 'మా పార్టీ తలచుకుంటే నీ అంతు చూస్తుంది. మీ సామాజిక వర్గాన్ని ఖతం చేస్తాం' అంటూ బెదిరించారు. దీనిపై ప్రభాకర్ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. అనిల్‌కుమార్‌పై వివిధ సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు.

పెళ్లి చేసుకోమన్నందుకే చంపేశాడు

- పథకం ప్రకారమే విఘ్నేష్ పెట్రోలు తెచ్చాడు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ
- దాడిలో గాయపడిన విద్యార్థిని మృతి

ఈనాడు, కడప; ఈనాడు డిజిటల్, అమరావతి: ఏపీలోని వైఎస్సార్ జిల్లా బద్వేలు సమీపంలో పెట్రోల్ దాడికి గురైన ఇంటర్ విద్యార్థిని (16) ఆదివారం కడప రిమ్స్‌లో మృతి చెందింది. నిందితుడు విఘ్నేష్ శనివారం పెట్రోలు పోసి నిప్పంటించగా.. 80 శాతం గాయపడ్డ ఆమెను ఆసుపత్రిలో చేర్పించిన విషయం తెలిసిందే. ఈ కేసులో నిందితుడిని శనివారమే అదుపులోకి తీసుకొన్నట్లు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. ఆ బాలిక పెళ్లి చేసుకోవాలని అడిగినందుకే విఘ్నేష్ ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని వెల్లడించారు. 'ఆమెకు విఘ్నేష్‌తో ఐదేళ్లుగా పరిచయం ఉంది. ఇద్దరూ శనివారం బద్వేలుకు 10 కి.మీ. దూరంలో కాసేపు గడిపారు. తనను పెళ్లి చేసుకోవాలని ఆమె అడగడంతో అప్పటికే పెళ్లయిన విఘ్నేష్ ఆమెతో వాగ్వాదానికి దిగాడు. ఆగ్రహంతో ఆమెపై పెట్రోలు పోసి నిప్పంటించాడు. పథకం ప్రకారమే అతడు సీసాతో పెట్రోలు తీసుకెళ్లాడు. కావాలనే అటవీ ప్రాంతానికి తీసుకెళ్లాడు. వ్యూహాత్మకంగా తన ఫోన్‌ను కడపలోనే ఉంచి భార్య ఫోన్ వినియోగించాడు' అని ఎస్పీ వివరించారు. కేసుకు సంబంధించిన శాస్త్రీయ ఆధారాలు, బాలిక వాంగ్మూలం సేకరించినట్లు తెలిపారు.

నిందితుడికి కఠిన శిక్ష పడేలా చూడాలన్న సీఎం చంద్రబాబు

పెట్రోల్ దాడిలో ఇంటర్ విద్యార్థిని మృతి చెందడంపై ఏపీ సీఎం చంద్రబాబు విచారం వ్యక్తం చేశారు. ఘటన జరిగినప్పటి నుంచి ఎస్పీతో తరచూ ఫోన్‌లో మాట్లాడుతూ.. బాధితురాలి చికిత్స, కేసు విచారణ గురించి తెలుసుకున్నారు. ఎంతో భవిష్యత్తు ఉన్న విద్యార్థిని దుర్మార్గుడి దుశ్చర్యకు బలికావడం కలచివేసిందని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 'బాధిత కుటుంబానికి న్యాయం చేయడమంటే నిందితుడికి చట్ట ప్రకారం త్వరగా శిక్ష పడేలా చూడటమే. ప్రత్యేక కోర్టులో ఫాస్ట్‌ట్రాక్ విధానంలో విచారణ పూర్తి చేయాలి. నిందితుడిని మరణ శిక్ష స్థాయిలో శిక్షించేలా చూడాలి. ఆడ బిడ్డలపై అఘాయిత్యాలు చేసేవారికి ఈ ఘటనలో పడే శిక్ష హెచ్చరికగా ఉండాలి' అని అధికారులను ఆదేశించారు.

సత్వరం స్పందిస్తారు.. ప్రాణాలు నిలుపుతారు!

- 72 ఠాణాలు.. 1,170 మంది సిబ్బంది..
- రాష్ట్రంలో తెరపైకి మరో కొత్త విభాగం
- రోడ్డు ప్రమాద మరణాల నియంత్రణే లక్ష్యం
- తుదిదశ ఆమోదానికి 'డీటీఆర్ఎస్'



తెలంగాణలో మరో కొత్త విభాగం అవతరించబోతోంది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ట్రాఫిక్ అండ్ రోడ్ సేఫ్టీ (డీటీఆర్ఎస్)గా వ్యవహరించే దీనికోసం ఏళ్ల తరబడి కొనసాగుతున్న నిరీక్షణ ఫలించనుంది. రోడ్డు ప్రమాద మరణాల్ని నియంత్రించే లక్ష్యంతో పనిచేసే ఈ విభాగం త్వరలోనే కార్యాచరణను ప్రారంభించనుంది. దీనికి ఇప్పటికే ఆర్థికశాఖ ఆమోదం లభించడంతోపాటు సిబ్బంది కేటాయింపు సైతం జరగడం కీలక పరిణామం. సంబంధిత దస్త్రాన్ని ప్రభుత్వ పరిశీలనకు పంపడంతో ఇక ఆమోదముద్ర వేయడమే మిగిలింది.

పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో..

తెలంగాణ పోలీస్‌శాఖ ఆధ్వర్యంలోని రైల్వేస్ అండ్ రోడ్‌సేఫ్టీ విభాగం నేతృత్వంలో ఈ విభాగం పనిచేయనుంది. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 72 పోలీస్‌స్టేషన్లను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. అన్ని జాతీయ, రాష్ట్ర రహదారులపైనే వీటిని ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే రహదారుల పక్కన శాంతిభద్రతల ఠాణాలుంటే వాటిలోనే ఇవీ కొలువుదీరనున్నాయి. వీటిలో పనిచేసేందుకు 1,170 మంది సిబ్బందిని కేటాయించాలని నిర్ణయించారు. సివిల్, ఏఆర్, కమ్యూనికేషన్స్ విభాగాలకు చెందిన పోలీసులు దీనిలో పనిచేయనున్నారు.

తక్షణ వైద్యసాయంతోనే..



రాష్ట్రంలో ఏటా దాదాపు 20 వేల రోడ్డు ప్రమాదాలు సంభవిస్తుండగా.. 6 వేల మంది వరకు చనిపోతున్నారు. 2022లో 19,497 ప్రమాదాల్లో 6,886 మంది.. 2023లో 20,699 ప్రమాదాల్లో 6,788 మంది ప్రాణాలు కోల్పోయారు. అయితే రోడ్డు ప్రమాదాల్లో సకాలంలో వైద్యసేవలు అందకపోవడంతోనే ఎక్కువ మరణాలు సంభవిస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో క్షతగాత్రులకు తక్షణ వైద్యసాయం అందించే వ్యవస్థను ఏర్పాటుచేయాలనే ఆలోచన ఎప్పటినుంచో ఉంది. తమిళనాడులో ఈ తరహా వ్యవస్థతో మరణాలను గణనీయంగా తగ్గించగలిగారు. ఆ వ్యవస్థను గతంలోనే అధ్యయనం చేసిన తెలంగాణ పోలీసులు డీటీఆర్ఎస్ ఏర్పాటుకు ప్రతిపాదన రూపొందించారు. రూ.20 కోట్లతో వాహనాలు.. రూ.30 కోట్లతో స్పీడ్‌లేజర్ గన్‌లు, బ్రీత్‌అనలైజర్ల కొనుగోలుతోపాటు వేబ్రిడ్జిల నిర్మాణానికి ప్రతిపాదించారు. 2017లోనే 'రైల్వేస్ అండ్ రోడ్ సేఫ్టీ'ని అప్పటి డీజీ కృష్ణప్రసాద్ ప్రతిపాదించినా ఏళ్ల తరబడి మోక్షం కలగలేదు. తాజాగా ఈ దస్త్రం తుదిదశ ఆమోదానికి సిద్ధం కావడంతో కదలిక వచ్చినట్లయింది.

వెంటనే స్పందించేలా..

డీటీఆర్ఎస్ విభాగం బృందాలు ఆయా జిల్లాల ఎస్పీల పర్యవేక్షణలో పనిచేస్తాయి. జాతీయ, రాష్ట్ర రహదారుల్లో నిరంతరం గస్తీ తిరుగుతుంటారు.

- ఎక్కడైనా రోడ్డు ప్రమాదం జరిగితే తక్షణం స్పందించి క్షతగాత్రుల్ని సమీపంలోని ఆసుపత్రులకు తరలిస్తారు. ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాల్లో రోడ్ ఇంజినీరింగ్ లోపాలున్నాయా అని పరిశీలించి సవరించేందుకు నివేదికలు పంపిస్తారు.
- రోడ్డుప్రమాద కేసుల్ని ఈ విభాగమే దర్యాప్తు చేస్తుంది. ఎఫ్ఐఆర్ మొదలుకొని అభియోగపత్రాల నమోదు వరకు పర్యవేక్షిస్తుంది.

సిబ్బంది ఎవరెవరు?

- సివిల్ విభాగం నుంచి 28 మంది ఇన్‌స్పెక్టర్లతో పాటు సబ్‌ఇన్‌స్పెక్టర్లు (164), ఏఎస్సైలు (51), హెడ్‌కానిస్టేబుళ్లు (115), కానిస్టేబుళ్లు (365) ఉంటారు.
- ఏఆర్ నుంచి.. ఒక్కొక్కరు చొప్పున ఆర్ఐ, ఆర్ఎస్సైలతో పాటు 152 మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 200 మంది కానిస్టేబుళ్లు.
- కమ్యూనికేషన్స్ నుంచి.. ఒక్కో ఇన్‌స్పెక్టర్, సబ్ ఇన్‌స్పెక్టర్, హెడ్ కానిస్టేబుల్‌లతో పాటు 53 మంది కానిస్టేబుళ్లు.
- ఇంజినీరింగ్ విభాగం నుంచి ఈఈ లేదా డీఈఈ, రవాణా శాఖ నుంచి డీటీవో, వైద్యశాఖ నుంచి అసిస్టెంట్ సివిల్ సర్జన్‌తోపాటు మినిస్టీరియల్ స్టాఫ్ ఉంటారు.



- ఈనాడు, హైదరాబాద్

10 క్రెడిట్ కార్డులు.. స్తోమతకు మించి అప్పులు

మనోవేదనతో యువకుడి బలవన్మరణం



ప్రసాద్

దుగ్గొండి, న్యూస్‌టుడే: వివిధ బ్యాంకుల నుంచి క్రెడిట్ కార్డులు తీసుకొని స్తోమతకు మించి ఖర్చు చేశాడు.. తిరిగి డబ్బులు చెల్లించలేక.. బ్యాంకుల వారికి సమాధానం చెప్పలేక.. మనోవేదనకు గురై ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన వరంగల్ జిల్లా దుగ్గొండి మండల పరిధిలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబసభ్యులు, ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. నాచినపల్లి గ్రామానికి చెందిన దార ప్రసాద్(38) అవివాహితుడు. డిగ్రీ పూర్తి చేసి ఏడేళ్లుగా హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో వివిధ బ్యాంకుల నుంచి 10 వరకు క్రెడిట్ కార్డులు తీసుకొని ఇష్టారీతిన ఖర్చు చేస్తూ వెళ్లాడు. నెలవారీ కిస్తీలు చెల్లించకపోవడంతో వడ్డీలు పెరిగి అప్పులయ్యాయి. బ్యాంకు అధికారులు తరచూ ఫోన్లు చేయగా.. వాయిదాలు పెడుతూ వచ్చాడు. ఈ క్రమంలో ఈ నెల 10న దసరా పండగకు స్వగ్రామానికి వెళ్లాడు. అప్పటి నుంచి ఎక్కువగా ఫోన్లో మాట్లాడుతూ బాధపడుతుండటం గమనించిన తండ్రి రాములు ఏమైందని అడగగా.. విషయం చెప్పాడు. బాధపడకు ఎక్కడైనా అప్పు తెచ్చి చెల్లిద్దామని తండ్రి ధైర్యం చెప్పారు. శనివారం ఉదయం కుటుంబసభ్యులు పొలానికి వెళ్లగా. . ఇంట్లో ఒంటరిగా ఉన్న ప్రసాద్ ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సాయంత్రం ఇంటికి చేరుకున్న తల్లిదండ్రులు విగతజీవిగా మారిన కుమారుడిని చూసి గుండెలవిసేలా రోదించారు. అప్పులు కడతామని చెప్పినా ఇంతటి అఘాయిత్యానికి పాల్పడ్డావా అంటూ కన్నీరుమున్నీరయ్యారు. రాములు ఆదివారం దుగ్గొండి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జాతీయ రహదారిపై కాల్పుల కలకలం

- వాహనాలపై పారిపోతున్న నలుగురిని కార్లలో ఛేజింగ్
- ఏపీలో శ్రీసత్యసాయి జిల్లా రామాపురం వద్ద ఘటన
- తెలంగాణలో రిజిస్టర్ అయిన వాహనాల్లో రాక



రామాపురం బస్టాప్ వద్ద స్థానికుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న డీఎస్పీ శ్రీనివాసులు

బత్తలపల్లి, ధర్మవరం, న్యూస్‌టుడే: ఏపీలోని శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం రామాపురం బస్టాప్ వద్ద జాతీయ రహదారిపై ఆదివారం తుపాకీ కాల్పులు కలకలం రేపాయి. రెండు కార్లలో సఫారీ దుస్తుల్లో ఉన్న వ్యక్తులు తుపాకులు చేతబూని.. రెండు ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న నలుగురు యువకులను వెంటాడారు. బస్టాప్ వద్ద నుంచి రామాపురం గ్రామ రహదారి గుండా ఆ నలుగురూ పారిపోతుండటంతో కార్లలో వచ్చిన వారు గాల్లోకి కాల్పులు జరిపారు. నలుగురు యువకుల్లో ఇద్దరు ద్విచక్ర వాహనాల పైనుంచి కిందకు దూకి, సమీప పొలాల్లోకి పారిపోయారు. పొలాల వైపు వెళ్లిన వారిని తుపాకులతో వెంబడించారు. వారిపై రాళ్లు రువ్వి ఆ ఇద్దరూ పరారయ్యారు. ఉదయం 9.40 గంటల ప్రాంతంలో జరిగిన ఈ ఘటనతో స్థానికులు ఉలిక్కిపడ్డారు. దీనిపై పోలీసులు ఉమ్మడి అనంతపురం జిల్లాతోపాటు కడప జిల్లా పోలీసు యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు విచారణ చేపట్టారు. తెలంగాణ రిజిస్ట్రేషన్ నంబర్లున్న రెండు కార్లలో వచ్చిన వారు కాల్పులు జరిపారని స్థానికులు తెలిపారు. ఇద్దరు దుండగులు ద్విచక్ర వాహనాల్లో తాడిమర్రి వైపు వెళ్లిపోయారని, వారు హిందీలో మాట్లాడుకున్నట్లు గ్రామస్థులు చెప్పారు. బత్తలపల్లి టోల్‌ప్లాజా సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు తెలంగాణ రిజిస్ట్రేషన్ నంబర్లున్న రెండు కార్లను గుర్తించారు. ఆ వాహనాల ఆధారంగా ఫోన్ నంబర్లు సేకరించి, వారితో మాట్లాడగా.. తాము తెలంగాణ పోలీసులమని చెప్పారు. కర్నూలుకు వెళుతున్నట్లు వారు చెప్పడంతో విచారణ నిమిత్తం బత్తలపల్లి రావాలని డీఎస్పీ వారికి చెప్పారు. కొంతసేపటికే వారు ఫోన్లను స్విచ్ఛాఫ్ చేశారు. దీంతో కాల్పులు జరిపిన వారు పోలీసులా.. లేక ఏదైనా ముఠా సభ్యులా? అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. దీనిపై తెలంగాణ పోలీసు ఉన్నతాధికారులతోనూ మాట్లాడారు. రెండు కార్లకు సంబంధించిన వివరాలు తెలిశాయని, వాటిలో వచ్చిన వారు ఎవరు? పారిపోయిన వారు ఎవరన్నది త్వరలో తేలుస్తామని శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ రత్న తెలిపారు.



ఆహా ఓటీటీ వేదికపై సినీ నటుడు నందమూరి బాలకృష్ణ వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న అన్‌స్టాపబుల్ సీజన్-4 చిత్రీకరణ ఆదివారం హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోలో ప్రారంభమైంది. ఈ సీజన్ మొదటి అతిథిగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు హాజరయ్యారు. ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి బాలకృష్ణ స్వాగతం పలికారు. షో త్వరలో ప్రసారమవుతుందని నిర్వాహకులు తెలిపారు.

- న్యూస్‌టుడే, జూబ్లీహిల్స్

మాలలకు ద్రోహం చేస్తే ఊరుకోం: పసుల రామ్మూర్తి

భీమారం, న్యూస్‌టుడే: కాంగ్రెస్‌కు మాలల సంపూర్ణ మద్దతుందని, మాలలకు ద్రోహం చేస్తే మాత్రం చూస్తూ ఊరుకునేది లేదని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పసుల రామ్మూర్తి అన్నారు. ఆదివారం హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం భీమారంలో విశ్రాంత డీఎస్పీ దామెర నర్సయ్య అధ్యక్షతన మాల, మాల ఉపకులాల, ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. రామ్మూర్తి మాట్లాడుతూ. . ప్రాణాలు అర్పించైనా ఎస్సీ వర్గీకరణను అడ్డుకుంటామన్నారు. ఈ వర్గీకరణ భాజపా, తెదేపా మనువాదుల కుట్ర అని విమర్శించారు. అగ్రవర్ణాలు మంద కృష్ణమాదిగను పావుగా వాడుకుంటున్నాయని ఆరోపించారు. ఎమ్మెల్యేలు గడ్డం వివేక్ వెంకటస్వామి, కేఆర్ నాగరాజు మాట్లాడుతూ.. మాల ఉద్యోగ సంఘాలు ఏకతాటిపైకి వచ్చి మాలల అభ్యున్నతికి పాటుపడాలని పిలుపునిచ్చారు. మాల మహానాడు ప్రతినిధులు ఐలయ్య, సర్వయ్య, మందల భాస్కర్, ఉసిల్ల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీజాక్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా హర్షవర్ధన్‌రెడ్డి

ఈనాడు, హైదరాబాద్: వచ్చే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయ సంఘాల ఐక్య కార్యాచరణ సమితి(టీజాక్) తరఫున నల్గొండ, వరంగల్, ఖమ్మం నియోజకవర్గం అభ్యర్థిగా గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి పోటీ చేయనున్నారు. 33 సంఘాల భాగస్వామ్యంతో కూడిన టీజాక్ సమావేశం ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించారు. ఉపాధ్యాయ ఉద్యోగానికి 2017లో రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్న గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డిని అభ్యర్థిగా నిలపాలని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించినట్లు టీజాక్ ఛైర్మన్ మణిపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ పర్వతి సత్యనారాయణ తెలిపారు.

317 జీవోపై తుది నివేదిక సీఎంకు అందజేత

ఈనాడు, హైదరాబాద్: కొత్త జోన్లు, కొత్త జిల్లాలకు అనుగుణంగా ఉద్యోగుల సర్దుబాటు కోసం రూపొందించిన 317 జీవోపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం తన తుది నివేదికను రూపొందించింది. ఈ మేరకు ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి నివేదిక పత్రాలను అందజేసింది. మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు సభ్యులుగా, దామోదర్ రాజనర్సింహ అధ్యక్షతన ఏర్పాటైన ఉపసంఘం ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల అభిప్రాయాల సేకరణతోపాటు పలువురు మేధావులతో సుదీర్ఘంగా చర్చించింది. ఆన్‌లైన్ ద్వారా కూడా సూచనలు ఆహ్వానించింది. న్యాయపరమైన అంశాలపై సంబంధిత అధికారులు, ప్రభుత్వ న్యాయవాది సలహాలను తీసుకుంది. అన్నింటినీ పరిశీలించి తుది నివేదికను రూపొందించింది.

'మేడిగడ్డ' కుంగి నేటికి ఏడాది..



మేడిగడ్డ బ్యారేజీ

మహదేవపూర్, న్యూస్‌టుడే: కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ (లక్ష్మీ)బ్యారేజీ కుంగి సోమవారం నాటికి ఏడాదవుతోంది. 2023 అక్టోబరు 21వ తేదీ రాత్రి ఒక్కసారిగా భారీ శబ్దంతో బ్యారేజీపై వంతెన కుంగిపోయింది. బ్యారేజీ పియర్ కింది భాగంలో పగుళ్లు వచ్చాయి. 2016 మే 2న అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ మేడిగడ్డ వద్ద కాళేశ్వరం ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయగా.. 2019 జూన్ 21న ప్రారంభించారు. ప్రాజెక్టు ప్రారంభించిన మూడేళ్లలో మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుకు గురైంది. దీంతో ఇంజినీరింగ్ అధికారులు, జలవనరుల నిపుణులు, ప్రభుత్వ సూచన మేరకు బ్యారేజీలో నీటిని నిల్వ చేయకుండా ఖాళీ చేశారు. ఎన్నికల సమయం కావడంతో కాళేశ్వరం ప్రాజెక్టుపైనే ప్రధానంగా ప్రచారం సాగింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రుల బృందం పర్యటించింది. జాతీయ, రాష్ట్ర డ్యాం సేఫ్టీ అథారిటీ ఇంజినీర్ల బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించి పలు సిఫార్సులు చేసింది. వర్షాకాలంలో బ్యారేజీకి ముప్పు కలగకుండా తాత్కాలిక పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని సూచించింది. ఈ మేరకు బ్యారేజీలో పియర్ల పగుళ్లను పూడ్చివేయడం, గేట్ల తొలగింపు, దిమ్మెలను సరిదిద్దడం, బ్యారేజీ ఎగువ, దిగువ ప్రాంతాల్లో బుంగలను పూడ్చివేయడం వంటి చర్యలు చేపట్టారు. ఎన్‌డీఎస్ఏ పలు పరిశీలనలు, పరీక్షలు చేయాలని సూచించింది. ఇందులో కొన్ని పరీక్షలు చేయగా, మిగతావి చేయాల్సి ఉంది. బ్యారేజీ శాశ్వత పునరుద్ధరణకు ఎన్‌డీఎస్ఏ సిఫార్సుల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేయనుంది.

నేడు నగరానికి జస్టిస్ ఘోష్

రేపటి నుంచి కాళేశ్వరం కమిషన్ మలిదశ విచారణ!

ఈనాడు, హైదరాబాద్: కాళేశ్వరం ఎత్తిపోతల న్యాయ విచారణ కమిషన్ జస్టిస్ పీసీ ఘోష్ సోమవారం సాయంత్రం సమయానికి హైదరాబాద్‌కు చేరుకుంటారని కమిషన్ వర్గాలు తెలిపాయి. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లోని అవకతవకలు, నష్టాలపై బహిరంగ విచారణ నిర్వహిస్తున్న కమిషన్ మంగళవారం నుంచి తిరిగి ఆ ప్రక్రియను కొనసాగించనున్నట్లు సమాచారం. ఈ మేరకు కమిషన్‌కు అఫిడవిట్లు సమర్పించిన వారిని విచారిస్తోంది. గత నెలలో కాళేశ్వరం ఎత్తిపోతల మాజీ ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లును జస్టిస్ ఘోష్ విచారిస్తూ మధ్యలోనే ప్రక్రియ నిలిపివేశారు. తదుపరి విచారణలో తేదీ ఇచ్చి పిలుస్తామని అప్పట్లో కమిషన్ పేర్కొంది. దీంతో ఈసారి విచారణలో ఆయనతో పాటు నీటిపారుదల శాఖ కార్యదర్శులుగా పనిచేసిన ఐఏఎస్‌లు, మాజీ ఐఏఎస్‌లలో కొందరిని పిలిచే అవకాశాలున్నట్లు సమాచారం.

పాలిటెక్నిక్ లెక్చరర్ల ఎంపిక జాబితా ప్రకటన

ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో సివిల్, ఎలక్ట్రికల్-ఎలక్ట్రానిక్స్, మెకానికల్ ఇంజినీరింగ్ సబ్జెక్టుల లెక్చరర్ పోస్టులకు ప్రాథమిక ఎంపిక జాబితాను టీజీపీఎస్సీ ప్రకటించింది. ఎంపికైన అభ్యర్థుల జాబితా, మరిన్ని వివరాల కోసం www.tspsc.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని టీజీపీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ తెలిపారు.



భయంతో ఆరుబయటకు వచ్చిన రోగులు, వారి సంబంధీకులు



లక్ష్యాన్ని నిర్ణయించుకున్నాకే ప్రయాణం మొదలెట్టండి

లక్ష్యాలను ఎలా సాధించాలని ఆలోచించడానికి ముందు అసలు ఎలాంటి వాటిని లక్ష్యాలుగా ఎంచుకోవాలో ఆలోచించుకోవడం కీలకం. మీ లక్ష్యం డబ్బు సంపాదించడమా, పేరు ప్రఖ్యాతులు తెచ్చుకోవడమా, సామాజిక సేవ చేయడమా, నచ్చిన పని చేస్తూ ఆత్మసంతృప్తి పొందడమా అన్నది ముందుగానే స్పష్టంగా నిర్ణయించుకొని ఆ తర్వాతే ప్రయాణాన్ని మొదలుపెట్టాలి. లేకపోతే ఏదోరోజు మీరు ఎంచుకున్న దారి సరైనది కాదని తెలిసి పశ్చాత్తాప పడతారు.

- మార్క్ మాన్సన్, రచయిత

నిర్మల్ జిల్లా ఆసుపత్రిలో మంటలు

- పలు రికార్డులు, కంప్యూటర్లు దగ్ధం

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బోధనాసుపత్రిలో ఆదివారం ఉదయం 11 గంటల ప్రాంతంలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. మొదటి అంతస్తులోని ఆరోగ్యశ్రీకి సంబంధించిన కార్యాలయ గదిలో నుంచి దట్టంగా పొగలు రావడం గమనించిన ఆసుపత్రి సిబ్బంది, రోగులు, వారి సంబంధీకులు భయంతో బయటకు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకొని కిటికీ అద్దాలను పగులగొట్టి గది లోపల మంటలను అదుపు చేశారు. రికార్డులు, పలు కంప్యూటర్లు, పాత మంచాలు ప్రమాదంలో కాలిపోయాయి. విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్ కారణంగానే ప్రమాదం సంభవించినట్లు భావిస్తున్నామని అగ్నిమాపక అధికారి ప్రభాకర్ తెలిపారు. ఆస్తినష్టం అంచనా వేస్తున్నామని, ఆసుపత్రి అధికారులు, పోలీసుల నివేదిక ఆధారంగా కేసు నమోదు చేస్తామని చెప్పారు. మంటలు చెలరేగిన ప్రాంతంలో రోగుల వార్డులేవీ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.



బోధనాసుపత్రి మొదటి అంతస్తులోని ఆరోగ్యశ్రీ కార్యాలయంలో చెలరేగుతున్న మంటలు

EENADU Vol: 51, Iss: 71 Printed and Published by D N Prasad on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt. Ltd. Printed at Ushodaya Publications, Eenadu Press, Plot No. 95 & 96, Survey No. 150, Phase-II, CIE, Gandhinagar, Quthubullapur Village & Mandal, Hyderabad, Medchal District - 500 037, Telangana State. Published at Eenadu Corporate Office, Ramoji Film City, Anajpur Village, Abdullapurmet Mandal, Ranga Reddy Dist - 501 512, Telangana State. Editor: D N Prasad. Phone: 040-22232223, RNI No. 27656/75, Regd. No. HSE/1009/2024-26, Eenadu, Hyderabad. Licensed to Post without Pre-payment. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. Founder Ramoji Rao

ఇరాన్ చేతిలో ఇజ్రాయెల్ దాడి ప్లాన్

- పెంటగాన్ నుంచే లీక్!
- తీవ్రంగా తీసుకున్న అగ్రరాజ్యం
- విచారణకు ఆదేశం

వాషింగ్టన్: ఇరాన్‌పై ఎప్పుడు.. ఎలా ఇజ్రాయెల్ దాడి చేయనుందో తమకు తెలుసునని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ప్రకటించిన కొన్ని గంటల్లోనే అగ్రరాజ్యానికి ఊహించని షాక్ ఎదురైంది. ఇజ్రాయెల్ దాడి ప్రణాళికలపై అమెరికా నిఘా వర్గాలు రూపొందించిన రెండు కీలక డాక్యుమెంట్లు ఇరాన్ అనుకూల టెలిగ్రామ్ ఛానల్ 'మిడిల్ ఈస్ట్ స్పెక్టేటర్'లో కనిపించడంతో కలకలం రేగింది. పెంటగాన్ వర్గాల నుంచి లీకైన సమాచారాన్నే తాము పోస్టు చేశామని ఆ ఛానల్ ప్రకటించడం గమనార్హం. ఈ నెల 1న ఇజ్రాయెల్‌పై బాలిస్టిక్ క్షిపణులతో ఇరాన్ భారీస్థాయిలో దాడులు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఇందుకు ప్రతీకారంగా త్వరలో ఎదురు దాడి చేయడానికి ఇజ్రాయెల్ సన్నాహాలు చేస్తోంది. ఈ సన్నాహాల సమాచారాన్ని అమెరికా గూఢచర్య ఉపగ్రహాలు సేకరించాయి. బహిర్గతమైన డాక్యుమెంట్లలో ఇజ్రాయెల్ వాయుసేన సన్నద్ధతకు సంబంధించిన వివరాలు ఉన్నాయి. అమెరికా గూఢచర్య ఉపగ్రహాలు సేకరించే సమాచారానికి బాధ్యత వహించే అమెరికా నేషనల్ జియో స్పేషియల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ ఈ డాక్యుమెంట్లను రూపొందించింది. వీటిల్లో ఉన్న ఉపగ్రహ చిత్రాలు, సమాచారంతో.. రానున్న రోజుల్లో ఇరాన్‌లోని ఏయే ప్రాంతాలపై ఇజ్రాయెల్ దాడి చేయొచ్చన్న అవగాహనకు రావొచ్చు. రెండు కీలక ఫైళ్లలో ఒకటి టెల్ అవీవ్ వాయుసేన సన్నద్ధతకు సంబంధించినదైతే.. రెండోదానిలో క్షిపణుల మోహరింపు, ఇరాన్ తీవ్రంగా స్పందిస్తే ఎలాంటి ఆయుధాలను వాడాలన్న వివరాలు ఉన్నాయి. అమెరికా రక్షణ శాఖ అధికారులు మాత్రం డాక్యుమెంట్లు బహిర్గతం కావడం ఆందోళనకర విషయమని వ్యాఖ్యానించినట్లు సీఎన్ఎన్ పేర్కొంది. ఈ ఘటనపై విచారణ చేపట్టనున్నట్లు పెంటగాన్ తెలిపింది.

మూల్యం తప్పదు: నెతన్యాహు

తనను, తన భార్యను హత్య చేయాలని ప్రయత్నించి హెజ్‌బొల్లా భారీ తప్పిదం చేసిందని.. ఇందుకు మూల్యం చెల్లించుకోకతప్పదని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు హెచ్చరిక జారీచేశారు. సెసెరియాలోని నెతన్యాహు నివాసంపై శనివారం హెజ్‌బొల్లా డ్రోన్ దాడి నిర్వహించిన సంగతి తెలిసిందే. "మా భవిష్యత్తు కోసం శత్రువులపై మేం చేస్తున్న యుద్ధాన్ని ఈ దాడి నిరోధించలేదు" అని ఆయన పేర్కొన్నారు. ఇజ్రాయెలీ పౌరులకు హాని కలిగించేవారు మూల్యం చెల్లించుకోక తప్పదని అన్నారు. లెబనాన్ నుంచి దూసుకొచ్చిన ఓ రాకెట్ కారణంగా ఉత్తర ఇజ్రాయెల్‌లో ఓ వ్యక్తి మరణించారు. ఈ ఘటనలో మరో వ్యక్తికి కూడా గాయాలయ్యాయి.

సిన్వర్ పిరికివాడు

- అక్టోబరు 7 దాడి తర్వాత ఆయనేం చేశాడంటే..
- వీడియోను విడుదల చేసిన ఇజ్రాయెల్



టెల్‌అవీవ్: తమ దాడిలో మృతి చెందిన హమాస్ అధినేత యాహ్యా సిన్వర్ ధైర్యవంతుడు కాదని పిరికివాడని ఇజ్రాయెల్ సైన్యం (ఐడీఎఫ్) పేర్కొంది. గతేడాది అక్టోబరు 7 దాడి జరిపిన వెంటనే ఆయన భయంతో కుటుంబంతో ఖాన్ యూనిస్‌లో తన నివాసం కింద ఉన్న సొరంగంలోకి పారిపోయినట్లు తెలిపింది. ఇందుకు సంబంధించిన వీడియోను ఐడీఎఫ్ శనివారం విడుదల చేసింది. ఇందులో ఓ సొరంగ మార్గంలోకి సిన్వర్, అతడి భార్య, పిల్లలు వెళ్తున్నట్లు ఉంది. వారి చేతుల్లో టీవీ, చాపలు, సంచులు పలు వస్తువులు ఉన్నాయి. గత ఏడాది తమపై దాడులు చేసినప్పటి నుంచి సిన్వర్ ఈ సొరంగంలోనే ఎక్కువ సమయం గడిపాడని ఐడీఎఫ్ ప్రతినిధి రియర్ అడ్మిరల్ డానియెల్ హగారీ తెలిపారు. ఈ వీడియో ఆధారంగానే తాము సిన్వర్ వేటను సాగించామని.. చాలా సార్లు త్రుటిలో తప్పించుకున్నాడని చెప్పారు. సొరంగంలో దొరికిన నగదు, పత్రాలకు సంబంధించిన ఫొటోలను విలేకరుల సమావేశంలో హగారీ చూపించారు.

ఆ హ్యాండ్ బ్యాగ్ ధర రూ.26 లక్షలు..!

ఐడీఎఫ్ విడుదల చేసిన వీడియోలో సిన్వర్ భార్య చేతిలో ఓ హ్యాండ్ బ్యాగ్ ఉంది. దీని విలువ 32,000 డాలర్లు (రూ. 26 లక్షలు) ఉంటుందని తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన ఫొటోలను ఐడీఎఫ్ అధికారి అవిచాయ్ అడ్రే ఎక్స్‌లో పోస్ట్ చేశారు. "గాజా ప్రాంతంలోని ప్రజలు కనీస అవసరాలకు డబ్బులు లేక ఇబ్బంది పడుతున్నారు. కానీ, సిన్వర్, అతడి భార్యకు డబ్బుపై ఉన్న ప్రేమకు ఇది ఒక ఉదాహరణ" అని ఆయన విమర్శించారు.

నేతలను న్యాయమూర్తులు పొగడొద్దు

- జడ్జీలు అత్యున్నత నైతిక ప్రమాణాలు పాటించాలి
- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్

అహ్మదాబాద్: రాజకీయ నేతలను, ప్రభుత్వ అధికారులను న్యాయమూర్తులు పొగడకూడదని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ పేర్కొన్నారు. అలా పొగడటం.. మొత్తం న్యాయవ్యవస్థ విశ్వసనీయతపైనే ప్రభావం చూపే అవకాశం ఉందని అన్నారు. గుజరాత్‌లో న్యాయాధికారుల సదస్సులో ఆయన ప్రసంగిస్తూ.. మత, కుల, లింగ, రాజకీయ కేసుల్లో జడ్జీలు తమ పరిధిని దాటి వ్యాఖ్యలు చేయడంపై ఆందోళన వ్యక్తంచేశారు. ఇలాంటి ప్రత్యేక కేసుల్లో న్యాయమూర్తులు ఆచితూచి వ్యవహరించాలని అన్నారు. ధర్మాసనం లోపల, వెలుపల న్యాయమూర్తి ప్రవర్తన.. అత్యున్నత న్యాయ నైతిక ప్రమాణాలకు లోబడి ఉండాలని స్పష్టంచేశారు. న్యాయవ్యవస్థ విశ్వసనీయతకు న్యాయనైతికత, సమగ్రత మూలస్తంభాలని తెలిపారు. ఒక న్యాయమూర్తి తన పదవికి రాజీనామా చేసి ఎన్నికల్లో పోటీచేస్తే.. ప్రజల్లో ఆయన నిష్పాక్షికతపై అనుమానాలు చెలరేగే అవకాశం ఉందని అన్నారు.

జడ్జీలను తొలగించే అధికారం పార్లమెంటుకు లేదు: బంగ్లా సుప్రీంకోర్టు

ఢాకా: న్యాయమూర్తులను తొలగించే అధికారం పార్లమెంటుకు దఖలపరుస్తూ షేక్ హసీనా ప్రభుత్వం చేసిన 16వ రాజ్యాంగ సవరణను కొట్టివేస్తూ గతంలో వెలువరించిన తీర్పును బంగ్లాదేశ్ సుప్రీంకోర్టు పునరుద్ధాటించింది. ప్రభుత్వం దాఖలు చేసిన సమీక్ష పిటిషన్‌ను కొట్టివేసింది. హసీనా రద్దు చేసిన అత్యున్నత న్యాయమండలిని తిరిగి ఏర్పాటు చేయాలని ఉత్తర్వులు ఇచ్చింది. ఇక నుంచి న్యాయమూర్తులపై ఆరోపణలను న్యాయమండలే పరిష్కరించనుంది.

యుద్ధానికి పూర్తిస్థాయిలో సిద్ధమవ్వండి

- చైనా సైన్యానికి షీ జిన్‌పింగ్ పిలుపు

బీజింగ్: ప్రపంచవ్యాప్తంగా వేగంగా మారుతున్న సైన్య సమీకరణాల దృష్ట్యా యుద్ధానికి పూర్తిస్థాయిలో సిద్ధమవ్వాలంటూ తన దేశ సైన్యానికి చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ పిలుపునిచ్చారు. ఇటీవల తైవాన్ చుట్టూ డ్రాగన్ చేపట్టిన సైనిక విన్యాసాల తర్వాత ఈ ప్రకటన జిన్‌పింగ్ నుంచి రావడం గమనార్హం. గత నెల ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి ప్రయోగాన్ని కూడా చైనా నిర్వహించింది. తైవాన్ విషయంలోనూ ఇటీవల దూకుడు పెంచుతూ వస్తోంది. ఇటీవల చైనా అధ్యక్షుడు పీఎల్ఏ రాకెట్ ఫోర్స్ బ్రిగేడ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా "యుద్ధానికి సన్నాహాలను సమగ్రంగా బలోపేతం చేయాలి. దళాలు పటిష్ఠమైన పోరాట సామర్థ్యాలను కలిగి ఉండేలా చూడాలి. సైనికులు తమ వ్యూహాత్మక పోరాట సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలి" అని ఆయన పేర్కొన్నారు. దేశ భద్రత, ప్రధాన ప్రయోజనాలను కాపాడాలని సైన్యానికి సూచించారు.

కశ్మీర్‌లో ఫేస్‌బుక్, వాట్సప్ ద్వారా ఉగ్ర నియామకాలు!

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో యువతను ఉగ్రవాదకూపంలో లాగేందుకు పాకిస్థాన్ గూఢచార సంస్థ (ఐఎస్ఐ), తీవ్రవాద సంస్థలు కొత్తతరహా విధానాలను అమలు చేస్తున్నాయి. ఈ క్రమంలో డిజిటల్ ప్లాట్‌ఫాం ద్వారా ఉగ్ర నియామకాల (రిక్రూట్‌మెంట్) ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నాయని అధికారులు ఆదివారం వెల్లడించారు. దక్షిణకశ్మీర్‌లో ఈ నియామకాలు, బోధన కార్యక్రమాలు భారీగా పెరిగాయన్నారు. భద్రతా పరమైన కారణాలతో ప్రత్యక్ష చర్చలకు వీలు కాకపోవడంతో పాక్ ఇలాంటి అడ్డదారులను వెతుకుతోందని పేర్కొన్నారు. డిజిటల్ ప్లాట్‌ఫాంలు అయిన వాట్సప్, ఫేస్‌బుక్, ఎక్స్, టెలిగ్రామ్‌లను ఉపయోగించుకుని ఉగ్రసంస్థలు యువతను లక్ష్యంగా చేసుకున్నాయని ఓ అధికారి చెప్పారు. యువతకు ఉగ్రవాదులు ఆన్‌లైన్‌లో శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. 'ఉగ్రవాద కథనాలు, భావజాలాన్ని ఎదుర్కోవడం' అనే అంశంపై జరిగిన చర్చలో ఐక్యరాజ్యసమితిలోని భారత మాజీ, శాశ్వత ప్రతినిధి సయ్యద్ అక్బరుద్దీన్ మాట్లాడుతూ.. తీవ్రవాద బృందాలు సోషల్ మీడియాను దుర్వినియోగం చేస్తున్నాయన్నారు. భావ ప్రకటన స్వేచ్ఛను కాపాడుతూ.. అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు.

భారత్, బ్రెజిల్, ఆఫ్రికాలు భద్రతా మండలికి ప్రాతినిధ్యం వహించాలి: రష్యా

మాస్కో: ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో భారత్, బ్రెజిల్, ఆఫ్రికా దేశాలకు శాశ్వత సభ్యత్వం ఉండాలని రష్యా అభిప్రాయపడింది. తద్వారా ప్రపంచంలోని అన్ని ప్రాంతాలకు ప్రాతినిధ్యం దక్కినట్లు అవుతుందని పేర్కొంది. రష్యా విదేశాంగశాఖ మంత్రి సెర్గీ లవ్రోవ్ ఆదివారం ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. భద్రతా మండలిని విస్తరించాలని, తనకు శాశ్వత సభ్యత్వం ఇవ్వాలని భారత్ ఎప్పటి నుంచో కోరుతోంది. ఈ డిమాండుకు రష్యా గతంలోనూ మద్దతిచ్చింది. మరోసారి ఆ అవసరాన్ని నొక్కి చెప్పింది.

మరమరాలు తిన్న 200 మందికి అస్వస్థత

- అస్సాంలో ఘటన

గోలాఘాట్: అస్సాంలోని గోలాఘాట్ జిల్లాలో ఓ సంతాప సభలో మరమరాలు తిని దాదాపు 200 మంది అస్వస్థతకు గురయ్యారు. సరూప్‌థార్ ప్రాంతంలోని పస్‌దోరియా గ్రామంలో ప్రదీప్ గోగాయ్ అనే వ్యక్తి శనివారం తన తల్లి సంతాప సభను ఏర్పాటు చేశాడు. ఈ కార్యక్రమానికి వచ్చిన అతిథులకు సంప్రదాయ 'జల్‌పాన్'(చిరుతినుబండారాలతో పాటు వెన్న కలిపిన మరమరాలు) అందించడంతో దాదాపు 200మంది ఫుడ్‌పాయిజన్‌కు గురైనట్లు ఆదివారం అధికారులు వెల్లడించారు. కడుపునొప్పి, తలనొప్పి, వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలతో వెంటనే 53మంది ఆసుపత్రిలో చేరినట్లు తెలిపారు. వీరిలో ఇద్దరిని సమీపంలోని జోర్హాట్ ఆసుపత్రికి తరలించినట్లు వెల్లడించారు. మరో 150మంది స్వల్ప లక్షణాలతో బాధపడుతున్నారని పేర్కొన్నారు.

అమెరికాలో కాల్పులు.. ఒకరి మృతి

- మరో అయిదుగురికి గాయాలు

అల్బని: అమెరికాలోని జార్జియా రాష్ట్రం అల్బని యూనివర్సిటీలో చోటుచేసుకున్న కాల్పుల ఘటనలో ఒకరు మృతి చెందారు. మరో అయిదుగురు గాయపడ్డారు. వర్సిటీ తూర్పు ప్రాంగణంలో శనివారం రాత్రి ఈ దుర్ఘటన జరిగిందని విశ్వవిద్యాలయాధికారి ఒకరు తెలిపారు. మృతుడిని అట్లాంటాకు చెందిన 19 ఏళ్ల యువకుడిగా గుర్తించారు. అయితే అతడి పేరు ఏంటన్నది ఇంకా తెలియరాలేదు. అల్బని యూనివర్సిటీలో సుమారు ఆరు వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. తమ వర్సిటీలో విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది భద్రతే తమకు మొదటి ప్రాధాన్యం అని సంబంధిత అధికారి స్పష్టం చేశారు.

ఓబీసీలకు 27% రిజర్వేషన్ల డిమాండ్‌ను సమర్థిస్తారా?

- భాజపాకు కల్పనా సోరెన్ సవాల్



ఇంటర్నెట్ డెస్క్: ఝార్ఖండ్‌లో ఓబీసీలకు 27శాతం రిజర్వేషన్ కల్పించాలన్న డిమాండ్‌ను సమర్థిస్తారా? అని జేఎంఎం ఎమ్మెల్యే కల్పనా సోరెన్ భాజపాకు సవాల్ విసిరారు. త్వరలో జరగనున్న రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రచార కార్యక్రమంలో ఆదివారం ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... తమ ఆత్మగౌరవాన్ని కాషాయం పార్టీ దెబ్బతీసినట్లు ఝార్ఖండ్ ప్రజలు గ్రహించారని వారు ఆగ్రహంతో ఉన్నారని వ్యాఖ్యానించారు.

యూపీలో అభ్యంతరకర పోస్టుపై నిరసనలు

- 500 మందిపై కేసు నమోదు


ముజఫర్‌నగర్: ఉత్తర్‌ప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్ జిల్లాలో ఆదివారం 500 మందికి పైగా పౌరులపై కేసు నమోదైంది. మీరాపుర్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఉపఎన్నికల నేపథ్యంలో విధించిన ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించడమే దీనికి కారణం. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...నిఖిల్ త్యాగి అనే యువకుడు ఓ వర్గానికి వ్యతిరేకంగా సామాజిక మాధ్యమంలో పోస్టులు చేశాడు. దీంతో ఆ వర్గం వారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు అతడిని అరెస్టు చేశారు. నిఖిల్‌ను ఆదివారం విడుదల చేశారంటూ వదంతులు రావడంతో ఆగ్రహించిన వందలమంది..రోడ్లపైకి చేరి నిరసనలు చేపట్టారు. నిఖిల్‌కు చెందిన దుకాణంపై రాళ్లతో దాడులు చేస్తూ అభ్యంతరకరమైన నినాదాలు చేశారు. దీంతో వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడు తమ కస్టడీలోనే ఉన్నాడని తెలియజేయడంతో నిరసనకారులు వెనక్కితగ్గారు.

2 రోజులుగా అంధకారంలో క్యూబా

- విద్యుత్ సరఫరా లేక ఇక్కట్లలో ప్రజలు

హవానా: క్యూబాలోని ఆంటోనియో గుటెరస్ విద్యుత్ కేంద్రం విఫలం కావడంతో శుక్రవారం నుంచి దేశవ్యాప్తంగా కరెంటు సరఫరా నిలిచిపోయింది. ఆదివారానికి కూడా పరిస్థితిలో పెద్దగా మార్పు రాలేదు. దీంతో దేశవ్యాప్తంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఫ్రిజ్‌ల్లోని ఆహార పదార్థాలు చెడిపోవడంతో రోడ్లపైనే పౌరులు కట్టెపొయ్యిలపై వంటలు చేసుకుంటున్నారు. కొన్ని బేకరీలు తెరుచుకోవడంతో రొట్టెల కోసం ప్రజలు పెద్దఎత్తున బారులు తీరారు. దేశంలోని అనేక ప్రాంతాల్లో గురువారం సాయంత్రం నుంచే విద్యుత్ సరఫరా నిలిచిపోగా శుక్రవారం ఉదయం నుంచి దేశమంతటా ఇదే పరిస్థితి ఎదురైంది. తిరిగి సాధారణ స్థితి నెలకొనడానికి ఎన్ని రోజులు పడుతుందో అధికారిక అంచనా లేదు. ఈ క్రమంలో క్యూబా ప్రభుత్వం విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించింది. ప్రభుత్వాధ్వర్యంలోని కార్యాలయాలనూ మూసివేశారు. అత్యవసరం కాని సేవలను నిలిపివేశారు. సామర్థ్యానికి మించి విపరీతమైన విద్యుత్ డిమాండ్ ఏర్పడటంతో గ్రిడ్లు విఫలమైనట్లు స్థానిక అధికారులు పేర్కొంటున్నారు.

ఎయిమ్స్ బ్రాండ్‌ను పలుచన చేయబోం: నడ్డా



దిల్లీ: దేశవ్యాప్తంగా ఏర్పాటైన కొత్త ఎయిమ్స్ ఇన్‌స్టిట్యూట్‌లలో బోధన, అధ్యాపకుల ప్రమాణాలను తగ్గించడాన్ని తాను అనుమతించబోనని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా స్పష్టం చేశారు. ఎయిమ్స్ బ్రాండ్‌ను పరిరక్షిస్తామని హామీ ఇచ్చారు. ఆదివారం ఇక్కడ జరిగిన బీజేఎంఎఫ్‌సీవీఎన్ 2024 ఫోరంలో నడ్డా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..దిల్లీ ఎయిమ్స్‌ను 60వ దశకంలో స్థాపించినప్పటికీ 80ల్లోనే ప్రఖ్యాతి గాంచిందని గుర్తుచేశారు. 'ఏ సంస్థకు అయినా పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందడానికి 10 నుంచి 20 ఏళ్ల సమయం పడుతుంది. ఎయిమ్స్ బ్రాండ్‌ను పలుచన చేయడాన్ని నేను అనుమతించను. ఎట్టిపరిస్థితుల్లోనూ దీని ఖ్యాతిని కాపాడతాం. అధ్యాపకుల నియామకాల్లో ఎటువంటి రాజీ పడబోం' అని స్పష్టం చేశారు. ఎయిమ్స్-దర్భంగాకు త్వరలో శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. పట్నా వైద్య కళాశాల ఆసుపత్రిని ఆసియాలోనే రెండవ అతిపెద్ద ఆసుపత్రిగా అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు.

అమెరికా ఎన్నికల్లో ఓటేయనున్న 24.4 కోట్ల మంది!


వాషింగ్టన్: అమెరికాలో ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈసారి అధ్యక్ష ఎన్నికల్లో దాదాపు 24.4 కోట్ల మంది ఓటు వేయనున్నారు. గత ఎన్నికలతో పోల్చుకుంటే ఓటర్ల సంఖ్య పెరిగినట్లు సర్వేలు చెబుతున్నాయి. 2016 అధ్యక్ష ఎన్నికల్లో 59 శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ప్యూ రీసెర్చ్ సెంటర్ వెల్లడించింది. 2020 ఎన్నికల్లో 66 శాతం మంది ఓటేసినట్లు పేర్కొంది. 1900 తర్వాత ఇదే అత్యధికమని తెలిపింది. 2016లో 18 నుంచి 29 ఏళ్ల మధ్య వయసున్న యువత 39 శాతం ఓటు వేసినట్లు తెలిపింది. 2020 ఎన్నికల్లో అది 50 శాతానికి పెరిగినట్లు వెల్లడించింది.

2020 అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో దాదాపు 60 శాతం యువ ఓటర్లు ప్రస్తుత అధ్యక్షుడు బైడెన్‌కు ఓటు వేసినట్లు సర్వేలు తెలిపాయి. 36 శాతం మంది మాత్రమే మాజీ అధ్యక్షుడు ట్రంప్‌నకు ఓటేసినట్లు వెల్లడించాయి. 30 నుంచి 44 ఏళ్ల వయసు వారిలో 52 శాతానికిపైగా బైడెన్‌వైపు మొగ్గు చూపారు. 65 ఏళ్లు దాటిన వారిలో 62 శాతం ట్రంప్‌నకు మద్దతు తెలిపారు. 2023లో ప్యూ రీసెర్చ్ సెంటర్ నిర్వహించిన సర్వేలో 18 నుంచి 24 ఏళ్ల యువ ఓటర్లలో 66 శాతం మంది డెమొక్రటిక్ పార్టీకి మద్దతిస్తున్నట్లు తేలింది. 25 నుంచి 29 ఏళ్ల వయసు ఓటర్లలో 64 శాతం మంది డెమొక్రటిక్ పార్టీవైపు మొగ్గు చూపినట్లు సర్వే వెల్లడించింది. మొత్తంగా యువ ఓటర్లలో 55 శాతం డెమొక్రటిక్ వైపు ఉండగా 42 శాతం రిపబ్లికన్లవైపు ఉన్నట్లు తెలిపింది. 80ఏళ్లు పైబడిన వారిలో 58 శాతం మంది రిపబ్లికన్ పార్టీకి మద్దతివ్వగా 39 శాతం డెమొక్రటిక్ పార్టీ వైపు నిలిచినట్లు సర్వేలో వెల్లడైంది.

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో జాతి అనేది ప్రధానాంశంగా మారింది. జాతుల మధ్య అసమానతలు ఎన్నికల్లో తీవ్ర ప్రభావం చూపుతాయని సర్వేలు స్పష్టం చేస్తున్నాయి. 2020 ఎన్నికల్లో 71 శాతం మంది శ్వేత జాతీయులు ఓటు హక్కు వినియోగించుకోగా.. 58.4 శాతం శ్వేత జాతేతరులు ఓటు వేసినట్లు బ్రెన్నాన్ సెంటర్ ఫర్ జస్టిస్ లా అండ్ పాలసీ సంస్థ పేర్కొంది. వారిలో 62.6 శాతం మంది ఆఫ్రో అమెరికన్లుండగా, 53.7 శాతం లాటిన్, 59.7 శాతం ఆసియా అమెరికన్లున్నట్లు తెలిపింది. గత కొన్నేళ్లుగా అమెరికాలో అనేక రాష్ట్రాలు ఓటు నమోదును కష్టతరం చేశాయని వెల్లడించింది. ప్రధానంగా రిపబ్లికన్ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాలు మరింత కఠినంగా అమలు చేసినట్లు చెప్పింది.

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో 1980 నుంచి పురుషుల కంటే మహిళలే ఎక్కువ శాతం మంది ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. 2020 ఎన్నికల్లో 68.4 శాతం మంది మహిళలు ఓటు వేయగా, పురుషులు 65 శాతం మంది ఓటేశారు. 1996 ఎన్నికల నుంచి మహిళా ఓటర్లలో ఎక్కువ శాతం మంది డెమొక్రటిక్ పార్టీకి తమ మద్దతు ఇస్తున్నట్లు సెంటర్ ఫర్ అమెరికన్ ఉమెన్ అండ్ పాలిటిక్స్ తెలిపింది. 2020 ఎన్నికల్లో 57 శాతం మంది మహిళలు బైడెన్‌కు ఓటు వేయగా, 42 శాతం మంది ట్రంప్‌నకు ఓటేశారు.

కమలా హారిస్ 60వ పుట్టినరోజున రెస్టారెంట్లో పనిచేసిన ట్రంప్



ఇంటర్నెట్ డెస్క్: అమెరికా అధ్యక్ష ఎన్నికలకు సమయం సమీపిస్తున్న వేళ అభ్యర్థులు ఒకరిపై ఒకరు తీవ్ర విమర్శలు చేసుకుంటున్నారు. నవంబరు 5న జరగనున్న ఎన్నికల ఫలితాల్లో ప్రభావం చూపే కీలక రాష్ట్రాల్లో ఇరువురు నేతలు పర్యటిస్తున్నారు. ప్రత్యర్థుల బలహీనతలను ఎత్తిచూపుతూ ఓటర్ల మద్దతును కూడగట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలో తన పుట్టిన రోజైన ఆదివారం జార్జియాలోని పలు చర్చిలను కమలా హారిస్ సందర్శించారు. డొనాల్డ్ ట్రంప్.. పెన్సిల్వేనియాలోని మెక్‌డొనాల్డ్ ఫుడ్ కోర్టులో కొంతసేపు పని చేశారు. ఈ క్రమంలోనే ఆదివారం హారిస్ 60వ పుట్టిన రోజు చేసుకుంటుండగా.. ట్రంప్ తనదైన శైలిలో ఆమెపై విమర్శలు గుప్పించారు. యుక్త వయసులో ఉన్నప్పుడు మెక్‌డొనాల్డ్‌లో పని చేశానని హారిస్ గతంలో వెల్లడించారు. ఇదే విషయాన్ని గుర్తు చేస్తున్న ట్రంప్.. ఆమె మాటలను తాను విశ్వసించనని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే కమలా హారిస్ పుట్టిన రోజున రెస్టారెంట్లో పని చేస్తున్నానని తెలిపారు.

ఈర్ష్య, డబ్బు, స్టేటస్ చుట్టే ట్రంప్

- ఒబామా విమర్శ



లాస్ వెగాస్: రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌నకు ప్రజల సమస్యలు పట్టవని, ఎంతసేపూ ఈర్ష్య, డబ్బు, స్టేటస్ చుట్టూనే ఆయన తిరుగుతారని అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా విమర్శించారు. కమలా హారిస్‌కు మద్దతుగా నెవడాలో ఆయన ప్రచారం నిర్వహించారు. హారిస్ అధ్యక్షురాలు కాబోతున్నారని పేర్కొన్నారు. 'ఈ ఎన్నికల్లో గట్టి పోటీ నెలకొందని నాకు తెలుసు. అమెరికన్లు ఇంకా సంఘర్షణలను ఎదుర్కొంటున్నారు. కొవిడ్ అనంతరం ధరలు పెరిగాయి. ఈ సమస్యలన్నింటినీ పరిష్కరించాలంటే హారిస్ గెలవాలి. ట్రంప్ గెలిస్తే తన సమస్యలు తప్ప ప్రజల సమస్యలను పట్టించుకోరు' అని ఒబామా పేర్కొన్నారు.

వందకుపైగా డ్రోన్లతో ఉక్రెయిన్ దాడి


- మార్గమధ్యంలో కూల్చివేసిన రష్యా
- క్షిపణులతో విరుచుకుపడ్డ పుతిన్ సేన.. 17 మందికి గాయాలు

కీవ్: రష్యాలోని పశ్చిమ ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని ఉక్రెయిన్ ఆదివారం డ్రోన్లతో భారీగా దాడులకు దిగింది. వీటిలో వందకుపైగా లోహవిహంగాలను రష్యా గగనతల రక్షణ దళాలు నేలకూల్చాయి. మరోవైపు ఉక్రెయిన్‌పై పుతిన్ సేన జరిపిన దాడిలో 17 మంది గాయపడ్డారు. తమ దేశంలోని ఏడు ప్రాంతాలపైకి డ్రోన్లను ఉక్రెయిన్ ప్రయోగించినట్లు రష్యా రక్షణశాఖ పేర్కొంది. సరిహద్దు ప్రాంతమైన కర్స్క్‌ను ప్రధానంగా లక్ష్యంగా చేసుకున్నట్లు తెలిపింది. అక్కడ 43 డ్రోన్లను కూల్చేశామని వెల్లడించింది. మొత్తంమీద 110 డ్రోన్లను ధ్వంసం చేశామని పేర్కొంది. జెర్జిన్స్క్ ప్రాంతంలో రష్యా ప్రభుత్వ ఆధ్వర్యంలోని స్వెర్డ్‌లోవ్ కర్మాగారాన్ని లక్ష్యంగా చేసుకొని దాడి చేసినట్లు ఉక్రెయిన్ సైన్యం ప్రకటించింది. అక్కడ శతఘ్ని గుళ్లు, బాంబులకు అవసరమైన రసాయనాలను తయారుచేస్తున్నట్లు ఆరోపించింది. తమ డ్రోన్ దాడి వల్ల లిపెట్స్క్ ప్రాంతంలోని వాయుసేన స్థావరంలో మంటలు చెలరేగినట్లు పేర్కొంది. సెప్టెంబరు చివర్లోనూ ఇదే తరహా దాడికి ఉక్రెయిన్ ప్రయత్నించింది. నాడు 125కిపైగా డ్రోన్లను కూల్చేసినట్లు రష్యా ప్రకటించింది.

ఉక్రెయిన్‌లోని క్రివ్యీ రిహ్ నగరంపై జరిగిన క్షిపణి దాడిలో 17 మంది గాయపడ్డారు. ఇళ్లు, దుకాణాలు దెబ్బతిన్నాయి. రష్యా తమపైకి 49 డ్రోన్లు, రెండు ఇస్కాందర్-ఎం బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించిందని ఉక్రెయిన్ వైమానిక దళం పేర్కొంది. వాటిలో 31 డ్రోన్లను కూల్చేశామని తెలిపింది. 13 లోహవిహంగాలను ఎలక్ట్రానిక్ రక్షణ వ్యవస్థలు నిర్వీర్యం చేసి ఉంటాయని పేర్కొంది.

రాకూడదని అనుకొంటూనే.. వచ్చా

- 'బిగ్‌బాస్ 18' షోలో సల్మాన్ నిర్వేదం
- బిష్ణోయ్ ముఠా బెదిరింపుల నేపథ్యం..



దిల్లీ: జనాదరణ పొందిన రియాలిటీ సిరీస్ 'బిగ్‌బాస్ 18' షూటింగుకు ఈ సారి తాను రాకూడదని అనుకొంటూనే వచ్చినట్లు బాలీవుడ్ సూపర్‌స్టార్ సల్మాన్‌ఖాన్ అన్నారు. శనివారం నాటి వారాంతపు ఎపిసోడ్‌లో హోస్ట్‌గా పాల్గొన్న సల్మాన్ ఈ షోలో పాల్గొంటున్న పోటీదారులతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ ముఠా నుంచి తీవ్రమైన బెదిరింపులు ఎదుర్కొంటున్న ఆయన మాటల్లో నిర్వేదం తొంగిచూసింది. సల్మాన్‌కు సన్నిహితుడైన మహారాష్ట్ర మాజీమంత్రి బాబా సిద్దీఖీని ఈ ముఠా వారం రోజుల కిందట ముంబయిలో కాల్చిచంపిన విషయం తెలిసిందే. ఘనమైన ఇఫ్తార్ పార్టీలు, బాలీవుడ్ స్నేహాలకు పేరెన్నికగన్న సిద్దీఖీని కేవలం సల్మాన్‌తో ఉన్న సాన్నిహిత్యం కారణంగానే బిష్ణోయ్ ముఠా లక్ష్యంగా చేసుకొన్నట్లు పోలీసుల కథనం. సిద్దీఖీ హత్యపై సామాజిక మాధ్యమాల్లో ఎటువంటి వ్యాఖ్యలు చేయని సల్మాన్.. అంత్యక్రియలకు కొన్ని గంటల ముందు బాంద్రాలోని తన మిత్రుని నివాసాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. ఈ నేపథ్యంలో బిగ్‌బాస్ వేదికపై సల్మాన్ చేసిన వ్యాఖ్యలు సిద్దీఖీ హత్య తర్వాత ఆయన నుంచి వెలువడిన తొలి బహిరంగ స్పందనగా భావిస్తున్నారు. "మిత్రులారా! దేవుడి సాక్షిగా చెబుతున్నా. నా జీవితం ఒక ప్రత్యేకదశలో సాగుతున్న తరుణంలో నేను మీ ముందుకు వచ్చి మీ తగవులు (షోలో హౌస్‌మేట్స్ మధ్య ఆర్గ్యుమెంట్లు) తీర్చాల్సి వస్తోంది. ఈరోజు ఇక్కడికి రావాల్సింది కాదనే నేను అనుకొంటున్నా. కానీ, మనం చేయాల్సింది చేయాలిగా" అంటూ షోలో సల్మాన్ చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. తన మీద చాలా ఆరోపణలు చేస్తున్నారని, ఈ పరిస్థితుల్లో తన తల్లిదండ్రులు ఎటువంటి అవస్థను అనుభవిస్తున్నారో తెలుసని సల్మాన్ అన్నారు. ఈ ఎపిసోడ్‌ను సిద్దీఖీ హత్యకు ముందు చిత్రీకరించారా.. తర్వాతనా అనేది నిర్వాహకులు నిర్ధారణ చేయలేదు. కాగా, సల్మాన్‌ఖాన్ ప్రాణాలతో ఉండాలంటే రూ.5 కోట్లు ఇవ్వాలని రెండు రోజుల కిందట ముంబయి ట్రాఫిక్ పోలీసుల వాట్సప్ నంబరుకు బిష్ణోయ్ ముఠా పేరుతో వచ్చిన బెదిరింపు సందేశంపై నగరంలోని వర్లీ ఠాణాలో కేసు నమోదు చేశారు. నేరవిభాగం పోలీసులు దీనిపై దర్యాప్తు ప్రారంభించారు.

భారత మీడియాపై కెనడా పోలీసుల అక్కసు

ఇంటర్నెట్‌డెస్క్: కెనడా పోలీసులు భారత్ మీడియాపై అక్కసు వెళ్లగక్కారు. ఇక్కడి మీడియా తప్పుగా రిపోర్టింగ్ చేస్తోందని ఆరోపించారు. భారత క్రిమినల్ గ్యాంగుల నుంచి కెనడా వాసులకు ఇప్పటికిప్పుడు ఎలాంటి ముప్పులేదని రాయల్ కెనడియన్ మౌంటెడ్ పోలీసు (ఆర్‌సీఎంపీ) అధికారిణి బ్రిగెట్టే గౌవిన్ ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. దేశంలోని హింసలో భారత ప్రభుత్వ హస్తం ఉందంటూ ఆర్సీఎంపీ కొన్నాళ్ల క్రితమే ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బ్రిగెట్టే వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కొన్నిసార్లు పోలీసులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని.. దీనిలో భాగంగానే గతంలో ఆ వ్యాఖ్యలు చేసినట్లు వివరణ ఇచ్చారు. "మేం కొన్ని ఆధారాలను భారత్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు చూపించాలనుకున్నాం. కానీ ఆ ప్రయత్నాలు విఫలమయ్యాయి. భారత మీడియా తప్పుడు కథనాలు ఇస్తోంది. మేం వాటిని సరిచేయాలనుకుంటున్నాం" అని బ్రిగెట్టే పేర్కొన్నారు. భారత క్రిమినల్ గ్యాంగుల నెట్‌వర్క్ అసాధారణంగా ఉందని ఆమె అభిప్రాయపడ్డారు.

జైల్లో లారెన్స్ బిష్ణోయ్ ఖర్చులకు రూ.40 లక్షలు!

ఇంటర్నెట్‌డెస్క్: ప్రస్తుతం జైల్లో ఉన్న పంజాబీ గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ అవసరాల కోసం అతడి కుటుంబం భారీ మొత్తం ఖర్చు చేస్తున్నట్లుగా అతని బంధువొకరు వెల్లడించారు. మహారాష్ట్ర మాజీ మంత్రి బాబా సిద్దీఖీ హత్యతో బిష్ణోయ్ పేరు మరోసారి వార్తల్లోకి వచ్చిన విషయం తెలిసిందే. ప్రస్తుతం అతడు జైల్లో ఉన్నా అతడి సోదరుడు, అనుచరుడు కెనడా నుంచి వారి ముఠాను నడిపిస్తున్నారు. బిష్ణోయ్ గురించి అతడి బంధువు రమేష్ బిష్ణోయ్ పలు సంచలన విషయాలు వెల్లడించారు. పంజాబ్ విశ్వవిద్యాలయం నుంచి న్యాయవిద్యను పూర్తి చేసిన లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌స్టర్‌గా మారతాడని తానెప్పుడూ ఊహించలేదని ఆయన చెప్పారు. "ముందు నుంచి మాది సంపన్న కుటుంబమే. లారెన్స్ తండ్రి హరియాణా పోలీసు కానిస్టేబుల్‌గా పనిచేసేవారు. వారికి మా గ్రామంలో దాదాపు 110 ఎకరాల భూమి ఉంది. లారెన్స్ ఎప్పుడూ ఖరీదైన దుస్తులు, బూట్లు ధరించేవాడు. ఇప్పుడు కూడా జైల్లో ఉన్న అతడి కోసం మా కుటుంబం సంవత్సరానికి రూ.40 లక్షలు ఖర్చు చేస్తోంది" అని రమేష్ వెల్లడించారు.

కాలుష్యం పెరగడానికి కారణం భాజపా 'చెత్త రాజకీయాలే': ఆతిశీ



దిల్లీ: దేశ రాజధాని నగరంలో పెరుగుతున్న వాయు, నీటి కాలుష్యానికి భాజపా 'చెత్త రాజకీయాలే' కారణమని దిల్లీ ముఖ్యమంత్రి ఆతిశీ మండిపడ్డారు. కాళిండికుంజ్ వద్ద యమునా నది ఉపరితలంపై విషపూరిత రసాయనాల నురగ కనబడటంపై ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. దిల్లీలో వాయు నాణ్యత క్షీణించడానికి భాజపా పాలిత రాష్ట్రాలైన హరియాణా, యూపీ కారణమని ఆరోపించారు. హరియాణాలో పంట వ్యర్థాల దహనం, డీజిల్ బస్సులు, ఇటుక బట్టీలు కారణమని పేర్కొన్నారు. యమునా నదిలో పారిశ్రామిక వ్యర్థ జలాలను శుద్ధి చేయకపోవడం వల్లే నదిపై నురగ ఏర్పడుతోందంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ఆ నురగను తొలగించేందుకు ఆదివారం రాత్రి నుంచి సిలికాన్ ఆధారిత డిఫోమర్లను వినియోగిస్తామన్నారు. 'కేంద్ర ప్రభుత్వ డేటా ప్రకారం.. పంజాబ్ పంట వ్యర్థాల దహనాలు సగానికి తగ్గాయి. యూపీ, హరియాణాల్లో మాత్రం పెరిగాయి. ఈ చర్యలు భాజపా నీచ రాజకీయాలకు అద్దంపడుతున్నాయి. పంజాబ్ ప్రభుత్వం తగ్గించగలిగినప్పుడు.. హరియాణా, యూపీలోని భాజపా ప్రభుత్వాలు ఎందుకు తగ్గించలేవు' అని ఆతిశీ ప్రశ్నించారు.

ఈనాడు సినిమా



ఎన్టీఆర్

యుద్ధభూమిలో మళ్లీ పోరు షురూ

హృతిక్ రోషన్‌తో కలిసి మరోసారి యుద్ధభూమిలోకి అడుగు పెట్టేందుకు సిద్ధమయ్యారు కథానాయకుడు ఎన్టీఆర్. ప్రస్తుతం వీళ్లిద్దరి కలయికలో తెరకెక్కుతున్న పాన్ ఇండియా చిత్రం 'వార్ 2'. అయాన్ ముఖర్జీ తెరకెక్కిస్తున్నారు. యశ్‌రాజ్ ఫిల్మ్స్ సంస్థ నిర్మిస్తోంది. చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా ప్రస్తుతం కొత్త షెడ్యూల్‌ను ప్రారంభించుకునేందుకు సిద్ధమైంది. అది ఈ వారం నుంచే ముంబయిలో మొదలు కానుంది. దీనికోసం ఎన్టీఆర్ ఇప్పటికే అక్కడికి చేరుకున్నారు. ఈ షెడ్యూల్‌లో హృతిక్ - తారక్‌లపై ఓ భారీ ఛేజింగ్ సీక్వెన్స్‌తో పాటు పాటను చిత్రీకరించనున్నట్లు సమాచారం. ఇందుకోసం ప్రత్యేకంగా కొన్ని సెట్లు సిద్ధం చేయించినట్లు తెలిసింది. అందులోనే ప్రధాన తారాగణంపై చిత్రీకరణ కొనసాగించనున్నారు. స్పై యాక్షన్ థ్రిల్లర్‌గా ముస్తాబవుతున్న ఈ సినిమా వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది.



రామ్ తాళ్లూరి, విష్వక్ సేన్, శ్రద్ధా శ్రీనాథ్, రవితేజ ముళ్లపూడి

రెండోసారీ చూసేంత స్థాయి ఉన్న చిత్రమిది

మెకానిక్ రాకీతో నవంబరు బరిలో ప్రేక్షకుల్ని పలకరించనున్నారు విష్వక్ సేన్. ఆయన హీరోగా నటించిన ఈ చిత్రాన్ని రవితేజ ముళ్లపూడి తెరకెక్కించారు. రామ్ తాళ్లూరి నిర్మించారు. మీనాక్షి చౌదరి, శ్రద్ధా శ్రీనాథ్ కథానాయికలు. సునీల్, నరేశ్ వి.కె తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. ఈ సినిమా నవంబరు 22న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే ఆదివారం హైదరాబాద్‌లో ఈ చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా హీరో విష్వక్ సేన్ మాట్లాడుతూ.. "ఈ చిత్రం ఇటీవలే చూశా. చాలా నమ్మకంగా ఉన్నాం. ఇది ప్రేక్షకుల్ని సీటు అంచున కూర్చోబెట్టే సినిమా. రెండోసారి కూడా చూసే స్థాయిలో ఉంటుంది. ద్వితీయార్ధంలో థియేటర్స్ అన్నీ ఆడిటోరియమ్‌లా మారిపోతాయి. త్వరలో మరో ట్రైలర్ కూడా వస్తుంది. నవంబరు 21న సాయంత్రం నుంచే పెయిడ్ ప్రీమియర్స్ వేయనున్నాం" అన్నారు. "ట్రైలర్ అందరికీ నచ్చిందనుకుంటున్నా. ఇంకా చాలా కంటెంట్ సినిమాలో ఉంది. అందరూ ఈ సినిమా చూసి విజయవంతం చేయాలని కోరుకుంటున్నా" అన్నారు దర్శకుడు రవితేజ. నిర్మాత రామ్ తాళ్లూరి మాట్లాడుతూ.. "నవంబరు 22న థియేటర్స్‌లో మాస్ జాతర ఉంటుంద"న్నారు. ఈ కార్యక్రమంలో శ్రద్ధా శ్రీనాథ్, క్రాంతి ప్రియం తదితరులు పాల్గొన్నారు.



కియారా అద్వాణీ



శార్వరీ వాఘ్

ఇద్దరు భామలతో రణ్‌బీర్ యాక్షన్?



రణ్‌బీర్ కపూర్

చిత్రపరిశ్రమలో ప్రస్తుతం అందరి దృష్టి 'ధూమ్ 4' చిత్రంపైనే. సినీప్రియులను విశేషంగా ఆకట్టుకున్న 'ధూమ్' ఫ్రాంఛైజీలో భాగమిది. ప్రముఖ నిర్మాణ సంస్థ యశ్‌రాజ్ ఫిలింస్ తీర్చిదిద్దుతున్న ఈ నాల్గో భాగంలో బాలీవుడ్ కథానాయకుడు రణ్‌బీర్ కపూర్ ప్రధాన పాత్రలో నటిస్తున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ సినిమా గురించి మరో ఆసక్తికర విషయం బయటికొచ్చింది. ఈ యాక్షన్ థ్రిల్లర్ చిత్రంలో బాలీవుడ్ అందాల తారలు కియారా అద్వాణీ, శార్వరీ వాఘ్‌లు కథానాయికలుగా నటించనున్నట్లు తెలుస్తోంది. 'ప్రస్తుతం 'ధూమ్ 4' స్క్రిప్ట్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇందులో రణ్‌బీర్ సరసన నటించడానికి కియారా, శార్వరీలతో చర్చలు జరుపుతోంది చిత్రబృందం. వీరిద్దరిలో ఒకరు పోలీసుగా, మరొకరు విలన్ పాత్రలో మెరవనున్నారు. త్వరలో పూర్తి విషయాల్ని అధికారికంగా వెల్లడించనున్నార'ని రణ్‌బీర్ సన్నిహిత వర్గాలు తెలిపాయి. మరి ఈ అందాల భామలతో రణ్‌బీర్ చేసే సందడి ఎలా ఉంటుందో తెలియాలంటే కొన్ని రోజులు వేచిచూడాల్సిందే.


సంక్రాంతి తెలుగు చిత్రసీమకే కాదు.. తమిళ పరిశ్రమకూ పెద్ద పండగే. ఈ పొంగల్ బరిలో ఇద్దరు ముగ్గురు తమిళ అగ్రతారల చిత్రాలు పోటీ పడటం ఏటా కనిపించే ఆనవాయితీనే. అలాగే వీటిలో సింహభాగం తెలుగులోనూ అనువాదాలుగా అదృష్టం పరీక్షించుకోవడమూ పరిపాటే. అందుకే తెలుగు సినీప్రియులూ కోలీవుడ్ పొంగల్ రేసును ఆసక్తిగా గమనిస్తుంటారు. అయితే ఇప్పుడిప్పుడే తెలుగు సంక్రాంతి రేసుపై స్పష్టత వస్తుండగా.. కోలీవుడ్‌లో మాత్రం పొంగల్ పందెంపై ఇంకా సందిగ్ధత కొనసాగుతూనే ఉంది. దీంతో ఈసారి పండగ బరిలో వినోదాలు పంచే తారలెవరన్నది అటు కోలీవుడ్ సినీప్రియుల్లోనూ.. ఇటు తెలుగు ప్రేక్షకుల్లోనూ ఆసక్తిరేకెత్తిస్తోంది.

కోలీవుడ్ పొంగల్ దంగల్!

ఇంకా సందిగ్ధంలోనే



కమల్‌హాసన్



అజిత్



విక్రమ్



కార్తి

తమిళ చిత్రసీమ నుంచి పొంగల్ బరిలో నిలిచే చిత్రాలేవన్నది ఇంత వరకు స్పష్టత రానప్పటికీ.. ఈసారి ముగ్గురు అగ్రతారల మధ్య ముక్కోణపు పోటీ కనిపించడం ఖాయంగా కనిపిస్తోంది. తమిళ అగ్ర కథానాయకుడు అజిత్‌కు పొంగల్ బాగా అచ్చొచ్చిన సీజన్. ఆయన నుంచి వచ్చిన 'తునీవు', 'విశ్వాసం', 'వీరం' తదితర చిత్రాలన్నీ ఈ పండగ బరిలో మంచి ఆదరణ దక్కించుకున్నాయి. భారీ వసూళ్లు సాధించి సత్తా చాటాయి. దీంతో ఇప్పుడాయన మరోసారి పొంగల్ బరిలో అదృష్టం పరీక్షించుకునేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ప్రస్తుతం అజిత్ చేతిలో 'విదాముయార్చి'తో పాటు 'గుడ్ బ్యాడ్ అగ్లీ' చిత్రాలున్నాయి. ఈ రెండు యాక్షన్ ఎంటర్‌టైనర్లలో తిరుమేని తెరకెక్కించిన 'విదాముయార్చి' ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకోగా.. అధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహిస్తున్న 'గుడ్ బ్యాడ్ అగ్లీ' ముగింపు దశలో ఉంది. అయితే వీటిలో అజిత్ - రవిచంద్రన్‌ల సినిమాని పొంగల్ బరిలో నిలపనున్నట్లు ఆ చిత్ర బృందం గతంలోనే ప్రకటించింది. కాకపోతే డిసెంబరు నాటికి ఈ చిత్రం సిద్ధమయ్యే దాన్ని బట్టి విడుదల తేదీపై స్పష్టత వచ్చే అవకాశముంది. అందుకే మరోవైపు 'విదాముయార్చి'ని కూడా పండగ లక్ష్యంగానే చకచకా నిర్మాణానంతర పనులు పూర్తి చేస్తోంది ఆ చిత్ర బృందం. మరి ఈ రెండింటిలో ఏది ముందొస్తుందన్నది ఇప్పటికి తేలకున్నా.. పొంగల్ రేసులో అజిత్ కనిపించడం పక్కా అని అర్థమవుతోంది.

యాక్షన్ థ్రిల్లర్‌గా...

ఇటీవలే 'తంగలాన్'తో భారీ విజయాన్ని అందుకుని జోరుమీదున్నారు కథానాయకుడు విక్రమ్. ఇప్పుడాయన పొంగల్ బరిలో అజిత్‌తో తలపడనున్నట్లు కోలీవుడ్ వర్గాల సమాచారం. ప్రస్తుతం ఆయన నుంచి రానున్న కొత్త చిత్రం 'వీర ధీర శూరన్: పార్ట్ 2'. 'చిన్నా' సినిమాతో ప్రేక్షకుల్ని మెప్పించిన ఎస్.యు.అరుణ్ కుమార్ దీన్ని తెరకెక్కిస్తున్నారు. గ్రామీణ నేపథ్యంలో సాగే యాక్షన్ థ్రిల్లర్‌గా ముస్తాబవుతున్న ఈ చిత్రం ప్రస్తుతం ముగింపు దశలో ఉంది. దీన్ని ముగ్గుల పండగ బరిలో అజిత్ సినిమాకి ఒకరోజు అటుఇటుగా విడుదల చేసేందుకు చిత్ర నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నట్లు ప్రచారం వినిపిస్తోంది. ఇక ఈ పండగ రేసులోనే అజిత్, విక్రమ్‌లకు తోడుగా కథానాయకుడు కార్తి కూడా సందడి చేసే అవకాశమున్నట్లు కోలీవుడ్ నుంచి సమాచారం అందుతోంది. ప్రస్తుతం ఆయన హీరోగా నలన్ కుమారస్వామి తెరకెక్కించిన చిత్రం 'వా వాతియారే'. కె.ఇ.జ్ఞానవేల్ రాజా నిర్మించారు. యాక్షన్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా ముస్తాబవుతున్న ఈ సినిమా ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్లో ఉంది. నవంబరు నాటికి దీన్ని పూర్తిగా సిద్ధం చేసి విడుదల తేదీపై స్పష్టత ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. 'సత్యం సుందరం' విజయం తర్వాత కార్తి నుంచి వస్తున్న సినిమా కావడంతో దీనిపైనా ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి.

కమల్ సందడి ఓటీటీలో?

కథానాయకుడు కమల్‌హాసన్.. దర్శకుడు శంకర్ కలయికలో రూపొందిన చిత్రం 'భారతీయుడు 2'. ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ సినిమా బాక్సాఫీస్ ముందు చేదు ఫలితాన్ని అందుకుంది. ఈ నేపథ్యంలో ఆ సినిమాకి కొనసాగింపుగా సిద్ధం చేసిన 'భారతీయుడు 3' థియేట్రికల్ విడుదలపై అనుమానాలు నెలకొన్నాయి. ప్రస్తుతం దీన్ని నేరుగా ఓ ప్రముఖ ఓటీటీ వేదికలో విడుదల చేసేందుకు చర్చలు చేస్తున్నట్లు తెలిసింది. అన్నీ అనుకున్నట్లు జరిగితే దీన్ని జనవరిలో సంక్రాంతి సందర్భంగా ఓటీటీలో చూసే అవకాశముందని సమాచారం.

తెలుగులోకి వచ్చేవెన్ని?

కథానాయకులు అజిత్, విక్రమ్, కార్తిలకు తమిళ చిత్రసీమకు దీటుగా తెలుగులోనూ మంచి మార్కెట్ ఉంది. అందుకే వీరి నుంచి వచ్చే ప్రతి సినిమా తెలుగులోనూ ఒకేసారి విడుదలవుతుంటుంది. అంతేకాదు సంక్రాంతి బరిలోనూ వీరి అనువాదాలు తెలుగు చిత్రాలతో పోటీ పడటం ఏటా చూస్తూనే ఉంటాం. కానీ, ఈసారి ఆ పోటీలో నిలిచేవెన్ని అన్నది ఆసక్తిరేకెత్తిస్తోంది. ఈ ఏడాది పొంగల్ సందర్భంగా తమిళంలో ధనుష్ 'కెప్టెన్ మిల్లర్', శివ కార్తికేయన్ 'అయలాన్', విజయ్ సేతుపతి 'మేరీ క్రిస్మస్' తదితర చిత్రాలు బాక్సాఫీస్ ముందు అదృష్టం పరీక్షించుకున్నాయి. వీటిలో ధనుష్, శివ కార్తికేయన్‌ల సినిమాల్ని తెలుగులోనూ విడుదల చేయడానికి ప్రయత్నించినప్పటికీ అప్పటికే తెలుగులోని సంక్రాంతి చిత్రాల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నారు. వాటిని రెండు వారాలు ఆలస్యంగా తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. ప్రస్తుతం తెలుగులో మరోసారి అదే రీతిలో సంక్రాంతి చిత్రాల పోటీ కనిపిస్తోంది. రామ్‌చరణ్, బాలకృష్ణ, వెంకటేశ్ తదితరుల చిత్రాలు పండగ బరిలో తలపడటం దాదాపుగా ఖాయమైంది. నాగచైతన్య, సందీప్ కిషన్ తదితరులు ఈ రేసులో కనిపించే అవకాశమున్నట్లు తెలుస్తోంది. మరి ఇంత రద్దీ నేపథ్యంలో ఈసారైనా అనువాద చిత్రాలకు తెలుగులో థియేటర్లు దొరికే అవకాశముందా? లేక ఈ ఏడాది పరిస్థితే పునరావృతమవుతుందా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

ప్రేక్షకుల్ని బంధువులుగా మార్చే సినిమా!



రమేశ్

"అరిటాకులో విందు భోజనంలా ఉంటుంది మా 'లగ్గం'. పెళ్లైన ప్రతి వాళ్లకు వాళ్ల లగ్గాన్ని మరోసారి గుర్తు చేసేలా ఉంటుంద"న్నారు దర్శకుడు రమేశ్ చెప్పాల. ఆయన దర్శకత్వంలో సాయిరోనక్, ప్రజ్ఞ నగ్ర జంటగా నటించిన చిత్రమే 'లగ్గం'. వేణుగోపాల్ రెడ్డి నిర్మించారు. రాజేంద్రప్రసాద్, ఎల్బీ శ్రీరామ్, రఘుబాబు తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. ఈ సినిమా ఈనెల 25న విడుదల కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు రమేశ్ మాట్లాడుతూ.. "తెలంగాణలో లగ్గానికి చాలా ప్రత్యేకత ఉంది. ఆ సంస్కృతిని.. దాంట్లోని ఎమోషన్‌ను కలిపి తెరపైకి తీసుకురావాలన్న ఆలోచనతో ఈ కథ సిద్ధం చేశా. ఆడపిల్ల ఉన్న ప్రతి తండ్రితో పాటు అందరూ చూడాల్సిన చిత్రమిది. ఈ కథలోని భావోద్వేగాలను ఓ పెయింటింగ్‌లా తెరపై ఆవిష్కరించాను. పెళ్లైన వాళ్లకు వాళ్ల లగ్గాన్ని గుర్తు చేస్తూనే.. పెళ్లి చేసుకునే వాళ్లకు ఎలా చేసుకోవాలో వినోదాత్మకంగా చెప్పాను. అలాగే వివాహం విషయంలో వధూవరుల కుటుంబాలు ఎలా ఆలోచించాలన్నది తెలియజేశాం. ఈ చిత్రంతో ప్రేక్షకుల్ని బంధువులుగా మార్చనున్నాం" అన్నారు. ఈ సినిమాకి సంగీతం: మణిశర్మ, ఛాయాగ్రహణం: బాల్‌రెడ్డి.

జనవరిలో స్కై ఫోర్స్?



అక్షయ్ కుమార్

'సర్ఫిరా', 'ఖేల్ ఖేల్ మే' చిత్రాలతో ఇటీవలే ప్రేక్షకులను అలరించిన బాలీవుడ్ అగ్ర కథానాయకుడు అక్షయ్ కుమార్. ప్రస్తుతం ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'స్కై ఫోర్స్'. యాక్షన్ డ్రామా నేపథ్యంలో సందీప్ కేవ్లానీ తెరకెక్కిస్తున్నారు. భారత దేశ మొదటి వైమానిక దాడి ఆధారంగా రూపొందుతున్న చిత్రమిది. దినేశ్ విజన్ నిర్మిస్తున్నారు. ఇందులో సారా అలీ ఖాన్, వీర్ పహారియా, నిమ్రత్ కౌర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా ఈ సినిమాను వచ్చే ఏడాది గణతంత్ర దినోత్సవం సందర్భంగా విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. "చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ నిర్మాణానంతర పనులు ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నాయి. క్రిస్మస్‌కు విడుదల కాబోతున్న ఈ సినిమా ట్రైలర్‌తో ప్రచార కార్యక్రమాల్ని మొదలు పెట్టనుంది చిత్రబృందం. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది జనవరి 24న విడుదల చేయాలని నిర్ణయించుకుంది చిత్రబృందం" అని అక్షయ్ కుమార్ సన్నిహిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఈయన 'కన్నప్ప', 'జాలీ ఎల్‌ఎల్‌బీ 3', 'హౌస్‌ఫుల్ 5' చిత్రాలతో బిజీగా ఉన్నారు.

ఆదరణ ఆనందాన్నిస్తోంది!

రామ్ కార్తీక్, కశ్వి జంటగా మనోజ్ పల్లేటి తెరకెక్కించిన చిత్రం 'వీక్షణం'. అశోక్ రెడ్డి, పి.పద్మనాభ రెడ్డి సంయుక్తంగా నిర్మించారు. ఈ సినిమా ఇటీవల విడుదలైన నేపథ్యంలో ఆదివారం హైదరాబాద్‌లో థ్యాంక్స్‌మీట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హీరో రామ్ కార్తీక్ మాట్లాడుతూ.. "ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి దక్కుతున్న ఆదరణ ఆనందాన్నిస్తోంది. దీన్ని ఇంత పెద్ద హిట్ చేసిన ప్రేక్షకులందరికీ కృతజ్ఞతలు" అన్నారు. "ఈ సినిమా హిట్టవుతుందని తెలుసు. కానీ, ఈస్థాయి విజయాన్ని అందుకుంటుందని ఊహించలేదు. మంచి చిత్రాన్ని ప్రోత్సహించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు" అన్నారు దర్శకుడు మనోజ్. ఈ కార్యక్రమంలో శ్రీరామ్, శ్రీనివాస్, సమర్థ్, ఫణి తదితరులు పాల్గొన్నారు.



రామ్ కార్తీక్, మనోజ్, సమర్థ్

ఆల్ఫా సెట్లో అలియా



అలియా భట్

'జిగ్రా'తో ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది బాలీవుడ్ కథానాయిక అలియా భట్. ఇందులో తన తమ్ముడి కోసం పోరాటం చేస్తున్న ఓ సోదరి పాత్రలో కనిపించి మెప్పించింది. ఇప్పుడామె తన రాబోయే 'ఆల్ఫా' సినిమా కోసం రంగంలోకి దిగింది. శివ్ రావేల్ దీన్ని తెరకెక్కిస్తున్నారు. శార్వరీ వాఘ్ కీలక పాత్ర పోషిస్తుంది. ప్రస్తుతం కశ్మీర్‌లో ఈ సినిమా రెండో షెడ్యూల్ చిత్రీకరణ జరుగుతుంది. తాజాగా ఈ షూటింగ్‌లో పాల్గొన్నట్లు తెలుపుతూ.. సామాజిక మాధ్యమాల వేదికగా ఓ ఫొటోను పంచుకుంది. యశ్‌రాజ్ ఫిలింస్ నిర్మిస్తున్న మొదటి మహిళా గూఢచారి చిత్రమిది. అనిల్ కపూర్, బాబీ దేవోల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. వచ్చే ఏడాది క్రిస్మస్ సందర్భంగా డిసెంబరు 25న ప్రేక్షకుల ముందుకు రానుందీ చిత్రం.

గ్లిజరిన్ వేసుకొని ఏడవడం నచ్చక నటనే వదిలేయాలనుకున్నా!

ఫ్లాష్‌బ్యాక్

గ్లామర్, డీ గ్లామర్.. ఇలా పాత్ర ఏదైనా అవలీలగా నటిస్తూ ప్రేక్షకుల్ని మెప్పిస్తుంటుంది బాలీవుడ్ అగ్ర కథానాయిక కాజోల్. 'కరణ్ అర్జున్', 'కుచ్ కుచ్ హోతా హై', 'దిల్‌వాలే దుల్హానియా లే జాయేంగే' లాంటి ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో నటించి మూడు దశాబ్దాలుగా చిత్రసీమను ఏలుతున్న అందాల భామ ఈమే. ఎంతో మంది అగ్రతారల సరసన ఆడిపాడిన కాజోల్... ఓ సందర్భంలో సినిమాల నుంచి దూరం కావాలని అనుకుందట. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె.. ఆనాటి సంగతుల్ని గుర్తు చేసుకుంది. "ఉధార్ కీ జిందగీ' నా మూడో సినిమా. అప్పుడు నాకు 18ఏళ్లు ఉంటాయనుకుంటా. అప్పుడే చిత్రపరిశ్రమకి వచ్చిన నాకు అంతా కొత్తగా ఉంది. మేకప్, గ్లిజరిన్ వేసుకోని ఏడ్వడం.. ఇవన్నీ చూసి నటనతో విసిగిపోయాను. ఆ సినిమా చిత్రీకరణ పూర్తిచేశాక నటనకు స్వస్తి చెప్పాలని నిర్ణయించుకున్నాను. ఇక నటించడం నా వల్ల కాదని మా అమ్మకు చెప్పేశా. కానీ.. షారుక్ నన్ను నా వృత్తిలో కొనసాగేందుకు ప్రోత్సహించారు. 'నీకు అన్నీ తెలుసు. ఇంకా నటించడం నేర్చుకుంటే భవిష్యత్తులో మంచి స్థాయిలో ఉంటావ'ని అన్నారు. ఆయన మాటలతో నేను కొంత ధైర్యాన్ని తెచ్చుకొని నటనలో టెక్నిక్‌లను నేర్చుకున్నాన"ని చెప్పుకొచ్చింది కాజోల్. ప్రస్తుతం ఆమె నటించిన 'దో పత్తి' ఈ నెల 25న రానుంది.



కాజోల్

డ్రగ్స్ నేపథ్యంతో..



సందీప్, శగ్న శ్రీ

ఆట సందీప్, శగ్న శ్రీ జంటగా రామక్రిష్ణ కంచి తెరకెక్కించిన చిత్రం 'ది షార్ట్ కట్'. రంగారావు తోట, రజనీకాంత్ పున్నపు సంయుక్తంగా నిర్మించారు. ఈ చిత్ర ట్రైలర్‌ను నృత్య దర్శకుడు శేఖర్‌మాస్టర్ ఇటీవల హైదరాబాద్‌లో విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. "ట్రైలర్ బాగుంది. ఇందులోని కొన్ని డైలాగులు సినిమా వాళ్ల జీవితాలకు అతి దగ్గరగా ఉన్నాయి. ఈ చిత్రంతో సందీప్ హీరోగా మారడం ఆనందంగా ఉంది" అన్నారు. "డ్రగ్స్ కల్చర్‌పై తీసిన చిత్రమిది. దాని వల్ల సమాజానికి ఎంత ప్రమాదం జరుగుతుందన్నది చెబుతూనే.. డ్రగ్స్ నివారణ కోసం ఏం చేయాలన్నది దీంట్లో చూపించాం" అన్నారు దర్శకుడు రామక్రిష్ణ. హీరో సందీప్ మాట్లాడుతూ.. "కామెడీతో పాటు యాక్షన్ నేపథ్యంలో సాగే చిత్రమిది. ఇండస్ట్రీలో దర్శకుడవ్వాలని ప్రయత్నిస్తున్న యువకుడి జీవితం ఎలా మారిందన్నది చిత్ర కథాంశం" అన్నారు.

స్థిరీకరణ కొనసాగే అవకాశం!



సమీక్ష: అంతర్జాతీయ సంకేతాల ప్రభావంతో గత వారం సూచీలు స్వల్ప నష్టాల్లో ముగిశాయి. విదేశీ మదుపర్ల అమ్మకాలు కొనసాగగా, దిగువ స్థాయుల్లో డీఐఐలు కొనుగోళ్లకు మొగ్గుచూపారు. దేశీయంగా చూస్తే.. కూరగాయల ధరలు ప్రియం కావడంతో సెప్టెంబరులో రిటైల్ ద్రవ్యోల్బణం 9 నెలల గరిష్ఠమైన 5.49 శాతానికి చేరింది. టోకు ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం (డబ్ల్యూపీఐ) 1.84 శాతానికి పెరిగింది. సెప్టెంబరులో ఎగుమతుల అండతో, వాణిజ్యలోటు 20.78 బిలియన్ డాలర్లకు తగ్గింది. హ్యుందాయ్ మోటార్ రూ.27,870 కోట్ల ఐపీఓకు 2.37 రెట్ల స్పందన లభించింది. త్రైమాసిక ఫలితాలు, కార్పొరేట్ వార్తల నేపథ్యంలో షేరు/రంగం ఆధారిత కదలికలు సూచీలను నడిపించాయి. బ్యారెల్ ముడిచమురు ధర 7.6% తగ్గి 73 డాలర్లకు చేరింది. చైనాలో గిరాకీ భయాలు, ఇజ్రాయెల్-ఇరాన్ పరిణామాలు ప్రభావం చూపాయి. అంతర్జాతీయంగా చూస్తే.. ఈసీబీ కీలక రేట్లను మరో 0.25% తగ్గించి 3.25% చేసింది. సెప్టెంబరులో బ్రిటన్ ద్రవ్యోల్బణం 1.7 శాతానికి చేరింది. మూడో త్రైమాసికంలో చైనా జీడీపీ 4.6% పెరిగింది. సెప్టెంబరులో చైనా ఐఐపీ వృద్ధి 5.4 శాతంగా నమోదైంది. మొత్తం మీద ఈ పరిణామాలతో గత వారం సెన్సెక్స్ 0.2% నష్టంతో 81,225 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 0.4% తగ్గి 24,854 పాయింట్ల దగ్గర స్థిరపడింది. రంగాల వారీ సూచీల్లో వాహన, చమురు-గ్యాస్, ఎఫ్ఎమ్‌సీజీ షేర్లు లాభపడగా.. బ్యాంకింగ్, స్థిరాస్తి, యంత్ర పరికరాల షేర్లు నష్టపోయాయి. విదేశీ సంస్థాగత మదుపర్లు (ఎఫ్ఐఐలు) నికరంగా రూ.21,823 కోట్ల విలువైన షేర్లను విక్రయించగా, డీఐఐలు రూ.16,384 కోట్ల షేర్లను కొనుగోలు చేశారు. ఈ నెలలో ఇప్పటివరకు విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్లు (ఎఫ్‌పీఐలు) నికరంగా రూ.70,000 కోట్లు వెనక్కి తీసుకున్నారు.

లాభపడ్డ, నష్టపోయిన షేర్ల నిష్పత్తి 7:8గా నమోదు కావడం.. మార్కెట్లలో అప్రమత్తతను సూచిస్తోంది.

ఈ వారంపై అంచనా: వరుసగా మూడో వారం స్థిరీకరించుకున్న సెన్సెక్స్, నష్టాల్లో ముగిసింది. అయితే వారం చివర్లో కొంత రికవరీ కనిపించింది. ఇటీవలి కనిష్ఠమైన 80,400 పాయింట్ల దిగువకు చేరితే మాత్రం, మరిన్ని నష్టాలకు అవకాశం ఉంటుంది. మరోవైపు 82,000 పాయింట్ల వద్ద బలమైన నిరోధం, ఆ తర్వాత 83,400 వద్ద మరో నిరోధం ఎదురుకావొచ్చు.

ప్రభావిత అంశాలు: అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చే సంకేతాలను దేశీయ సూచీలు అందిపుచ్చుకోవచ్చు. నవంబరు 4న అమెరికా అధ్యక్ష ఎన్నికలు జరగనుండటంతో మదుపర్లు ఆచితూచి వ్యవహరించొచ్చు. పశ్చిమాసియాలో పరిస్థితులు కీలకం కానున్నాయి. కొన్ని వారాలుగా ఎఫ్ఐఐల విక్రయాలు కొనసాగుతుండటంతో డాలర్‌తో పోలిస్తే రూపాయి కదలికలపై దృష్టి పెట్టొచ్చు. ముడిచమురు ధరలు మరింత తగ్గితే, ఈక్విటీ మదుపర్ల సెంటిమెంట్ బలపడే అవకాశం ఉంది. భారత తయారీ, సేవల పీఎంఐ గణాంకాలు, ఆర్‌బీఐ ఎంపీసీ సమావేశ మినిట్స్ వెలువడనున్నాయి. ఈ వారం అల్ట్రాటెక్, బజాజ్ ఫైనాన్స్, పర్సిస్టెంట్, జొమాటో, గోద్రేజ్ ప్రాపర్టీస్, హెచ్‌యూఎల్, ఎస్‌బీఐ లైఫ్, కోల్గేట్, కోరమాండల్, ఐటీసీ, యూబీఎల్, బ్యాంక్ ఆఫ్ బరోడా, బీఈఎల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్, కోల్ ఇండియా, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ వంటి కంపెనీలు ఫలితాలు విడుదల చేయనున్నాయి. ఫలితాలతో పాటు యాజమాన్యాల భవిష్యత్ అంచనాలపై దృష్టిపెట్టొచ్చు. అంతర్జాతీయంగా.. జర్మనీ, యూరోజోన్, బ్రిటన్, అమెరికా పీఎంఐ గణాంకాలు, అమెరికా గృహ విక్రయాల గణాంకాలపై కన్నేయొచ్చు.

తక్షణ మద్దతు స్థాయులు: 80,409, 80,000, 78,496

తక్షణ నిరోధ స్థాయులు: 81,810, 82,320, 83,400

స్వల్పకాలంలో సెన్సెక్స్ స్థిరీకరణకు అవకాశం ఉంది.

– సతీశ్ కంతేటి, జెన్ మనీ

పసిడిలో స్వల్ప దిద్దుబాటు!


కమొడిటీస్ ఈ వారం

పసిడి



పసిడి డిసెంబరు కాంట్రాక్టు ఈవారం రూ.76,397 కంటే దిగువన ట్రేడయితే కొంత దిద్దుబాటుకు ఆస్కారం ఉంటుంది. రూ.75,045; రూ.74,324 వరకు దిగిరావచ్చు. ఒకవేళ రూ.76,397 కంటే పైన కదలాడితే సమీపకాలంలో రూ.78,471 వద్ద నిరోధం ఎదురుకావచ్చు. ఈ స్థాయిని మించితే రూ.79,191, రూ.80,543 వరకు పెరిగే అవకాశం ఉంటుంది.

వెండి



వెండి డిసెంబరు కాంట్రాక్టు రూ.93,009 కంటే దిగువన కదలాడితే కొంత బలహీనతకు అవకాశం ఉంటుంది. రూ.95,274 ఎగువన సానుకూలంగా కదలాడొచ్చు. అందువల్ల రూ.93,009 దిగువన కాంట్రాక్టును షార్ట్ సెల్ చేయడం లేదంటే.. రూ.95,274 ఎగువన లాంగ్ పొజిషన్లు తీసుకోవడం మంచి వ్యూహం అవుతుంది.

ప్రాథమిక లోహాలు



● రాగి అక్టోబరు కాంట్రాక్టు ప్రతికూలంగా కదలాడితే రూ.807.65 వద్ద మద్దతు లభించొచ్చు. ఈ స్థాయిని కోల్పోతే రూ.793.25కు దిగిరావచ్చు. అదే సమయంలో సానుకూల ధోరణిలో చలిస్తే రూ.837.55 వద్ద నిరోధం ఎదురయ్యే అవకాశం ఉంటుంది. ఈ స్థాయిని అధిగమిస్తే రూ.853.30; రూ.867.60 వరకు పెరుగుతుందని భావించొచ్చు.

● సీసం అక్టోబరు కాంట్రాక్టుకు రూ.181.20 దిగువన లాంగ్ పొజిషన్లకు దూరంగా ఉండాలి. రూ.180.75 కంటే కిందకు వస్తే రూ.179.05; రూ.177.45 వరకు కాంట్రాక్టు దిద్దుబాటు అయ్యే అవకాశం ఉంది. ఒకవేళ పైకి వెళితే రూ.184.15 వద్ద నిరోధం ఎదురుకావచ్చు. దీనిని అధిగమిస్తే రూ.185.75; రూ.187.45 వరకు పెరిగే అవకాశం ఉంటుంది.

● జింక్ అక్టోబరు కాంట్రాక్టు రూ.279 కంటే కిందకు వస్తే రూ.273.20; రూ.269.25కు చేరొచ్చు. అదే విధంగా రూ.288.75 స్థాయిని మించితే రూ.292.70; రూ.298.50 వరకు రాణించొచ్చు.

● అల్యూమినియం అక్టోబరు కాంట్రాక్టు రూ.234.05 కంటే దిగువన కదలాడితే కొంత దిద్దుబాటుకు అవకాశం ఉంటుంది. అయితే రూ.233.95 వద్ద మద్దతు లభించొచ్చు. ఈ స్థాయిని కోల్పోతే రూ.228.85; రూ.224.95 వరకు పడిపోవచ్చు. రూ.242.95 స్థాయిని మించితే రూ.246.85; రూ.251.95 వరకు పెరిగే అవకాశం ఉంటుంది.


ఇంధన రంగం



● ముడి చమురు నవంబరు కాంట్రాక్టు రూ.5,641 కంటే దిగువన ట్రేడయితే రూ.5,443; రూ.5,130 వరకు దిద్దుబాటు కావచ్చు. ఒకవేళ సానుకూల ధోరణిలో చలిస్తే రూ.6,152 వద్ద నిరోధం ఎదురుకావచ్చు. ఈ స్థాయిని అధిగమిస్తే.. 6,465; రూ.6,663 వరకు పెరిగే అవకాశం ఉంటుంది.

● సహజవాయువు అక్టోబరు కాంట్రాక్టు రూ.225.45 కంటే దిగువన ట్రేడ్ కాకుంటే సానుకూల ధోరణికి అవకాశం ఉంటుంది. అయితే రూ.247.35 వద్ద నిరోధం ఎదురుకావచ్చునే విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలి. ఈ స్థాయి కంటే పైకి వెళితే రూ.261.45; రూ.268.85 వరకు పెరిగే అవకాశం ఉంటుంది.

వ్యవసాయ ఉత్పత్తులు



● పసుపు డిసెంబరు కాంట్రాక్టు రూ.13,234 కంటే దిగువన ట్రేడ్ కాకుంటే కొనుగోళ్ల మద్దతు లభించొచ్చు. అయితే రూ.14,098 వద్ద నిరోధం ఎదురుకావచ్చు. ఈ స్థాయిని అధిగమిస్తే రూ.14,496 వరకు వెళ్లే అవకాశం ఉంటుంది. ఒకవేళ రూ.13,234 కంటే కిందకు వస్తే రూ.12,768 వరకు దిద్దుబాటు కావచ్చు.

● పత్తి క్యాండీ నవంబరు కాంట్రాక్టు కిందకు వస్తే రూ.55,583 వద్ద మద్దతు లభించొచ్చు. ఈ స్థాయినీ కోల్పోతే రూ.54,176 వరకు దిగిరావచ్చు. అదేవిధంగా రూ.57,913 కంటే పైకి వెళితే రూ.58,836 వరకు పెరిగే అవకాశం ఉంటుంది.

– ఆర్ఎల్‌పీ కమొడిటీ అండ్ డెరివేటివ్స్

గతవారం కదలికలు ఇలా

కమొడిటీ	ప్రారంభం (రూ.లలో)	ముగింపు (రూ.లలో)	వృద్ధి/(క్షీణత) (శాతంలో)
పసిడి (డిసెంబరు)	76,251	77,750	1.97
వెండి (డిసెంబరు)	91,239	95,470	4.64
రాగి (అక్టోబరు)	839	821.90	-2.04
సీసం (అక్టోబరు)	183.70	182.50	-0.65
జింక్ (అక్టోబరు)	285.55	284.80	-0.26
అల్యూమినియం (అక్టోబరు)	240.10	239.05	-0.44
ముడి చమురు (నవంబరు)	6,264	5,839	-6.78
సహజ వాయువు (అక్టోబరు)	253.40	233.30	-7.93
పసుపు (డిసెంబరు)	13,560	13,700	1.03
పత్తి క్యాండీ (నవంబరు)	56,620	56,990	0.65

ఈనాడు బిజినెస్

నవంబరు 1న మూరత్ ట్రేడింగ్

దిల్లీ: దీపావళి సందర్భంగా నవంబరు 1న గంట పాటు ప్రత్యేక 'మూరత్ ట్రేడింగ్'ను బీఎస్ఈ, ఎన్ఎస్ఈ నిర్వహించనున్నాయి. 'సంవత్ 2081' ప్రారంభాన్ని పురస్కరించుకుని ఈ ప్రత్యేక ట్రేడింగ్ సెషన్ నిర్వహిస్తారు. సాయంత్రం 6 గంటలకు మొదలై రాత్రి 7 గంటలకు ఈ ట్రేడింగ్ ముగియనుంది. ముందస్తు ట్రేడింగ్ సెషన్ సాయంత్రం 5.45 నుంచి 6 గంటల మధ్య జరుగుతుంది. ఈక్విటీ, కమొడిటీ డెరివేటివ్స్, కరెన్సీ డెరివేటివ్స్, ఈక్విటీ ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్, సెక్యూరిటీస్ లెండింగ్ అండ్ బారోయింగ్ వంటి పలు విభాగాల్లో ట్రేడింగ్ జరుగుతుంది.

ఐటీలో ఉద్యోగ ఆశలు చిగురించాయ్

● ఆరేడు త్రైమాసికాల తరవాత జులై-సెప్టెంబరులో నికర నియామకాలు అధికం



దేశీయ ఐటీ దిగ్గజ సంస్థలు ఆరేడు త్రైమాసికాలుగా వెల్లడిస్తున్న ఆర్థిక ఫలితాల్లో నికర ఉద్యోగుల సంఖ్య తగ్గడమే కానీ, పెరిగింది లేదు. అయితే తాజా జులై-సెప్టెంబరు ఫలితాల్లో మాత్రం ఇందుకు భిన్నంగా ఉద్యోగుల సంఖ్య పెరగడం, తాజా ఉత్తీర్ణుల ఎంపికలనూ ప్రణాళిక మేరకు చేపడుతున్నామని ఆయా యాజమాన్యాలు ప్రకటించడం.. ఉద్యోగార్థులకు భవిష్యత్తుపై ఆశలు చిగురింప చేశాయనే చెప్పాలి. ఇప్పటివరకు ఫలితాలు ప్రకటించిన 5 కంపెనీలు (టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో, టెక్‌మహీంద్రా, ఎల్‌టీఐ మైండ్‌ట్రీ) కలిపి సెప్టెంబరు త్రైమాసికంలోనే నికరంగా 17,500 కొత్త నియామకాలు జరిపాయి. హెచ్‌సీఎల్ టెక్‌లో 780 మంది తగ్గారు. అది కూడా అమెరికా సంయుక్త సంస్థ నుంచి విడిపోవడం వల్లే. తొలి త్రైమాసికంతో పోలిస్తే, ఈ సంస్థలో ఉద్యోగుల క్షీణత గణనీయంగా అదుపులోకి వచ్చింది. కొత్త - భారీ ఆర్డర్లపైనా కంపెనీలు ఆశావహంగా ఉన్నాయి. కృత్రిమమేధ ప్రాజెక్టుల్లోనూ ఆర్డర్లు వస్తున్నట్లు వెల్లడించడం, అధునాతన సాంకేతికతలపై మన నిపుణులకు ఉన్న సామర్థ్యాన్ని ప్రపంచ వాణిజ్య సంస్థలు గుర్తించినట్లయ్యింది. కళాశాల ప్రాంగణాల్లో ఎంపిక చేసి, గతంలో ఆఫర్ లెటర్ ఇచ్చిన అందరినీ తప్పనిసరిగా చేర్చుకుంటున్నట్లు ఈ సంస్థలన్నీ ప్రకటించాయి.

కంపెనీ	2024-25లో నియామకాలు/తొలగింపులు: జులై-సెప్టెంబరు	ఏప్రిల్-జూన్	మొత్తం సిబ్బంది
టీసీఎస్	5726	5452	6,12,724
ఇన్ఫోసిస్	2456	-1908	3,17,788
విప్రో	978	337	2,33,889
హెచ్‌సీఎల్‌టెక్	-780	-8080	2,18,621
టెక్ మహీంద్రా	6653	2165	1,54,273
ఎల్‌టీఐమైండ్‌ట్రీ	2504	-284	84,438
	17,537	-2,318	16,21,733

సీఎన్‌జీ ధర కిలోకు రూ.4-6 పెరగొచ్చు!

దిల్లీ: దేశీయంగా వెలికి తీసిన సహజవాయువు (సీఎన్‌జీ) సరఫరా తగ్గుతున్నందున, గిరాకీని అందుకునేందుకు.. రిటైల్‌గా విక్రయించే సంస్థలు విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. దీని కొనుగోలు ధర అధికంగా ఉంటున్నందున, దేశీయంగా వాహనాలకు విక్రయించే సీఎన్‌జీ ధర కేజీకి రూ.4-6 పెరిగే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఎక్సైజ్ సుంకం కోత లేకుంటే ఈ పెరుగుదల తప్పదని వెల్లడించాయి. అయితే దేశీయంగా వెలికి తీస్తున్న సహజవాయువును మాత్రం 20% తక్కువ ధరకే ప్రభుత్వం సరఫరా చేయనుంది. అరేబియా సముద్రం నుంచి బంగాళాఖాతం మధ్య ఉన్న క్షేత్రాల నుంచి సహజవాయువును వెలికితీసి, దాన్ని సీఎన్‌జీగా కంపెనీలు మారుస్తున్నాయి. ఈ క్షేత్రాల్లో ఉత్పత్తి చేసే గ్యాస్ ధరలను ప్రభుత్వం నియంత్రిస్తోంది. ఈ గ్యాస్‌ను వాహనాల్లో ఇంధనంగా, గృహాలకు పైప్డ్ వంటగ్యాస్‌గా విక్రయిస్తున్నాయి. ఇళ్లకు పైపుల ద్వారా సరఫరా చేసే వంటగ్యాస్ పరిమాణంలో మార్పులు చేయడానికి లేదు. అందువల్ల సిటీ రిటైల్ సంస్థలకు మాత్రం సరఫరా తగ్గిస్తోంది. అందువల్ల దిగుమతులు అధికమై, కంపెనీలు కిలోకు రూ.4-6 వరకు పెంచొచ్చని అంటున్నారు.

రూ.10,556 కోట్ల సమీకరణకు 4 ఐపీఓలు



హ్యుందాయ్ షేర్ల నమోదు రేపు

దిల్లీ: ప్రధాన విభాగంలో ఈ వారం 4 కంపెనీలు ఐపీఓలకు రాబోతున్నాయి. వారీ ఎనర్జీస్, దీపక్ బిల్డర్స్, అఫ్కాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, గోదావరి బయోరిఫైనరీస్ ఈ జాబితాలో ఉన్నాయి. ఈ సంస్థలన్నీ కలిపి, సుమారు రూ.10,556 కోట్ల నిధుల్ని ప్రాథమిక మార్కెట్ నుంచి సమీకరించబోతున్నాయి. ఎన్ఎస్ఈ ఎంఎస్ఈ విభాగంలో మరో 5 సంస్థలు ఈ వారమే ఐపీఓకు రాబోతున్నాయి.

● 2024లో ఇప్పటి వరకు 63 ఐపీఓలు రాగా.. అందులో చాలా వరకు కంపెనీలు లిస్టింగ్‌లో మంచి లాభాలను నమోదు చేశాయి. 14 ఏళ్ల తర్వాత ఈ ఏడాదే ఐపీఓలు బాగా వస్తున్నాయి.

కంపెనీ	ఇష్యూ పరిమాణం (రూ.కోట్లలో)	ఇష్యూ తేదీలు	ధరల శ్రేణి (రూ.లలో)
వారీ ఎనర్జీస్	4,321.44	21-23	1,427-1,503
దీపక్ బిల్డర్స్	260.04	21-23	192-203
గోదావరి బయోరిఫైనరీస్	554.75	23-25	334-352
అఫ్కాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్	5,430.00	25-29	ప్రకటించాల్సి ఉంది.

● హ్యుందాయ్ మోటార్ ఇండియా షేర్లు ఈనెల 22న బీఎస్ఈ, ఎన్ఎస్ఈలో నమోదు కానున్నాయి. లక్ష్య పవర్‌టెక్ ఐపీఓ షేర్లు 23న, ఫ్రెషారా అగ్రో ఎక్స్‌పోర్ట్స్ షేర్లు 24న ఎన్ఎస్ఈ ఎస్ఎంఈ ప్లాట్‌ఫామ్‌పై నమోదు కానున్నాయి.

ఈ వారం రాబోతున్న ఎన్ఎస్ఈ ఎస్ఎంఈ ఐపీఓలు

కంపెనీ	ఇష్యూ పరిమాణం (రూ.కోట్లలో)	ఇష్యూ తేదీలు	ధరల శ్రేణి (రూ.లలో)
ప్రీమియం ప్లాస్ట్	26.20	21-23	46-49
డానిష్ పవర్	197.90	22-24	360-380
యునైటెడ్ హీట్ ట్రాన్స్‌ఫర్	30.00	22-24	56-59
ఓబీఎస్‌సీ పర్ఫెక్షన్	66.02	22-24	95-100
ఉషా ఫైనాన్షియల్ సర్వీసెస్	98.45	24-28	160-168



డాక్టర్ మురళీధరబాబును సన్మానిస్తున్న ఫార్మా రంగ ప్రముఖులు వెంకట్‌రెడ్డి, సి.సత్యనారాయణ, వి.సత్యనారాయణ, ఆనంద్, అప్పాజీ, రవీంద్రనాథ్, రమేష్ తదితరులు

ఫార్మా అభివృద్ధికి మురళీధర సేవలు ఎనలేనివి

హైదరాబాద్ (మాదాపూర్), న్యూస్‌టుడే: దేశీయ ఫార్మా పరిశ్రమ అభివృద్ధికి డాక్టర్ మురళీధర బాబు గవిని ఎనలేని సేవలు అందించారని పలువురు ప్రముఖులు కొనియాడారు. మురళీధరబాబు 75వ జన్మదిన వేడుకలను మాదాపూర్‌లోని ఆవాస హోటల్‌లో ఆదివారం సాయంత్రం నిర్వహించగా, ఫార్మా రంగ పలువురు ఆయన్ను సన్మానించారు. ఫార్మాస్యూటికల్స్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మాజీ డైరెక్టర్ జనరల్ పి.వి.అప్పాజీ మాట్లాడుతూ, అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ (యుఎస్ఎఫ్‌డీఏ) ఆడిటర్‌గా పనిచేసినప్పుడు - ఆ తర్వాత దేశీయ ఫార్మా పరిశ్రమ ఉన్నతి కోసం మురళీధర బాబు కృషిచేశారని ప్రశంసించారు. మురళీధరబాబు మాట్లాడుతూ.. '1996 డిసెంబరులో అమెరికాలో 2 ఉద్యోగావకాశాలు రాగా, నేను ఎఫ్‌డీఏను ఎంచుకున్నా. ఎఫ్‌డీఏలో పనిచేసే ఆడిటర్లకు, కంపెనీలు చేసే తప్పు చెప్పేందుకే అనుమతి ఉంటుంది. నేను తప్పులను వెల్లడించడంతో పాటు, ఎలా సరిచేసుకోవాలో కూడా చెప్పాను. ఇందువల్ల కంపెనీలు తమ తప్పులు సరిచేసుకునేవ'న్నారు. అనంతరం మురళీధరబాబు కేక్ కోశారు. మసూ గ్లోబల్ సొల్యూషన్స్ ఎండీ రమేష్ పెన్నామారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విర్కో ల్యాబ్స్ ఎండీ వెంకట్‌రెడ్డి, లారస్ ల్యాబ్స్ ఎండీ సి.సత్యనారాయణ, సిప్రా ల్యాబ్స్ ఎండీ వి.సత్యనారాయణ, వసుధ ఫార్మా ఈడీ ఆనంద్, డైరెక్టర్ మధుసూదన్‌రాజు, టైచి ఇండస్ట్రీస్ ఎండీ సందీప్ రాజు, ఇంటర్నేషనల్ ఫార్మా కన్సల్టెంట్ ఆర్.ఎం.వి.రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కోడి గుడ్లు



21న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	500	గోదావరి	515
వరంగల్	502	విశాఖపట్నం	510
విజయవాడ	515	చిత్తూరు	548

విదేశీ పెట్టుబడులు.. కార్పొరేట్ ఫలితాలు దారిచూపుతాయ్

స్టాక్ మార్కెట్ ఈ వారం

● నేడు నష్టాలకు అవకాశం ● 24,650 దిగువన నిఫ్టీకి మరిన్ని బలహీనతలు

● ఔషధ, బ్యాంకింగ్‌కు సానుకూలతలు ● విశ్లేషకుల అంచనాలు



దేశీయంగా కార్పొరేట్ సంస్థల ఫలితాలు, విదేశీ మదుపర్ల పెట్టుబడుల ధోరణి, అంతర్జాతీయ భౌగోళిక-రాజకీయ ఉద్రిక్తతలు ఈవారం స్టాక్ మార్కెట్లకు దిశానిర్దేశం చేస్తాయని విశ్లేషకులు చెబుతున్నారు. సోమవారం సూచీలు నష్టపోవచ్చని అంచనా వేస్తున్నారు. కొన్ని దిగ్గజ కంపెనీల ఫలితాలు స్తబ్దుగా ఉండడంతో పాటు, భవిష్యత్తుపై యాజమాన్యాల వ్యాఖ్యలు ప్రభావం చూపుతాయని అంటున్నారు. నిఫ్టీ-50 24,650 కంటే దిగువకు వస్తే తాజా అమ్మకాలు జరుగుతాయని.. 24,500-24450 వరకు ఈ సూచీ పడొచ్చని ఒక బ్రోకరేజీ పేర్కొంది. 24,900 వద్ద నిరోధం ఉందని.. దీనిని అధిగమిస్తే 25,000-25050 వరకు పుంజుకోవచ్చని అంచనా వేస్తోంది. వివిధ రంగాలపై విశ్లేషకులు ఏమంటున్నారంటే..

● **చమురు** కంపెనీల షేర్లు స్తబ్దుగానే కదలాడొచ్చు. పశ్చిమాసియాలో అనిశ్చితులు, చమురు ధరలు దిశానిర్దేశం చేయొచ్చు. బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ ఫలితాలు శుక్రవారం వెలువడనున్నాయి.

● నెస్లే ఫలితాలు నిరుత్సాహకరంగా ఉండడంతో ఈ వారం **ఎఫ్ఎంసీజీ** షేర్లపై ప్రభావం ఉంటుంది. కోకోవా, కాఫీ ధరలు పెరగడమూ సవాలే.

● **సిమెంటు** కంపెనీల షేర్లు నష్టాలను కొనసాగించొచ్చు. మధ్యకాలంలో బులిష్ ధోరణిని కనబరచవచ్చు. రాబోయే నెలల్లో ధరల పెంపునకు అవకాశం ఉండడం ఇందుకు నేపథ్యం. సోమవారం అల్ట్రాటెక్ , గురువారం ఏసీసీ ఫలితాలు వెలువడనున్నాయి.

● **లోహ** కంపెనీల షేర్లు స్థిరీకరణకు గురికావొచ్చు. ఈ నెలలో ఇప్పటిదాకా ధరల్లో ఊగిసలాట చోటు చేసుకోవడం ఇందుకు నేపథ్యం. ఫలితాల కారణంగా ఎంపిక చేసిన షేర్లలో కదలికలు ఉండొచ్చు.

● **టెలికాం**కు వస్తే.. మూడో వారమూ భారతీ ఎయిర్‌టెల్ షేర్లు లాభపడితే, వొడాఫోన్ ఐడియా నాలుగో వారంలోనూ నష్టపోవచ్చు. మంగళవారం నాటి ఇండస్ టవర్స్ ఫలితాలను గమనించాలి.

● **ఐటీ** కంపెనీల షేర్లు తక్కువ శ్రేణికి లోబడి కదలాడొచ్చు. ఈ వారం సైయెంట్, కోఫోర్జ్, పర్సిస్టెంట్ సిస్టమ్స్, జెన్సార్, బిర్లాసాఫ్ట్ ఫలితాలు వెలువడనున్నాయి.

● పశ్చిమాసియా అనిశ్చితుల మధ్య రక్షణాత్మక రంగమైన **ఔషధ** షేర్లు సానుకూలతలను ప్రదర్శించొచ్చు. స్పెషాలిటీ డ్రగ్స్ లాభాలతో మార్కెట్ వాటా పెంచుకున్న కంపెనీల షేర్లు రాణించే అవకాశం ఉంది.

● **వాహన** కంపెనీల షేర్లు చాలా తక్కువ శ్రేణికి లోబడి చలించొచ్చు. ఆర్థిక ఫలితాల నుంచి దిశానిర్దేశం అందొచ్చు.

● **నిఫ్టీ బ్యాంక్** ఈ వారం రాణించొచ్చు. సూచీకి 53,000 వద్ద నిరోధం; 50,566 వద్ద మద్దతు కనిపిస్తోంది. శనివారం వెలువడ్డ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, కోటక్ బ్యాంక్, ఆర్‌బీఎల్ బ్యాంక్‌ల ఫలితాల ప్రభావం ఉంటుంది.

● **యంత్రపరికరాల** షేర్లు ఫలితాల ఆధారంగా కదలాడొచ్చు. భెల్ గురువారం, సీజీ పవర్ సోమవారం ఫలితాలను వెల్లడించనున్నాయి. భెల్ నికర లాభం 6%, ఆదాయం 19% పెరగొచ్చని అంచనా.

నేటి బోర్డు సమావేశాలు: బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్, యూనియన్ బ్యాంక్, సీజీ పవర్, సిటీ యూనియన్ బ్యాంక్, సైయెంట్ డీఎల్ఎం, జన స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, మహీంద్రా లాజిస్టిక్స్, నెల్కో

వాహన	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అశోక్ లేలాండ్	223.28	227.80	215.60
బజాజ్ ఆటో	10063.95	10326.10	9710.10
ఐషర్ మోటార్స్	4765.65	4913.70	4538.00
హీరో మోటోకార్ప్	5216.20	5359.60	5074.40
ఎం అండ్ ఎం	2964.25	3030.10	2881.80
మారుతీ	12105.10	12327.10	11733.50
టాటా మోటార్స్	910.15	935.80	874.00
టీవీఎస్ మోటార్	2715.90	2809.60	2604.20

ఎఫ్ఎమ్‌సీజీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అదానీ విల్మర్	329.00	337.20	318.20
బ్రిటానియా ఇండస్ట్రీస్	5887.20	6046.40	5790.40
కోల్గేట్ పామోలివ్	3395.95	3477.80	3308.10
డాబర్ ఇండియా	571.40	576.60	562.30
ఇమామీ	700.85	725.60	679.70
హిందుస్థాన్ యునిలీవర్	2717.10	2763.40	2670.30
ఐటీసీ	486.70	498.70	472.40
మారికో	669.30	685.10	646.70

యంత్రపరికరాలు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భెల్	253.85	261.40	242.80
సీజీ పవర్	819.00	844.30	802.30
ఎల్ అండ్ టీ	3577.80	3622.40	3518.00
సీమెన్స్	7803.00	8030.50	7451.30
థెర్మాక్స్	5198.60	5333.40	4972.60

ఔషధ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అరబిందో ఫార్మా	1472.70	1499.60	1436.50
బయోకాన్	339.95	348.40	328.30
సిప్లా	1551.70	1575.70	1524.30
డాక్టర్ రెడ్డీస్	6741.10	6837.40	6614.20
గ్లెన్‌మార్క్ ఫార్మా	1738.45	1765.60	1701.80
లుపిన్	2179.70	2219.70	2133.60

టెలికాం	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భారతీ ఎయిర్‌టెల్	1,707.85	1734.00	1672.20
ఎమ్‌టీఎన్ఎల్	52.06	57.50	45.60
టాటా కమ్యూనికేషన్స్	1873.00	1926.50	1781.30
వొడాఫోన్ ఐడియా	9.02	9.20	8.80

లోహ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హిందాల్కో	753.50	776.40	713.60
హిందుస్థాన్ జింక్	506.50	532.80	480.80
ఎన్ఎమ్‌డీసీ	231.44	240.60	215.10
సెయిల్	129.03	133.50	123.20
టాటా స్టీల్	155.39	159.30	149.10
వేదాంతా	480.85	495.80	456.50

బ్యాంకింగ్	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	1681.85	1712.60	1638.80
ఐసీఐసీఐ బ్యాంక్	1264.50	1296.50	1209.20
ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్	71.57	72.60	70.50
ఇండస్‌ఇండ్ బ్యాంక్	1347.25	1368.40	1320.50
కోటక్‌మహీంద్రా బ్యాంక్	1871.05	1896.40	1835.40
పీఎన్‌బీ	103.27	105.00	101.60
ఎస్‌బీఐ	820.40	835.00	795.60

ఐటీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హెచ్‌సీఎల్ టెక్	1857.70	1889.10	1827.30
ఇన్ఫోసిస్	1879.60	1962.80	1827.60
పర్సిస్టెంట్ సిస్టమ్స్	5506.15	5621.30	5345.50
టీసీఎస్	4123.05	4182.60	4050.30
టెక్ మహీంద్రా	1687.90	1735.40	1621.80
విప్రో	548.65	577.60	510.40

చమురు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
రిలయన్స్ ఇండస్ట్రీస్	2718.60	2766.90	2658.50
బీపీసీఎల్	342.50	349.80	330.60
హెచ్‌పీసీఎల్	431.60	442.50	417.20
ఐఓసీఎల్	165.35	168.60	160.10
ఓఎన్‌జీసీ	283.30	287.60	277.00
ఆయిల్ ఇండియా	533.40	558.60	510.20

సిమెంటు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
ఏసీసీ	2285.65	2324.00	2217.00
అంబుజా సిమెంట్స్	573.95	588.60	551.70
ఇండియా సిమెంట్స్	362.00	366.20	355.40
శ్రీ సిమెంట్	24325.25	24549.70	23975.80
అల్ట్రాటెక్ సిమెంట్	11069.30	11275.70	10797.80



భుజాల పొడవులు వేర్వేరైతే అది విషమబాహు త్రిభుజం

టీజీపీఎస్సీ, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
అరిథ్‌మెటిక్

క్షేత్రగణితం

- జ్యామితీయ పటాల చుట్టుకొలత, వైశాల్యం, ఘనపరిమాణాలను గణించే విభాగాన్ని క్షేత్రమితి అంటారు.
- ఒక సరళ సంవృత పటం అన్ని భుజాల పొడవుల మొత్తాన్ని చుట్టుకొలత అంటారు.
- భుజాన్ని సెం.మీ.లలో ఇచ్చినప్పుడు చుట్టుకొలత సెం.మీ.లలో ఉంటుంది. అంటే భుజానికి, చుట్టుకొలతకు ప్రమాణాలు ఒకటే.
- ఒక సరళ సంవృతపటం ఆక్రమించిన ప్రాంతాన్ని దాని వైశాల్యం అంటారు.
- ఆర్యభట్ట అనే గణిత శాస్త్రవేత్త తన 'ఆర్యభట్టీయం' అనే గ్రంథంలో క్షేత్రమితి గురించి ప్రస్తావించాడు.

1 సెం.మీ. = 10 మి.మీ.
1 మీ. = 100 సెం.మీ.
1 కి.మీ. = 1000 మీ.
1 చ.సెం.మీ. = 100 చ.మి.మీ.
1 ఏరు = 100 చ.మీ.
1 హెక్టార్ = 100 ఏర్లు = 10000 చ.మీ.

నోట్: ఆర్యభట్ట $\pi = 3.14$ అని గణించాడు.

త్రిభుజాలు

మూడు భుజాలతో ఆవరించిన సరళ సంవృత పటాన్ని త్రిభుజం అంటారు.

- త్రిభుజంలో మూడు భుజాలు, మూడు కోణాలు, మూడు శీర్షాలు ఉంటాయి.
- త్రిభుజంలోని మూడు కోణాల మొత్తం $180°$

భుజాల ఆధారంగా త్రిభుజాలు పలు రకాలు. అవి..

సమబాహు త్రిభుజం: సమాన కొలతలున్న మూడు భుజాలతో ఆవరించిన త్రిభుజాలను సమబాహు త్రిభుజం అంటారు.

- సమబాహు త్రిభుజంలో ప్రతికోణం సమానం. అంటే ప్రతి కోణం $60°$ ఉంటుంది.
- వైశాల్యం $A = \frac{\sqrt{3}}{4} a^2$
- ఎత్తు $h = \frac{\sqrt{3}}{2} a$
- వైశాల్యం $(A) = \frac{h^2}{\sqrt{3}}$ (ఎత్తు ఇచ్చినప్పుడు)
- చుట్టుకొలత $P = 3a$
- అంతరవృత్త వ్యాసార్ధం $r = \frac{a}{2\sqrt{3}}$
- పరివృత్త వ్యాసార్ధం $R = \frac{a}{\sqrt{3}}$

సమద్విబాహు త్రిభుజం: ఒక త్రిభుజంలో రెండు భుజాల పొడవులు సమానంగా ఉంటే సమద్విబాహు త్రిభుజం అంటారు. ఇక్కడ అసమాన భుజం - భూమి

- సమాన భుజాలకు ఎదురుగా ఉండే కోణాలు సమానం.
- వైశాల్యం $(A) = \frac{b}{4}\sqrt{4a^2 - b^2}$
- వైశాల్యం $(A) = \frac{h}{4}\sqrt{4 - h^2}$ (ఎత్తు ఇచ్చినపుడు)
- చుట్టుకొలత $(P) = 2a + b$
- ఎత్తు $(h) = \frac{1}{2}\sqrt{4a^2 - b^2}$

విషమబాహు త్రిభుజం: ఒక త్రిభుజంలోని మూడు భుజాల పొడవులు వేర్వేరుగా ఉంటే ఆ త్రిభుజాన్ని విషమబాహు త్రిభుజం అంటారు.

- చుట్టుకొలత $(P) = a + b + c$
- అర్ధ చుట్టుకొలత $(S) = \frac{a + b + c}{2}$
- వైశాల్యం $(A) = \sqrt{s(s - a)(s - b)(s - c)}$

లంబకోణ త్రిభుజం: ఒక త్రిభుజంలోని ఒక కోణం $90°$ ఉంటే ఆ త్రిభుజాన్ని లంబకోణ త్రిభుజం అంటారు.

పైథాగరస్ సూత్రం: $(\text{కర్ణం})^2 = (\text{భూమి})^2 + (\text{ఎత్తు})^2$

- వైశాల్యం $(A) = \frac{1}{2} \times b \times h$
- చుట్టుకొలత $(P) = b + h + d$
- చుట్టుకొలత $(P) = b + h + \sqrt{b^2 + h^2}$

లంబకోణ సమద్విబాహు త్రిభుజం: ఒక లంబకోణ త్రిభుజంలో రెండు భుజాల పొడవులు సమానంగా ఉంటే ఆ త్రిభుజాన్ని లంబకోణ సమద్విబాహు త్రిభుజం అంటారు.

- వైశాల్యం $(A) = \frac{1}{2} a^2$
- చుట్టుకొలత $= 2a + d = 2a + a\sqrt{2} = (2 + \sqrt{2})a$
- కర్ణం $(d) = a\sqrt{2}$
- కర్ణం ఇచ్చినప్పుడు వైశాల్యం $A = \frac{d^2}{4}$

మాదిరి ప్రశ్నలు

1. $3\sqrt{3}$ సెం.మీ.ల భుజం ఉన్న సమబాహు త్రిభుజం ఎత్తు ఎంత?
1) 4.5 సెం.మీ. 2) 5.5 సెం.మీ. 3) 6.5 సెం.మీ. 4) ఏదీకాదు

సాధన: $h = \frac{\sqrt{3}}{2} a$
$= \frac{\sqrt{3}}{2} \times 3\sqrt{3}$
$= \frac{3 \times 3}{2}$
$= \frac{9}{2} = 4.5$ సెం.మీ.

సమాధానం: 1

2. సమబాహు త్రిభుజ వైశాల్యం $64\sqrt{3}$ చ.సెం.మీ.లు. అయితే దాని చుట్టుకొలత ఎంత? (సెం.మీ.లలో)
1) 64 2) 48 3) 32 4) 24

సాధన: $A = \frac{\sqrt{3}}{4} a^2$
$\frac{64\sqrt{3}}{1} = \frac{\sqrt{3}}{4} a^2$
$64 \times 4 = a^2$
$a = 8 \times 2 = 16$
$P = 3a$
$= 3 \times 16 = 48$ సెం.మీ.

సమాధానం: 2

3. ఒక త్రిభుజంలోని భుజాలన్నింటినీ రెట్టింపు చేస్తే ఏర్పడే కొత్త త్రిభుజ వైశాల్యం ముందున్న దానికి K రెట్లు. అయితే K విలువ ఎంత?
1) 2 2) 4 3) 16 4) 8

సాధన: $A_1 = \frac{\sqrt{3}}{4} a^2$
$A_2 = \frac{\sqrt{3}}{4}(2a)^2 = \frac{\sqrt{3}}{4} 4a^2$
$\therefore \frac{\sqrt{3}}{4} 4a^2 = \frac{\sqrt{3}}{4} a^2 . K$
$K = 4$

సమాధానం: 2

4. సమద్విబాహు త్రిభుజం చుట్టుకొలత 30 సెం.మీ. దాని ప్రతి సమాన భుజం 12 సెం.మీ. అయితే దాని వైశాల్యం ఎంత?
1) $3\sqrt{24}$ 2) $5\sqrt{22}$ 3) $6\sqrt{14}$ 4) $9\sqrt{15}$

సాధన: $2a + b = 30$
$2(12) + b = 30$
$b = 6$
$A = \frac{b}{4}\sqrt{4a^2 - b^2}$
$= \frac{6}{4}\sqrt{4(12)^2 - 6^2}$
$= 9\sqrt{15}$ చ.సెం.మీ.

సమాధానం: 4

5. 13, 14, 15 సెం.మీ.ల భుజాలు ఉన్న త్రిభుజ వైశాల్యం ఎంత? (చ.సెం.మీ.లలో)
1) 84 2) 64 3) 24 4) 71

సాధన: $S = \frac{a + b + c}{2} = \frac{13 + 14 + 15}{2} = \frac{42}{2} = 21$
$A = \sqrt{s(s - a)(s - b)(s - c)} = \sqrt{21 \times 8 \times 7 \times 6}$
$= \sqrt{7 \times 3 \times 4 \times 2 \times 7 \times 3 \times 2}$
$= 7 \times 3 \times 2 \times 2 = 84$ చ.సెం.మీ.

సమాధానం: 1

6. త్రిభుజం భుజాల నిష్పత్తి $\frac{1}{2} : \frac{1}{3} : \frac{1}{4}$, చుట్టుకొలత 78 సెం.మీ. అయితే ఆ త్రిభుజంలో పెద్ద భుజం పొడవు ఎంత?
1) 24 సెం.మీ. 2) 12 సెం.మీ. 3) 36 సెం.మీ. 4) 48 సెం.మీ.

సాధన: $\frac{1}{2} : \frac{1}{3} : \frac{1}{4}$
$6 : 4 : 3$
$6x, 4x, 3x$
$\therefore 6x + 4x + 3x = 78$
$13x = 78 \Rightarrow x = 6$
$6x = 6 \times 6 = 36$ సెం.మీ.

సమాధానం: 3

7. ఒక త్రిభుజం భూమి 18 సెం.మీ., ఎత్తు 13 సెం.మీ. అయితే దాని వైశాల్యం ఎంత?
1) 126 చ.సెం.మీ. 2) 117 చ.సెం.మీ. 3) 87 చ.సెం.మీ. 4) 18 చ.సెం.మీ.

సాధన: $A = \frac{1}{2} \times b \times h = \frac{1}{2} \times 18 \times 13 = 117$ చ.సెం.మీ.

సమాధానం: 2

8. ఒక త్రిభుజం ఎత్తు దాని భూమికి 2 రెట్లు. వైశాల్యం 625 చ.సెం.మీ. అయితే దాని భూమి పొడవు ఎంత?
1) 10 సెం.మీ. 2) 15 సెం.మీ. 3) 20 సెం.మీ. 4) 25 సెం.మీ.

సాధన: $b = x, h = 2x$
$A = \frac{1}{2} \times x \times 2x$
$625 = \frac{1}{2} \times x \times 2x$
$\longrightarrow x^2 = 625$
$b = x = 25$ సెం.మీ

సమాధానం: 4



రచయిత
యర్రమాద నర్సిరెడ్డి
విషయ నిపుణులు

9. లంబకోణ సమద్విబాహు త్రిభుజంలో ఒక భుజం పొడవు 16 సెం.మీ. అయితే దాని వైశాల్యం ఎంత? (చ.సెం.మీ.లలో)
1) 128 2) 100 3) 115 4) 120

సాధన: $A = \frac{1}{2} a^2 = \frac{1}{2} \times 16 \times 16 = 128$ చ.సెం.మీ

సమాధానం: 1

446 Word of the Day

Unflinching

Telugu meaning: జంకని, చలించని

English meaning: The word unflinching is an adjective that describes someone or something that shows no fear or hesitation, especially in difficult situations.

Synonyms: Resolute, Determined

Antonyms: Hesitant, Timid

Usage: **1.** Her unflinching loyalty to her friends earned her their lifelong trust and respect.
2. The soldier stood unflinching in the face of the enemy's attacks, determined to protect his comrades

Latest Updates

Guest Teacher Posts

AP State Ekalavya Model Residential Schools Society invites applications for Teaching Faculty to work as Guest Teachers in Ekalavya Model Residential Schools initially for one year in ITDA Paderu. The last date for offline applications is 26 October 2024.

PM Internship Scheme 2024-25

The central government has announced the Prime Minister's Internship Scheme - 2024, which will improve employment opportunities for the youth. Eligible candidates should apply before October 25.

Consultants Posts

Satyajit Ray Film and Television (SRFTI) of the Ministry of Information and Broadcasting, Kolkata is inviting applications for consultant posts. The last date for sending offline applications is 30 October 2024.

Ph.D. Program

Indian Institute of Science Education and Research (IISER) Tirupati invites applications from prospective candidates for admission to the Ph.D. program in January 2025. The last date for online application is 3 November 2024.


Did You Apply..?

Today (October 21) is the last date for the following Jobs/ Apprentice posts/ Admissions

- 108 Office Attendant- Group C posts in NABARD, Mumbai.
- 68 Anganwadi posts in DWCD, Nandyal District.
- Graduate/ Diploma Engineer Trainee posts in Hindustan Urvarak and Rasayan Limited (HURL), Jharkhand.
- Pharmacist Grade-II posts in TG MHSRB.
- Apprentice Trainees in Jute Corporation, Kolkata.
- PG Diploma course in AU, Visakhapatnam.

For more information and other notifications - scan QR code

ఈ-బుక్ (భౌతికశాస్త్రం)



భౌతికశాస్త్రం ప్రకారం తలపై భారాన్ని మోస్తున్న వ్యక్తి ఎంత దూరం నడిచినా, అతడు చేసిన పని సున్నాయే.. అదేవిధంగా వస్తువును వృత్తాకారంలో తిప్పడం, వంట చేయడం, ఆఫీస్‌లో పని చేయడం మొదలైనవన్నీ ఫిజిక్స్ పరంగా పనులు కావు. ఈ విధంగా మన నిత్య జీవిత కార్యకలాపాల్లో అనేక వాటిని భౌతికశాస్త్రం పనులుగా గుర్తించదు.

- పని - శక్తి - సామర్థ్యం అంటే ఏమిటి, వాటి నిర్వచనాలు - నియమాలు, నిత్యత్వ బలాలు మొదలైన విషయాలు ఈ-బుక్‌లో ఉన్నాయి.

చదవడం కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..

కరెంట్ అఫైర్స్



భారత గ్రాండ్‌మాస్టర్, తెలంగాణకు చెందిన అర్జున్ ఇరిగేశి డబ్ల్యూఆర్ చెస్ మాస్టర్స్ కప్‌లో టైటిల్ కైవసం చేసుకున్నాడు. 2024, అక్టోబరు 18న లండన్‌లో జరిగిన ఫైనల్లో లాగ్రెవ్‌పై అర్జున్ విజయం సాధించాడు. క్లాసికల్ పద్ధతిలో జరిగిన తొలి రెండు గేములు డ్రాగా ముగియడంతో ఫలితాన్ని టైబ్రేక్‌లో తేల్చారు. టైబ్రేక్‌లో అర్జున్ 69 ఎత్తుల్లో విజయం సాధించి టైటిల్ కైవసం చేసుకున్నాడు.



ప్రపంచంలో అత్యధిక పేదలు ఉన్న అయిదు దేశాలలో భారత్ ఒకటని ఐక్యరాజ్య సమితి నివేదిక వెల్లడించింది. ఐక్యరాజ్యసమితి అభివృద్ధి సంస్థ (యు.ఎన్.డి.పి), ఆక్స్‌ఫర్డ్ పేదరిక-మానవాభివృద్ధి అధ్యయన సంస్థ సంయుక్తంగా విడుదల చేసిన అంతర్జాతీయ బహుముఖ పేదరిక సూచీలో ఈ వివరాలు ఉన్నాయి.
- ప్రపంచంలో అత్యధికంగా భారత్‌లోనే 23.4 కోట్ల మంది నిరుపేదలు ఉన్నారు. 9.3 కోట్ల మంది పేదలతో పాకిస్థాన్, 8.6 కోట్లమందితో ఇథియోపియా, 7.4 కోట్ల మందితో నైజీరియా, 6.6 కోట్లమందితో కాంగో పేదలు అధికంగా గల దేశాలుగా నిలుస్తున్నాయి. ప్రపంచ పేదలలో 48.1 శాతం మంది ఈ అయిదు దేశాల్లోనే నివసిస్తున్నారు.



అంతర్జాతీయ బ్రెయిన్ రిసెర్చ్ ఆర్గనైజేషన్ (ఐబీఆర్‌వో) అధ్యక్షురాలిగా శుభా టోలే ఎన్నికయ్యారు. 2028 డిసెంబరు 31 వరకు ఆమె ఈ పదవిలో ఉంటారు. అభివృద్ధి చెందుతోన్న దేశం నుంచి ఈ పదవికి ఎంపికైన మొదటి వ్యక్తిగా ఆమె చరిత్ర సృష్టించారు. ఐబీఆర్‌వో 57 దేశాలకు చెందిన 69 సైంటిఫిక్ సొసైటీలకు ప్రాతినిధ్యం వహిస్తోంది.

కరెంట్ అఫైర్స్ ఈబుక్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

SSC Exams
English

Phrasal Verbs

Directions (Qs. 1 - 20): *Fill in the blanks with the correct phrasal verbs to make the sentence grammatically and contextually correct.*

1. The teacher asked the students to .... their mobile phones before the exam started.
A) put up B) give in
C) hand over D) take off

2. The athlete .... after the injury and was unable to finish the race.
A) pulled out B) set off
C) gave in D) broke down

3. The burglar .... the house while the family was on vacation.
A) looked after B) broke into
C) brought up D) took over

4. We had to .... our plans for a picnic because of the heavy rain.
A) call off B) take after
C) turn out D) set up

5. The company decided to .... a new software to improve productivity.
A) bring in B) call off
C) set out D) give up

6. When the alarm went off, everyone quickly .... the building.
A) give up B) took off
C) turned down D) made for



7. After hours of negotiation, they finally .... a compromise that worked for both sides.
A) came up with B) set out
C) put off D) looked after

8. The government .... a plan to tackle unemployment in rural areas.
A) set up B) came across
C) brought in D) drew up

9. He .... the idea of starting his own business after seeing how successful his friend was.
A) looked after B) took up
C) gave in D) brought out

10. The heavy workload caused him to .... under pressure.
A) break down B) turn out
C) take off D) look after

11. The police .... the case, hoping to find new evidence.
A) look after B) looked into
C) turned up D) gave out

12. He .... a story to cover up the real reason for his absence.
A) made up B) took after
C) turned up D) called off

13. She .... the challenge with enthusiasm and was determined to succeed.
A) put off B) took on
C) gave up D) broke down

14. The new manager .... immediately after the previous one resigned.
A) broke into B) took over
C) called off D) brought up

15. He .... smoking to improve his health and lifestyle.
A) gave up B) took after
C) put up with D) brought in

16. The car .... on the highway, and they had to call for roadside assistance.
A) gave out B) took after
C) broke into D) brought up

17. She .... her old toys to charity instead of throwing them away.
A) gave out B) handed down
C) broke into D) turned up

18. They .... for the top of the mountain before sunrise to catch the morning view.
A) set out B) brought up
C) turned down D) made up

19. The meeting was scheduled for 10 AM, but they .... it to 9 AM due to some urgent issues.
A) put off B) brought forward
C) gave up D) turned down

20. He was unsure about the decision, so he .... it over before giving his final response.
A) ran out B) thought through
C) took up
D) looked down

Scan the QR code for Key

Writer:
P. Manoj Kumar, Subject Expert

ప్రిపరేషన్ టెక్నిక్

స్కూళ్లు, కోచింగ్ సెంటర్లు, ఇతర శిక్షణా సంస్థలు ఏవైనా రివిజన్ తరగతులు, టెస్ట్ సిరీస్‌లు, మోడల్ టెస్ట్‌లు పెడితే కచ్చితంగా హాజరుకావాలి. ప్రిపరేషన్‌ను పదును పెట్టుకోవడానికి వాటిని ఉపయోగించుకోవాలి.

డీఎస్సీ - 2024

విద్యా దృక్పథాలు

కరెంట్ అఫైర్స్



✦ 'డీఆర్‌డీఓ – ఇండస్ట్రీ – అకాడెమియా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'ను ఏ ఐఐటీ ఏర్పాటు చేసింది?
జ: ఐఐటీ కాన్పూర్

✦ ఐక్యరాజ్యసమితి డాగ్ హమర్స్క్‌జోల్డ్ పతకాన్ని ఇటీవల మరణానంతరం గెలుచుకున్న కాంగోలోని భారతీయ శాంతి పరిరక్షకుడు ఎవరు? జ: నాయక్ ధనంజయ్ కుమార్ సింగ్

మాదిరి ప్రశ్నలు

✦ ఐక్యరాజ్య సమితి డాగ్ హమర్స్క్‌జోల్డ్ పతకాన్ని ఏ సంవత్సరం నుంచి ప్రదానం చేస్తున్నారు?
జ: 1997

✦ ప్రపంచంలోనే మొదటిసారిగా ఏ దేశంలో క్యాన్సర్ రోగికి పంది కాలేయాన్ని మార్పిడి చేశారు?
జ: చైనా

✦ ఇటీవల వార్తల్లోకి వచ్చిన హైడ్రాక్సీయూరియా మందు ఏ వ్యాధికి సంబంధించింది?
జ: సికిల్ సెల్ అనీమియా

✦ ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలకు 2024, జూన్ 5న ఏ దేశం అధికారికంగా ఆతిథ్యం ఇచ్చింది? జ: సౌదీ అరేబియా

✦ నీటి సూక్ష్మబిందువులు సాధారణ ఖనిజాలను నానోపార్టికల్స్‌గా విడగొట్టగలవని ఇటీవల ఏ ఐఐటీ పరిశోధకులు కనుక్కున్నారు? జ: ఐఐటీ మద్రాసు

మరింత సమాచారం

TENTH Social Studies



Cyclone depressions from Mediterranean Sea

2 Marks

Climate of India

1) **What is "Green House Effect"?**

A: The atmosphere traps a lot of the Solar energy that reaches Earth by preventing it from totally escaping back into space. This is called 'Green House Effect'.

2) **Define the Bursting Monsoon.**

A: The pre-monsoon showers towards the end of the summer season in Deccan plateau.

Q&A

3) **Why do winds always blow toward low-pressure regions?**

A: 1. In low-pressure regions temperature is high and evaporation is more.
2. Warm air rises, so cool air replaces it.

4 Marks

4) **What is known as "October heat"?**

A: 1. October - November is a period transition from hot wet conditions to dry winter conditions.
2. The retreat of the monsoon is marked by clear skies and a rise in temperature.
3. The land is still moist.
4. Owing to the conditions of high temperature and humidity the weather becomes rather oppressive.

5) **Explain about the "Western disturbances"?**

A: Cyclone depressions coming from the Mediterranean Sea are called Western Disturbances and cause low to moderate rainfall over northern India. This rainfall is boon to wheat crop which is generally cultivated in the "Rabi" season.

Some More Important Questions

4 Marks For answers

1) Why do you think that the effects of climate change may be felt by all countries?

6 Marks

1) How does deforestation affect global warming?

- G. Vishwa Prasad

SUBSCRIBE CHANNEL

పంట విక్రయాలకు విశిష్ట వ్యవస్థ!

వ్యవసాయ ఉత్పత్తిని రైతు పొలం నుంచి వినియోగదారుడి వరకు తరలించడంలో ఉన్న సేవలన్నీ వ్యవసాయ మార్కెటింగ్‌లో భాగమే. గతంలో పూర్తిగా దళారులు, మధ్యవర్తుల నియంత్రణలో ఉన్న ఈ సేవలను స్వాతంత్ర్యానంతరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవస్థీకృతం చేశాయి. ఈ క్రమంలో రైతులు, వినియోగదారులతో పాటు వ్యాపారులకూ ఆమోదయోగ్యంగా ఉండే విధానాలు రూపొందిస్తూ, తగిన మౌలిక వసతులను సమకూరుస్తున్నాయి. వ్యవసాయం, వ్యవసాయ మార్కెట్ల నియంత్రణ లాంటివి రాష్ట్రాల పరిధిలోని అంశాలైనప్పటికీ కేంద్రం చురుగ్గా వ్యవహరిస్తోంది. మొత్తం ఈ ప్రక్రియ గురించి పోటీ పరీక్షార్థులకు సమగ్ర అవగాహన ఉండాలి. దేశంలో వ్యవసాయ మార్కెట్ల స్వరూపం, ఇందులో ఉన్న లోపాలు, వీటిని అధిగమించేందుకు ఇప్పటి వరకు చేసిన చట్టాలు, చేపట్టిన సంస్కరణలు, అమలుచేస్తున్న పథకాలు, వ్యవసాయ మార్కెటింగ్‌లో పాల్గొనే వివిధ కేంద్ర ప్రభుత్వ సంస్థలు, వాటి కార్యకలాపాల గురించి తెలుసుకోవాలి.



కొచ్చిలోని సెంట్రల్ వేర్‌హౌసింగ్ సంస్థ

భారతదేశంలో వ్యవసాయ మార్కెటింగ్

భారత దేశంలో రైతు తన పంటను మార్కెట్‌లోకి తీసుకెళ్లినప్పటికీ మధ్యవర్తుల కారణంగా సరైన ధర పొందలేకపోతున్నాడు. ఉత్పత్తులను మార్కెట్‌కి చేరవేయడానికి, సరైన ధరకు అమ్ముకోవడానికి వ్యవసాయదారుడికి అవసరమైన సౌకర్యాల కల్పనే వ్యవసాయ మార్కెటింగ్.

రకాలు: వ్యవసాయ మార్కెటింగ్ పలు రకాలుగా జరుగుతుంది.

1) **ప్రాథమిక మార్కెట్లు:** వారంలో ఒక నిర్ణీత రోజున వ్యవసాయదారులు తమ ఉత్పత్తులను గ్రామ సంతలో విక్రయిస్తారు. వీటిని దక్షిణాదిన 'షాండీలు' అని, ఉత్తరాదిన 'హాట్‌బజార్' లని పిలుస్తారు.

2) **ద్వితీయ మార్కెట్లు:** వీటిని టోకు లేదా అసెంబ్లింగ్ మార్కెట్లు అంటారు. మండీలు ఈ కోవలోకే వస్తాయి. గ్రామాల్లో, చిన్న పట్టణాల్లో సంవత్సరం పొడవునా ఈ మార్కెట్‌లో వ్యాపారం జరుగుతుంది. ఇక్కడ ఉత్పత్తి, నిల్వ, బ్యాంకింగ్ వసతులు ఉంటాయి.

3) **అంతిమ మార్కెట్లు:** పెద్ద పట్టణాలు, నగరాల్లో ఉంటాయి. ఒకటి అంతకంటే ఎక్కువ రాష్ట్రాలకు విస్తరించి ఉంటుంది. వినియోగదారుడికి వస్తువులు చేర్చడం, వ్యవసాయ ముడిపదార్థాలు ప్రాసెసింగ్ యూనిట్లకు చేర్చడం ఇందులో భాగమే.

4) **సంతలు:** యాత్రా స్థలాల్లో, పండగ రోజుల్లో వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకానికి సంతలు ఏర్పాటు చేస్తారు. ఇక్కడ పశువుల విక్రయం కూడా జరుగుతుంది.

5) **క్రమబద్ధమైన మార్కెట్లు:** మార్కెటింగ్‌లో అక్రమ పద్ధతులు, మోసాలు జరగకుండా రైతులకు సరైన ధర అందించే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వాలు వీటిని ఏర్పాటు చేస్తాయి.

6) **సహకార మార్కెటింగ్:** సహకార సూత్రాల ప్రాతిపదికన రైతులు తమ ఉత్పత్తులు విక్రయించుకోవడానికి ఏర్పాటు చేసినవే సహకార మార్కెట్లు. భారత వ్యవసాయ మార్కెటింగ్ సమస్యలకు ఇది ఉత్తమ పరిష్కారం.

ప్రభుత్వం తీసుకుంటున్న నివారణ చర్యలు:

గిడ్డంగి సౌకర్యాలు: పంటను నిల్వ చేయడానికి గిడ్డంగి సదుపాయాలు కల్పించాలి. కేంద్ర గిడ్డంగుల సంస్థ (సీడబ్ల్యూసీ) 1957లో ఏర్పాటైంది. 1965లో జాతీయ స్థాయిలో ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ)ను ఏర్పాటు చేశారు. కేంద్ర ప్రభుత్వానికి 783.17 లక్షల టన్నుల ఆహారధాన్యాలు నిల్వ చేసే సామర్థ్యం ఉంది.

రహదారుల నిర్మాణం: 2000లో గ్రామాల్లో రహదారులు నిర్మించేందుకు 'ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన' ప్రారంభించారు.

గ్రేడింగ్ ప్రామాణీకరణ: గ్రేడింగ్ చేసిన వ్యవసాయ ఉత్పత్తులకు అగ్‌మార్క్ గుర్తు ఇస్తారు. దీని కోసం సెంట్రల్ క్వాలిటీ కంట్రోల్ ల్యాబొరేటరీని కోల్‌కతాలో ఏర్పాటు చేశారు. దీనికి అనుబంధంగా 11 ప్రాంతీయ ప్రయోగశాలలు ఉన్నాయి.

ఇండియన్ ఎకానమీ

ప్రామాణిక తూనికలు, కొలతలు: ఆహార ఉత్పత్తులు కొలిచేటప్పుడు మధ్యవర్తుల మోసాల నుంచి రైతులను రక్షించేందుకు 1939లో 'ప్రామాణిక కొలతల చట్టం' తీసుకొచ్చారు. కేంద్రం 1958లో 'మెట్రిక్ సిస్టమ్ ఆఫ్ మెజర్స్' విధానం తీసుకొచ్చి దేశవ్యాప్తంగా ఏకరూప పద్ధతి ప్రవేశపెట్టింది.

క్రమబద్ధ మార్కెట్లు: వ్యవసాయ మార్కెటింగ్‌లోని లోపాలను సరిదిద్దేందుకు 1951లో రెగ్యులేటెడ్ మార్కెట్లు ఏర్పడ్డాయి. వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ కమిటీ చట్టాల (ఏపీఎంసీ) ప్రకారం రాష్ట్రాలు వాటిని ఏర్పాటు చేశాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 7,320 మార్కెట్లు పనిచేస్తున్నాయి. కేరళ, మణిపుర్ లాంటి రాష్ట్రాలు ఏపీఎంసీ చట్టాలుతీసుకురాలేదు.

రైతుబంధు: ఈ పథకం ద్వారా మార్కెట్ కమిటీలు అత్యవసర సమయంలో పంటను తాకట్టు పెట్టుకుని పంట విలువలో 75% వరకు రుణసహాయం చేస్తాయి. 180 రోజుల వరకూ దీనిపై వడ్డీ ఉండదు.

మార్కెట్ సమాచారం: వ్యవసాయ ఉత్పత్తుల సమాచారాన్ని రేడియో, టీవీ, పత్రికల ద్వారా ప్రభుత్వం రైతులకు తెలియజేస్తుంది. దీని కోసం కిసాన్ కాల్‌సెంటర్ పథకాన్ని 2004లో ప్రారంభించింది. దీని టోల్ ఫ్రీ నంబరు 1800-180-1551.

మార్కెట్ డైరెక్టరేట్, తనిఖీ: వ్యవసాయ మార్కెటింగ్ కార్యకలాపాలను సమన్వయ పరిచేందుకు ప్రభుత్వం మార్కెటింగ్ డైరెక్టరేట్‌ను ప్రారంభించింది. 1955 నిత్యావసర వస్తువుల చట్టం కేంద్ర నిబంధనలను అమలుపరుస్తుంది.

మద్దతు ధరలు: ప్రభుత్వం రైతులకు మద్దతు ధరలను, సేకరణ ధరలను ప్రకటిస్తుంది. వ్యవసాయ ధరల కమిషన్ సిఫార్సులపై ఈ ధరలను నిర్ణయిస్తుంది.


జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ సంస్థ: వ్యవసాయ మార్కెటింగ్ కేంద్రాన్ని 1988లో జైపుర్‌లో ఏర్పాటు చేశారు. ఇది బోధన, పరిశోధన, కన్సల్టెన్సీ సేవల ద్వారా వ్యవసాయ మార్కెటింగ్ అవస్థాపన సదుపాయాలను మెరుగుపరుస్తుంది.

ప్రత్యేక మండళ్లు: రబ్బరు, టీ, కాఫీ, పొగాకు, సుగంధద్రవ్యాలు, కొబ్బరికాయలు, నూనెగింజలు మొదలైన అనేక రకాల పదార్థాలకు జాతీయ స్థాయి మండళ్లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. **ఉదా:** జాతీయ పాడిపరిశ్రమాభివృద్ధి మండలి, జీడి ఎగుమతుల అభివృద్ధి మండలి.

సహకార మార్కెట్లు: జాతీయస్థాయిలో 1958, అక్టోబరు 2న నేషనల్ అగ్రికల్చరల్ కో-ఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ (నాఫెడ్) ఏర్పాటైంది. ఇది మార్కెట్‌లో ధరలను స్థిరీకరిస్తుంది. 1963లో నేషనల్ కో-ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశారు. ఈ సంస్థ ప్రాసెసింగ్, నిల్వ, గ్రేడింగ్, మార్కెటింగ్ కోసం ప్రణాళికలు రూపొందిస్తుంది. గిరిజన అటవీ, వ్యవసాయ ఉత్పత్తుల విక్రయంలో వ్యాపారుల దోపిడీని అరికట్టేందుకు 1987లో ట్రైబల్ కో-ఆపరేటివ్ మార్కెటింగ్ డెవలప్‌మెంట్ ఫెడరేషన్ ఏర్పాటైంది.

జాతీయ మార్కెట్ అభివృద్ధి: వ్యవసాయ ఉత్పత్తులకు ఈ-ప్లాట్‌ఫాం ద్వారా దేశవ్యాప్త మార్కెట్ ఇచ్చే లక్ష్యంతో 2016, ఏప్రిల్ 14న జాతీయ వ్యవసాయ మార్కెట్ పోర్టల్ 'ఈ-నామ్' ప్రారంభమైంది.

గ్రామీణ వ్యవసాయ మార్కెట్లు: దేశంలో 86% పైగా ఉపాంత, చిన్నకారు రైతులే. వీరు ఏపీఎంసీలు, టోకు మార్కెట్ల ద్వారా పంటను అమ్మలేకపోతున్నారు. అందుకే 22 వేల రూరల్ హాట్‌లను అభివృద్ధి చేస్తామని 2018-19 నాటి ఆర్థికమంత్రి చెప్పారు. వీటిని ఈ-నామ్‌తో అనుసంధానం చేస్తారు.



రచయిత: ధరణి శ్రీనివాస్

వ్యవసాయ మార్కెటింగ్ దశలు

1) **అసెంబ్లింగ్:** వేర్వేరు స్థలాల్లో రైతులు పండించిన పంటను ఒకే చోటకు చేర్చడం అసెంబ్లింగ్.
2) **గ్రేడింగ్:** పంట నాణ్యత ఆధారంగా వేరుచేయడం.
3) **ప్రామాణీకరణ:** వేరుచేసిన ఉత్పత్తిని వరుస క్రమంలో అమర్చడం.
4) **ప్రాసెసింగ్:** వ్యవసాయఉత్పత్తులను వినియోగానికిఅనుగుణంగా మార్చడం.
5) **ప్యాకింగ్:** ప్రాసెసింగ్ చేసిన పంటను కొంతకాలం నిల్వ ఉంచేందుకు ప్యాకింగ్ చేయడం.
6) **పంపిణీ:** ప్రాసెసింగ్, ప్యాకింగ్ చేసిన తర్వాత పంటను టోకు, చిల్లర వ్యాపారులకు చేర్చే విధానం.



భారత వ్యవసాయ మార్కెటింగ్‌లోని లోపాల వల్ల ఈ దశలు పూర్తికాకుండానే వ్యవసాయదారుడు తన ఉత్పత్తిని విక్రయించడంతో సముచిత ధర పొందలేకపోతున్నాడు. **లోపాలు:** 1) మధ్యవర్తులు, దళారీలు అధికంగా ఉండటం. 2) గ్రేడింగ్, ప్రామాణిక సౌకర్యాల కొరత 3) కొలతలు, తూనికల్లో లోపాలు 4) రవాణా సౌకర్యాల కొరత 5) వ్యవసాయదారుల నిరక్షరాస్యత 6) గిడ్డంగి సౌకర్యాల కొరత, మార్కెట్ సమాచార లోపం 7) వ్యవసాయ పరపతికి, మార్కెటింగ్ సదుపాయాలకు మధ్య సమన్వయం లేకపోవడం.

అరటిపండులో పోషకం పొటాషియం!

శారీరక, మానసిక కార్యకలాపాలకు, జీవక్రియలకు కావాల్సిన శక్తి అంతా తినే ఆహారం నుంచే అందుతుంది. ఎదుగుదలకు కీలకమైన పోషకాలను సమకూరుస్తూ, శరీర కణజాలం అభివృద్ధికి దోహదపడుతున్న ఆహారం గురించి తగిన పరిజ్ఞానం ప్రతి ఒక్కరికీ అవసరమే. ఏ ఆహారంలో ఎలాంటి పోషకాలు ఉన్నాయి, ఏ పోషకం లోపంతో ఏయే వ్యాధులు వస్తాయి, పోషకాహార లోపానికి కారణమయ్యే అంశాలు తదితర వివరాలు పోటీ పరీక్షార్థులకు తెలిసి ఉండాలి. కార్బొహైడ్రేట్లు, కొవ్వులు, ప్రొటీన్లు మొదలైన స్థూల పోషకాలుండే ధాన్యాలు, ప్రధాన ఆహారపదార్థాలతో పాటు ఖనిజాలు, విటమిన్లు లాంటి సూక్ష్మ పోషకాలు లభించే ప్రకృతి వనరులపై అవగాహన కలిగి ఉండాలి.



మానవుడిలో పోషణ, ఆహారంలోని అంశాలు

1. కిందివాటిలో మనం తీసుకునే ఆహారంలోని పదార్థాలు–
   1) కార్బొహైడ్రేట్లు, కొవ్వులు
   2) విటమిన్లు, ఖనిజ లవణాలు
   3) ప్రొటీన్లు, పీచుపదార్థం, నీరు 4) పైవన్నీ
2. పిండిపదార్థాల నిర్ధారణలో మనకు చివరికి వచ్చే రంగు?
   1) నీలం - నలుపు 2) నీలం
   3) నీలం - ఊదా 4) ముదురు రంగు
3. కిందివాటిలో సత్య వాక్యాన్ని ఎంచుకోండి.
   ఎ) ప్రొటీన్ పరీక్షలో ముడిపదార్థం ముద్దగా లేదా పొడి రూపంలో ఉండాలి.
   బి) ముడిపదార్థానికి 10 చుక్కల నీరు కలపాలి.
   సి) ముడిపదార్థానికి రెండు చుక్కల కాపర్ సల్ఫేట్, 10 చుక్కల కాస్టిక్ సోడా కలపాలి.
   డి) ప్రొటీన్ ఉండే ముడిపదార్థం పొందే రంగు - ఊదా.
   1) ఎ, బి, సి 2) ఎ, డి
   3) ఎ, బి, సి, డి 4) ఎ, సి, డి
4. కిందివాటిలో శక్తి జనకాలను గుర్తించండి.
   1) పిండిపదార్థాలు, కొవ్వులు 2) ప్రొటీన్లు
   3) కొవ్వులు 4) విటమిన్లు
5. కిందివాటిలో శరీర నిర్మాణ ఆహార పదార్థాలు..
   1) బఠాణీ, శనగ, పెసలు, కందిపప్పు, చిక్కుడు
   2) సోయాబీన్స్, చిక్కుడు
   3) పాలు, గుడ్లు, మాంసం, పన్నీర్
   4) పైవన్నీ
6. వాదన–ఎ: శరీరానికి వ్యాధుల రక్షణలో విటమిన్లు సహాయపడతాయి.
   వాదన–బి: శరీరంలోని కళ్లు, ఎముకలు, దంతాలు, చిగుళ్లను ఆరోగ్యంగా ఉంచడంలో సాయపడతాయి.
   1) ఎ సరైంది 2) బి సరైంది
   3) ఎ, బి లు సరైనవి 4) ఎ, బి లు సరికావు
7. కిందివాటిలో పిండిపదార్థం ఉన్న కాండ రూపాంతరం..
   1) చిలగడదుంప 2) బంగాళాదుంప
   3) చెరకు 4) 2, 3
8. శరీర పెరుగుదల, మరమ్మతుల కోసం ఉపయోగపడేవి?
   1) ప్రొటీన్లు 2) కొవ్వులు
   3) పిండిపదార్థాలు 4) ఖనిజ లవణాలు
9. కిందివాటిలో పిండి పదార్థం కలిగి, అతిపొడవైన కీలం ఉండే మొక్క?
   1) వరి 2) గోధుమ
   3) జొన్న 4) మొక్కజొన్న
10. కిందివాటిలో వేటి నుంచి అయోడిన్ లభించదు?
    ఎ) చేపలు, ఉప్పు, అల్లం
    బి) చేపలు, పీతలు, ఆకుకూర
    సి) ఉప్పు, అల్లం డి) చేపలు, రొయ్యలు
    1) ఎ, బి 2) డి 3) బి 4) ఎ, సి, డి

డీఎస్సీ - 2024 బయాలజీ

11. సాధారణంగా మానవుడిలో రక్తం గడ్డకట్టేందుకు ఎన్ని నిమిషాల సమయం పడుతుంది?
    1) 6 ని. 2) 9 ని. 3) 12 ని. 4) 15 ని.
12. కిందివాటిని జతపరచండి.

జాబితా - I	జాబితా - II
1) కార్బొహైడ్రేట్ల సమృద్ధి వనరు	ఎ) పచ్చిమిర్చి
2) క్యాల్షియం వనరు	బి) తెప్లా
3) ఫాస్ఫరస్ వనరు	సి) పాలు, గుడ్లు
4) చిరుధాన్యాలు, పప్పులతో చేసిన వనరు	డి) బియ్యం

    1) 1-డి, 2-సి, 3-ఎ, 4-బి
    2) 1-డి, 2-ఎ, 3-సి, 4-బి
    3) 1-డి, 2-బి, 3-ఎ, 4-సి
    4) 1-డి, 2-ఎ, 3-బి, 4-సి
13. ఒక వ్యక్తికి గాయం మానేందుకు ఎక్కువ సమయం పడుతుందంటే కిందివాటిలో ఏ విటమిన్ లోపం కారణమై ఉంటుంది?
    1) A 2) B 3) C 4) D
14. కిందివాటిలో తప్పుగా ఉన్న జతను గుర్తించండి.
    1) సజ్జలు - పెరల్ మిల్లెట్
    2) సామలు - ప్రోసో మిల్లెట్
    3) రాగులు - ఫింగర్ మిల్లెట్
    4) కొర్రలు - ఇటాలియన్ మిల్లెట్
15. వాదన–ఎ: మనం తీసుకునే ఆహారంలో తగిన పాళ్లలో పోషకాలు లేకపోవడాన్ని పోషకాహార లోపం అంటారు.
    వాదన–బి: క్వాషియార్కర్, మెరాస్మస్ అనేవి పోషకాహార లోపం వల్ల కలిగే వ్యాధులు.
    1) ఎ, బి లు అసత్యం 2) ఎ, బి లు సత్యం
    3) ఎ సత్యం 4) బి సత్యం
16. పోషక పదార్థాల అధ్యయనాన్ని ఏమంటారు?
    1) ట్రోపాలజీ 2) ట్రాకియాలజీ
    3) అగ్రస్టాలజీ 4) పైవన్నీ
17. కిందివాటిలో అంతర్జాతీయ పాల దినోత్సవం?
    1) జూన్ 12 2) జులై 15
    3) జూన్ 1 4) ఆగస్టు 2
18. కిందివాటిలో తల్లి పాలల్లో లోపించిన విటమిన్?
    1) ఎ 2) డి 3) సి 4) కె
19. పాలలో పెరుగుదల కారకం ఉందని పేర్కొన్న వ్యక్తి?
    1) హాప్‌కిన్స్ 2) ఫంక్
    3) జేమ్స్‌లిండ్ 4) 2, 3
20. కిందివాటిలో యాంటీగ్జీరాఫ్తాల్మియా విటమిన్
    1) ఫిల్లోక్వినోన్ 2) టోకోఫెరాల్
    3) రెటినాల్ 4) థయమిన్
21. కిందివాటిలో ఏ పిండిపదార్థం అయోడిన్ నిర్ధారణ పరీక్షలో నీలం – నలుపు వర్ణాన్ని ఇవ్వదు?
    1) గ్లూకోజ్ 2) సుక్రోజ్
    3) సెల్యులోజ్ 4) అమైలేజ్
22. అయిదు కార్బన్ అణువులున్న సరళ పిండిపదార్థం?
    1) రైబోజ్ 2) గ్లూకోజ్
    3) ఫ్రక్టోజ్ 4) గ్యాలక్టోజ్
23. కిందివాటిని జతపరచండి.

జాబితా - I	జాబితా - II
1) గ్రేప్ షుగర్	ఎ) ఫ్రక్టోజ్
2) ఫ్రూట్ షుగర్	బి) లాక్టోజ్
3) టేబుల్ షుగర్	సి) గ్లైకోజన్
4) మిల్క్ షుగర్	డి) గ్లూకోజ్
5) అనిమల్ స్టార్చ్	ఇ) సుక్రోజ్

    1) 1-డి, 2-ఎ, 3-ఇ, 4-బి, 5-సి
    2) 1-డి, 2-ఎ, 3-ఇ, 4-సి, 5-బి
    3) 1-డి, 2-ఎ, 3-సి, 4-బి, 5-ఇ
    4) 1-డి, 2-సి, 3-ఎ, 4-బి, 5-ఇ
24. వాదన–ఎ: ప్రపంచంలో అతి తియ్యనైన చక్కెర ఫ్రక్టోజ్.
    వాదన–బి: ప్రపంచంలో అతి తక్కువ తియ్యనైన చక్కెర సుక్రోజ్.
    1) ఎ, బి లు సరైనవి 2) ఎ సరైంది
    3) బి సరైంది
    4) ఎ, బి లు సరైనవి కావు
25. కిందివాటిలో ప్రొటీన్ లోపం వల్ల కలిగే వ్యాధి?
    1) స్థూలకాయత్వం 2) మెరాస్మస్
    3) పెల్లాగ్రా 4) క్వాషియార్కర్
26. ప్రపంచంలో కొవ్వు పన్ను విధించిన మొదటి దేశం?
    1) డెన్మార్క్ 2) న్యూజిలాండ్
    3) అమెరికా 4) చైనా
27. కిందివాటిలో సంపూర్ణ పోషకాలున్న ఆహార పదార్థాలు?
    1) పాలు 2) గుడ్లు 3) మాంసం 4) పైవన్నీ
28. చీమలు కుట్టినప్పుడు విడుదలయ్యే ఆమ్లం?
    1) లాక్టిక్ ఆమ్లం 2) ఫార్మిక్ ఆమ్లం
    3) టానిక్ ఆమ్లం 4) పామిటిక్ ఆమ్లం
29. చెమటలో నీటిశాతం?
    1) 80 2) 75 3) 55 4) 99
30. జతపరచండి.

జాబితా – 1	జాబితా – 2
1) క్యారెట్ రంగుకు కారణం	ఎ) బచ్చలి
2) క్యారెట్‌లో అధికంగా ఉండే విటమిట్	బి) బొప్పాయి
3) విటమిన్ A అధికంగా ఉండే ఫలం	సి) విటమిన్ A
4) విటమిన్ A అధికంగా ఉండే ఆకుకూర	డి) B - కెరోటిన్
	ఇ) తోటకూర
	ఎఫ్) విటమిన్ - D

    1) 1-డి, 2-సి, 3-బి, 4-ఎ
    2) 1-డి, 2-ఎఫ్, 3-ఇ, 4-ఎ
    3) 1-డి, 2-ఇ, 3-ఎ, 4-బి
    4) 1-డి, 2-ఎ, 3-బి, 4-సి
31. కిందివాటిలో ఐరన్ లభించని వనరు?
    ఎ) ఆకుకూరలు బి) కాలేయం
    సి) ఆపిల్ డి) పచ్చిమిర్చి
    1) ఎ, బి 2) బి, సి
    3) సి 4) డి
32. ఉడికించినా, ఎక్కువ కాలం నిల్వ ఉంచినా నశించిపోయే విటమిన్?
    1) C 2) D 3) A 4) B_{12}
33. కిందివాటిలో దేని లోపంతో పిల్లల్లో మానసిక వైకల్యం ఏర్పడుతుంది?
    1) ఇనుము 2) క్యాల్షియం
    3) అయోడిన్ 4) ఫాస్ఫరస్
34. కిందివాటిలో అరటిపండులోని పోషక పదార్థం?
    1) పొటాషియం 2) క్యాల్షియం
    3) ఇనుము 4) అయోడిన్
35. ప్రపంచ ఆహార దినోత్సవం?
    1) జూన్ 1 2) జూన్ 12
    3) అక్టోబరు 16 4) అక్టోబరు 18
36. కిందివాటిలో గ్రేట్ మిల్లెట్?
    1) జొన్నలు 2) ఉలవలు
    3) పెసలు 4) కందులు
37. ఒక విద్యార్థి బెరిబెరి అనే వ్యాధితో బాధపడుతున్నాడు. అయితే వైద్యుడు అతడికి ఇచ్చే సలహా?
    1) చిలగడదుంప, వేరుశనగ తీసుకోమనడం
    2) సిట్రస్ జాతి ఫలాలను తీసుకోమనడం
    3) తృణధాన్యాలు, నూనెగింజలు, పాలు, గుడ్లు, మాంసం తీసుకోమనడం
    4) మరపట్టిన బియ్యాన్ని వాడమనడం
38. పొలం పనిలో నిమగ్నమైన రైతు శరీర భాగంలో గాయమైనప్పుడు, రక్తం ఆగకుండా ధారాళంగా కారుతోంది. అయితే అతడికి ఏ విటమిన్ లోపం ఉందని చెప్పొచ్చు?
    1) కాల్సిఫెరాల్ 2) రెటినాల్
    3) థయామిన్ 4) ఫిల్లోక్వినోన్
39. కిందివాటిలో 4డి విటమిన్ ఏది?
    1) నియాసిన్
    2) పాంటోథెనిక్ ఆమ్లం
    3) పైరిడాక్సిన్
    4) రైబోఫ్లేవిన్



రచయిత: వట్టిగొనళ్ల పద్మనాభం

సమాధానాలు

1-4; 2-1; 3-3; 4-1; 5-4; 6-3; 7-4; 8-1; 9-4; 10-3; 11-1; 12-1; 13-3; 14-2; 15-2; 16-1; 17-3; 18-3; 19-1; 20-3; 21-3; 22-1; 23-1; 24-2; 25-4; 26-1; 27-4; 28-2; 29-4; 30-1; 31-4; 32-1; 33-3; 34-1; 35-3; 36-1; 37-3; 38-4; 39-1.

తాజా ఇంటర్న్‌షిప్‌లు

వర్క్ ఫ్రమ్ హోమ్
డీప్‌థాట్ ఎడ్యుటెక్ వెంచర్స్‌లో

1. ఏఐ సైకాలజీ
నైపుణ్యం: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్
స్టైపెండ్: రూ. 2,000
☛ internshala.com/i/bf0697

2. యూఎక్స్ రిసెర్చ్
నైపుణ్యం: యూఎక్స్ రిసెర్చ్
స్టైపెండ్: రూ. 2,000
☛ internshala.com/i/b4736e

3. టీచింగ్
నైపుణ్యం: టీచింగ్ స్టైపెండ్: రూ. 2,000
☛ internshala.com/i/16e2c4

4. కాపీరైటింగ్
నైపుణ్యం: కంటెంట్ మార్కెటింగ్
స్టైపెండ్: రూ. 2,000
☛ internshala.com/i/9ded22

గేమ్ డెవలప్‌మెంట్
సంస్థ: లోహిటెక్ సొల్యూషన్స్
నైపుణ్యాలు: యానిమేషన్, బ్లెండర్ 3డీ, సీ#, యూనిటీ 3డీ, యూనిటీ ఇంజిన్
స్టైపెండ్: రూ. 8,000-10,000
☛ internshala.com/i/e4dff3

ఆటోమేషన్ ఇంజినీర్ (ఏఐ వెబ్ యాప్)
సంస్థ: మార్వారీ కెటలిస్ట్స్
నైపుణ్యాలు: అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్), డేటా సైన్స్, డేటా స్ట్రక్చరర్స్, డెవోప్స్, ఫ్లాస్క్, ఇన్ఫర్మేషన్ ఆర్కిటెక్చర్, మెషిన్ లెర్నింగ్, మీన్/మెర్న్ స్టేక్, పైతాన్, రోబోటిక్ ప్రాసెస్, ఆటోమేషన్ (ఆర్‌పీఏ), సెలీనియం, యూఐపాత్
స్టైపెండ్: రూ. 2,500-5,000
☛ internshala.com/i/194bdb

వీడియో ఎడిటింగ్/ మేకింగ్
సంస్థ: బవేజా మీడియా
నైపుణ్యాలు: అడోబ్ ఆఫ్టర్ ఎఫెక్ట్స్, ఫొటో షాప్, ప్రీమియర్ ప్రో, వీడియో ఎడిటింగ్, వీడియో మేకింగ్ స్టైపెండ్: రూ. 6,000-7,000
☛ internshala.com/i/ad48a1

సేల్స్
సంస్థ: వర్డ్‌ఇంక్ నైపుణ్యం: సేల్స్
స్టైపెండ్: రూ. 5,000
☛ internshala.com/i/1ea994

వీటన్నిటికీ దరఖాస్తు గడువు: నవంబరు 16

గృహాలు, కర్మాగారాలు, వాణిజ్య సముదాయాలు.. ఇలా అన్ని చోట్లా ఉపయోగించే.. వస్తువులు, పరికరాలు, యంత్రాలు, ఉపకరణాలు.. వీటికి ప్రాణం పోసేది డిజైనర్లే. ఈ రంగంలో ఆసక్తి ఉన్నవారు ఐఐటీలతోపాటు మేటి సంస్థలు అందించే డిజైన్ కోర్సుల్లో చేరవచ్చు. ఇందుకు యూసీడ్, సీడ్ దారి చూపుతాయి!

డిజైన్ కోర్సులకు.. సీడ్ దారి!



మనం ఉపయోగించే వస్తువు ఏదైనప్పటికీ నిర్ణీత ప్రమాణాల మేరకు రూపొందాలి. ఆకర్షణీయంగానూ, సౌకర్యవంతంగానూ ఉంటూనే నాణ్యతలో రాజీ లేకుండా తయారవ్వాలి. తక్కువ ఖర్చుతో ఎక్కువ మన్నిక వచ్చేలా మన్ననలు పొందాలి. ఇవన్నీ కుదరాలంటే సమర్థ డిజైనర్ల సేవలు తప్పనిసరి. డిజైన్ రంగంలో రాణించడానికి విశేష పరిజ్ఞానంతోపాటు సృజన కీలకం. ఇంటర్మీడియట్ విద్యార్హతతో యూజీ స్థాయిలో ఈ చదువులు మొదలవుతాయి. ఆ తర్వాత ఆసక్తి ఉంటే పీజీలో స్పెషలైజేషన్ ఎంచుకోవచ్చు. అనంతరం పీహెచ్‌డీతో అత్యున్నత స్థాయినీ అందుకోవచ్చు.

డిజైన్ కోర్సుల్లో చేరడానికి దేశంలో ఎన్నో సంస్థలు పరీక్షలు నిర్వహిస్తున్నాయి. ఐఐటీ బాంబే ఆధ్వర్యంలోని యూసీడ్, సీడ్ వీటిలో ముఖ్యమైనవి. యూజీ కోర్సులకు యూసీడ్, పీజీ కోసం సీడ్ రాయాలి. ఇందులో ప్రతిభతో ఐఐటీలు, జాతీయ స్థాయిలో మేటి సంస్థల్లో సీటు పొందవచ్చు. దేశవ్యాప్తంగా పలు సంస్థలు ఈ స్కోరుతో అవకాశం కల్పిస్తున్నాయి.

యూజీ కామన్ ఎంట్రన్స్ ఎగ్జామ్ ఫర్ డిజైన్ (యూసీడ్)

అర్హత: 2024లో ఇంటర్ పూర్తిచేసుకున్నవారు, ప్రస్తుతం ఇంటర్ ద్వితీయ సంవత్సరం కోర్సులు చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. సైన్స్, కామర్స్, ఆర్ట్స్, హ్యూమానిటీస్.. అన్ని గ్రూపులవాళ్లూ అర్హులే. మూడేళ్ల డిప్లొమా, రెండేళ్ల ఒకేషనల్ కోర్సులు పూర్తిచేసుకున్న, చదువుతున్నవారికీ అవకాశం ఉంది. ఐఐటీ-గువాహటి కోర్సుల్లో చేరడానికి ఇంటర్ ఎంపీసీ తప్పనిసరి.

వయసు: అక్టోబరు 1, 2000 తర్వాత జన్మించాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులైతే అక్టోబరు 1, 1995 తర్వాత జన్మించినప్పటికీ అవకాశం ఉంటుంది.

పరీక్ష ఇలా..

ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమంలో 300 మార్కులకు ఉంటుంది. వ్యవధి మూడు గంటలు. ఇందులో రెండు భాగాలు (ఎ, బి) ఉంటాయి.

పార్ట్-ఎ: ఈ విభాగానికి 200 మార్కులు. మొత్తం 57 ప్రశ్నలు. వ్యవధి రెండు గంటలు. పరీక్షను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. ఇందులో 3 సెక్షన్లు.

◆ **సెక్షన్ 1 (న్యూమరికల్ ఆన్సర్ టైప్):** ఈ విభాగంలో 14 ప్రశ్నలకు 56 మార్కులు. ప్రతి ప్రశ్నకు 4 మార్కులు. ఆప్షన్లు ఉండవు. జవాబును నేరుగా ఖాళీపై పూరించాలి. రుణాత్మక మార్కులు లేవు. ఆన్‌లైన్ కీబోర్డు ఉపయోగించి సమస్యను సాధించవచ్చు.

◆ **సెక్షన్ 2 (మల్టిపుల్ సెలక్ట్ ప్రశ్నలు):** ఈ విభాగంలో 15 ప్రశ్నలకు 60 మార్కులు. ప్రతి ప్రశ్నకు 4 ఆప్షన్లు. వాటిలో ఒకటి లేదా అంతకంటే ఎక్కువ సరైన జవాబులు ఉండవచ్చు. అభ్యర్థులు సరైన ఆప్షన్లు అన్నీ గుర్తిస్తేనే 4 మార్కులు సొంతమవుతాయి. అలాగే ఒకవేళ సరైన ఆప్షన్లలో కొన్ని గుర్తించి, సరికానివి వదిలేస్తే వాటి ప్రకారం పాక్షిక మార్కుల కేటాయిస్తారు. తప్పు సమాధానానికి ఒక మార్కు తగ్గిస్తారు.

◆ **సెక్షన్ 3 (మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు):** ఇందులో 28 ప్రశ్నలకు 84 మార్కులు. ప్రతి ప్రశ్నకూ 4 ఆప్షన్లు. అయితే వీటిలో ఒకటే సరైనది. అందువల్ల ఈ విభాగానికి రుణాత్మక మార్కులు ఉన్నాయి. ప్రతి సరైన జవాబుకు 3 మార్కులు. తప్పు సమాధానానికి 0.71 మార్కులు తగ్గిస్తారు.

పార్ట్-బి: ఈ విభాగానికి 100 మార్కులు. వ్యవధి ఒక గంట. ఇందులో రెండు ప్రశ్నలు ఉంటాయి. అభ్యర్థి డ్రాయింగ్ నైపుణ్యాలను పరిశీలిస్తారు. ప్రశ్న ఆన్‌లైన్‌లో కంప్యూటర్‌పై డిస్‌ప్లే అవుతుంది. సమాధానం (డ్రాయింగ్) జవాబు పత్రంపై రాయాలి.

ప్రశ్నలడిగే విభాగాలు

విజువలైజేషన్ అండ్ స్పేషియల్ ఎబిలిటీ, అబ్జర్వేషన్ అండ్ డిజైన్ సెన్సిటివిటీ, ఎన్విరాన్‌మెంటల్ అండ్ సోషల్ అవేర్‌నెస్, అనలిటికల్ అండ్ లాజికల్ రీజనింగ్, లాంగ్వేజ్ అండ్ క్రియేటివిటీ, డిజైన్ థింకింగ్ అండ్ ప్రాబ్లమ్ సాల్వింగ్, డ్రాయింగ్ విభాగాల నుంచి ప్రశ్నలుంటాయి. పరీక్షపై అవగాహన, సన్నద్ధతకు పాత ప్రశ్నపత్రాలు ఉపయోగపడతాయి. గత ప్రశ్నపత్రాలు-జవాబులు యూసీడ్ వెబ్‌సైట్‌లో ఉంచారు. వాటిని గమనిస్తే ఏం చదవాలి, సాధన ఎలా ఉండాలో తెలుస్తుంది. సృజన, ఆలోచన, తార్కికతలపై ముడిపడిన ప్రశ్నలే ఎక్కువగా అడుగుతారు.

సంస్థలు, సీట్లు

ఐఐటీ-బాంబే 37, ఐఐటీ-దిల్లీ 20, ఐఐటీ-గువాహటి 56, ఐఐటీ- హైదరాబాద్ 26, ఐఐటీ-రవుర్కెలా 20, ఐఐఐటీడీఎం-జబల్‌పూర్‌లో 66 ఉన్నాయి.

యూసీడ్ స్కోరుతోనే దేశవ్యాప్తంగా పలు ఇతర సంస్థలు సైతం ప్రవేశం కల్పిస్తున్నాయి. యూనివర్సిటీ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ స్టడీస్, డీవై పాటిల్ యూనివర్సిటీ, దిల్లీ టెక్నలాజికల్ యూనివర్సిటీ, జైన్, జేకేఎల్‌యూ, నిర్మా, సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, విట్, లవ్ లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ, శ్రేష్ఠ, గురుగోవింద్ సింగ్ ఇంద్రప్రస్థ యూనివర్సిటీ, వరల్డ్ యూనివర్సిటీ ఆఫ్ డిజైన్, విశ్వనికేతన్, మిట్, యూపీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్, సెప్ట్, అనంత్ నేషనల్ యూనివర్సిటీ ...తదితర సంస్థలు ఈ జాబితాలో ఉన్నాయి.

పీజీ, పీహెచ్‌డీల్లోకి... సీడ్

డిజైన్‌లో యూజీ పూర్తిచేసుకున్న, చివరి సంవత్సరం కోర్సులు చదువుతున్న విద్యార్థులు పీజీ చదవడానికి, అలాగే పీజీవాళ్లు పీహెచ్‌డీలో చేరడానికి సీడ్ రాయాలి. ఐఐఎస్సీ బెంగళూరు, ఐఐటీ-బాంబే, దిల్లీ, గువాహటి, హైదరాబాద్, కాన్పూర్, ఐఐటీడీఎం- జబల్‌పూర్, కాంచీపురంలలో డిజైన్ పీజీ, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశానికి సీడ్ నిర్వహిస్తున్నారు. ఇదే స్కోరుతో పలు ఇతర సంస్థల్లోనూ పీజీ కోర్సుల్లో చేరవచ్చు.

ప్రశ్నపత్రం ఇలా

ప్రశ్నపత్రం ఇంగ్లిష్‌లో ఉంటుంది. ఇందులో పార్ట్ ఎ, బి ఉంటాయి..

పార్ట్-ఎ: ఆన్‌లైన్‌లో పరీక్ష ఉంటుంది. ఈ విభాగంలో న్యూమరికల్ ఆన్సర్ టైప్, మల్టిపుల్ సెలక్ట్, మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు వస్తాయి. ప్రశ్నపత్రం 150 మార్కులకు ఉంటుంది. పరీక్ష వ్యవధి ఒక గంట. మొత్తం 44 ప్రశ్నలు వస్తాయి. న్యూమరికల్ ప్రశ్నలు 8 ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు 4 మార్కులు. రుణాత్మక మార్కులు లేవు. మల్టిపుల్ సెలెక్ట్ ప్రశ్నలు 10 వస్తాయి. ఒక్కో ప్రశ్నకు 4 మార్కులు. ఒకటి కంటే ఎక్కువ సరైన సమాధానాలు ఉంటాయి. అన్నీ గుర్తిస్తేనే పూర్తి మార్కులు. సరైన వాటిలో కొన్నే గుర్తిస్తే పాక్షిక మార్కులు. తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు తగ్గిస్తారు. మల్టిపుల్ ఛాయిస్ విభాగంలో 26 ప్రశ్నలు. ప్రతి ప్రశ్నకు 3 మార్కులు. తప్పు సమాధానానికి అర మార్కు తగ్గిస్తారు.

సిలబస్: విజువలైజేషన్ అండ్ స్పేషియల్ ఎబిలిటీ, ఎన్విరాన్‌మెంటల్, సోషల్ అవేర్‌నెస్, అనలిటికల్ అండ్ లాజికల్ రీజనింగ్, లాంగ్వేజ్ అండ్ క్రియేటివిటీ, అబ్జర్వేషన్ అండ్ డిజైన్ సెన్సిటివిటీ అంశాల్లో ప్రశ్నలు వస్తాయి.

పార్ట్-బి: ప్రశ్నలు ఆన్‌లైన్‌లో కంప్యూటర్‌పై డిస్‌ప్లే అవుతాయి. వీటికి సమాధానాలు (డ్రాయింగ్స్) బుక్‌లెట్‌లో రాయాలి. ప్రతి ప్రశ్నకు 20 మార్కులు చొప్పున వంద మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. స్కెచింగ్, క్రియేటివిటీ, ఫామ్ సెన్సిటివిటీ, విజువల్ సెన్సిటివిటీ, ప్రోబ్లమ్ ఐడెంటిఫికేషన్ విభాగాల్లో ఒక ప్రశ్న చొప్పున ఉంటాయి. వ్యవధి 2 గంటలు. పార్ట్ ఏను స్క్రీనింగ్ టెస్టుగా పరిగణిస్తారు. ఈ పరీక్షలోని ప్రతిభ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. ఎంపికైనవారి పార్ట్ బీ సమాధానాలు మూల్యాంకనం చేస్తారు. తుది ఎంపికలో పార్ట్ ఏకు 25, పార్ట్ బీకి 75 శాతం వెయిటేజీ లభిస్తుంది.

అర్హత: గ్రాడ్యుయేట్లు ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రవేశం కల్పించే సంస్థల వారీ స్వల్ప వ్యత్యాసాలు ఉంటాయి. బీటెక్, బీఆర్క్, డిజైన్, ఇంటీరియర్ డిజైన్, బీఎఫ్ఏ వీటిలో ఏదైనా నాలుగేళ్ల కోర్సు లేదా జీడీ ఆర్ట్స్ డిప్లొమా ప్రోగ్రాం (10+5 విధానంలో) చదివినవారికి అన్ని సంస్థల్లోనూ అవకాశం ఉంటుంది. అభ్యర్థులు ఎన్నిసార్లైనా పరీక్ష రాసుకోవచ్చు. వయసు నిబంధన లేదు.


యూసీడ్, సీడ్ ముఖ్య తేదీలు

ఫీజు: మహిళలు, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.2000. మిగిలిన అందరికీ రూ. 4000
ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: అక్టోబరు 31. రూ.500 ఫైన్‌తో నవంబరు 8. **పరీక్ష తేదీ:** జనవరి 19
తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, విశాఖపట్నం
వెబ్‌సైట్లు:
https://uceedapp.iitb.ac.in/UCEED/home.jsp
https://ceedapp.iitb.ac.in/CEED/home.jsp

మన జీవితాలు స్మార్ట్‌ఫోన్స్, సోషల్ మీడియా, వీడియో గేమ్స్‌తో నిండిపోతున్నాయి. ఇవి సంతోషాన్ని కలిగిస్తున్నట్లు అనిపించినా, చిక్కులనూ తెస్తున్నాయి. వీటి కారణంగా ఏకాగ్రత, క్రమశిక్షణ, పని తీరు తగ్గిపోతాయి. ఈ నేపథ్యంలో తిబో మోరిస్ రాసిన 'డోపమైన్ డీటాక్స్' పుస్తకం మన దైనందిన జీవనశైలిని మారుస్తూ, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది.

పుస్తకం

మన జీవన శైలి చురుగ్గా.. మెరుగ్గా!



నాడీవ్యవస్థలో పారే జీవ రసాయనం (న్యూరో ట్రాన్స్‌మిటర్).. డోపమైన్. ఇది మెదడుకు రసాయన ప్రేరణలను పంపుతుంది. సంతోషం, సుఖం, ప్రేరణ, ఆశాభావం కలిగించడంలో ముఖ్య పాత్ర పోషిస్తుంది. మనకేదైనా మంచి అనుభవం కలిగినప్పుడు (ఇష్టమైన ఆహారం తిన్నప్పుడో, సోషల్ మీడియాలో నచ్చిన నోటిఫికేషన్ వచ్చినప్పుడో) మెదడు డోపమైన్‌ను విడుదల చేస్తుంది. ఇది ఆ అనుభవం పట్ల ఆకర్షితులను చేస్తుంది. కానీ, దీని దుష్ప్రభావం ఏమిటంటే- ఈ తక్షణానందం కోసం అలవాటు పడిపోతూ ముఖ్యమైన ఇతర అంశాలను విస్మరిస్తాం.

దీర్ఘకాలిక ఆనందాన్ని కలిగించేవి కొన్ని ఉంటాయి. తరగతిలో ఫస్ట్ రావటం, క్విజ్ పోటీలో మొదటి బహుమతి, ఉద్యోగం రావటం లాంటివి. వీటిని సాధించాలంటే శ్రమపడాలి. అందుకు భిన్నంగా మన పోస్టును వంద మంది లైక్ చేస్తే మనమేదో సాధించేశామన్న ఆనందం వెంటనే కలుగుతుంది. ఇలా ఆ క్షణం సంతృప్తి పరిచే పనులే డోపమైన్ వ్యసనాలు. వీటికి బానిసలుగా మారితే, అది నెమ్మదిగా మన జీవనశైలిని నాశనం చేస్తుంది. ఏకాగ్రత తగ్గిపోతుంది. క్రమంగా ఒత్తిడికి లోనవుతాము. ఈ సమస్యలను అధిగమించడానికి డీటాక్స్ (విషం చేరినచోట దాన్ని తొలగించడం/ విరుగుడు ప్రక్రియతో విషం చేసే దుష్పరిణామాలను నిలుపుదల చేయడం) అవసరం.

డోపమైన్ డీటాక్స్ అంటే డోపమైన్ వ్యసనాలకు కొన్ని రోజులపాటు దూరంగా ఉండటం. ఉదాహరణకు- స్మార్ట్ ఫోన్ వాడకాన్ని తగ్గించడం, వీడియో గేమ్స్‌కు దూరంగా ఉండటం, సోషల్ మీడియా చర్చలను తగ్గించుకోవడం లాంటివి. నియంత్రిత వాడకం ద్వారా... కోల్పోయిన మానసిక సామర్థ్యాన్నీ, విశ్రాంతినీ పొందగలం. ఈ పుస్తకం డోపమైన్ వ్యసనాలను ఎలా తగ్గించుకోవాలో, ఎలా పూర్తి సమర్థత, క్రమశిక్షణలతో మళ్లీ ఎలా పనిచేయగలమో వివరంగా చర్చిస్తుంది. సరళమైన మార్గాలను, అభ్యాసాలను అందిస్తుంది.

ప్రధాన అంశాలు

1 క్షణిక ఆనందానుభూతులు మనకు ఎలా హాని చేస్తాయి అన్నది పుస్తకం మొదటి భాగంలో వివరంగా చర్చిస్తారు.

2 నిజజీవితంలో ఒక సర్టిఫికేషన్ పొంది పది మంది మన్నన పొందాలంటే కొన్ని నెలల పాటు కష్టపడి పరీక్షలు రాయాలి. అదే ఒక వీడియో గేమ్‌లో విజయం సాధిస్తే ప్రపంచవ్యాప్తంగా ఆ ఆట ఆడే తోటి ఆటగాళ్ళు వేలల్లో మెచ్చుకుంటారు. వీడియోగేమ్ ఇంటర్ఫేస్ మనమేదో సాధించేశామనే భ్రమ కలిగిస్తూ మన ఖాతాలో లక్షల పాయింట్లు నింపుతుంది. అలా సులభంగా మన మనసుకు సాంత్వన కలిగి, క్షణికానందాన్ని ఈ డోపమైన్ వ్యసనాలు అందిస్తాయి. వీటికి ఎలా బానిసలమవుతామో, వాటిని ఎలా గుర్తించి నియంత్రించాలో పుస్తకం సూచిస్తుంది.

3 వీడియో గేమ్ ఆడే బదులు వ్యాయామం, నడక, జాగింగ్ లాంటివి చేయమని రచయిత సూచిస్తారు.

4 ఈ పుస్తకంలో ఉన్న విధానాలు రోజువారీ జీవితంలో కొత్త శక్తిని అందిస్తాయి. ఉదాహరణకు ఆహార నియమాలు, వ్యాయామం, సమయపాలన మీద దృష్టి పెట్టడం వంటివి.

5 డీటాక్స్ ప్రక్రియను పునరావృతం చేస్తూ ఉంటే పాత అలవాట్లలో పడకుండా, కొత్తగా నేర్చుకున్న జీవిత విధానంలో ముందుకు సాగవచ్చు. ఈ పుస్తకం ఆ డీటాక్స్ ప్రోగ్రామ్‌ను ఎలా పునరావృతం చేయాలో వివరిస్తుంది.

ఏ ప్రయోజనాలు?

● డోపమైన్ డీటాక్స్ వల్ల మనసుకు విశ్రాంతి లభిస్తుంది. తద్వారా మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుంది.

● స్మార్ట్‌ఫోన్స్, ఇతర డిజిటల్ అంశాలకు దూరంగా ఉంటే ఏకాగ్రత పెరుగుతుంది. తాత్కాలిక ఆనందాలపై కాకుండా, ముఖ్యమైన పనులపై మెదడును కేంద్రీకరించవచ్చు.

● అనవసరమైన పనులను వదిలి, విలువైన సమయాన్ని ముఖ్యమైన కార్యకలాపాలకు కేటాయించగలుగుతారు.

సాంకేతిక ప్రపంచంలో మనల్ని బంధిస్తున్న మానసిక వ్యసనాల నుంచి బయటపడడానికి ఈ పుస్తకం మార్గం చూపుతుంది. ఈ పద్ధతులను అమలు చేస్తే, మనసు, శరీరం, జీవనశైలి మెరుగ్గా మారతాయి. ఇందులోని అన్ని సూచనలూ అందరికీ వర్తించాలనేమీ లేదు. ఎవరికి వారు ఆలోచించి, తమకు ప్రయోజనం కలిగించే అంశాలనే పాటించడం మేలు.

– రహ్మాన్ & సంపత్

ఇంటర్‌తో రూ.18 లక్షల వేతనం!

10+2 టెక్నికల్ ఎంట్రీ

ఇంటర్మీడియట్ ఎంపీసీ గ్రూపు విద్యార్థులు ఉచితంగా బీటెక్ చదువుకుని, లెఫ్టినెంట్ హోదాతో ఉద్యోగంలో చేరే అవకాశం వచ్చింది. ఇందుకు ఇండియన్ ఆర్మీ 10+2 టెక్నికల్ ఎంట్రీ స్కీమ్ దారిచూపుతుంది. జేఈఈ మెయిన్ స్కోరుతో దరఖాస్తులు షార్ట్‌లిస్ట్ చేసి, రెండు దశల్లో వివిధ పరీక్షలు నిర్వహించి కోర్సులోకి తీసుకుంటారు. వీరికి బీటెక్ కోర్సు, లెఫ్టినెంట్ కొలువులకు సంబంధించిన ఉచిత శిక్షణ నాలుగేళ్లు అందిస్తారు. ఆ తర్వాత విధుల్లోకి తీసుకుంటారు. ఈ సమయంలో రూ.18 లక్షల వరకు వార్షిక వేతనం పొందవచ్చు. అత్యున్నత స్థాయికీ చేరుకోవచ్చు.



ఏడాదికి రెండుసార్లు 10+2 టెక్నికల్ ఎంట్రీ స్కీమ్ ప్రకటన విడుదలవుతుంది. ప్రతిసారీ 90 మందికి అవకాశం కల్పిస్తారు. జేఈఈ మెయిన్-2024 స్కోరుతో ఈ కోర్సు, ఉద్యోగానికి దరఖాస్తు చేసుకోవచ్చు. వచ్చిన దరఖాస్తులు పరిశీలించి, ఎక్కువ స్కోరు ఉన్నవారికి అవకాశం కల్పిస్తారు.

ఇలా వడపోతలో నిలిచినవారికి సర్వీస్ సెలక్షన్ బోర్డు (ఎస్ఎస్‌బీ) ఆధ్వర్యంలో జనవరి-మార్చిలోపు బెంగళూరులో ఐదు రోజులు రెండు దశల్లో సైకలాజికల్ పరీక్షలు, గ్రూప్ పరీక్షలు, ఇంటర్వ్యూలు ఉంటాయి. తొలిరోజు స్టేజ్-1 స్క్రీనింగ్ (ఇంటెలిజెన్స్) పరీక్షల్లో అర్హత సాధించినవారిని స్టేజ్-2కి ఎంపిక చేస్తారు. ఆ తర్వాత నాలుగు రోజులు నిర్వహించే వివిధ పరీక్షల్లో అన్ని విభాగాల్లోనూ రాణించినవారిని కోర్సు, శిక్షణకు తీసుకుంటారు.

కోర్సు, శిక్షణ

జులై, 2025 నుంచి మొదలువుతంది. నాలుగేళ్ల టెక్నికల్ ట్రెయినింగ్ పుణె, సికింద్రాబాద్, మావ్‌ల్లోని ఆర్మీ కేంద్రాల్లో ఎక్కడైనా కొనసాగుతుంది. ఇందులో రెండు దశలు... ఫేజ్-1 మూడేళ్ల ప్రీ కమిషన్ ట్రెయినింగ్, ఫేజ్-2 ఏడాది పోస్ట్ కమిషన్ శిక్షణ ఉంటాయి. మూడేళ్ల ఫేజ్-1 శిక్షణ పూర్తిచేసుకుని, ఫేజ్-2లో చేరినప్పుడు ప్రతి నెలా రూ. 56,100 స్టైపెండ్ అందుతుంది.

◆ నాలుగేళ్ల శిక్షణ పూర్తయిన తర్వాత లెఫ్టినెంట్ హోదా దక్కుతుంది. ◆ శిక్షణ, కోర్సు విజయవంతంగా పూర్తిచేసుకున్న వారికి ఇంజినీరింగ్ (బీటెక్) డిగ్రీని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం, న్యూదిల్లీ అందిస్తుంది. వీరిని పూర్తిస్థాయిలో విధుల్లోకి తీసుకుంటారు. ◆ లెవెల్-10 మూలవేతనం రూ. 56,100, మిలటరీ సర్వీస్ పే రూ. 15,500 ప్రతి నెలా అందుతాయి. డీఏ, హెచ్‌ఆర్ఏ, ప్రోత్సాహకాలు దక్కుతాయి. వీరు సీటీసీ రూపంలో ఏడాదికి సుమారు రూ. 18 లక్షలు పొందవచ్చు.

◆ తక్కువ వ్యవధిలోనే ఉన్నత స్థాయికీ చేరుకోవచ్చు. రెండేళ్ల అనుభవంతో కెప్టెన్, ఆరేళ్ల సర్వీస్‌తో మేజర్, పదమూడేళ్లకు లెఫ్టినెంట్ కల్నల్ హోదాలను అందుకోవచ్చు. ఈ విధానంలో ఎంపికైనవాళ్లు పూర్తి వ్యవధితో విధుల్లో కొనసాగవచ్చు. ఇవి శాశ్వత (పర్మనెంట్) ఉద్యోగాలు అందువల్ల వీరికి పింఛను చెల్లిస్తారు.



ఖాళీలు: 90

అర్హత: ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్ సబ్జెక్టుల్లో 60 శాతం మార్కులతో ఇంటర్మీడియట్/ప్లస్ 2, జేఈఈ మెయిన్స్ 2024 స్కోరు తప్పనిసరి. పురుషులు మాత్రమే అర్హులు.

వయసు: 16 1/2 ఏళ్ల నుంచి 19 1/2 ఏళ్ల మధ్య ఉండాలి. అంటే జనవరి 2, 2006 - జనవరి 1, 2009 మధ్య జన్మించినవారే అర్హులు.

ఆన్‌లైన్ దరఖాస్తులు: నవంబరు 6 వరకు స్వీకరిస్తారు.
వెబ్‌సైట్: https://joinindianarmy.nic.in/

నోటీస్ బోర్డు

ఉద్యోగాలు

మనూలో బీఈడీ (ఓడీఎల్) ప్రోగ్రామ్

హైదరాబాద్‌లోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ (మనూ) 2024-25 విద్యా సంవత్సరానికి ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్ విధానంలో బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్ (బీఈడీ) ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.
అర్హత: డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎలిమెంటరీ ఎడ్యుకేషన్‌లో శిక్షణ పొందిన ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులు అర్హులు.
బోధనా మాధ్యమం: ఉర్దూ.
ప్రోగ్రామ్ వ్యవధి: రెండేళ్లు (4 సెమిస్టర్లు).
ప్రవేశ ప్రక్రియ: ప్రవేశ పరీక్ష ఆధారంగా.
రిజిస్ట్రేషన్ ఫీజు: రూ. 1,000.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 30-10-2024.
ప్రవేశ పరీక్ష తేదీ: 03-11-2024.
ప్రవేశ పరీక్ష ఫలితాల వెల్లడి: 06-11-2024.
వెబ్‌సైట్: https://manuu.edu.in/

వాక్-ఇన్స్

మంగళగిరి ఎయిమ్స్‌లో..

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, మంగళగిరిలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్).. ఒప్పంద ప్రాతిపదికన 63 సీనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **విభాగాలు:** అనాటమీ, బర్న్స్ అండ్ ప్లాస్టిక్ సర్జరీ, బయో కెమిస్ట్రీ, కార్డియాలజీ, గ్యాస్ట్రోఎంటరాలజీ, పాథాలజీ, నెఫ్రాలజీ, ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్ అండ్ బ్లడ్ బ్యాంక్, సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ, న్యూక్లియర్ మెడిసిన్, ఎండోక్రినాలజీ, రేడియో థెరపీ, యూరాలజీ తదితరాలు.
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంబీబీఎస్/ఎండీ/ ఎంఎస్/ డీఎన్‌బీ/డీఎం/ ఎమ్మెస్సీ/పీహెచ్‌డీతో పాటు పని అనుభవం.
వేతనం: నెలకు రూ. 67,700. **వయసు:** 45 ఏళ్లు మించకూడదు. ఎస్సీ/ ఎస్టీ ఐదేళ్లు, ఓబీసీ మూడేళ్లు, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు పదేళ్లు సడలింపు ఉంటుంది.
దరఖాస్తు ఫీజు: రూ. 1500; ఎస్సీ/ఎస్టీలకు రూ. 1000; దివ్యాంగులకు ఫీజు మినహాయింపు ఉంటుంది.
దరఖాస్తు: ఆన్‌లైన్ ద్వారా **ఎంపిక:** రాతపరీక్ష, ధ్రువపత్రాల పరిశీలన, ఇంటర్వ్యూల ఆధారంగా.
ఇంటర్వ్యూ తేదీ: 07-11-2024. **వేదిక:** గ్రౌండ్ ఫ్లోర్, అడ్మిన్ అండ్ లైబ్రరీ బిల్డింగ్, ఎయిమ్స్ మంగళగిరి, మంగళగిరి, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్.
వెబ్‌సైట్: www.aiimsmangalagiri.edu.in/

సీ-మెట్‌లో ఆపరేటర్ ఖాళీలు

హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ మెటీరియల్స్ ఫర్ ఎలక్ట్రానిక్స్ టెక్నాలజీ (సీ-మెట్) ఒప్పంద ప్రాతిపదికన 31 ఆపరేటర్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూ నిర్వహిస్తోంది.
✦ సీనియర్ ఇన్‌ఛార్జ్: 01 ✦ అనలిస్ట్: 01
✦ ఆపరేటర్ (గ్రేడ్ 1/2): 10
✦ షిఫ్ట్ ఇన్‌ఛార్జ్: 04 ✦ ఇన్‌స్ట్రుమెంటేషన్ స్టాఫ్: 02 ✦ జూనియర్ ఎలక్ట్రికల్ ఇంజినీర్: 01
✦ ఎలక్ట్రీషియన్: 03 ✦ ఆఫీస్ స్టాఫ్: 02
✦ హెల్పర్: 06 ✦ సేఫ్టీ ఇన్‌ఛార్జ్: 01
అర్హత: ఐదో తరగతి, ఇంటర్, పోస్టును అనుసరించి ఐటీఐ, డిప్లొమా, బీఈ/బీటెక్/బీఎస్సీ, ఎమ్మెస్సీతో పాటు పని అనుభవం.
విభాగాలు: కెమిస్ట్రీ, ఎలక్ట్రికల్, మెటలర్జీ/ కెమికల్/ ఇన్‌స్ట్రుమెంటేషన్/ ఎన్విరాన్‌మెంటల్ తదితరాలు.
వయసు: 40 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ/ ఎస్టీలకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
దరఖాస్తు: ఆన్‌లైన్ ద్వారా.
ఇంటర్వ్యూ తేదీలు: అక్టోబరు 24, 25.
వేదిక: సీ-మెట్, ఐడీఏ ఫేజ్-3, చర్లపల్లి, హెచ్‌సీఎల్, హైదరాబాద్.
వెబ్‌సైట్: https://cmet.gov.in/jobs

బి.ఎ. తర్వాత ఏమేం అవకాశాలు?

బి.ఎ. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ చేశాను. దీంతో ఏ ఉన్నత విద్యా ఉద్యోగావకాశాలుంటాయి? - బి. చిట్టిబాబు

■ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో గ్రాడ్యుయేషన్ చేసినవారికి ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పరిశోధన, పరిపాలనకు సంబంధించిన వివిధ ఉద్యోగావకాశాలుంటాయి. ఈ సబ్జెక్ట్ చదివినవారు చాలామంది సివిల్ సర్వీసెస్, రాష్ట్ర స్థాయి పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తూ ఉంటారు. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ గ్రాడ్యుయేట్లు పాలసీ అనలిస్టులు, ఫీల్డ్ ఆఫీసర్లు, కన్సల్టెంట్లు లాంటి ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. స్వచ్ఛంద సేవా సంస్థలు, యూఎన్‌డీపీ, ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్, యునెస్కో లాంటి అంతర్జాతీయ సంస్థలు, వివిధ కన్సల్టింగ్ సంస్థల్లో కొలువులు లభిస్తాయి. వీటితో పాటు ప్రభుత్వరంగ సంస్థలు, సామాజిక రంగాలు, వివిధ కేంద్ర ప్రభుత్వ సంస్థలు, మంత్రిత్వ శాఖల్లో ఉద్యోగ ప్రయత్నాలు చేయవచ్చు.

పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్, పొలిటికల్ సైన్స్, సోషల్ వర్క్, పబ్లిక్ పాలసీ, లా, జర్నలిజాల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసే అవకాశం ఉంది. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో పీజీ చేసిన తరువాత నెట్/ సెట్/ పీహెచ్‌డీతో విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో అధ్యాపక ఉద్యోగాలకు పోటీ పడవచ్చు. ఆసక్తి ఉంటే డేటా అనాలిసిస్, డెవలప్‌మెంట్ స్టడీస్, టౌన్ ప్లానింగ్, పబ్లిక్ ఫైనాన్స్, కమ్యూనికేషన్ లాంటి వాటిలో స్వల్పకాలిక కోర్సులూ చేయవచ్చు. బోధన రంగంలో ఆసక్తి ఉంటే డీఈడీ, బీఈడీ చేయవచ్చు. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ గ్రాడ్యుయేషన్‌తో డిగ్రీ అర్హత ఉన్న అన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకూ దరఖాస్తు చేసుకోవచ్చు.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్